# 1.దాహం దాహం దాహం

"ఇదుగో నేను విరూపాక్ష గుహలో వుండగా నీటి వసతి లేక చూత గుహకు మారేవాళ్ళం. మిట్ట మధ్యాహ్న వేళ నెత్తిమీద గడ్డి మోపులతో కడజాతి స్త్రీలు అలసిపోయి ఎండలో నీళ్ళ నిమిత్తం వచ్చేవాళ్ళు. ఏదో ప్రొద్దున కొంచెం గంజి త్రాగి వస్తారేమో పాపం. రాగానే మోపులు క్రింద పడవేసి, సామీ! సామీ! ముందు మా వీపుల మీద చెంబెడు నీళ్ళు కొట్టు సామీ! అనేవాళ్ళు. నేను తిన్నెపై నిలబడి అలాగే చెంబెడు నీళ్ళు పోసేవాడిని. అమ్మయ్యా! హాయిగా వున్నదిప్పుడని తెప్పరిల్లినాక దోసిట్లో నీళ్ళు పోయమనేవారు. కడుపు నిండా నీళ్ళు త్రాగినాక తలా కొంచెం అంబలి పోసేవాడిని. తర్వాత చెట్టునీడన కొంతసేపు వుండి సేదదీరి వెళ్ళేవారు. ఆ రోజుల్లో వారిని నీరున్న చోట్లకు పోనిచ్చేవారు కాదు కనుక".

**ఈ వృత్తాంతం స్వయంగా భగవానులే సెలవిచ్చారు (సూరి నాగమ్మ లేఖలు.)**

ఈ దప్పిక శరీర సంబంధం. మనస్సంబంధ దాహం విద్యా తృష్ణ, జీవుని దాహం ఆత్మామృతం. ఈ మూడు దశల్లోనూ దాహముంటుంది. వీటిని తీర్చేవాడే జగద్గురువు – మహాత్ముడు – దైవం.

'సంభవామి యుగే యుగే' అంటే ఇదే. దుష్ట శిక్షణ అంటే చావగొట్టటం కాదు. అహంకార వినాశనం. శిక్షణ – శిష్యులకు శిక్షణ నివ్వటం. కనుక దుష్టులను, శిష్టులుగా పరిణమింపచేయటం తప్ప చావగొడితే మరలా వాడుగానే జన్మిస్తాడు. ప్రాచీన పౌరాణిక భాషలో మృత్యువంటే 'అహం వ్యక్తిత్వాన్ని లోపింప చేయటమే'. రాక్షసుడంటే దైవానికి లేదా ధర్మానికి దూరంగా పోయేవాడనీ, దేవత అంటే దానికి సన్నిహితంగా – దాని వైపుగా నడిచే వాడనీ అర్థం.

ఈ దృష్టితోనే ఆధునికావతారాలు వచ్చాయి.

| | |
|---|---|
| 1. మహర్షి | 2. శ్రీరామకృష్ణ– శారదా దేవి |
| 3. శ్రీ వివేకానందుడు | 4. శిరిడీ జ్యోతి |

పాండిచ్చేరి మహా సముద్రం – అంటే శ్రీ అరవింద మహా యోగి – అమ్మ వీరే. తమకు తామే అవతారాలుగా ప్రకటించుకొన్నారు. సనాతన భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని పునరుద్ధరణం చేయటమే కాక వేద ఋషుల మార్గాన్ని స్థాపిస్తూ దేశ – కాల – వ్యక్తి – కుల – మత భేదాలులేని ఆధ్యాత్మిక మార్గాన్ని అందించిన మహానుభావులు వారు.

కనుక వీరిని గురించి స్థూలంగానైనా పరిచయం చేద్దామన్న సత్సంకల్పంతో ఈ గ్రంధమాలిక ఉద్దేశింపబడినది. అదీ సాధారణ మానవుల కోసం. పండితుల కోసమైతే చాలా గ్రంధాలున్నాయి. వీరంతా ఆ సాధారణ జనం కోసమే తపించారు కనుక. ఈ సంగతి విన్న శ్రీమతి సరస్వతి శ్రీ రవి ప్రకాష్ (ఎబర్శీఅ–ాాఎవతీఅఝు) దంపతులు తమంత తామే బాబా పుస్తకాన్ని అచ్చు వేయించే బాధ్యత స్వీకరించటం – బాబా దివ్యాశీస్సుగా భావించాలి కదా! వారికి బాబా దయాశీస్సులు లభించాలని కోరుకుంటున్నాను.

# 2.భూమిక

ఖాండేషు లో గురుగోవిందులన్న సిద్ధపురుషుడన్నాడట శిష్యులతో–

"ఈ రోజున శిరిడి సాయి బాబా చంద్రునిలో లీనమౌతున్నారు. ఆ గురు చంద్రులను దర్శించిరండి" అని. వీరు, సాయిబాబా ఒకే గురువు శిష్యులంటారు మనకు తెలియదు. ఈ చంద్రుడంటే తంత్రయోగ విద్యలో గురుపాదుకలకు ధ్యానబిందువైన శిరస్సు. దాని నడుమ నున్న సహస్రార కమలం. దీనికి చిహ్నమే నేడు మనం శిరిడిలో చూచే గురుస్థానంలో గురు పాదాలు. అది బాబా శిరస్సు. సహస్రార కమలం. అదే దేవీ స్వరూపమని యోగవిద్య చెబుతుంది. పూర్ణ చంద్రబింబం 16 కళలు కలది. బాబా 16 ఏళ్ళ వయస్సులో శిరిడీ వచ్చాడని కదా సచ్చరిత్ర చెబుతుంది. ఆ చంద్రబింబమే బాబా గురు స్వరూపమైన దేవీ మూర్తి. ప్రతిరోజూ బాబాకు హారతిచ్చే బాపూ సాహెబు జోగ్‌తో బాబా, ఇంకా ఒక





రోజులో – మర్నాడు – మహా సమాధి చెందబోతూ అన్నారట "నేను నీతో ఎప్పుడూ ఏమి చెప్పలేదు. నా $3\frac{1}{2}$ కళల్లో నాల్గవంతు కూడా. కానీ భవిష్యత్తులో లోకం ఈ విషయం తెలుసుకుంటుంది" అని.

బాబా మాటలు ఉపనిషన్మంత్రాలు. $3\frac{1}{2}$ కళలు అంటే – భగవంతుడు 4 కళలు కలవాడట. అందులో 3 వంతులు పైనే వుంటే 1 వంతు మాత్రమే ప్రపంచంగా సృష్టిగా వచ్చింది.

బాబా చెబుతున్న $3\frac{1}{2}$ కళలు రహస్య స్థానంలోనే వుండి పోయాయి. అందులో నాల్గోవంతు మాత్రమే మనకు దక్కింది. అదీ సంపూర్ణంగా తెలియనే లేదు. ఆ పాదమే బాబా వామపాదం. వామా అంటే సృష్టి, ఆ పాదమే మనకు పూజింపదగ్గది. అదే మోక్ష సాధనం. తరణోపాయం.

బాబా దాదాపు 80 ఏళ్ళు జీవిస్తే, శరీరంతో 60 ఏళ్ళపాటు శిరిడిలో వున్నారు. ఆ 80 ఏళ్ళ జీవిత చరిత్రలో మనకు దక్కింది నాల్గవంతే.

బాబా సచ్చరిత్ర వ్రాసిన దభోల్కరు 1910లో శిరిడీ వెళ్ళాడు. అప్పటి నుండి 8, 9 ఏళ్ళపాటు జరిగిన కథలే వ్రాసాడు. కొన్ని తనకు తానుగా చూచినవీ, కొన్ని విన్నవీ అంటే 15 ఏళ్ళ చరిత్ర నాల్గోవంతే. ఇదే మనకు తెలిసిన బాబా కథ. అంటే భగవంతు డెప్పుడూ మనిషికర్థం కాని తత్త్వమే.

బాబా అన్నది $3\frac{1}{2}$ కళలు అంటే ఓంకారం. ఇందులో అ+ఉ +మ+జ. ఈ చివరిది అర్థమాత్ర. దానంతటది ఉచ్చారణ కందనిది. కనుక తురీయ. నాల్గవ దశలో ఉండే తత్త్వం పరమాత్మ, జగన్మాత. మొదటి 3 అక్షరాలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ఇవే త్రికళలు. జాగ్రత్, స్వప్న, నిద్రావస్థలు – (వ్యక్తిదశలో.)

సృష్టిదశలో సృష్టి, పోషణ, సంహరణ చేసేది త్రిమూర్తులు. అర్థ మాత్ర యోగులనుభవించే సమాధి స్థితి.

ఇవే బాబా చెప్పిన $3\frac{1}{2}$ కళలు. దీనికి జోగు చెప్పుకొన్న అర్థమేమంటే బాబా ఓంకార స్వరూపుడని. అందులో లీనమౌతాడని.

"ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ – తద్విష్ణోః పరమంపదం" అని వేదం. అదే సర్వమూ, అదే పరమాత్మ అని. బాబా తత్త్వం పరమాత్మ అని.

# 3. శిరిడీ బాబా అంటే?

బాబా కన్నులు బంగారు దీపాల్లాగా కాంతితో మెరిసిపోయేవి. ఆయన చిలుము త్రాగేవాడు – బాబా దక్షిణ ఎంతో పుచ్చుకునేవాడు కానీ, పైసా కూడా వుంచుకోకుండా దానం చేసేసేవాడు.

"బాబా అంటే మీకేమి తెలుసు ? ఆ రోజుల్లో ఈ రోజుల్లో కూడా ఆయనంటే తెలిసిన వారు చాలా అరుదు. మా గురువు గారు ఉపాసనీ మహారాజుకు మాత్రమే తెలుసు బాబా అంటే ఏమిటో? మీకూ నాలాంటి దర్శన శక్తి వుంటే ఆయన సర్వసృష్టి కర్త – భర్త అనగలిగే వారు. దక్షిణ పుచ్చుకునేవాడు మహాయోగి ఎలా కాగలడు ? ఇది లోకం దృష్టి. కానీ ఇవ్వాళ చూస్తున్నారు గదా ప్రతి చోట సాయి మందిరాలు వస్తున్నాయి. సాయి అగ్గి పెట్టెలు ఒకటేమిటి ? సర్వం సాయిమయం.

సాయి బాబా చెప్పినట్లు ఉపాసనీ మహారాజు మూడేళ్ళు ఖండోబా గుడిలో నీటిని మాత్రమే త్రాగుతూ సాయి ఆజ్ఞానుసారంగా గడిపారు. ఆయన మహాయోగి. ఆయనకే తెలుసు సాయిబాబా అంటే ఏమిటో? ఉపాసని ఎంత మహాయోగి అంటే – దయాదృష్టి ఒక మట్టి కణం మీద పడితే అది సాక్షాత్తు భగవంతుడౌతుంది. ఆయనంత మహాత్ముడు. బాబా జాన్ అన్న మహాయోగినిని గురించి నేనెప్పుడంటూ వుంటాను గదా ఆమె యోగినీ చక్రవర్తి. పూనా నగరంలో దూరంగా ఒక వేపచెట్టు క్రింద నిత్యం కూర్చునేది. ఎండాలేదు. వానాలేదు. చలీ లేదు. ఎప్పుడూ అక్కడే. శరీరం ముడతలు పడినా ఆమె దీపంలాగా మెరిసిపోయేది. నిత్య సంతోషమే





ముఖం మీద తాండవించేది. పఠానులు బెలూచీ మిలిటరీ వారెందరో ఆమె చుట్టూ మూగేవారు. ఆమె దివ్య సమాధిలో వున్నపుడు మాత్రం చేతిలో ఒక కర్ర తీసుకొని నడిస్తే వస్త్రాదులు సైతం ఆమెననుసరించలేక పోయేవారు. కనురెప్ప పడేటంతలో ఆమె నాకు సమాధిననుగ్రహించినది. అంటే నేనెక్కడ నుండి వచ్చానో ఆ అఖండ స్థితిని మొదటిసారిగా కల్పించినది. ఆ పారవశ్య స్థితి నాకు 9 నెలలైనా పోలేదు. లోకమంతా స్వప్నంలాగా గోచరించేది. అప్పుడు 1915 ప్రాంతంలో బాబా దర్శనం చేసాను. నన్ను చూడగానే బాబా అన్నారు. ఓహో పర్వర్దిగారా ! (దైవం) అని. నన్ను ఖండోబా గుడికి పంపించాడు. అక్కడ ఉపాసనీ నన్ను చూచి రావద్దని రాతితో కొట్టాడు. అది సరిగ్గా ఏ నుదుటి పైన బాబాజాన్ ముద్దు పెట్టుకోగా నాకు లోకానుభవం పోయిందో అక్కడ తగిలింది. వెంటనే నాకు లోకానుభవం వచ్చింది. దైవానుభవం, లోకానుభవం ఒక చోట ఉందా అంటే మహాయోగికే సాధ్యం. తర్వాత ఉపాసనీతో 7 ఏళ్ళు గడిపాను. ఆయన, నేను రాత్రుల్లో నిద్ర లేకుండా గడిపే వాళ్ళం. అప్పుడాయన చేతులు జోడించి – "మెహర్ నీవవతార పురుషుడవు. నీకు నమస్కారం" అని "మెహర్ బాబా".

ఇది సాయి శిష్య పరంపర. ఉపాసని సాయి శిష్యుడు. ఆయన శిష్యుడు మెహర్ బాబా. ఇది సాయి భక్తుల గురు పరంపర.

సాయిబాబా స్వయంగా తనను గురించి తానెవరో ప్రకటించుకొన్న ఘట్టాలు రెండు, మూడున్నాయి.

## 1

ఒక దొంగ కొన్ని వస్తువులతో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ వస్తువు లెక్కడివి? అని ప్రశ్నిస్తే నాకు శిరిడీ బాబా ఇచ్చాడన్నాడట. కోర్టు వారు బాబాను వచ్చి సాక్ష్యం చెప్పమని సమన్లు పంపిస్తే వాటిని తగులబెట్టండి అన్నాడట. తర్వాత భక్తులు కోర్టు వారికి విన్నవించుకొన్నారు. "వారు

మహాత్మ్యలు. కనక మీరే ఎవరినైనా శిరిడికి పంపి సాక్ష్యం సేకరించుకోమన్నారు.

ఒక మేజిస్ట్రేట్–నానా జోహ–అన్నాయన శిరిడి వచ్చి బాబాను ప్రశ్నించాడిలాగా. 1. "మీ పేరు?"

నన్నంతా సాయిబాబా అంటారు.

2. "మీ తండ్రి పేరు?" – ప్రశ్న

ఆయనా సాయిబాబానే

3. "మీ గురువు పేరు?" – ప్రశ్న

"వెంకూసా".

4. "మీ జాతి మతం?" – ప్రశ్న

"కబీరు"

5. "కులం " ?

"పర్వర్దిగార్" – ( భగవంతుడు )

6. "వయస్సు" –

లక్షల సంవత్సరాలు. విని మెజిస్ట్రేటడిగారట. మీరు చెబుతున్నది నిజమేనా? అని నేనెప్పుడూ అబద్ధమాడనని బాబా సమాధానం.

"మీకీ దొంగ తెలుసా?" అని మళ్ళీ ప్రశ్నిస్తే "ఔను తెలుసు. ఐనా నాకు తెలియని దెవ్వరు? నాకందరూ తెలుసు."

ఈ దొంగ మీతో ఉన్నాడని అంటున్నాడు. మరి ఇదీ నిజమేనా ! అని మళ్ళీ ప్రశ్న.

"ఔను. అంతా నాతోనే వుంటారు. అందరూ నావారే" అని బాబా సమాధానం. 'అతడంటున్నాడు. ఈ నగలు తమరిచ్చారని". "ఔను. ఇచ్చాను". అని సమాధానం. వెంటనే మరలా బాబా అన్నాడు. "ఎవరికెవరి





కిస్తున్నారు? ఇచ్చేదెవరు? పుచ్చుకొనేదెవరు? అయితే మీకీ నగలెలా వచ్చాయి అని మళ్ళీ ప్రశ్న.

"అంతా నాదే కనుక" అని బాబా

మెజిస్ట్రేటుకు మతి పోయింది.

"అయ్యా ! ఇది చాలా పెద్దకేసు. వాడంటున్నాడు. మీరే ఈ నగలు తనకిచ్చాడని' – అని అనే సరికి బాబా తీవ్రంగా అన్నాడట. "ఏమిటిదంతా? వీడితో నాకేం పని? అని విసుగుగా బయటకు వెళ్ళిపోయారు బాబా.

ఇందులో బాబా చెప్పిన సమాధానాలు. బాబా అసలు తత్వానికి సంబంధించినది. తనకూరూ–పేరు లేదు. బలి చక్రవర్తి కథలో బలి వామనుని ప్రశ్నిస్తాడు. "వడుగా ఎవ్వరి వాడవీవు" అని భగవంతుడన్నాడు. నాకూరు పేరులేదు. అన్ని పేర్లు ఊళ్ళు నావే. నేనే అంతటా ఉన్నాను అని. కాబట్టి తాను భగవంతుడనని స్పష్టంగా చెబుతున్నాడు బాబా. అదే మాట పర్వర్దిగారనీ స్పష్టంగా చెప్పాడు. మతం – జాతి – కబీరు అన్నాడు.

బాబా తన పూర్వజన్మలో కబీరునని ఒక చోట అన్నట్లు వారి జీవిత చరిత్ర కారులన్నారు. వేపచెట్టు క్రింద త్రవ్వినపుడు (ఈ కథ తర్వాత వస్తుంది) అది నా గురు స్థానం. త్రవ్వవద్దని బాబా వారించాడు. బాబా గురువెవ్వరు ? వెంకూసా 'అని పైన చెప్పాడు కదా! కబీరా! వెంకూసానా ? – అల్లామాలిక్ అన్నాడు కనుక అల్లానా? – (తర్వాత వస్తుంది). వెంకుసా కథ విషయం కూడా తర్వాత వస్తుంది. వయస్సు లక్షల సంవత్సరాలంటే ఆత్మకు వయస్సు లేదు. శరీరానికుంటుంది. ఆత్మకు దేశము లేదు. కాలమూ లేదు. పేరు లేదు. బాబా అన్నది పేరుకాదు. తండ్రి అన్న అర్థంలో బాబా అంటే సా + హి= ఆమెయే అని అంటే జగన్మాత అని కొందరన్నారు. కాబట్టి సాయిబాబా అంటే అమ్మా+తండ్రి కలసిన అర్థనారీశ్వర స్వరూపం. నేటి భాషలో మనం చూచే ప్రపంచం వస్తురూపంలో కన్పించే పదార్థ జగత్తు. ఇది శక్తి స్వరూపం. అందులో ఉన్న ఆత్మ పదార్థం. ఈశ్వరుడు.

కాబట్టి సర్వజగత్తు మాత (తల్లి, తండ్రి) (పరమేశ్వరుడు) స్వరూపం. కనుక బాబా అంటే సగుణ రూపమైన ప్రపంచము. దానికి లోపలా, బయటా వున్న ఆత్మస్వరూపం ఈ ప్రపంచంలో సకల జీవులు నా శరీరాలే అని మరొక చోట ప్రవచించారు బాబా. అంటే ప్రపంచం వారికి శరీరం అదే శక్తి. తాను ఆత్మ (నిర్గుణం). ఈ సగుణ, నిర్గుణ స్వరూపుడు బాబా,

బాబా భక్తులతో ఇలా అన్నట్లు 'సాయి సచ్చరిత్ర'లో ఉన్నది. "ఆత్మధ్యానం చేయండి. అది కుదరకపోతే మీరు రోజూ చూచే ఈ రూపాన్ని ధ్యానించండి అని. కాబట్టి బాబా రూపం సగుణం. ఆత్మ తనంత తానై ఒక రూపం ధరిస్తే అది బాబా.

బాబా చిత్రపటాల కథా ఇదే నిరూపిస్తుంది. (ఈ విషయం తర్వాత చూద్దాం) రామకృష్ణ పరమహంస కూడా అన్నారట.

"భగవంతుడు రెండుసార్లు నవ్వుతాడు. ఒకటి – అన్నదమ్ములు ఆస్తిపాస్తులు పంచుకొనేటప్పుడు నీదిది – నాదిది అనుకొన్నప్పుడొకసారి నవ్వుతాడట."

ఇదే బాబా అన్నది ఎవరిస్తున్నారు? ఎవరు పుచ్చుకుంటున్నారు?– అంటే ఇచ్చేది, పుచ్చుకునేది భగవంతుడేనని భావం. మరొకసారి వారే అన్నారట. ఎవరో భక్తుడు వచ్చి దుఃఖంలో ప్రార్థించాడు. 'స్వామీ! మా బోటివారికి తరణోపాయమేమిటని" ? – ఆ మహాత్ముడన్నాడట "మీరేం చేస్తారు కనుక. చేయగలరు కాబట్టి మీకోసం అంతా నేనే చేస్తాను. కాబట్టి దీనిని గుర్తు బెట్టుకోండి – అని తన శరీరాన్ని చూపించారట.

ఇదే బాబా అన్నదీ. "నిత్యమూ మీరు చూచే ఈ రూపాన్ని ధ్యానించండి" అని. మరొక చోట బాబా అన్నాడు.

నా తండ్రి పురుషుడు (ఆత్మ)

నా తల్లి మాయ (అమ్మ)





మాయ–మాత అన్న మాటలకర్థాలు వేరు. మామూలు అర్థాలు లోకానికి తెలుసు గాని పరమార్థం తెలియదు. అర్థంలో సూక్ష్మమైన భావం – సారాంశం – (పరమ+అర్థం) పరమార్థం.

'శ్రీమాతా' అని లలితా సహస్రం ప్రారంభమౌతుంది. మాత అంటే కొలిచేది. మానం అంటే కొలత. మేయం అంటే కొలవబడేది.

ఆత్మకు స్వరూపం లేదు. గుణం లేదు. అది అనుభవించదగ్గదే తప్ప మాటల కందేది కాదు. మాటల కందేది వస్తువు నీవూ–నేను–చెట్టూ–పుట్టా తప్ప ఆత్మకాదు. కనుకనే అది వాక్కునకు, మనస్సున కందేది కాదని చెబుతుంది, ఉపనిషత్తు–గీత. అలాంటి ఆత్మకు శరీరాన్నిచ్చి ఒక నామం – రూపం కల్పించే మహాశక్తి శ్రీమాత. నిర్గుణ పదార్థం. సగుణంగా మార్చే శక్తి తల్లి. ఆమె సర్వప్రపంచాన్ని తన మహాగర్భంలో మోస్తున్నది. ఆమె పేరు మహామాయ. ఇందుకే రామకృష్ణ పరమహంస అన్నది ప్రపంచమంతా తల్లి రూపమేనని. బాబా అన్నదీ ఇదే. –

ఇదంతా నా శరీరం. కాబట్టి ప్రతి జీవినీ బాబాగా పూజించటమే బాబా మీద మనం చూపే భక్తి. ఏ జీవి దగ్గరకు వచ్చినా కసురుకోవద్దు. ఋణానుబంధం లేనిదే

ఏదీ నీ దగ్గరకు రాదు–అని భక్తులకు బాబా చేసిన హితబోధ. ఆ జీవి రూపంగానే భావించి ప్రేమించండి అని బాబా లోకానికి చేసిన బోధ.

బాబా చరిత్రకారుడు హేమాడ్‌పంతు అన్నాడు "నేనే సర్వాంతర్యామిని. నేనే లక్ష్మిని, త్రిగుణ సామరస్యాన్ని నేనే. మీరెక్కడున్నా, ఏమి చేస్తున్నా నాకు తెలుస్తుందని జ్ఞాపకం పెట్టుకోండి. మీ హృదయాలపై అధికారిని నేనే. ఈ సమస్త జీవరాసుల్ని ఆవరించి వున్నాను. జగత్తును నడిపించేవాడిని నేనే. సృష్టి, స్థితి లయకారకుడనూ నేనే. ఇంద్రియాధిపతిని నేనే. నేనే వాటిని నడిపించే సూత్రధారిని. నన్ను స్మరించండి. కనిపిస్తున్న

చరాచర ప్రపంచం, జీవరాసులు నా శరీరమే"– అని అన్నాడట బాబా. ఈ మాటలు స్వయంగా విని గ్రంధస్థం చేసాడు సాయి సచ్చరిత్రకారుడు.

ఇందుకే మెహర్బాబా అన్నాడు "ఆయన సమస్త ప్రపంచాధిపతి. సృష్టికర్త అని

ఆ రోజులలో బాబాను దర్శించిన యోగులు పుణతాంబా నివాసి గంగాఘీరు మీరు, ఏవలా మఠంలో నివసించే అక్కల్ కోట మహారాజు శిష్యుడు ఆనందనాథుడు పండరీనాథుని మహా భక్తుడు గౌలిబువా గంగాఘీరు గొప్ప సాధకుడు. ఆయనొకసారి బాబాను దర్శించటానికి శిరిడి వచ్చి అన్నాడట. ఈ మణి ఇక్కడ వుండటం వల్ల శిరిడి పుణ్యక్షేత్రమైనది. నీళ్ళకుండలు మోసి తోట పెంచే ఈయనను మీరివ్వాళ్ళ తెలుసుకోలేరు. కానీ భవిష్యత్తులో తెలుస్తుంది. ఆయనెవరో. శిరిడి పుణ్యస్థలం కనుక ఆ మహాత్ముని రాబట్టుకోగలిగినది" అని.

అలాగే ఆనంద నాథుడు 'ఈయన ఒక అమూల్య రత్నం. సామాన్య మనిషిలాగా కన్పిస్తున్నాడు. కానీ ఒక అమూల్య వజ్రం తప్ప మామూలు రాయి కాదు" అని.

గౌలీ బువా 90 ఏళ్ళ వృద్ధుడు. పండరీపురంలో కొన్నాళ్ళు, నర్మదా నదీ తీరంలో కొన్నాళ్ళుండే మహాభక్తుడు. "సాక్షాత్తు ఈ మహాత్ముడు పండరినాథుని అవతారమని" అన్నాడు.

మాసిపోయిన కఫ్నీ–చంకన జోలి–చేతిలో ఒక సీనా రేకు డబ్బా–పుచ్చుకొని శిరిడీ వీధుల్లో బిచ్చమెత్తుకొని పాడుబడ్డ మసీదులో వుండే వ్యక్తి–బయటకు కన్పిస్తున్నవాడు. రాయి. లోపలి వెలుగు పరమాత్మ స్వరూపం. దానిని దర్శించినవారు కనుక వారలా అనగలిగినారు.

అలనాడు శ్రీ కృష్ణుని కూడా భగవదవతారమని భీష్మాదులు విశ్వసించారు తప్ప శిశుపాల కౌరవులు కాదు కదా.

కాబట్టి బాబా ఇలా అన్నాడట ఒకసారి "నా భక్తుని యింటిలో





అన్న, వస్త్రాలకు లోటుండదు. నన్నారాధించే వారిని సదా రక్షిస్తుంటాను. నీకేం కావలసినా నన్నడుగు. లోకంలోకి వెళ్ళు కానీ నీ మనస్సు నాకర్పించి వెళ్ళు. భగవద్భక్తునిగా జీవించు." ఈ బోధ ఇహపర సాధకమైనది. లోక వ్యవహారం తప్పదు. కానీ ఎలా వ్యవహరించాలి. దైవాన్ని మనస్సులో నిలుపుకొని శరీరంతో జీవయాత్ర చేయాలి.

శ్రీ రమణ మహర్షి కూడా ఇలాగే అన్నారట. ' నీ మనస్సులో కాశీ– హిమాలయా లకు వెళ్ళాలని కోరుకొని యిక్కడుంటూ బాధపడవద్దు. మనస్సులో కాశీలో ఉన్నానను కొంటూ శరీరంతో వ్యవహరించు' అని.

# 4. జామ్నేరు చమత్కారం

జామ్నేరులో నానా చంద్రోర్కరన్న బాబా భక్తుడు ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కూతురు మైనాతాయి ప్రసవవేదన పడుతున్నది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం శూన్యం. మనసులో బాబాను ప్రార్థిస్తున్నాడు.

ఈ జామ్నేరు ఖాండేషు జిల్లాలో వున్నది. అది శిరిడికి 100 మైళ్ళ దూరం. ఇక్కడ శిరిడిలో ఒక భక్తుడు రామగిరి బువా ఖాండేష్ జిల్లాలో వున్న తన ఊరు పోవాలనుకున్న ప్రేరణ కలిగి బాబాకు నమస్కరించి అనుమతిని అర్థించాడు. బాబా అన్నాడు 'మంచిది పోయిరా, వెళ్ళేటప్పుడు జామ్నేరు పోయి నానాతో ఆనందించి వెళ్ళు అన్నాడు. బువా అన్నాడు 'బాబా నా దగ్గర రెండే రూపాయలు ఉన్నాయి అవి జలగాం వరకే సరిపోతుంది అక్కడి నుండి జామ్నేరుకు డబ్బు లేదు' అన్నాడు. బాబా అన్నాడట 'బాపు బువా అన్నీ అవే సమకూరుతాయి పో అన్నాడు' అని. ఆద్కరు వ్రాసిన హారతి పాట వ్రాసుకోమని చెప్పి ' దానిని ఈ ఊదీని నానాకివ్వు అని పంపించాడు. రామగిరి బువాను బాపూ బువా అని బాబా ఒక్కరే పిలిచేవారట. జలగాం నుండి జామ్నేరు 30 మైళ్ళు పోవాలంటే

బండి మీదో, టాంగా మీదనో పోవాలి. సరే బాబా మీద అచంచలమైన భక్తి కలవాడు కనుక బువా, బయల్దేరి జలగాం వెళ్ళేసరికి రాత్రి 2:45 అయినది. దిగగానే జేబులో రెండు అణాలు మాత్రమే ఉన్నవి. కనక ఎలాగురా అనుకుంటూ స్టేషన్ బయటకు వచ్చాడు. అక్కడ ఎవరో ఒక గడ్డమున్న ఆసామి పిలుస్తున్నాడు. బాపూ బువా ఎవరు? అంటూ (బాబాను గుర్తించడానికిలా 1, 2 సూచనలిస్తాడని కథల్లో వస్తుంది.) నేనంటూ ఈయన పలికితే ఆయన ఒక టాంగా దగ్గరకు తీసుకొనిపోయి కూర్చోబెట్టి బండి తోలాడు. ఆ గుర్రాలు చాలా పెద్దవి. బలంగా వున్నాయి. చాలా ఖరీదైనవి. బండి క్రొత్తగా వుంది (ఇవీ గుర్తుంచుకోవాలి). తెల్లవారేసరికి బాగూరు ప్రక్కనున్న సెలయేరు దగ్గర బండిననాపి టాంగావాలా బాపూ గుర్రాలకు నీళ్ళు త్రాగించి వస్తాను. నీవీ ఫలహారాలు తినమని పేడా వంటి తీపి పదార్థాలను పెట్టాడు. అతడు సంశయించాడు. ఈయన సాయిబు లాగు ఉన్నాడు కదా. ఎలా తినేది అని ఆయన ఈ గుంజాటనను కనిపెట్టి నేను సాయిబును కాదు. గరవాల్ దేశ క్షత్రియుణ్ణి. తినమని ఇచ్చి గుర్రాలకు నీరు త్రాగించటానికి వెళ్ళాడు. (ఈ గరవాల్ హిమాలయాలలో సిక్కు రాజులు పాలించిన రాష్ట్రం. బాబాకివన్నీ తెలుసుననటానికిదొక గుర్తు. ) మరలా బండి బయలుదేరి తెల్లవారుజాముకు జామ్నేరు చేరింది. బాపు గిరిబువాకు దిగి మూత్ర విసర్జనం చేసుకోవాలనిపించి బండినాపించి అవతలికి వెళ్ళి పని ముగించుకొని వచ్చేసరికి బండి లేదు. టాంగావాలా లేదు. ఆశ్చర్యపోయి ఆ దగ్గరలో ఉన్న కచేరి ఏదోనని పోయి విచారిస్తే అదే నానా పనిచేసే కార్యాలయమని ఆయన ఇల్లు దగ్గరేనని తెలుసుకొని వెళ్ళి నానాను చూచి విషయం చెప్పాడు.

బాబా స్వయంగా పంపిన మనిషని తెలిసిన నానా ఆనందానికి అవధులు లేవు. హారతి పాడుతూ కూతురుకు ఊదిని నీళ్ళలో కలిపి త్రాగించటం సుఖ ప్రసవం జరగడం తొందరగా జరిగిపోయింది.

బువా నానా దగ్గర సెలవు తీసుకొనిపోతూ అన్నాడు. "నానా తమరు





టాంగాను పంపకపోతే నేను ఇబ్బంది పడిపోయేవాడిని అని ఆయన ఆశ్చర్యపోయి నేను పంపడ మేమిటి? మీరు వస్తున్నారని నాకెలా తెలుస్తుంది?అని, ఇద్దరూ ఇదంతా బాబా లీల అని మనస్సుల్లో నమస్కరించుకొన్నారు. బువా వెళ్ళిపోయాడు.

ఇప్పుడు చూద్దాం. ఈ చమత్కారానికి అర్థమేమిటి ? చమత్కారమంటే పైకి మామూలుగా కన్పించే విషయాన్ని తరచి చూస్తే దైవకార్యమైన అద్భుతంగా కన్పించే విషయమని అర్థం.

### దీని భావం

శరీరమే రథం. ఆత్మ రథంలో కూర్చున్న యజమాని రథాన్ని తోలే సారథి బుద్ధి. మనస్సు గుర్రాల పగ్గాలు. కాలు, చేయి మొదలైన కర్మేంద్రియాలు ఐదు. కన్ను, ముక్కు, చెవి వంటి జ్ఞానేంద్రియాలు ఐదు కలిపి పది గుర్రాలు. ఇవి విషయ వాంఛలతో లోకంలోకి పరుగెత్తుతున్నాయి. కనుక వస్తురూపమైన ప్రపంచమే వాటికి దారులు. ఆత్మ + బుద్ధి + మనస్సు + ఇంద్రియాలు అన్నీ కలిసిన ఏకవ్యక్తి పేరు 'భోక్త' అనుభవించేవాడు.

ఎవడు విజ్ఞానవంతుడంటే రథికుడంటే లోపలనున్న ఆత్మను తలచుకొంటూ బుద్ధితో విచారించి మనస్సన్న పగ్గాలను ఇంద్రియ నిగ్రహంతో బంధించి జీవయాత్ర చేసే మనిషి. అంటే తనను తాను ఆత్మను భగవంతునికి సమర్పించుకొని శరణని బ్రతకడం దివ్యమార్గం. ఆధ్యాత్మ మానవుని జీవయాత్రా స్వరూపమిది.

అలాకాక ఎవడు మనస్సన్న పగ్గాలను వదలిపెడతాడో ఆ బండిని గుర్రాలు గుంటలోనికి లాగుకొని వెళతాయి.

ఇది కఠోపనిషత్తులో చెప్పిన జీవాత్మ+పరమాత్మల సమన్వయం. ఇది శ్రేయస్సును కల్గిస్తుంది. ఇదే భారతంలో పార్థసారథి రథ స్వరూపము. పార్థుడు జీవాత్మ = నరుడు. సారథి మీద భారం వహించి కురుక్షేత్ర

యుద్ధం చేశాడు. అంటే జీవితంలోకి వెళ్ళాడు. అతనికే గీతా బోధ జరిగింది. శ్రేయోమార్గం లభించింది. ఇందుకే ఇవ్వాళ ప్రపంచంలో ప్రతి ఇంట్లో ఈ రథం బొమ్మలు కనిపిస్తున్నాయి.

శల్య సారథ్యం దీనికి వ్యతిరేకమైనది. అక్కడ మనస్సు (శల్యుడు) రథికుడైన కర్ణుని అపాయంలోకి తోసింది. ఇది బుద్ధి లేనివాని పని. లోకమే నిజమనుకొనే వాడిలాగే ప్రవర్తిస్తాడు. ఇందుకే శల్య సారథ్యమన్న పేరు వచ్చింది.

ఆనాడు భగవంతుడు గురువై – స్నేహితుడై – వచ్చి అర్జునుని పాండవులను ఆదుకొన్నట్లు, నేడు బాబా వచ్చాడు. దైవమే గురువై వచ్చిన వాని కథే బాబా సచ్చరిత్ర. ఇందుకే బాబా గురుశరణాగతినే మోక్ష సాధనంగా ప్రకటించాడు. కనుకనే శ్రీకృష్ణుని కోసమని కట్టిన బూటీవాడాను తన గుడిగా మలుచుకొన్నాడు. దానిని కట్టించిన బూటీ మధ్యహాలులో మురళీధరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించుదామనుకొంటున్నట్లు బాబాతో అంటే బాబా అన్నాడట ఎందుకు మనమే కూర్చుందాం. అంతా కలసి హాయిగా ఆడుకొందా'మని అంటే తానే శ్రీకృష్ణుడని కదా భావం. కృష్ణుడానాడు బృందావనంలో గొల్లపిల్లలతో ఆడుకొన్నట్లు మనమూ ఆడుకొందామని ఆ కథను గుర్తు చేయటంలో తాత్పర్యం. తాను కృష్ణావతారమని చెప్పటం. అసలు ప్రతి గురువు ఆ జగద్గురువు అవతారమే. ఈ విషయం గీతాశ్లోకం దగ్గర బాబా ప్రకటిస్తాడు. తాను కృష్ణునిలాగానే శిరిడీ వాసులతో ఆడుకొన్నాడు బాబా. బాబా జీవితమంతా శ్రీకృష్ణుని లీల. ఆ టాంగా కథ పార్థసారథి కథే. ఇందుకే 'లీలా సమాధి' లో ఈ పద్యం చెప్పబడినది.

"జీవి గ్రావమై ఆంతర చేతనమ్ము
నందనందనుడైన ఆనందమూర్తి
రావియాకుల బూరతో రాగమాల
పితుకుచున్నాడు – చిరుపుల్ల వెదురు తోడ!





'ఇతడు శ్రీకృష్ణుడేమో ? నా హృదయ వీధి
కడిమి తోటలు పూయు చీకట్లలోన
వర్ణమయ విశ్వపింఛంబు ప్రభల తోడ
శ్వేత పద్మముల్ వికసింప చేయుచుండె !"

బాబా ఒక బండ మీద కూర్చున్నాడే ? ఆ కథ తర్వాత చెప్పుకొందాం. ఆ బండ ఎవరు? లోకం అంటే మనం. పైన కూర్చున్నవాడు పరమాత్మ శ్రీకృష్ణుడు. రావి ఆకుల బూరతో సంగీతం పాడుతున్నాడు. మనం బండలమంటే అజ్ఞాన స్వరూపులం. కనుక మన మనస్సుల్లో అంతా చీకటే. దానిని కడిమి చెట్ల వనంలాగా అమ్మ వుండే మనలో చోటది కనుక బాబా లోకమన్న రంగు రంగుల పింఛం పెట్టుకొని జ్ఞాన పద్మమైన సహస్రారాన్ని వికసింపజేయాలి – అని ప్రార్థన. ఇది బాబాలోపలి కనుకనే బాబా పాదసేవ చేస్తున్న ఒక భక్తుడు సపత్నే కరుతో అన్నాడట "నీవిప్పుడు సేవిస్తున్న పాదాలు ఆద్యంతములు లేనివి. పవిత్రమైనవి. నీ కష్టాలు గట్టెక్కినవి" అని. ఇది బాబా పాద మహిమ. ఈ పాదాలే ఇవ్వాళ మనం దర్శిస్తున్న గురుస్థానంలో కన్పించే వెండి పాదాలు. అవి తన గురువుగారివని బాబా అన్నా మనకు గురు బాబావే.

ఒకసారి ఒక భక్తురాలు వెండి పాదుకలు చేయించి బాబా పాదాలు పెట్టమని ప్రార్థించింది. బాబా అలా చేసారు. ఆమె వెండి పాదుకలు తీసుకొనిపోతుంటే అన్నాడట. 'ఆమె బాబా పాదాలను తీసుకొని పోతున్నదిరా! అని. అంటే ఆ పాదుకలలో తన దివ్య జ్యోతిర్మయములైన పాదాలను ప్రవేశపెట్టాడన్నమాట. మనం గురువులకు నమస్కరించటం. పాదుకా పూజ చేయటమన్నది ఆ పాదుకలు సహస్రార కమలంలో ధ్యానించటమే.

బాబా పాదాలు నిత్యమూ మన శిరస్సులోని వేయిరేకుల పద్మంలో ధ్యానించటం శ్రేయస్కరం. శ్రీరమణ మహర్షి అన్నాడట 'ఆత్మజ్ఞానం

హృదయంలో బంగారు దీపంలాగా
ప్రకాశిస్తూ వుంటుంది. అదే గురువు గారి పాదాలు అవి చాలా దయగలవి" అని గురుపాద మహిమను గురించి చెప్పారు. వాటిని ధ్యానించటమే ఆత్మజ్ఞాన సాధనం.' శ్రీరామ కృష్ణ పరమహంస కూడా ఎవరి మీదనైనా దయకల్గితే తన పాదాన్ని ఎత్తి వాని శిరస్సుపైన పెట్టేవారట. ఎవరో ఒకసారి నవ్వుతూ అన్నాడట "ఇది మరీ అన్యాయం గురూజీ. ప్రతివారి నెత్తిన కాలు పెట్టటం". అంటే, వారన్నారట – "అది నాకు తెలిసి చేస్తున్నానా. అమ్మ అలా చేయిస్తున్నది" అని బాబా ఎడమ పాదాన్ని భూమి మీద పెట్టి కూర్చున్న ఫోటో చూస్తే లోకానికి ఆ పాదాన్ని పూజించుకోమని అనుగ్రహించారని స్పష్ట పడుతుంది.

ఇంకొకసారి మరొక భక్తుడు దామూ అన్నాకేసారే–అన్నవాడు బాబా పోయినాక తనగతేమిటని తనలో అనుకుంటూ బాబా పాదసేవ చేస్తుంటే బాబా "నేను పోతానని భయపడవద్దు. నేను సమాధి చెందినా నా ఎముకలు మీతో మాట్లాడుతాయి–ఓదారుస్తాయి. విశ్వాసాన్ని కల్పిస్తాయి. నా సమాధి మీ వెంటనే ఉంటూ మాట్లాడుతుంది. అనన్య భక్తితో నన్నే సేవించే వారిని రక్షిస్తాయి. సందేహం లేదు. ఇది బాబా లోకానికిచ్చిన కరదానం వరదానం అభయహస్తం.

గతంలో శ్రీ కృష్ణుడన్నాడు 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం ప్రజ అహం త్వాంసర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అన్ని ధర్మాలను వదిలి నన్నే శరణను నిన్ను సర్వ పాపాల నుండి విముక్తుని చేస్తాను.

ఇదే బాబా అన్నది. ఇందుకే బాబా 'సమాధి' మనకు గుడి అయినది. నిత్యమూ పూజలందుకొంటున్నది. శ్రీ రమణ మహర్షి అన్నారు. 'రమణుడంటే శరీరం కాదు. అది పోవటమంటూ ఏమీ లేదు. నిత్యమూ సర్వే సర్వత్రా వుంటుంది'–అని. ఎవరో భక్తుడు మద్రాసు పోతూ అయ్యో మహర్షిని వదిలి పోవలసి వచ్చిందే అని" మహర్షి అన్నారట. "ఈయన





చూడండి. ఇన్నేళ్ళు ఇక్కడ ఉండి పోవటానికి బాధపడ్తున్నాడు. మహర్షి అంటే శరీరమా!" అని. బాబా కూడా అన్నాడు. 'బాబా అంటే మూడు మూరల శరీరం కాదు' అని. కనుకనే భక్తులను పిలిచిన చోట్ల ప్రత్యక్షమైనాడని కథలు వింటున్నాం. నానా చాందోర్కరు – దాసగణు – మొదలగు వారి కథల్లో ఇది కన్పిస్తుంది.

హరిశ్చంద్ర గుట్టమీద నానా చందోర్కరు దాహమై తపించి పోతున్నాడు. ఆ కొండ శిరిడీకి చాలా దూరంలో సుమారు 100 మైళ్ళ దూరంలో వుంది. నానా ఆ కొండపైనెక్కుతుంటే దాహమైనది. ఎక్కడా నీటి చుక్కలేదు. దాహంతో అల్లాడిపోతున్నాడు.

ఇక్కడ శిరిడీలో బాబా అరుస్తున్నాడు. నానా నీళ్ళ కొరకు బాధపడుతున్నాడు నా భక్తుని రక్షించటం నా బాధ్యత అంటూ కొండపై నానా దగ్గరకొక భిల్లుడు అడవి జాతివాడు వచ్చి అయ్యా నీవు కూర్చొన్న రాతి క్రిందనే నీటి ఊట ఉంది చూడు అని ఆరాయి దొర్లిస్తే క్రింద దాహం తీర్చేటంత నీరున్నదట. అతని దాహం తీర్చిన భిల్లుడు బాబా భగవంతునకు సర్వ వ్యాపకత్వము – అంతటా వ్యాపించటము– సర్వశక్తిమత్వం (అన్ని శక్తులు), సర్వ నియామకత్వం (అన్నిటిని నియమించటం), సర్వరూప ధారణం వంటి శక్తులనేకములన్నాయి. ఇలాంటివి బాబాలో మనకు దర్శనమిస్తాయి.

ఈ కథలో భిల్లరూప ధారణంతో పాటు నీవున్న చోటనే దాహానికి నీరున్నది. నీవున్న చోటనే నేనున్నాను– దాహం తీర్చటానికని బాబా బోధ.

(ఈ కథలోని దాహమే ఈ గ్రంథమాలిక శీర్షిక "సామి! దాహం, దాహం, దాహం అన్నది)

కొండ అంటే లోకం. మనం జీవించే లోకం బాబా కూర్చున్న శిల అదే. దాని క్రిందనే (పైనా) తానున్నాడు. బాలకృష్ణ మాన్‌కర్ ఒక ప్రత్తి మిల్లులో పెద్ద ఉద్యోగి. భార్య పోయినాక సన్యసించి వచ్చి శిరిడిలో

స్థిరపడ్డాడు. బాబా తనలాగా కఫ్నీ – తలచుట్టూ గుడ్డతో వుంటాడు గదా. ఆ వేషం ముగ్గురు భక్తులకే అనుగ్రహించాడట. అందులో ఒకరు ఈ మాన్ కర్.

ఒక రోజు వానికి 10 రూపాయలిచ్చి మచ్ఛీంద్రగడ్ కొండకు పోయి అక్కడ ముప్పూటల ధ్యానం చేయమన్నాడు. ఆయనకు బాబాను వదిలి పోవటం ఇష్టంలేదు. కానీ బాబా అది తనకుపయోగిస్తుందని బలవంతాన పంపించాడు.

ఆయన మచ్ఛీంద్రగడ్‌కు వెళ్ళి బాబా చెప్పినట్లు ధ్యానం చేయసాగాడు. ఒక రోజున మాన్కర్ జాగ్రదవస్థలో మేల్కొని వుండగానే బాబా కనిపించాడు. అతడు ఆశ్చర్య పోతుంటే బాబా అన్నాడట. నీవు శిరిడీలో మూడున్నర మూరల శరీరమే బాబా అని అనుకున్నావు. కాదని నేను సర్వే సర్వత్రా వున్నానని నిరూపించటానికే నిన్నిక్కడకు పపించానని అదృశ్యుడైనాడు. తర్వాత మాన్కర్ తన ఊరు దాదరు పోవటానికి పూనా స్టేషన్లో టికెట్టు కోసం క్యూలో నిలబడ్డాడు. తనకు ముందొక వ్యక్తి కంబళి కప్పుకొని – గోచి పెట్టుకొని ఒక గొఱ్ఱెల కాపరిలాగా ఉన్న వ్యక్తి నిలబడి టిక్కెట్టు తీసుకొని వెనక్కు తిరిగి మాన్కర్ కాటిక్కెట్టిచ్చి నాకు పూనాలో వేరేపని పడినది. నీవిది తీసుకోగలవా? అని అంటే అతడు సంతోషంగా తీసుకోగలనన్నాడు. అని జేబులో డబ్బులు తీసి యివ్వబోయేటంతలో ఆ వ్యక్తి మాయమైనాడు. మాన్కరుకు తెలిసింది అతడు బాబా అని. ఈ సంఘటనలో బాబా స్వరూపంలోను ఇతర వ్యక్తి రూపంలోను కన్పించటం స్పష్టమే. ఇంకా చిత్రమైన అంశం తహసీల్దారు బాలకృష్ణ వినాయక దేవు గారింట్లో వ్రతం ముగింపు ఉత్సవానికి బాబా ఒకరు మరొక ఇద్దరు వ్యక్తుల రూపాల్లో విందుకు హాజరైన కథ.

దహను శిరిడీ వందల మైళ్ళ దూరంలో వుంది. దేవుగారింట్లో వ్రతం చేసుకొని సమాప్తి రోజున 200 మందికి భోజనాలేర్పాటు చేసి





బాబాను ఆహ్వానిస్తూ ఉత్తరం వ్రాసారు. అది తీసుకొని జోగ్ మసీద్ మెట్లెక్కి చదివి విన్పించాడు. బాబా అన్నాడు "నేను, నీవు మరొకరు ముగ్గురం వెళ్దాం. నాకు రైళ్ళు, టాంగాలు అక్కర్లేదు. తప్పకుండా వస్తాం అని వ్రాయి. నన్ను ప్రేమతో పిలిచిన వారి దగ్గర ప్రత్యక్షమవుతాను" – అని జోగ్ వ్రాశాడు. దేవ్ అది చూచి ఆనందించాడు. ఈలోగా ఎవరో బెంగాలీ వ్యక్తి దహను స్టేషన్ మాష్టరు దగ్గరకు వచ్చి గోరక్షణ నిమిత్తం చందా కోసం వచ్చానని చెప్పాడు. ఆయన దేవుగారు మామల్తదారు కనుక వారి నడగటం మంచిదన్నాడు. ఇంతలో ఆయనే అక్కడకు వచ్చాడు. స్టేషన్ మాష్టరు చెప్పిన సంగతులు విని ఇంకొక రెండు నెలలు పోయిన తర్వాత రమ్మన్నాడు.

ఈలోగా దేవుగారింట వ్రతం విందు రాగా 10–11 గం.ల ప్రాంతంలో వారింటికి ఒకరు వచ్చేరు. దేవనుకొన్నాడు బెంగాలీ వ్యక్తి కాబోలు వచ్చాడనుకోవటం చూచి – వారన్నారు. మేము విందుకోసం వచ్చాం. నాతో పాటు ఇంకా ఇద్దరున్నారని చెప్పాడు. దేవు సంతోషపడి అలాగే 12 గం.లకు రండి. మీరెక్కడుంటారో చెబితే మనిషిని పంపిస్తానన్నాడు. ఆయన వద్దు మేమే వస్తామని చెప్పి వెళ్ళాడు. బాబా రాలేదని. మరలా దేవు బాబాకు ఉత్తరం వ్రాయటం జోగు అది చదవటం జరిగింది. బాబా అన్నాడు "నేను మరొక ఇద్దరితో వస్తానని చెప్పి వెళ్ళి విందారగించి వచ్చాను. నన్ను గుర్తించ లేనివాడు నన్నెందుకాహ్వానించాలి. గుర్తుగా అందుకే నాతో ఇంకా ఇద్దరున్నారని చెప్పాను. అయినా గుర్తించలేదు. అన్నమాట తలపోయినా తప్పను". అని

ఇందులో ముగ్గురు సాధారణ వ్యక్తుల రూపాలు ధరించి వెళ్ళటం స్పష్టం. బాబా వస్తాడంటే అదే రూపంలో వస్తాడనుకోవటం తప్పు. ఇందుకే బాబా అన్నది.

"ఈ సమస్త సృష్టి – సకల జీవరాసులు – నీచ జంతువులు సైతం నా శరీరాలు". అని చెప్పటం వాటిని ప్రేమిస్తే నన్ను ప్రేమించడమేనని చెప్పటం

కదా. రమణమహర్షి కూడా ఇలాగే అనేవారట – "నాకు ఎక్కువ వడ్డించి నా కోసమనీ ఇవి తేవటం దేనికీ. అందరకూ వడ్డించిన తర్వాత నాకు మిగిలితే పెడితే సంతోషిస్తాను. ఇక్కడకు దేనికి వచ్చారో మరచిపోయి స్వామి కవీ ఇవీ పెట్టటం, సౌకర్యాలు సమకూర్చటం, దేనికి" అని నివారించేవారట.

సర్వ జీవులలోను తనను – ఆత్మను దర్శించేవారికి తానొక ప్రత్యేక వ్యక్తి ననుకోవటం కుదరని విషయము. సర్వ వ్యాపకుడు, సర్వ రూపనామధారీ తానే. ఇక్కడ 'నేను' అన్నవాడు ఎవ్వడూ లేడు. ఆ పరమాత్మకున్న వేయి రూపాలు–చేతులు–తలలూ– మనం ఆయన అంతర్యామి. బాబా పై మాటల్లో అన్నది నన్ను గుర్తించనివాడు ఎందుకు పిలవాలి అన్నది దానికర్థమిదే.

కథ అప్పుడు జరిగింది. మనమిప్పుడున్నాం. మనకేమి పని కథతో. అంటే సర్వకాలాలవారికీ అన్వయించకపోతే మాట, చేష్టా అది అవతారం కాదు. గీత అర్జునునికి చెప్పినా మనకోసమేనని మరచిపోరాదు. అందులో ప్రతిమాట మనకన్వయించేదే. కాబట్టి బాబా ఏ రూపంలోనైనా వస్తాడు. కుక్క, పంది రూపాల్లో సైతం వస్తాడు. "ఏదీ నీ దగ్గరకు ఋణానుబంధం లేకుండా రాదు. ఉన్నది పెట్టు. తరిమికొట్టవద్దు" – ఇది బాబాను ప్రేమించటమంటే. బాబా ప్రేమ, భక్తి అంటే ఇలా వుండాలి అని మనకు బోధించటమే కదా. పండితుడు (భక్తుడు) అంటే కుక్కను, దానిని తినే వానిని సైతం భగవంతునితో సమానంగా ప్రేమించటమేనని గీతలో కృష్ణ భగవానులు అనలేదా. దానికొక ఉదాహరణ –

ఉపాసనీ బాబా కథలో – ఈయన బాబా భక్తుల్లో చాలా గొప్పవాడు. రమణ మహర్షికి 'నాయన' గారి వంటివాడు. ఈయన గొప్ప ఉపాసకుడు గొప్పకవి. ఉపాసనీ అంతే లేకపోతే ఈయన మహాయోగి. శక్తిమంతుడై మెహర్బాబా వంటి అవతార పురుషునికి గురువైనవాడు. బాబా ఆయనను





చూడగానే మసీదులో నిన్ను నా అంతవానిని చేస్తా. శిరిడిలో 4 సంవత్సరాలుండు. ఖండోబా గుడి దగ్గరుండి భిక్షాటనతో యోగాభ్యాసం చేయమన్నాడు. ఆయన అలాగే చేస్తూ ఒక రోజు బాబాను తన దగ్గరకు వచ్చి భోజనం చేయమని ప్రార్థించాడు. సరే వస్తాను గాని గుర్తిస్తావా ? అన్నాడు బాబా. "ఆహా! నిన్ను గుర్తించలేనా? " రమ్మన్నాడు. ఉపాసనీ బ్రాహ్మణుడు. వంట చేస్తుంటే ఒక గొఱ్ఱెల కాపరి ఆనాటి భాషలో అంటరానివాడు ఒకడు వచ్చి కఱ్ఱమీద గడ్డమానించి చూస్తుంటే పోరా అని కసిరాడు ఉపాసని. బ్రాహ్మణుని వంట శూద్రుడు చూడకూడదు కనుక,

ఉపాసనీ మసీదుకు పోయి బాబాపై కోప్పడ్డాడు చనువుతో. నీవు రాలేదు – అని. 'నేను వచ్చానురా'. ఎప్పుడు వచ్చావు? ఆ వచ్చిన వాడెవరు! నీవు కసిరావే వాడినే నేను అన్నాడు బాబా. మరలా రేపు రమ్మని ప్రార్థించాడు. సరే నన్నాడు బాబా కుక్కగా వెళ్ళాడు. ఆయన రాయి విసిరాడు. మరల ఉపాసనీ బాబాను దెప్పిపొడిచాడు రాలేదని. 'ఆ వచ్చిన కుక్క ఎవరురా? నేనే". ఇదే గీతా సారాంశం. తాను కృష్ణుడు అంటే పరమాత్మ స్వరూపమని బాబా చెప్పటమే కదా.

ఉపాసనీ వంటివాడు గుర్తించని బాబాను మనమా గుర్తించేది? కాబట్టి అంటే సృష్టి అంతా సర్వజీవులూ ఆయన రూపాలేనని ప్రేమిస్తే బాబాను ప్రేమించటమేనని బాబా బోధించటమే ఈ కథల సారాంశం.

ఇలాంటివెన్ని కథలు?? ఉదాహరణ ప్రాయంగా చెప్పుకోగలమే తప్ప అన్నీ చెప్పుకోలేం. పైగా మనకు దక్కినవి చాలా తక్కువ. పోయినవెన్నో??

చంద్రాబాయి బోర్కరు అన్న మహిళ శ్రావణ మాస వ్రతం చేస్తూ కోపర్గాం ప్రతిరోజూ దత్తమందిరం ప్రదక్షిణం చేస్తున్నది. ఒకరోజున ప్రదక్షిణ సమయంలో ఆమెకొక ఫకీరు కన్పించి, నాకు పాయసంతో పాటుగా వెల్లుల్లిపాయల పచ్చడి చేసి పెట్టు అన్నాడు. ఆమె నేను వ్రతం చేస్తున్నాను.

ఉల్లిపాయ పచ్చడి పెట్టలేను – అన్నదే కాని మనసులో బాధపడుతూనేవుంది. పెట్టలేకపోయానే అని. ఆ బాధలో వ్రతం పూర్తి చేసుకొని, శిరిడి వచ్చి బాబాను దర్శించింది, జోగ్ భార్యతో పాటు. బాబా అన్నాడట జోగ్ భార్యతో–ఈమెను పాయసం పచ్చడి పెట్టమంటే నాకు పెట్టలేదని; ఆమె– 'బాబా ఆమె నిన్ను దర్శించటానికి వచ్చింది అన్నదట. బాబా – కాదు ఆమె నీకు గత 7 జన్మలుగా చెల్లెలు. నీ కోసం వెదుక్కుంటూ వచ్చింది. అప్పుడర్ధమైంది చంద్రాబాయికి దత్తమందిరం దగ్గర ఫకీరు బాబాయేనని.

ఇందులో ఉల్లిపాయల విషయం వ్రతంనాడు దేనికి ? – అవి మోక్షానికి అడ్డు అన్న భావన లోకంలో వుంది. అది తప్పుడు ఆలోచన అని చెప్పడానికి (ఇలాంటి కథలు దాదా– కేల్కరు ఉద్ధవేశ్ బువా కథల దగ్గర వస్తాయి)

శ్రీరమణ మహర్షి తల్లితో అన్నారట. 'అమ్మా! నీకు మోక్షమార్గంలో ములక్కాయల అడవులు – ఉల్లిపాయల కొండలు అడ్డు వస్తాయి ఎట్లా? ఇవన్నీ నాకోసం భక్తులు తెస్తారుమరి" అంటే అవి తినటం, తినక పోవటానికి ముక్తికీ సంబంధం లేదనీ.

వామాచారంలో మాంసం – మద్యం వంటివి నైవేద్యాలుగా అర్పించటం విషయంలో పరమహంస కూడా అంగీకరించిన సంగతి వారి చరిత్రలో వుంది. వారి తంత్ర సాధనలో భైరవీ బ్రాహ్మణి వాటితో సాధన చేయించిన కథా వుంది. అలాగే బాబా దగ్గర ఉపవాసాలు – ఆహార నిషేధాలేమీ లేవు. భక్తివుంటే చాలు. మనుష్యులుగా రావటమే కాక జంతువులుగా కూడా బాబా రావటం. ఆహారాన్ని తీసుకోవటం చూస్తాం.

శ్రీతార్కాడ్ శిరిడిలో వున్నప్పుడొక రోజున జంతువులకు కుక్కకు పందికి రొట్టె పెట్టింది. మసీదుకు రాగానే ఆమెతో బాబా అన్నాడు. "తల్లీ నాకు ఆకలిగా వున్నప్పుడు

నీవు రొట్టె పెట్టావు. నీవు తినకుండానే ఎప్పుడూ ఇలాగే చేయి. ఈ





జంతుదయ నీకు శుభం కల్గిస్తుంది అని అంటే, బాబా, నేనే యిక్కడ అతిథిగా వున్నాను. నేనెప్పుడు నీకు రొట్టె పెట్టాను అని. అప్పుడాదైవ మామెకు గుర్తు చేసింది "నీ వన్నము తినబోయే ముందు నీ దగ్గరకు కుక్క పంది వస్తే పెట్టలేదా?! అని, అవి నేనే. సర్వ జంతువుల్లో నేనున్నాను కదా.

ఇది తన అంతర్యామిత్వము, ఆత్మ స్వరూపాన్ని భక్తులకు చెప్పటం. అలాగే లక్ష్మీబాయితో మసీదులో బాబా అన్నాడు. "లక్ష్మీ నాకాకలిగా వుందని బాబా ఉండు ఇప్పుడే ఇంటికి పోయి రొట్టె తెస్తానని అలాగే చేసింది. ఆ రొట్టెను బాబా ఆకలిగా వున్న కుక్కకు వేసాడు. లక్ష్మీబాయి అన్నదట 'బాబా! అదేంపని నాకోసం గదా! అంటే, లక్ష్మీ ఈ కుక్క ఆకలి కూడా నాదే కదా అని.

రమణ మహర్షి కూడా తన చుట్టూ చేరిన జంతువులకు, పక్షులకు, ఉడతలకూ ఆహారం పెట్టేవారని చదువుతున్నాం. ఒక రోజు వారన్నారట– కుక్కలు, కోతులూ వంటి జంతువులు స్వామి దగ్గరకు కెందుకు వస్తాయి. అవన్నీ పూర్వజన్మలో పుణ్యం వల్ల ఇక్కడకు కర్మక్షాళనం కోసం వస్తాయి. మహర్షి దర్శనానికి ఋషులు, మిగతా జంతువుల రూపాల్లో వస్తారని, ఒక పులి ఆశ్రమం ప్రక్కనున్న చెఱువులో నీళ్ళు త్రాగటనికి వచ్చి గాంఢ్రు మనేదట. పోయేటప్పుడు అలాగే చేసేదట. ఆశ్రమంలో భక్తులు భయపడితే వారన్నారట. ఎందుకు భయం వారు (జంతువును కూడా ఇలాగే పిలిచేవారట.) నాకోసం వస్తారు. వచ్చేటప్పుడు వచ్చానని, పోయేటప్పుడు పోతున్నానని చెప్పటమే. ఆ గోంఢ్రుకు అర్థం అని.

బాబా కూడా ఇలాగే చెప్పారు. "ఎవ్వరూ ఏదీ ఋణానుబంధం లేనిదే నా దగ్గరకు రారు. వచ్చినప్పుడు చేతనైనదివ్వు. గావుకేకలు పెట్టి వెళ్ళబోకు. లేకపోతేలేదని పోయిరండని సౌమ్యంగా చెప్పండి అని. ఒక రోజున మసీదులో కుక్క వస్తే ఎవరో దానిని వెళ్ళగొట్టబోతే బాబా వారించి

'అది నీ కోసం రాలేదు. నాకోసం వచ్చింది. అన్నారట'.

ఆ జంతువుల రూపాలు – వీటి చాటునున్న ఆత్మ – తామేనని పైవారి తాత్పర్యం. అందుకే రమణులన్నారు. 'మీరు పై తోలును చూచి జంతువు, మనిషీ అంటారు. కానీ లోపలనున్న యజమానిని చూడరు' అని. ఆ యజమాని తానే. పరమాత్మ. అందుకే ఉపనిషత్తులన్నాయి.

'లోకంలో అంతా ఇల్లునూ–తోటను చూస్తారే తప్ప వాటి యజమానిని చూడటం లేదు' అని.

పరమహంస సైతము జంతువుల బాధలనుభవించే వారట. ఒక ఎద్దును కొడితే ఆ వాతలు తన శరీరమంతా తేలాయట. ఇదే సర్వవ్యాపకత్వం. సర్వాంతర్యామిత్వం.

వీరందరూ అవతారమూర్తులే. ఇన్ని అవతారాలు వచ్చిన యుగంలో మనం జీవించటం మన పుణ్యం కదా. ఈ దృష్టితో జీవయాత్ర చేయటం మన కర్తవ్యం. మనచుట్టూ వున్నదంతా దైవమే. ప్రతిజీవి 'ఆత్మ ధరించిన రూపమేనన్న భక్తి, ప్రేమతో బ్రతికితే చాలు వారిని సేవించినట్లే.

బాబా 1918 దసరానాడు సశరీరయాత్ర చాలించి – తేజశ్శరీర యాత్ర ప్రారంభించాడు. అవతారానికి మరణముండదు మనలాగా. జనన మరణాతీతమైన తత్త్వం అవతారం. అందుకే రమణులన్నారు. 'మహర్షి రావటమూ లేదు. పోవటమూ లేదు. అది నిత్యము నీలో నీ చుట్టూ వున్న వెలుగే' బాబా అన్నదీ ఇదే 'నా ఎముకలు నా సమాధి నిన్ను రక్షిస్తాయి' అని. పరమహంస, స్వామి వివేకానంద. అరవిందాదులందరూ ఇంతే. నేటికీ మనతోనే వున్నారు. బయటా, లోపల. స్వప్న రూపంలో – వ్యక్తులుగా వచ్చి మన రక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారని భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. శ్రీ రమణ మహర్షి భక్తుడై, దీర్ఘకాలం వారి సేవ చేసి వారు మహా సమాధి చెందిన తర్వాత కూడా రమణాశ్రమ వాసియై వారిపై ఎన్నో గ్రంధాలు వ్రాసిన ఓస్‌బోర్న్ బాబాను గురించి వ్రాశాడు.





ఆయన కలకత్తాలో వున్నప్పుడు జరిగిన సంఘటన. డట్టన్ అన్నావిడ ఒక క్రైస్తవ సన్యాసిని. ఆమె పైసాలేని రోజుల్లో తన భవిష్యత్ జీవితం అంధకార బంధుర మైనపుడు ఎవరూ లేని జీవితం – ఉద్యోగం లేదు – బ్రతుకు భారమైన రోజులు. అప్పుడు తన గదిలో దీనంగా కూర్చున్నదట. ఒక పొడవాటి మనిషి కాళ్ళకు చెప్పులు లేకుండా ప్రత్యక్షమైనాడు. అతని నెక్కడా ఆమె చూడలేదు. ఆయన దయతో అన్నాడామెతో – "భయం లేదు. నీవు కలకత్తా వెళ్ళు అన్నీ సర్దుకుంటాయి' అని. నాకు దక్షిణ ఇవ్వవా అన్నాడట. ఆమె నా దగ్గరేమి లేదు అంటే ఆ వ్యక్తి నీ డ్రాయరులో 35 రూపాయలు వున్నాయి చూడు. అనగానే ఆమె ఎప్పుడో దాచి మర్చిపోయినది గుర్తుకు రాగా లేచి చూచేసరికి నిజంగానే వున్నాయి. తిరిగి చూచేసరికి ఆ మహాత్ముడు లేడు. ఆమె కలకత్తా వెళ్ళింది. దూరపు బంధువొకాయన వున్నాడట. అతడామె బాధ్యతను తీసుకొన్నాడు.

ఆమె దుఃఖజీవితం ముగిసింది. ఇది ఓస్ బోర్న్‌కు తానే చెప్పిన సంఘటన. ఇదెక్కడో పాశ్చాత్యదేశంలో జరిగినది. ఆమె కలకత్తా వచ్చాక ఓస్‌బోర్న్ ఇంటి ప్రక్క వాటాలో వున్నప్పుడు ఆయనకు చెప్పినదట.

రమణ మహర్షి కూడా ఇలాగే పాశ్చాత్యదేశాల్లో మన దేశంలో వివిధ వ్యక్తులకు కన్పించడం, స్వప్నంలో జరగటం వారు తిరువణ్ణామలైకి రావటం జరిగిన ఘట్టాలు కోకొల్లలు.

ఇది సర్వవ్యాపకతకు – భగవంతుని దయాప్రభావం – రక్షణకు నిదర్శనము. బాబా 1885 మార్గశిర పౌర్ణమినాడు ఉబ్బసం బాధతో మూడు రోజులపాటు శరీరాన్ని వదిలి – దాని రక్షణ బాధ్యతను మహల్సాపతికి వదిలి – భగత్, నేను మూడు రోజులకు వస్తా. సమాధిలోకి పోతున్నాను. రాకపోతే తర్వాత ఈ శరీరాన్ని అక్కడ పాతమని ఒకచోటు చూపించి – ఆత్మను వేరు చేసి ఎక్కడికో – ఎందుకో – వెళ్ళిపోయారు. 72 గంటల తర్వాత తిరిగి శరీరంలోకి ప్రవేశించారు. ఈ సంఘటన

కర్థమేమో మన కర్థం కాదు. రమణమహర్షికి 17వ ఏట శరీరం – ఆత్మలు వేరన్న అనుభవం కలిగితే తిరువణ్ణామలై రావటం – అక్కడ దీర్ఘకాలం ఆత్మానందమగ్నుడై మౌనంగా వుండిపోవటం విన్నాం. ఈ సంఘటనకు, బాబా కథలోనూ (శరీరాన్ని వదిలి, ఆత్మను వేరు చేసిన వైనానికి) పోలికలున్నాయనుకోవచ్చు.

ఐతే బాబా విషయం వేరు. ఆయనకంతకు పూర్వమే ఈ శరీరాత్మల స్థితులు అనుభవంలో వున్నాయన్నమాట.

# 5.శయనము

సచ్చరిత్రలో బాబా ఒక బల్లను దూలానికి వేలాడదీసి దానిపై పండుకొన్న కథ చెప్పబడినది కదా.

దాని భావమేమిటి ? – దానిపై కెక్కటం, దిగటం చూడాలని లోకం మూగటం మొదలు కాగా బాబా దాన్ని విరిచి ధుని'లో పారవేసాడు. తర్వాత ఆ కొన్నాళ్ళకు ఆ బల్ల తెచ్చిన దీక్షిత్‌తో దాని గొప్పదనం వర్ణిస్తుంటే బాబా కావాలంటే మరలా ఒక బల్ల తెస్తానన్నాడట. బాబా ఆన్నాడట "మహల్సాను వదిలి నేనొక్కడినే ఎలా పండుకోవాలి"? అని ఆయనకూ ఒక బల్ల తెస్తానన్నాడు. ఇది మాయ అంటే బాబా మాట్లాడుతున్న విషయం స్థాయివేరు. మనిషి అర్థం చేసుకునే స్థాయి వేరు కావటమే అజ్ఞానం, మాయ. సరే మరలా బాబా అన్నాడు 'వాడెలా పండుకోగలడు. మేల్కొని నిద్రించేవాడే ఆ బల్లపై పండుకోగలడు. రోజూ నిద్రపోయేటప్పుడు భగత్ నా గుండెమీద చేయి పెట్టు 'అంటే వాడలాగే పెట్టి నిద్రపోతే చేయి బరువెక్కగానే నిద్రలేపేవాడని' అలాంటి వాడు బల్ల మీదెలా పండుకోగలడు' – అని. ఇంత చెప్పినా బాబా ఏమి చెప్పాడో ఎవరి కర్థమైనది. తన గుండెపై ఎందుకు చేయి పెట్టమన్నాడు బాబా. అంటే హృదయ చక్రంలో అనాహత ధ్వని వినమని. సాయి శరణానంద వ్రాసాడు "బాబా హృదయంలోనే కాదు. ఆయన రోమ రంధ్రాల్లో – ప్రతి జీవకణంలోనూ





అనాహతధ్వని విన్పించేది' అని. బాబా ఎముకలు, సర్వావయవాలోలనూ ఈ ధ్వని విన్పించేదని. ఇందుకే బాబా అన్నది 'నా ఎముకలు నిన్ను కాపాడుతాయి' అని.

బాబా బల్లపై కెక్కటం, దిగటం ఎవరికీ కన్పించలేదంటే ఏమిటి? బహుశా రెండర్థాలు భావించుకోవచ్చు.

1) శ్రీరామకృష్ణ పరమహంస సమాధిలో లీనమైన ఫోటో చూస్తున్నాం కదా. ప్రపంచమంతా వ్యాపించిన చిత్రమది. దానికొక కథవుంది.

వారి ఛాయా చిత్రాన్ని తీసుకోవాలని ఒక భక్తుడు ఫోటోలు తీసే వానితో సహా దక్షిణేశ్వరంలోని గుడికి వెళ్ళి పరమహంస అనుమతి నడిగితే ఆయనంగీకరించక విసవిసా నడచి పోయి గుడి మెట్లపై కూర్చున్నారు. ఇంతలో వివేకానందస్వామి వచ్చి ఈ తతంగమంతా చూచి విషయం తెలుసుకొని ఆ భక్తునితో అన్నాడట, 'గురువు గారనుమతించారు. నేను చెబుతానుండు'. అని గురువు గారి దగ్గరకు వెళ్ళి చెవిలో 'అమ్మ' అనగానే వారు సమాధిలోకి వెళ్ళారు. ఫోటోగ్రాఫరును రమ్మని సంజ్ఞ చేశాడు. స్వామీజీ, ఆయన వెళ్ళి తనకు కావలసినట్లు ఫోటో తీసుకోవాలని పరమహంస గడ్డం పట్టుకొని ముఖాన్ని త్రిప్పబోతో ఆయన శరీరం వ్రేలిమీద కాగితం ముక్కలాగా పైకి లేచిందట. స్వామిజీ వద్దు అని వారిస్తే ఫోటో తీసాడు. సమాధిలోకి వెళ్ళిన శరీరానికి బరువుండదని చెప్పారు వారి శిష్యులు.

బాబా శరీరాని కిలాగే బరువులేదు. వారు గాలిలో తేలిపోయే సిద్ధపురుషుడు యోగీశ్వరుడు. మరొకటి పైకి పోవటం – క్రిందికి రావటం, అంటే భగవంతుడు. లోకం, రెండూ బాబాకు ఒకటే. ఆ రెండింటి నడుమ నుండి బాబా మనలను కాపాడుతున్నాడు. ఆయన మనిషిగా వ్యవహరిస్తూనే భగవంతుడుగా, ఈయనలాగా వుంటూనే మనిషిగా ప్రవర్తించాడని అర్థం.

పైన పండుకోవటం కూర్చొని నిద్రపోవటం, అన్నాడంటే ఆయనకు నిద్రలేదు. నిత్య జాగరూపకుడైన పరమాత్మ తత్త్వం. రమణ మహర్షి కూడా ఇలాగే అన్నారు. మేల్కొని నిద్రపోవటం – నిద్రలోనూ జాగ్రత్త వుండటం మహాయోగి లక్షణం. ఇదే బహుశా యోగనిద్ర. శ్రీ మహావిష్ణువు ప్రళయానంతరం పోయేదని పురాణాల్లో – చండీ సప్తశతిలో వున్నది.

కనుక ఆకాశం – భూమికి నడుమ అంతరిక్షంలో వున్నాడు బాబా. పరమహంస కూడా పూర్తిగా సమాధిలోనూ – పూర్తిగా లోకంలోనూ కాక నడుమ వాకిట్లో దీపం లాగా వున్నాడు. అలాగే శ్రీ రమణులున్నూ.

ఆకాశం, నిప్పు, నీరు, గాలి, మన్నూ ఇవే పంచభూతాలు. దీనికంటే వేరు ప్రాణం. దానికంటే ఆత్మ. ఈ ఆత్మ, ప్రాణంతో కలసి పంచభూతాలను శరీరంగా ధరించి వస్తే జీవిఔతున్నాడు. భగవంతుడంటే 5 భూతాలు+ప్రాణం+ఆత్మ. ఈ చివరి 7వ తత్త్వం కనుక వానికంటే పైవాడు. ఎవనికి పంచభూతాలు స్వాధీనమౌతున్నాయో ఎవనికవి లోబడి ప్రవర్తిస్తు న్నాయో అక్కడ దైవమున్నది. మహాయోగులు దైవ ప్రతినిధులే కనుక వారికవి స్వాధీనం. సాక్షాత్తు భగవంతుడైన బాబా సంగతి చెప్పేదేముంది.

చాంద్ పాటిల్ కథలో బాబా నేలలో సటకా గ్రుచ్చితే నిప్పు, నీరు వచ్చాయని చెప్పబడ్డది. కుమ్మరి తాత్యా పచ్చి కుండనిస్తే వాటిలో చెట్లకు నీరు పోసి వాటిని ప్రక్క పెట్టగానే విచ్చిపోయాయి అనీ నీటిని నూనెగా మార్చి దీపాలు పెట్టాడనీ చెప్పబడ్డది. ఒకరోజు శిరిడీలో ఏకధాటిగా గాలివాన వస్తే పేదవారు గుడిసెలు పడి పోయాయని బాబాను ప్రార్థించారట. బాబా మసీదు బయటకు వచ్చి ఆకాశం వంక జూచి 'ఆగు, నీ ప్రతాపం తగ్గించు' అనగానే ఆగిపోయిందట. మరొకసారి మసీదులో బాబా భక్తులతో పాటుగా భోజనం చేస్తున్నపుడు కప్పు విరిగి పడబోతు ధ్వని చేస్తే బాబా పైకి చూచి – 'ఆగు అన్నాడట'. వారంతా భోజనం చేసి బయటకు వచ్చాక కప్పు కూలిందట.





ఈ కథ – కురుక్షేత్ర యుద్ధం అయిపోగానే రథాన్ని శిబిరానికి తెచ్చి శ్రీ కృష్ణ స్వామి అర్జునునితో అన్నాడట – 'రథం దిగవయ్యా ముందుగా' అని; అర్జునుడన్నాడట "బావా! రోజూ నీవు కదా ముందు దిగేది. ఇవ్వాళ నన్ను దిగమంటున్నావేమిటి " అని అడిగాడు. తర్వాత కృష్ణ పరమాత్మ దిగాడు. రథం దగ్ధమైనది. అర్జునుడాశ్చర్యపోయి 'స్వామీ! ఏమిది?" అని అర్జునా! భీష్మ, ద్రోణ, కర్ణాది మహావీరులు ప్రయోగించిన అస్త్ర శక్తులను అణచిపెట్టానిన్నాళ్ళు. పని అయిపోయింది. కనుక వాటి ప్రభావంతో అది తగలబడిపోయింది అని. ఇదీ దైవశక్తి.

అలాగే చివరకు కృష్ణ పరమాత్మ పండుకొన్నప్పుడు లేవబోతూ అర్జునునితో గాండీవమందిమ్మనాడట. అది ముట్టుకోగానే దానిద్వారా అర్జునుని లోనికి మహాశక్తి పరమాత్మ లాగివేస్తే అర్జునునికి గాండీవము లేవలేదట. అంటే ఆ మహా ధనుస్సు అగ్ని దత్తమైనది. దానికి మోసే శక్తి దైవమిస్తే ఈయన మోయగలిగాడన్న మాటేగదా. అలాగే శ్రీరామ చంద్రుడు ధనుస్సు ద్వారా పరశురాముని తపశ్శక్తిని హరించాడు. అలాగే బాబా కూడా ఒక పరాసు వస్తాదు పెద్దదుడ్డు కర్రతో వెనక నుండే బాబాను చంపబోతే దైవం వెన్కకు తిరిగి వాడి చేయి పట్టుకోగానే వాడి శక్తి అంతా పోయి కుప్పకూలిపోతే – మరలా బాబాయే చేతి నందించి పైకి లేవదీసాడు.

అంగులీమాళుడున్న పరమ కిరాతకుడు బుద్ధదేవుని వెన్కనుండి చంపబోతే ఆదైవం ఒకసారి వెన్కకు తిరిగి చూచే సరికి వాడు కరిగి నీరైపోయి ఆ దయామూర్తి కాళ్ళపై బడి భక్తుడై పోయాడట. ఇదీ దైవమంటే.

దాసుగణ కథలో –

బాబా పంచభూతమయుడు. పాదంలో గంగ కల నారాయణ మూర్తి అన్న విషయం స్పష్టం చేసే సంఘటన ఒకటున్నది.

ఒక పర్వదినాన దాసగుణ గోదావరీ తీరాన గల 'సింగతా' అన్న చోటకు పోవాలనుకొని బాబా అనుమతి అడిగితే 'ఎందుకురా గోదావరీ

స్నానానికంతదూరం పోవటం. నా పాదాల్లో వున్నది కదా' అంటే అతనికి పూర్తి విశ్వాసం లేక మౌనంగా నిలబడ్డాడు. బాబా! 'ఒరే గణూ! దోసిలి పట్టు నా పాదాల క్రింద' అనగానే అతడు చేసేది లేక అలాగే చేసాడు. బాబా బొటన వ్రేళ్ళ నుండి గంగ ప్రవహించింది. (గంగ అంటే గోదావరే). దాసగుణు కవి కనుక వెంటనే దాన్ని వర్ణించాడు. అతడు వ్రాసిన స్తవన మంజరిలో "బాబా నీవు సాయి మాధవుడై కాళ్ళ నుండి గంగను స్రవించావు. నీ పాదమే ప్రయాగ. నీ బొటన వ్రేళ్ళు రెండు గంగా, యమునలు. ఆ సమయంలో విష్ణుమూర్తివై వుంటావు. ప్రాతఃకాలంలో బ్రహ్మవు. నీ నుండి 'తత్త్వ' విద్య గంగగా ప్రవహిస్తుంది. సాయం సంధ్యలో 'ధుని' దగ్గర కూర్చున్నప్పుడు నీవు శివుడవు. నీవే త్రిమూర్తి స్వరూపుడవు" అంటూ స్తుతించాడు.

పరమాత్మ స్వరూపులైన మహాత్ములు యోగులు. దైవప్రతినిధులు. దైవ స్వరూపాలు. కనుక దైవంతన ప్రతినిధి దగ్గరకే భక్తులను చేరుస్తుంది. వారు తన శరీరం కనుక శరీరంతో ప్రవర్తించేవారు కనుక. ఇందుకే తిరుపతి వంటి క్షేత్రవాసులు సైతం శిరిడీ వంటి చోట్లకు పోవటం.

అది ద్వారక. బాబా నివసించిన పాడుబడిన మసీదు ద్వారకామాయి. అంటే ద్వారక అన్న పేరుగల తల్లి అని బాబా స్వయంగా ప్రకటించాడు. ఇది ద్వారక. ఈ మసీదు మాయిలోకి అడుగు పెడితే బాబా సర్వ శరీర - మనో వ్యాధులు పోతాయి. ఇలాంటి మాటలెన్నో చెప్పాడు బాబా. ద్వారక శ్రీకృష్ణుని చోటుగదా అంటే తాను అతడే నన్నమాట కదా.

బూటీ మందిరం నిర్మించి మధ్యహాలులో మురళీధరుని విగ్రహం పెడదామంటే బాబా ఏమన్నాడు 'ఎందుకు నేనే అక్కడ కూర్చుంటాను. మనమంతా కలసి ఆడుతూ, పాడుతూ అక్కడ వుందామని. అంటే కృష్ణ పరమాత్మగా అక్కడ కొలువున్న వాడెవ్వరు? బాబా శరీరంలోని శ్రీ కృష్ణుడు, జగద్గురువు షోడశ కళా ప్రపూర్ణమైన దైవం.





ఉద్ధవే బువా అన్న భక్తునితో బాబా అన్నాడు. 'ఏదో వకటి చదువుకో రాదా!' అని. ఏం చదువుకొనేది? అని అతడంటే పూర్వం నీకు ఏది చెప్పానో అది అన్నాడట. శ్రీకృష్ణ జన్మలో ఉద్ధవుడన్న భక్తునికి భాగవతం చెప్పాడు శ్రీకృష్ణుడు. 13వ స్కందం మీద ఏక నాథుడు వ్రాసిన వ్యాఖ్యానం వారికి పవిత్ర గ్రంథం కనుక చాలామంది భక్తులతో అది చదువుకొమ్మన్నాడు బాబా. తన పూర్వజన్మ శ్రీకృష్ణుడన్న మాటే కదా.

ద్వారక అంటే నాలుగు దిక్కుల ద్వారాలు కలది. ఎవరైనా ఎప్పుడైనా లోపలకు పోవచ్చు. ఇష్టం వచ్చినంతసేపు కూర్చోవచ్చు. నేడు మనం చూస్తున్న వైనమిదే. మందిరంలో మనమంతా ఆడుకోవచ్చు. పాడుకోవచ్చు. అంటే నేడు మనమంతా పోయి చేస్తున్నదదే కదా. ప్రొద్దున నుండి రాత్రి 9 గ॥ల దాకా. బాబా కెదురుగా కూర్చోవచ్చు. హాయిగా సమాధి దగ్గరకు పోయే వీలున్నా లేకున్నా ? నాసిక్ దగ్గర వణిలో సప్త శృంగిదేవి పూజారి కాకాజ వైద్య అతడేదో బాధల్లో వుండి ఆ తల్లిని ప్రార్థిస్తే ఆమె బాబా దర్శనం చేయమని స్వప్నంలో చెప్పింది. ఈయనకు బాబా అంటే త్ర్యంబకేశ్వరుడని త్రయంబకం (నాసిక్ దగ్గర పుణ్యక్షేత్రం) వెళ్ళి రోజూ గోదావరీ స్నానం చేసి ఉభయ సంధ్యల్లో స్వామికి అభిషేకం చేసి బిల్వ పత్రార్చన చేసి వారం గడిపారు. ఏమిలాభం లేకపోగా ఇంటికి తిరిగి వచ్చి మరలా అమ్మను ప్రార్థిస్తే ఆవిడగారు కలలో కన్పించి 'నేను చెప్పింది శిరిడీ బాబాను గురించి. నీవేమో త్ర్యంబకం పోయావు అన్నది. ఆ నాటికి శిరిడి ప్రచారంలోకి రాని కారణంగా అతనికా దైవం తెలియలేదు.

ఇక్కడ బాబా శ్యామా మ్రొక్కులు చెల్లించుకొని రమ్మని వణికి పంపటం కాకాజీని చూడటం– ఆయన ఆశ్చర్యపడటం – శిరిడీకి రావటం జరిగింది. వచ్చినాక జరిగిన దేమిటంటే ఒకవారంపాటు బాబాను దర్శించటం తప్ప మాట్లాడినది లేదు. కానీ కాకాజీ మనస్సునకు విశ్రాంతి లభించి తిరిగి వణికి వెళ్ళిపోయాడు.

ఈ కథ చెప్పేదేమిటి? బాబా దైవ స్వరూపమని దైవానికి ప్రతినిధి ప్రతిరూపమనీ కదా !!

కనుకనే బాబాలో తను తమ యిష్టదైవ రూపాలను చూచిన కథలు వచ్చాయి. ఉదాహరణకు 1, 2 కథలు చూద్దాం. 1909లో ఒక డాక్టరు స్నేహితుడైన తహశీల్దారుతో కలసి శిరిడీ వచ్చాడు. అతడు సనాతన బ్రాహ్మణుడు. శ్రీరామ భక్తుడు. బాబా సాయిబు అనుకొని అలాంటి వానికి తానెలా నమస్కరించాలని స్నేహితునడిగితే 'నీకిష్టమైతే నమస్కరించు. నీకిష్టం కాకపోతే మానివేయి. నిన్నెవ్వరూ బలవంత పెట్ట రన్నాడు. సరేనని మసీదుకు వచ్చారు. గద్దె మీద బాబా డాక్టరుకు శ్రీరామ చంద్రుడుగా కన్పించాడు. డాక్టరుగారు బాబా పాదాలపై పడ్డాడు. బయటకు వచ్చాక తహసీల్దారునడి గాడట. 'ఇదేమిటి? నమస్కరించనన్నావు కదా' అని. డాక్టరు తన ఇష్టదైవం శ్రీరాముడు కన్పించాడు. బాబా కాదని. తర్వాత నాలుగు రోజులున్నారు వారు. డాక్టరు 'బాబా నన్నా శీర్వదించనిదే అన్నం తిననని పట్టుబట్టి కూర్చున్నాడు. బాబా దర్శనానికి రాగా, డాక్టరు వానిని వెంట బెట్టుకొని మసీదుకు వచ్చాడు. బాబా అన్నాడట. ఏమయ్యా! వైద్యుడా, ఎవరు పిలిస్తే వచ్చావని. ఆ రాత్రి బాబా డాక్టరు కలలో కన్పించి ఆత్మానందాన్నిచ్చాడట. డాక్టరు స్వగ్రామం వెళ్ళిన తర్వాత 15 రోజుల దాకా ఆ అనుభవం పోలేదు.

స్వామి వివేకనందకు సమాధ్యనుభవం ప్రసాదిస్తే పరమహంస, వారికానుభవం 15 రోజుల పాటు పోలేదని చదువుతున్నాం. ఇదే గురువు అనుగ్రహమంటే. అది వుంటే చాలు ముక్తికి సోపానం లభించినట్లే.

మరొకచోట మద్రాసు రామదాసు భజన సమాజం శిరిడి వచ్చిన కథ. సచ్చరిత్రలో వుంది. అందులో ఒక భక్తురాలికిలాగే శ్రీరామదర్శనమైనదని అనుగ్రహించినట్లు చెప్పబడినది కదా.

నానా సాహెబు విమోన్‌కర్ కొడుకు పోలీసు ఇన్ స్పెక్టరు సోమనాథ





శంకర్ దేశపాండే అన్నవానికి బాబా ఆంజనేయ స్వామిలాగా దర్శనమిచ్చాడట. కొందరకు గణపతిగా ఇలా.

శ్రీ రమణ మహర్షినిలాగే చాలామంది భక్తులు శివాది రూపాల్లో దర్శించినట్లు చెప్పబడినది.

శ్రీరామకృష్ణ పరమహంస తనకత్యంత భక్తుడైన మధుసూదనునకు చాలా ఆశ్చర్యకరమైన దర్శనమైనదట.

పరమహంస వరండాలో పచార్లు చేస్తున్నాడట. ముందుకు వస్తున్నప్పుడు అమ్మగా. వెనక్కుపోయినపుడు శివునిగా. అతడాగలేక కన్నీళు ్ళ కార్చుకొంటూ, పరమ హంస పాదాలపై వాలిపోయినట్లు చదువుతున్నాం. ఇదీ మహాత్ములు దైవ ప్రతిమలు ప్రతినిధులంటే. వారికీ దైవానికీ భేదం లేదన్నమాట.

## 6. ద్వారకామాయి - ద్వారక

బాబా సుమారు 60 ఏళ్ళపాటు నివసించిన పాత మసీదును ద్వారకామాయి అన్నాడు. పైకి పాతబడిన మసీదు – లోపల కూర్చున్న నాకు చిరిగిపోయిన కఫ్నీ చిలుంగొట్టం – రేకుడబ్బా – జోలె ఒకటి – కుండలు – తిరుగలి, ధుని – ఇంటిలోని సామాగ్రి.

ఇది ద్వారకామాయి అట. ఆనాడు శ్రీ కృష్ణుడున్న ద్వారక రాజధాని ఆయన మహావైభవం కల సౌధంలో రాజాధిరాజులాగా మహాభోగం కలవాడు. ఆయన సభలో రాజులు–మంత్రులు సేనానులు–భక్తులైన ఋషులు, మునులు–ఇక్కడ పేద ప్రజలు. దీనికి, దానికి సంబంధమేమిటి ? స్థూలంగా ఏమి లేదు. కానీ సూక్ష్మంగా చూస్తే భగవంతుడు వేయి రూపాలు, వేల చేతులు, వేల కాళ్ళు తల మహాగ్ని, ఆ అగ్ని కుండంలో వేలు – లక్షలు – కోట్లు నిప్పురవ్వలెరిగి పడుతున్నాయి. అవే జీవరాసులు ఆ మహాగ్ని సృష్టి కారణమైనది.

ఇక్కడా ధుని వున్నది. అందులో పార్టీ ప్రభావం వల్ల శరీరరోగాలు– మానసిక రోగాలు పోతున్నవి. బాబా తన వేయి చేతులతో దూరాన – దగ్గరున్న భక్తులను రక్షిస్తున్నారు. అనేక రూపాలలో దూరాన వున్న వారిని కాపాడుతున్నారు. ఇందుకని యోగదర్శనంలో ఆయన వేల మొగాలు – చేతులు – కాళ్ళున్న పురుషోత్తముడు. ఈ ధుని విశ్వసృష్టి చేస్తూ రక్షిస్తూ వున్న మహాగ్ని – జ్ఞానాగ్ని.

ఇది ద్వారకా మాయి. నేటికీ భక్తులతో కిటకిటలాడుతున్న పుణ్యక్షేత్రం.

# 7. ద్వారక

1910లో దేవ్ శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాడు. అప్పుడు శిరిడిలో 400 ఇండ్లు మాత్రమే వున్నాయి. రోడ్లు లేవు. వీధి దీపాలు లేవు. ఒక మరాఠీ బడి మాత్రం వుండేదట. శిరిడి అసలు పేరు శిలాధీ (డీ) లేదా శైలాధి (డి) అట. రెండు బావులు మాత్రమే ఊరికంతా నీరిచ్చేది. 9 గుడులుండేవి. జనాభా అంతా కలిసి 2568 మంది.

ఐతే బాబా వచ్చిన రోజున 1840 ప్రాంతంలో శిరిడి ఎలా వుండేదో మనం ఊహించుకోవలసిందే తప్ప దాఖలాలు లేవు. పరమహంస – రమణ మహర్షులు జన్మించిన గ్రామాలు లాగానే శిరిడి కూడా వుండి వుండేది అంటే ఆ గ్రామం ద్వారకా?

మన సంస్కృతిలో గొప్పదనమేమంటే లోకం+ఇల్లు+ దేవాలయం+ మన శరీరం అన్ని ఒకటిగానే భావించబడ్డాయి. గుడి ఎలా ప్రధాన దైవం నడుమ నుండి చుట్టూ శిల్పాలతో అంకర్షింపబడేదో శరీరంలోనూ ఆత్మ వుంది. ఇంట్లోనూ ఇలవేల్పుంది. విశ్వమంతా దేవాలయమే. అందులోనూ భగవంతుడున్నాడు.

పురము = అంటే శరీరము=నగరం. పురుషోత్తముడు అంటే





అందులో నున్న దైవం = ఆత్మ. ద్వారకామాయిలో 'ధుని' మనలో నున్న జీవాగ్ని, ఆత్మాగ్ని. అందులోని ఊధీ దగ్ధమైన మన కర్మఫలం. బాబాయే చైతన్యాగ్ని, ఆత్మాగ్ని.

ఒక భక్తుడు గురుపౌర్ణిమ నాడు వచ్చాడు. బాబా మసీదులోని స్తంభాన్ని చూపించి పూజించమన్నాడట. సాయి శరణానందకు స్తంభాన్ని చూపి దానిక్రింద తాను 12 ఏళ్ళు తపస్సు చేశానని, తన గడ్డం భూమిని తాకేదని మహాత్ములు వచ్చినప్పుడు మాత్రం తానా గుంట నుండి బైటకు వచ్చేవాడిననీ చెప్పారు.

**మనకొక కథ వున్నది.**

పరమేశ్వరుడు ఒక కాంతి స్తంభంలాగా భూనభోంతరాలు వ్యాపిస్తే – నేనెక్కువ నేనెక్కువని పోట్లాడుకొంటున్న బ్రహ్మ, విష్ణువులు – ఆ మహాలింగం మొదలు, చివరా కనుక్కోలేక పోయారని. ఈ స్తంభమాజోతిస్స్తంభమే "అది భూమినీ, స్వర్గాన్ని కలుపుతున్నదని అందులోనే సర్వలోకాలున్నాయని – పైలోకాన్ని క్రింది లోకాన్ని కలిపేదీ అదే విడదీసేదీ అదే"నని వేదం చెబుతున్నది. మహమ్మదీయులు చెప్పే 'కుతుబ్' అన్నా ఆ దివ్యస్తంభమే అదే మహా శివలింగం. మనిషిలో అదే వెన్నుపాము. దాని క్రింద నున్న మూలాధారమే బాబా చెప్పిన సొరంగము. అక్కడ తాను తపస్సు చేసాననీ అన్నాడు బాబా. ఈ మూలాధారమే కొన్ని చోట్ల పుట్టలాగా, కొండ గుహలాగా చెప్పబడినది.

దీనిని సమర్థిస్తున్న అంశం మరొకటి వుంది. బాబా గురుస్థానంలో పాదుకలను పెట్టించిన కథ నేడు మనం దర్శిస్తున్న గురుస్థానం వేపచెట్టు క్రింద ఉన్నది. అక్కడ పాదాలున్నాయి. శరీరంలో ఈ పాదాలు శిరస్సులో మాడుపట్టున సహస్రారంలో ఉన్నాయి. అవే పార్వతీ పరమేశ్వరుల పాదంగా గురువు పాదాలుగా భావించటం. ధ్యానించటమూ వున్నది. అంటే అది సహస్రారం. చావడిలో బాబా నిద్రించేవాడని కదా చెప్పబడుతున్నది. అది

మూలాధారం. మసీదులో 'ధుని' వున్నది. అదే మణిపూరక చక్రం అగ్ని తత్త్వం కనుక అదే మణిపూరం. బాబా సమాధి మందిరం. ఆజ్ఞా చక్రం ఇది పైకి, క్రిందకూ చూసే స్థానం. వాకిట్లో దీపం బయటకూ, లోపలకు వెలుగునిచ్చినట్లు బాబా ప్రతిక్షణం ఈ రెండు లోకాల్లో జీవిస్తూ లోకాలను అల్లాను కలుపుతున్నాడు. సొరంగమంటే సుషుమ్నా నాడి. బాబా దానిద్వారా సప్తలోకాలకు చక్రాలను కలుపుతూ ఆజ్ఞా చక్రమే ఫాలనేత్రం. దివ్య దృష్టి అదే. పరమహంస తాను ఇలాగే వున్నాననీ రమణ మహర్షి – బుద్ధాదులంతా ఆత్మమగ్నులై యుంటూనే లోకాన్ని చూస్తూ, రక్షిస్తూ వున్నారని చెప్పబడుతున్నది.

శిరిడీని ఎలా ధ్యానించాలి? ఇది యోగ శరీరం. బాబా తత్త్వ స్వరూపమిక్కడ వున్నది. ఇది బాబా ధ్యానంగా గుర్తించాలి. అప్పుడది ద్వారక. అది ద్వారకామాయి. తాను శ్రీకృష్ణుడు. ఈ దృష్టితో ధ్యానించాలి.

కనుక బాబా సర్వగురు స్వరూపుడైనాడు. ఎందరో గురువులు తనలోనే దర్శనమిచ్చారు. ఈ కథలూ చాలా వున్నాయి.

## 8. సర్వగురు స్వరూపుడు బాబా

1. హరిశ్చంద్ర పితలే కథ. సచ్చరిత్రలో వుంది. అతని కుమారుని మూర్ఛరోగ నివారణం కోసం శిరిడి వస్తే అతని రోగాన్ని పోగొట్టి బాబా అతనికి 3 రూపాయలిచ్చి "పూర్వం నీకు 2 రూపాయలిచ్చి పూజించుకోమన్నాను. వీటినీ వాటినీ కలిపి పూజించుకో" అన్నాడు. అతడిదే మొదటిసారి రావటం శిరిడీకి. తన స్వగ్రామము బొంబాయికి వెళ్ళి తల్లిని అడిగాడట. ఈ విషయం తెలుసుకోవటానికి ఆమె ఆలోచించి 'పూర్వం బాలుడిగా నీవున్నప్పుడు నిన్ను తీసుకొని నీ తండ్రి అక్కల్ కోట వెళ్ళి మహారాజును దర్శించినపుడు బాబా లాగానే ఆయన 2రూ. లిచ్చాడు. అవెక్కడో పోయాయి. ఇప్పుడు బాబా ఇచ్చిన వాటినైనా పూజించుకో' అని చెప్పింది.





2. బాబా తనకూ రోజూ హారతిచ్చే జోగు మొదటిసారి దర్శనానికి వచ్చినపుడు భార్యా, భర్తలనిద్దరినీ శిరిడిలోనే వుండిపొమ్మని అక్కల్ కోట మహారాజు రూపంలో ఊధీ నిచ్చి ఆశీర్వదించాడు.

3. గురుస్థానంలో పాదుకలను స్థాపించిన కథలో, స్థాపించిన డాక్టరు అక్కల్ కోట మహారాజు భక్తుడు – శిరిడీ మీదుగా అక్కల్ కోట పోవాలని వస్తే బాబా ఆశీర్వదించి – అక్కడేముంది ? ప్రస్తుత మహారాజిక్కడే వున్నాడని తనను చూపించాడట బాబా.

4. అక్కల్ కోట మహారాజు శిష్యుడు ఆనందనాథుడు – రామానంద బీద్కర్ మహారాజు 1873లో బాబాను దర్శించారు. ఇది కేవలం వారి గురువులు ఇచ్చిన స్ఫురణతోనే జరిగినదనుకోవటంలో తప్పు లేదుకదా. అక్కల్ కోట మహారాజు దత్తావతారమని ప్రసిద్ధి కనుక బాబా ఆ సంప్రదాయంలో కిరీటమని విశ్వాసమొకటి ప్రసిద్ధిగా వుంది.

5. అంబాడేకర్ కథ సచ్చరిత్రలోనే వున్నది (26 అధ్యాయము) అందులో పేదరికంతో బాధపడుతూ 1916లో శిరిడీ వెళ్ళి ఆత్మహత్య చేసుకోవటానికి నిర్ణయించుకొని నూతి దగ్గర ఎండ్లబండి మీద ఎక్కి నూతిలో దూకుదామనుకోగానే దగ్గరలో హోటలు యజమాని సగుణ మేరు నాయక్ అన్నవాడు అక్కడకు వచ్చి అక్కల్ కోట మహారాజు చరిత్ర ఇచ్చాడు. ఆ కథలోనూ ఒక భక్తుడిలాగే ఆత్మహత్యా ప్రయత్నంలో బావిలో దూకాడట. ఆ మహారాజు వచ్చి రక్షించాడట.

ఇక్కడ బాబా రక్షించాడు. ఇదీ ఇద్దరకు నడుమనున్న ఏకత్వాన్ని తెలియచేస్తున్నది. మూలే శాస్త్రియని, ఒక బ్రాహ్మణ పండితుడు బూటీని చూడటానికి శిరిడీ వచ్చాడు. ఒక రోజాయన జపతపాదులు నిర్వహించుకుంటుంటే బాబా బూటీని పంపి మూలే దగ్గర దక్షిణ తెమ్మన్నాడు.

క్రితం రోజున బాబా లెండీ బాగుకు పోతూ 'కాషాయ వస్త్రాలు

తీసుకురండి. ధరించాలి' అంటే వారెవరికీ అర్థం కాలేదు.

మూలే శాస్త్రి సంప్రదాయ బ్రాహ్మణుడు కావటం వల్ల బూటీ కబురువిని 'ఆయన మహమ్మదీయుడు. అందులో మసీదు. నేను మైల పడతానేమో'ననుకొని, అయినా బూటీ కదా కబురు తెచ్చింది. కాదనలేక వెళ్ళాడు. ఇష్టం లేకనే మసీదు వెళ్ళాక చూస్తే బాబా స్థానంలో తన గురువు ఘోలప్ కన్పించాడట. కాషాయ వస్త్రాల్లో అందరకు బాబా కన్పించాడు'. 'ఏనాడో మరణించిన ఘోలప్ ఇప్పుడెలాగా కన్పించటం': అని మూలే శాస్త్రి బాబా పాదాలపై సాష్టాంగ పడ్డాడు. తిరిగి బాబా కన్పించి దక్షిణ ఇవ్వమన్నాడట. మూలే శాస్త్రికి ఆశ్చర్యం. ఇదెలా సంభవము అని.

# 9.రామదాసు

ఈయన శివాజీ గురువు 17వ శతాబ్దిలో నివసించిన సాధువు అంటే బాబాకు 200 ఏండ్లకు ముందుగా ఉన్నవాడు. ఆయన రూపాన్ని ఒక భక్తునకు స్వప్నంలో చూపించిన కథ రామదాసు భజన సమాజంవారు శిరిడీలో – కాశీకీ పోతూ – ఆగిన కథ సచ్చరిత్రలో వున్నది కదా. అందులో భార్యకు రామునిగా, భర్తకు స్వప్నంలో రామదాసుగా బాబా సాక్షాత్కరించినట్లు చెప్పబడినది.

బాబా శరీరమన్న తెరపైన గణేశ్వరుడు, శ్రీరాముడు – దత్తాత్రేయుడు ఆంజనేయ స్వామి – ఇత్యాది దేవతలు, బాబాకు పూర్వమున్న గురువులనేక మంది సాక్షాత్కరించిన కథల వల్ల బాబా కేవల శుద్ధాత్మ తత్త్వం – పరబ్రహ్మ స్వరూపమన్న విషయం తేటతెల్లమౌతున్నది. ఇంతేకాక జైన భక్తులకు జైనమత దేవతలు – గురువులైన తీర్థంకరలుగానూ కన్పించినట్లు కొన్ని కథలు చెబుతున్నవి. ఎవరేయే మతస్థులో– వారికా మత దేవతలుగా – గురువులుగా కన్పించటం వల్ల బాబా కేవలం పరబ్రహ్మ స్వరూపమన్న మాటే.





ఈ మాట బాబా సచ్చరిత్ర వ్రాసిన హేమాద్రిపంత్ చెప్పినాడు. ఆ పుస్తకాల్లో చదువుతున్న సచ్చిదానంద స్వరూపమే శిరిడిలో సాయిబాబా రూపంలో అవతరించినదని 11వ అధ్యాయంలో 'బాబా తాను సర్వాంతర్యామినని చెప్పేవారని 18-19 అధ్యాయా ల్లోను, మరొక అధ్యాయంలో చాలా అద్భుతమైన మాట వ్రాసాడు. "కేవల పరబ్రహ్మ మాయ అన్న మూసలో పడి సాయిగా అవతరించినదని వ్యక్తి దశలో ఆత్మ – విశ్వ స్థాయిలో బ్రహ్మ పదార్థమొకటే. మాయ అన్నదొక మూస. బంగారం కరిగించి ఏ ఆకారం నగ కావాలో ఆ ఆకారం గల మూసలో పోస్తాడు కంసాలి. దానికారూపమే వస్తుంది. అలాగే బాబా వచ్చారు.

శ్రీరమణ మహర్షి కూడా తాను కేవల శుద్ధాత్మ స్వరూపమని ప్రకటించాడు. అలాగే నిర్గుణతత్త్వం, సగుణ తత్త్వం గురువుగా బోధించిన జగద్గురువు బాబా.

# 10. పూర్వజన్మ వృత్తాంతాలు

బాబా నిత్యమూ ధునిని వెల్గించారు. లెండీ బాగులో 'నందా' (శాశ్వత), దీపం పెట్టాడు. చాలాసార్లు భక్తులతో అంటూవుండేవాడట బాబా "మీ లెక్కలన్నీ అల్లాకప్పజెప్పాలి నేను అని. అంటే ఏమిటి?

సృష్టికర్త అగ్ని స్వరూపుడైన పరమేశ్వరుడు. అతడే నాలుగు రకాలుగా తాను విభజించుకొని సృష్టిగా పరిణామం పొందుతున్నాడు. అతడు మహాగ్ని

| | |
|---|---|
| 1. జాగ్రద వస్థలో | – వైశ్వానరుడు |
| 2. స్వప్నావస్థలో | – తైజసుడు |
| 3. నిద్రావస్థలో | – ప్రాజ్ఞుడు |
| 4. అతీతావస్థ (పరిణమించని మహాగ్ని) | |
| తురీయ | – చివరి జ్యోతి |

అది అలాగే వుంటూ క్రింది అగ్నులుగా దీపాలుగా వెలుగుతున్నాడు. ఈ జీవుడు. ఆ మహాగ్నికి "జాతవేదు'డని పేరు. అంటే జన్మించినవారి పుట్టు పూర్వోత్తరాలు తెలిసినవాడని అర్థం. ఇదే బాబాస్వరూపం. కనుక మీ లెక్కలన్నీ అల్లా కప్పుచెప్పాలి అనటంలోని రహస్యం. తాను జాతవేదుడు అని.

'నందా' దీపం అంటే శాశ్వత దీపం. అంటే ఆత్మతత్త్వం. ఆ దీపం వెలిగినంత వరకే శరీర యాత్ర. అది పోతే శవం కనుక తానగ్ని దేవుడననటానికి 'ధుని' సంకేతము. తాను ఆత్మననటానికి 'దీపం' సంకేతం. అగ్నితత్త్వం ఋగ్వేదంలోనిది. అదే ఆత్మగా ఉపనిషత్తులు చెప్పాయి. వేద వేదాంత తత్త్వస్వరూపుడని తేలుతున్నది కదా. ఇందుకే వచ్చిన భక్తులతో మనం అనేక జన్మల నుండి ఇరుగు పొరుగున ఉన్నామనీ – నాకు, నీవు స్నేహితుడవనీ – వారి, వారి పూర్వజన్మ వృత్తాంతాలు చెబుతూ వచ్చాడు.

ఆ పూర్వజన్మలు 70గా కొన్నిచోట్ల సంకేతించాడు. ఉదా: శ్యామాతో అన్నాడు. ఒక స్త్రీ సంతానం కోసం బాబా దగ్గరకు రావటానికి శ్యామా సాయం వేడికొన్నది. బాబా మసీదు మెట్ల క్రింద ఆమెను కూర్చోమని తాను బాబా దగ్గర కూర్చొని ఆయనను మాటల్తో మభ్య పెట్టి ఈమెను రమ్మని సంజ్ఞచేశాడు. 'బాబా అది గ్రహించి శ్యామూ బుగ్గ గిల్లాడు. బాబా నా బుగ్గ గిల్లావన్నాడు శ్యామా "శ్యామా మనం 70 జన్మల నుండి స్నేహితులం. ఇంతమాత్రానికే బాధపడ్తున్నావా' అన్నాడు తర్వాత ఆమె కొబ్బరికాయనివ్వటం బాబా ఆమెకు సంతాన వరాన్ని ప్రసాదించటం తెలిసిన కథే.

2. నానా చంద్రోర్కరు కలెక్టరుకు (పర్సనల్ అసిస్టెంటు) వైయక్తిక సహాయకుడుగా అంటే బాబా మాటి మాటికీ ఆయనకు రమ్మని కబురు చేయటం ఈయన విసుక్కోవటం జరిగాక ఒకసారి శిరిడీ' (1897) లో వస్తే – 'బాబా అన్నాడట నిన్ను నాలుగు జన్మల నుండి ఎరుగుదును. నీ





బాధ్యత నాది కనుక కబురు చేశాను. ఈసారి మరలా రమ్మని ఆశీర్వదించి పంపాడు.

ఇదే గీతలో భగవంతుడు అర్జునునితో చెప్పింది.

"బాహూని తే వ్యతీతాని జన్మాని తవచ అర్జున

తాన్యహంవేదన త్వం వేత్థ పరంతప గీత 4–5)"

నీకు నాకు అనేక జన్మలు గతించాయి. వస్తాయి. నీకు తెలియదు. నాకు తెలుసు" అని.

బాబా ఈ మాట ఒకరితో అన్నాడు. "నీకు తెలియదు. నాకు తెలుసు" అని ఇదే సర్వజ్ఞత అన్న భగవంతుని లక్షణం.

## 11.రెండు మేకల కథ

ఇది సచ్చరిత్ర 46 అధ్యాయంలో వున్నది. ఒకరోజున లెండి తోట నుండి వస్తున్న బాబాకు మేకల మంద తటస్థపడినది. అందులో రెండు మేకలను చూచి బాబా వాటి యజమానికి 32 రూ.లిచ్చి కొన్నాడు.

సమారు 70–80 ఏళ్ళ క్రితం మా అమ్మ నాన్నల వివాహంలో తులం బంగారం ఖరీదు 5రూ।। లని విన్నాను. ఆ రోజుల్లో 1900 ప్రాంతంలో ఆ ధర చాలా ఎక్కువ. బహశా 32 తులాల బంగారం వచ్చిన రోజులు. అది చూచి శ్యామా మొదలైన భక్తులు బాబాను ఆక్షేపించారు. అయినా బాబా వాటికి 4 రూ.లు పెట్టి సెనగపప్పు కొని తినిపించి మరలా వాటిని వాటి యజమానికిచ్చాడట. తర్వాత బాబా అన్నాడట "ఆ మేకలు రెండు పూర్వజన్మలో అన్నదమ్ములు. వారొకరినొకరు ద్వేషించుకొని చంపుకున్నారు. వారప్పుడు నాకు జతగాళ్ళు, అందుకని నేను గుర్తించి జాలిపడి అంతధర పెట్టి కొన్నాను. మీరు కాదన్నారు. కనుక మరలా వాటిని ఆ యజమానికే ఇచ్చివేసాను.

బాబాకు సర్వ జన్మలు-సర్వకాలాలు - సర్వజీవులు-వర్తమాన క్షణంలోనే గోచరిస్తాయన్న మాటే కదా. కనుకనే "మేల్కొని నిద్రించేవాడే - బల్లపై పండుకో గలడన్నాడు." అంటే జాగ్రత్త - స్వప్నావస్థ - నిద్రావస్థ అన్నిటినీ సహజ సమాధిలో అవస్థలో ఉన్న బాబాకు ఒకే క్షణంలో అనుభవానికి వస్తాయని తాత్పర్యం. 47 అధ్యాయంలో కప్ప-పాము కథ వచ్చింది. పూర్వజన్మలో వారు చెన్న బసప్ప-వీరభద్రప్పలు. వారు కలహించుకొని పరస్పరం నరుకుకొని వచ్చి, పాము కప్పగా జన్మించారు.

బాబా 'ఒకరోజు ఊరవతలకు షికారు పోయాడు. అక్కడొక బాటసారి కలిసాడు. వారు మాట్లాడుకొంటుంటే కప్ప బెక బెకలాడింది. బాటసారి పోయి చూస్తాడు. దానినొక పాము పట్టుకొన్నదట. అతడన్నాడు బాబాతో. పాము కప్పను మ్రింగబోతున్నదని బాబా విని అది కుదరదు దానిని రక్షించేవాడిని నేనున్నాను కదా అని వాటి దగ్గరకు వెళ్ళి వీరభద్రప్పా పామువై జన్మించినా నీ పూర్వ వైరంతో కప్పగా జన్మించిన చెన్నబసప్పను మ్రింగుతున్నావా? అనగానే పాము కప్పను వదలి నీళ్ళలోకి పోయింది. ఇదేమని బాటసారి అడిగితే వారి పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరిస్తాడు బాబా. (ఈ కథ తర్వాత చూద్దాం)

ఇవన్నీ బాబా సర్వజ్ఞత్వాన్ని పూర్వ జన్మ పరజన్మలు తెలిసిన భగవల్లక్షణాన్ని స్థాపిస్తున్నాయి కదా.

## భౌతిక దశ

సాధారణంగా ఆధ్యాత్మిక గురువులు భక్తులకు ముక్తి మార్గం చూపటం కద్దు. కానీ బాబాలో ఒక విచిత్రాంశమేమంటే సామాన్య జనుల భౌతిక దశలోనూ సాయ పడటం.

ఒక దీపావళి రోజున బాబా ధుని దగ్గర కూర్చుని పరధ్యానంగా ధునిలో చేయి పెట్టాడట. దగ్గరనే ఉన్న శ్యామా వెనక్కు లాగి బాబా ఇలా





ఎందుకు చేసావని ఏడ్చాడు. బాబా చెప్పిందిది. 'దూరాన ఒక తల్లి, బిడ్డను ఒడిలో పెట్టుకొని కొలిమితిత్తి ఊదుతున్నది. లోపల యింట్లో భర్త ఆమెను పిలిస్తే మరచిపోయి ఒళ్ళో బిడ్డ ఉన్నాడని -వెంటనే లేవగానే బిడ్డ కొలిమిలో పడ్డది. నేను బయటకు లాగాను అని. అంటే అర్థమేమిటి ?

-మరొక ఊళ్ళో ఒక తల్లి ప్రసవించలేక నొప్పులు పడుతున్నదట. బాబా మసీదులో ఉండి భక్తులతో అన్నాడట 'నాకు కడుపులో నొప్పిగా ఉన్నది. గుడ్డగట్టిగా కట్టండి అని. ఆమె ప్రసవవేదన తాననుభవించాడట. దీనికర్థమేమిటి ?

మరొకసారి దత్త జన్మదినం రోజున తల్లి అనసూయ పడ్డ ప్రసవవేదన అనుభవించాడట బాబా. దీనికర్థమేమిటి?

ఈ మూడు ఉదాహరణలే కాదు ఇంకా ఇలాంటివి చాలా వున్నాయి. మనకందని వెన్నో ? మరి.

మొదటి విషయంలో బాబా సర్వ వ్యాపకత్వం స్పష్టపడుతున్నది. ఆనాడు అంతటా ఆయన తత్త్వం వ్యాపించింది. ఇది ఇతర కథల్లోనూ చూస్తాం. సృష్టి తన శరీరమని బాబా చెప్పనే చెప్పాడు. సర్వజీవులూ తనకు శరీరాలేనన్నాడు. కనుక దాని కిలాంటివి ఆధారమైన గుర్తులు. రెండవదానికర్థమేమంటే-సృష్టిని కన్నదెవరు? బాబా ఒకసారి అన్నాడట "మా అమ్మ నన్ను కన్నానని మురిసిపోయింది. ఆమె నన్ను కన్నదెప్పుడు? అని.

మరొకసారి 'మాయ నా కన్నతల్లి. నా తండ్రి అల్లా" అని. పై మాటను బట్టి కొందరన్నారు "బాబాకు తల్లి, తండ్రులుండి ఉండాలి. వారెవ్వరో మనకు తెలియక పోయినా!రని (బాబా పుట్టు, పూర్వోత్తరాల దగ్గర చూద్దాం ఈ విషయం) ఇక్కడ ప్రస్తుతాం శమేమంటే సర్వజీవరాసులను కన్న మహామాయ జగన్మాత. తానామె- ఇది వట్టిమాట కాదు నిజమేననటానికి ప్రసవవేదన అన్నారు. 'మీ అందరి కష్టాలను

స్వరూపాన్ని అని చెప్పటం తాననుభవించాడు. పరమహంస – మెహర్బాబా – అన్నారు. 'మీ అందరి కష్టాలను నేను భరించాను' అని. ఈ ప్రసవ వేదన దానికి గుర్తు. భగవంతుడెక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో లేడు (ఇదంతా కల్పనాంశమని రమణ మహర్షి చెప్పారు). ఈ ప్రపంచంలోనే మన కష్ట సుఖాలకు కర్తగా – భర్తగా (మోసేవాడు) హర్తగా (హరించేవాడు) వాడున్నాడని తాత్పర్యం.

3వ కథ ప్రకారం కూడా తన కన్నతల్లి అనసూయ మహా మాయ – తాను దత్తాత్రేయుని స్వరూపమని చెప్పటం (మహారాష్ట్ర కొంకణం-కర్ణాటకలోని సంప్రదాయమున్నది.) కనుక బాబా సర్వ సృష్టికే కర్త అని భౌతిక దశలో ఉదాహరణ ప్రాయంగా ఈ సత్యాలు మనదాకా వచ్చాయి. పోయినవి పోగా.

# మహాపరి నిర్యాణము

**( మహాసమాధి)**

బాబా 1918 విజయదశమి మంగళవారంనాడు భౌతిక శరీరాన్ని విడిచి పెట్టారు. ఆ తెల్లవారి బుధవారం ప్రొద్దున గ్రామంలోని జ్యోతిష్కుడు – శ్యామా మేనమామ లక్ష్మణ మామా కలలో అతని చేయి పట్టుకొని గుంజి బాబా. "నేను మరణించాననుకొని బాపూ సాహెబ్ జోగు హారతివ్వడు. నీవు వచ్చి మసీదులో నన్ను పూజించి హారతివ్వ'మని చెప్పాడు. ఆయనలాగేనని పూజా ద్రవ్యాలతో మసీదుకు వెళుతుంటే మధ్యజనం వారించినా వినక బాబా ఆజ్ఞను పాలించి వెళ్ళాడు. మధ్యాహ్న హారతిని యధావిధిగా జోగ్ నిర్వర్తించాడు. ఆ రోజునే పండరీపురంలో నున్న దాసగణు స్వప్నంలో బాబా సాక్షాత్కరించి – 'మసీదులో నన్ను వర్తకులు బాధించారు. నేను శరీరాన్ని వదిలి పెట్టాను. నీవు వచ్చి నన్ను పూలతో కప్పు' అని ఆదేశించాడు. దాసగణు అలాగే శిరిడి వెళ్ళి బాబా సమాధిని బంతి పూలతో కప్పాడు.





ఈ స్వప్న వృత్తాంతాలేమి చెబుతున్నాయంటే బాబా శరీరాన్ని వదిలినా తాను దివ్య శరీరంతో ఆత్మ శరీరంతో నిత్యమూ వున్నాడని నిరూపించటమే.

మహా సమాధ్యనంతరం కూడా బాబా లీలలకు కొదువలేదు.

# ఆనందరావు పాఖాడే

ఇతని విషయం సచ్చరిత్ర 45వ అధ్యాయంలో వచ్చింది.

బాబా సమాధి చెందిన తర్వాత ఒకనాడు బొంబాయి చౌపాటిలో దీక్షిత్, శ్యామా, కాకామహాజనులు శ్రోతలు కాగా ఏకనాథ భాగవతాన్ని చదువుతున్నాడు. అందులో నవనాథులు భక్తి విషయంగా చెప్పినది. చాలా గొప్పదిగా వున్నదని దీక్షిత్ శ్యామాతో అన్నాడట. శ్యామా 'మన భక్తి మాత్రం తక్కువదా?' బాబా వంటి మహాత్ముని గురువుగా పొందిన మనమదృష్టవంతులము కదా?" అన్నాడు. కానీ దీక్షిత్ కది నచ్చక దిగులు పడ్డాడు. ఇంతలో ఆనందరావు పాఖడే అన్న వ్యక్తి వచ్చి శ్యామాతో తనకు రాత్రి వచ్చిన స్వప్నం గురించి చెబుతున్నాడు. దాని సంగతి యిది. 'నేను సముద్రంలో నడుములోతున నిలబడ్డాను. బాబా రత్నసింహాసనం మీద కూర్చున్నాడు. శ్యామా ప్రక్కనే వుండి పాఖాడేను బాబాకు నమస్కరించమంటే "బాబా పాదాలు నీళ్లలో వున్నాయి అన్నాడు శ్యామా, 'బాబా పాదాలు బయట పెట్టు'మనగానే బాబా పాదాలు నీళ్ళలో నుండి బయట పెట్టగానే పాఖాడే నమస్కరించాడు" – అన్నకథ వున్నది.

బాబా సశరీరులుగా వున్నంతకాలం గద్దెమీద కూర్చున్నాడు. ఆ అరుగు రాతిదో–సిమెంటుదో. తర్వాత రత్న సింహాసనం మీద కూర్చున్నాడంటే అర్థమేమిటి? సముద్రంలో వుండటమేమిటి ? పాదాలు నీళ్ళలోనే అదృశ్యంగా వుండటమేమిటి? ఈ స్వప్న రహస్యమేమిటి ?

ఇక్కడ కథలో తనకత్యంత ప్రియ భక్తుడు దీక్షిత్ సందేహంలో

పడగానే బాబా దానిని నివారించటానికి పాఖడేను పంపాడు. అతనికి వచ్చిన స్వప్న వృత్తాంతం శ్యామాకు చెప్పాలని ఎందుకు వచ్చాడు ? కలలో ఆయన చెబితేనే బాబా పాదాలకు తాను నమస్కరించటం జరిగింది. అందుకని బాబా పాఖాడేతో అన్నాడు. శ్యామా ఋణం తీర్చుకొమ్మన్నట్లుగా "శ్యామాకు పట్టుబట్టలు పెట్టమంటే ఆనందరావు దీక్షిత్ దగ్గరకు రావటం - సరిగ్గా అతని మనస్సు సంశయగ్రస్తమైనపుడు జరగటం హఠాత్తుగా జరిగింది కాదు. బాబా ఏర్పాటు చేసిన ఘటన. దేశం, కాలం, వ్యక్తులు ఈ మూడింటిని కలపటం ఘటన. ఆ ఘట్టం వల్ల దీక్షిత్ సంశయం పోవటం-శ్యామా అతనికి బాబా గురించి చెప్పటం కలలో పాఖాడేకు బాబా పాదాలు కన్పించేటట్లు చేయటం - ఆయన బట్టలు పెట్టటానికని పాఖాడే రావటం - పాఖాడే పుణ్యంకొద్దీ కలలో బాబా సాక్షాత్కరించటం ఇన్ని అర్థాలు కలసిన సంఘటన అది. బాబా శరీరమున్నప్పుడు, లేనప్పుడూ బాబా ఉన్నాడు. ఆయన రావటమూ - పోవటమూ రెండు లీలామాత్రమేనన్న మాట.

పరమహంస శరీరం వదలినాక తెల్లవారి శారదామాత తన పుణ్యస్త్రీ చిహ్నాలను- గాజులు మొదలైన వాటిని తీసివేయబోతుంటే పరమహంస వచ్చి ఆమెను నివారించి అలా చేయవద్దంటూ 'తానెక్కడకూ పోలేదు. ఈ గదిలో నుండి ఆ గదిలోనికి పోయానంతే' నన్నాడట.

ఇక్కడ బాబా విషయము అంతే. ఈ భౌతిక శరీరమన్న గది నుండి దివ్య శరీరమన్న గదిలోనికి వెళ్ళాడు. రెండు గదులూ కన్పిస్తూనే వున్నాయి. భౌతిక నేత్రాలకు - స్వప్న నేత్రాలకు ఇక్కడ స్వప్న నేత్రాలకు గోచరించిన వైనం స్పష్టపడినది.

బల్లీ మహమ్మదన్న మహమ్మదీయుడుండేవాడు. అతని గేదెకు ఏదో జబ్బు చేస్తే పశువైద్యుని వల్ల కాకపోతే - బాబాను స్మరించి ఊధీని తినిపించాడట గేదెకు. దానితో గేదె జబ్బు తొలగినదట. అప్పటికి బాబా





మహా సమాధి చెంది 13 ఏళ్ళు గతించినది.

అబ్దుల్లా జాన్ అనే మరొక మహమ్మదీయుడుండేవాడు. అతనికి బాబా మీద అమిత విశ్వాసమే కాక బాబా గొప్ప ఔలియా సిద్ధ పురుషుడని ఆరాధించేవాడట. అతనికేవో బాధలు కలిగి సంసారాన్ని వదలి వెళ్ళిపోతూ 'స్వత్ లోయలో' నున్న సయ్యద్ అమీన్ బాబా అన్న మహాయోగి సమాధిని దర్శించాడట. ఆ రాత్రి స్వప్నంలో బాబా దర్శనమిచ్చాడంతే. ఏమీ చెప్పింది లేదు కానీ అతని బాధలు తొలగిపోయాయి.

బాబా మహా సమాధి చెందినా భక్తులను రక్షిస్తూనే ఉన్నాడని అతనికి విశ్వాసం కలిగింది.

1913లో ఆత్మారాం హరిభావుబేబల్ అన్న భక్తుడు రెండు వెండి పాదుకలు చేయించుకొని బాబా దర్శనానికి వెళ్ళాడు. బాబా 'అరే చాల బాగున్నాయే' అని అంటూ చేతుల్లోనికి తీసుకొని తన కాలి బొటన వేళ్ళు పాదుకల పైన పెట్టి' అరే! భావూ! చాలా బాగుంది. వీటిని నీ పూజలో పెట్టుకొమ్మ'న్నారు.

అతడలాగే దీర్ఘకాలం పూజించాడు. 1930లో ఒక పాదుక కన్పించలేదు. ఐనా అతడు భక్తితో మిగిలిన పాదుకను పూజిస్తూ రాగా మరలా రెండవది కూడా పోయింది. అతడు బాధతో మరలా వెండి పాదుకలు చేయించుకోవటానికి ప్రయత్నిస్తే కుదరలేదట. అతడు బాబా ఫోటో దగ్గర ఏడ్చాడు. ఆశ్చర్యంగా రెండు పాదుకలు పెట్టిన చోటనే కన్పించాయి. అతని ఆనందానికి అవధులు లేవు.

ఆనందరావు డోలస్ అన్న భక్తుడు 1952 మార్చి 10వ తేదీన రామనవమి ఉత్సవానికి శిరిడీ వెళ్ళాలనుకొని పై అధికారిని శెలవడిగితే వీల్లేదన్నాడు. కానీ ఇతనికేమో 'శిరిడీ' తప్పకపోవాలని వుంది. శెలవు దొరక్కపోతే ఉద్యోగానికి రాజీనామా చేద్దామని నిశ్చయించుకొని ఆఫీసుకు వెళ్తే అతనికి శెలవు మంజూరైనది. ఇతడు శిరిడీకి వెళ్ళాడు.

రావు సాహేబ్ గౌలంకర్ 1921లో సకుటుంబంగా తీర్థయాత్రలు చేస్తూ ప్రయాగ వచ్చాడు. అక్కడ అతనికొక కోర్కె కలిగింది. ఎవరైనా ఒక మహాత్ముని దర్శించాలని. తనటాంగా వాడి నడిగాడు ఎవరైనా తెలిస్తే చూపించమని. బాబాను మనస్సులో ధ్యానించాడు. ఇంతలో ఒక మహాత్ముడు దర్శనమిచ్చాడు. టాంగావాలా చెప్పాడు. రావు సాహెబుతో 'బాబూ ఈ సన్యాసి ఎప్పుడో గానీ ప్రయాగ రాడు. వచ్చినా ఎవరినీ దగ్గరకు రానివ్వడు. మీ అదృష్టం! చూచి రండన్నాడు. వీరు ఆ మహాత్ముని చేరగానే ఆయనెంతో ఆదరంగా వీరిని ఆశీర్వదించి పంపాడు.

1928లో రేగే ఇండోర్ హైకోర్టు న్యాయాధిపతి. శ్రీరామకృష్ణ పరమహంస పూజించిన కాళీమాతను దర్శించటానికి దక్షిణేశ్వరం వెళ్ళి ఒక మనిషిని కూలీకి కుదుర్చుకొని పరమహంస పూజించిన విగ్రహాలను చూపించమన్నాడు. అతడందరినీ చూపించాడు. కానీ పరమహంస పూజించిన రామలాల్ విగ్రహం చూపలేకపోయాడు. ఈ రామలాల్ విగ్రహం పరమహంస కెవరో యిస్తారు. పరమహంస గంగకు స్నానానికి వెళ్తే ఈ విగ్రహం నీటిలో పిల్లవాడులాగా ఈదేదట. పరమహంసతో పసివాడై ఆడుకొనే వాడట. అలాంటి మహత్తుకల విగ్రహమది. అది చూడాలని రేగే కోరిక.

ఇంతలో ఒక పూజారి ఎదురై నేను చూపిస్తాను రమ్మని ఆ విగ్రహ దర్శనం చేయించాడు.

'అయ్యా! తమ రెవరని రేగే అడిగితే ఆ పూజారిలా చెప్పాడు. రాత్రి కలలో ఎవరో కన్పించి "ఒకాయన గుడి దగ్గరుంటాడు. అతనికి కావలసిన గదులన్నీ చూపించ" మని చెప్పాడు. అందుకని నేనిలా వచ్చాను. రాగానే మీరు కన్పించారు' అని చెప్పాడు. బాబా దయకు రేగే ఎంతో ఆనందించాడు.

రతిలాల్ చిమన్ లాల్ సేఠ్ అహమ్మదు నగర నివాసి. ఆయన





1948 మే 22వ తేదీన ఆదోనిలో రైలెక్కాడు. ఆయనతో పాటుగా నల్గురు స్నేహితులు వున్నారు. అంతా కలసి పేకాటతో కాలక్షేపం చేస్తున్నారు. ఇంతలో చమన్‌లాల్‌కు మనస్సులో ఏదో తొందర. అవిశ్రాంతి కలిగి పేకాట మాని బాబా నామస్మరణం చేయటం ప్రారంభించాడు. రైలు గుల్బర్గా దాటి గంగాపూరు వచ్చింది. అది రజాకార్ల ఉద్యమం రోజులు వాళ్ళు గుంపుగా రైలులోకి జొరబడి లూటీ చేయటం మొదలు పెట్టారు. చమన్‌లాల్ రైలు పెట్టెలో వాకిలి దగ్గర ఎవరో ఆజానుబాహుడైన పఠాను నిలబడి రజకార్లను "రండిరా చంపుతానని బెదరించా"డొక దుడ్డు కర్రతో. వారు పారిపోయారు. రైలంతా లూటీ జరిగి ప్రయాణీకుల డబ్బు, దస్కం పోయింది. కానీ చమన్‌లాల్ వస్తువొక్కటీ పోలేదు.

ఇలాంటి సంఘటనలు బాబా మహా సమాధి అనంతరం జరగటం మనదాకా వస్తున్నాయి.

ఈ గ్రంథకర్త అనుభవాలు కొన్ని ముచ్చటించుకోవచ్చు.

ఒకసారి ఇతడు, ఇతని భార్య చుట్టాలింటికి వెళ్ళారు. అక్కడ తెల్లవారి 8 గం॥ల ప్రాంతంలో ఒక బిచ్చగాడు వచ్చి అన్నం పెట్టమన్నాడు. ఇంటి వాళ్ళు 'చద్దివున్నదయ్యా!" అని అంటే 'అదే పెట్టమన్నాడు. చద్ది పెట్టించుకోవటానికతని దగ్గర జోలి కూడా లేనందు వల్ల చేయి జాపాడు. ఆ చేయి అంతా పుండు 'అయ్యో! ఎలాగయ్యా!' అని గ్రంథకర్త భార్య తన దగ్గరున్న ఊధీ తెచ్చి చేతినిండా చల్లిందో లేదో పుండు మానిపోయింది. ఆ చేతిలో అన్నం పెట్టించుకొని 'ఈ ఊధీ మాహాత్మ్యం బెజవాడలోని బాబా గుడి దగ్గర మూగే భక్తులకు చెబుతానని వెళ్ళిపోయాడు.

అనంతపురంలో ఉద్యోగం చేసే రోజులవి. శ్రీమతి శాంత (గ్రంథకర్త భార్య) బాబా కోసమని 11 రూ.లు ముడుపు కట్టింది. తర్వాత కొన్నాళ్ళకెవరో బిచ్చగాడు వచ్చి నా 11 రూ.లు నాకివ్వు అన్నాడు. ఈవిడ ఇస్తూ ఏం చేస్తావు వీటితో' అని అంటే ఊళ్ళో ఫలానా చోట పేదవాళ్ళున్నారు.

వాళ్ళకన్నం వండి పెడతానని వెళ్ళిపోయాడు. ఆయనకెలా తెలుసు ఈ 11 రూ.ల ముడుపు. బాబా కాకపోతే. మా ఇంట్లోకి బాబా పటం ఆవిడ ద్వారానే మొదటిసారిగా వచ్చింది. ఆమెకు చిన్నతనంలోనే బాబా విషయం తెలుసు చుట్టం ద్వారా. ఆ చుట్టం ఆ రోజుల్లోనే బహుశ 70-80 ఏళ్ళ క్రితం శిరిడి పోయి వచ్చింది కనుక ఆమె, ఈమె చిన్నతనంలో 9-10 ఏళ్ళ వయస్సులో చెప్పింది. కాబట్టి బాబా విషయం విన్నది.

ఆ ఫోటోలో బాబా కళ్ళు నీలంగా వుండేవి. మాకది తెలియక బహుశా ఆ బొమ్మ వేసిన వాడలా వేసాడేమో అనుకొన్నాం. కొన్నాళ్ళకు ఆ రంగుపోయి మమూలు మన కళ్ళరంగు వచ్చింది. ఏమిటా ఈ వింత అనుకొన్నాము. తర్వాత బాబా చరిత్ర ఎందులోనో చదివాను. బాబా కళు ్ళ అలాగే వుండేవని రాత్రుల్లో పులి కళ్ళలాగా మెరిసేవని.

మా కుటుంబం మద్రాసులో వున్న రోజులవి. సుమారు 2000 ప్రాంతం కావచ్చు. ఒకసారి అనంతపురం సొంతయిల్లు సర్దుకోవటానికి వచ్చాం. బాబా పుస్తకం వామ పాదానంద వ్రాసింది 'లీలా సమాధి' ప్రతులను చెదలు కొట్టేశాయి. 50 పుస్తకాలు దాకా పాడైపోతే రోడ్డు ప్రక్క కాలువలో పారవేస్తున్నారు పిల్లలు. ఎవరో ఒకవ్యక్తి చాలా సాధారణంగా పల్లెటూళ్ళో బైరాగిలాగా వున్నాయన ఆ పుస్తకాల కుప్పను కెలుకుతూ అనుకొంటున్నాడట 'వేదం లాంటి పుస్తకం పాడై పోయిందే నని. ఒకరు విని ఈ మాటలు నాతో చెప్పారు. నేనాయనను పిలవండని, కుర్చీలో కూర్చోబెట్టి 'మీకీ పుస్తకం కావాలా? చదువగలరా? అని తెప్పించి ఇచ్చాము. ఎవరో ఒకరడిగారు 'తాతా! నీవెక్కడకు పోతున్నావని?' - 'మద్రాసు' అన్నాడాయన. మరైతే రైలు సమయమై పోయిందే ఎలా పోగలవంటే ఆయనన్నాడు. 'ఈ వేదం దొరికింది కదా! గాలిలో ఎగిరిపోతా'నని.

ఎవడనగలడా మాటలు? రైలు స్టేషనక్కడకు 2 కిలో మీటర్లుంది. 5 ని॥లో 10 ని॥లో రైలు రావటానికి సమయం. అలాంటి సందర్భంలో





ఆ బైరాగి అన్న మాటలవి. అన్నిటికంటే ఆశ్చర్యమేమంటే ఆ 'లీలా సమాధి' గురించి 'వేద' మనటం. ఆ పుస్తకాన్ని గురించి చాలామంది చదువుకొన్నవారే అది అర్థం కావటం కష్టమని, మరి కొందరైతే 10-15 సార్లు చదివినా ఎంతో విషయం మిగిలి పోతున్నది. దానిపైన 'భాష్యం' రావాలని ఈ మధ్యనే శ్రీ పి. నాగేశం (రిటైర్డ్ ఐ.ఆర్. యస్. అనంతపురం) గారన్నారు.

మరొక పండితుడు ప్రపంచంలో గొప్ప పుస్తకాలు 4, 5 ప్రస్తావించి ఈ పుస్తకం వాటి స్థాయిలో వున్నది. బాబా వేదకాలం నాటి మహర్షిగా చెప్పారు. అద్భుత గ్రంథమని. అలాంటి గ్రంధాన్ని గురించి అసాధారణ బైరాగి అలా అన్నాడంటే -

"బాబా కాక అతడెవ్వరు?"

# కలలో బాబా

మనిషి కల ఒక గొప్ప సాధనం. కలలో గురువులు - దైవం కన్పించిన మార్గం బోధించటం భక్తుల అనుభవాల్లో కన్పిస్తూనే వుంది.

త్యాగరాజ స్వామి సంగీత సాధన సమయంలో నారదుడు మారువేషంలో వచ్చి సంగీత గ్రంథమొకటి ఇచ్చి వెళ్ళినట్లు వింటున్నాం. ఇది నేడూ జరుగుతున్నది భక్తులకు సాధనా మార్గాలు విన్పించే చోటు 'కల'. గీతా శాస్త్రమంతా అలాంటి దశలోనూ చెప్పబడ్డది. కలలో మేల్కొన్నపుడుండే మనసు లోపించటంవల్ల ఊహాపోహలకు తావు లేదు. కనుక బాబా వంటి దైవం-గురువు కలలో తోచి మార్గం చెప్పటం- సాయపడటం జరిగింది. జరుగుతున్నది. నేటికీ అది సత్యమే. పాఖాడే స్వప్న వృత్తాంతం చూచాం కదా. ఆ స్వప్నంలో గోచరించిన బాబా దైవం. కనుక రత్నసింహాసనం గోచరించింది. పాదాలు సముద్రంలో వున్నాయి. బాబా యధార్థస్థితి అది సశరీరుడైన బాబాను- వ్యక్తిగా - గురువుగా చూస్తాం తప్ప దైవ రూపం గోచరించదు. అది బాబా తత్త్వస్వరూపం.

దానికి సింహాసనం గుర్తు. మేలుకొన్నవేళ బాబా అంతర్యామిగా స్ఫురించాడు. కలలో తానుగా మన గురువెవరో వారుగా గోచరిస్తున్నాడు.

దైవం ధర్మార్థ, కామ, మోక్ష ప్రదాత. కనుక ఈ అన్ని దశలోన్లు సాయ పడుతున్నాడు.

భీమాజీ పాటీలు రోగగ్రస్తుడై బాబా దర్శనానికి వచ్చాడు. వాని రోగాన్ని బాబా రెండు స్వప్నాల ద్వారా కుదిర్చాడట. ఒక కలలో వాడు పాఠశాలలో చదివే విద్యార్థిగా – వాడిని పంతులుగారు కొట్టినట్లుగా; రెండవ కలలో వాడి ఛాతీమీద పెద్ద బండ దొర్లించినట్లు తోచింది. వాడి క్షయజబ్బు నయమైపోయింది. కలలో నయమైన ఈ జబ్బు మామూలు స్థితిలోనైతే చాలా కాలం పడుతుంది. కలలో మన సూక్ష్మశరీరంతో వుంటాం. అక్కడ రోగ కారణముంటుంది. అది కేవల ప్రాణమయ కోశం. ఆ కారణాన్ని నిర్మూలించాలంటే కలే గొప్ప సాధనం.

భౌతికదశలో పిళ్ళే నారి కురుపును నయం చేయటం చూస్తాం. పిళ్ళే బాబాకు సన్నిహితుడైన భక్తుడు. అతనికి నారి కురుపు వచ్చింది. ఆ బాధ పడలేక బాబాకు కబురు చేశాడు. దీనిని 10 జన్మల మీద పరచి బాధను తగ్గించమని. బాబా అన్నారట. 10 జన్మలు దేనికి ? నేనిక్కడున్నది మీ బాగోగులు చూడటానికి కాకపోతే దేనికున్నట్లు? వాడిని తీసుకొని రండి. 10 రోజుల్లో కుదురుస్తానని. సరే పిళ్ళేను మసీదుకు తీసుకొని వచ్చారు శ్యామా మొదలగువారు. బాబా అతని పుండుపైన ఊధీ రాసి విశ్రాంతి తీసుకొమ్మని 'ఇప్పుడే ఒక కాకి వచ్చి పుండును పొడుస్తుంది. నీ రోగం నమమౌతుంద'న్నాడు. తర్వాత అబ్దుల్లా వచ్చి పిళ్ళే పుండును చూడక తొక్కితే పుండు చితకటం బాధ – 10 రోజుల్లో ఊదీవల్ల నయం కావటం జరిగింది. అబ్దుల్లాను కాకి అనేవాడట బాబా ఎందుకో? ఎవరికి తెలుసు? గనుక మనకు తోచిన ఊహలు చేసుకోవటం తప్ప యదార్థం మనకు తెలియదు. ఇక్కడ బాబా వైద్యనాథుడైన శివుడు. ఇదొక జాతి.





బురహాన్ పూర్ మహిళ, కెప్టెన్ హాటే కలల్లో బాబా వారిని తనకు భోజనం పెట్టమన్నాడట.

బురహానీ మహిళ ఒక పోస్టుమాస్టరు భార్య. వారు బాబానప్పుడూ చూడనేలేదు. ఆమె కలలో బాబా తోచి తనకు కిచిడీ (పులగం) కావాలని అడగటం వీరు తర్వాత శిరిడి వచ్చి బాబాకు కిచిడి అన్నం పెట్టటం జరిగినది. అలాగే కెప్టెన్ హాటే – గ్వాలియరు డాక్టరు కలలో బాబా కన్పించి నన్ను మరచిపోయావా ? అన్నాడట. 'లేదు బాబా' అని హాటే బాబా కాళ్ళమీద పడ్డాడు. తోటలో చిక్కుడు కాయలు కోసి కూరవండి పెట్టాలని తోటలోకి వెళ్ళాడు. ఇదంతా కాకా తర్వాత ఒక బొంబాయి మిత్రునకుత్తరం వ్రాసి డబ్బు పంపించాడు ఆ మిత్రుడు శిరిడి వెళ్ళాడు. అది చిక్కుడు కాయల కాలం కాదు. కానీ ఎవరో ఒకామె చిక్కుడుకాయల గంపతో కన్పిస్తే ఇతడవి కొని బాబాకు నైవేద్యం పెట్టాడు. ఈ కలల్లో దైవం తనను నైవేద్యం పెట్టమని ఆదేశిస్తున్నాడు.

తార్కాడు భార్య శిరిడిలో మసీదుకు పోయి బాబాకు నమస్కరిస్తే దైవమన్నది "తల్లీ మీ యింటికి బాంద్రా పోయాను ఏమైనా తిందామని, కానీ మీ యింట్లో ఏమీ లేదు తినటానికి. ఆకలితో తిరిగి వచ్చానన్నాడు". (బాబా సచ్చరిత్ర 9వ అధ్యాయం). మరొక భక్తునితో "వీడు గృహ దేవతకు నైవేద్యం పెట్టకుండా మాడుస్తున్నాడు. కనుక వాడిని శిరిడీకి లాక్కొని వచ్చాను? అన్నాడు.

ఇవన్నీ 'దైవానికి – అతడిచ్చిన దానిని అతనిని మరచిపోయి తినటం పాపమ'ని గీత చెప్పిన దానిని బాబా చెబుతున్నాడు. భగవంతునికి నైవేద్యం పెట్టటమంటే మన జీవితాలను ఆయనకు సమర్పించి శరణనటం. నైవేద్యం భోజనంగా ఆరగించటం. భక్తితో ఒక సాధన. భక్తుడు కావటమంటే ఇదే యజ్ఞశిష్టాశనం – యజ్ఞంలో నైవేద్యంగా మిగిలిన దానిని తినమని గీత.

మానవ జీవితంలో ప్రత్యేకించి సంసారులకు 5 యజ్ఞాలు చేయమని

పెద్దలు చెప్పారు. అవేమంటే -

1. బ్రహ్మయజ్ఞం - వేదం చదవటం లేదా చదివి చెప్పటం
2. దేవ యజ్ఞం - దేవతారాధన
3. పితృయజ్ఞం -పితృదేవతలకు తద్దినం వంటివి పెట్టి ఆరాధించటం.
4. భూతయజ్ఞం - చెట్టు, పుట్ట, పశువు, పక్షివంటి వానిని ఆదరించటం.
5. నర (అతిథి) యజ్ఞం - అతిథి, అభ్యాగతులను ఆదరించటం.

ఈ పంచయజ్ఞాలు మనిషిని ఉద్ధరించే సాధనాలు. బాబా దైవయజ్ఞం చేయండని పై కథల ద్వారా బోధిస్తున్నాడు.

మరొక చోట మసీదులో భక్తులతో అన్నాడట (సచ్చరిత్ర 18, 19 అధ్యా) "ఏ సంబంధము లేకుండా నీ దగ్గర కెవ్వరూ రారు. కుక్క వచ్చినా, మనిషి వచ్చినా తరమవద్దు. వాటిని ప్రేమతో చూడండి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టు. గుడ్డలు లేనివారికి గుడ్డలివ్వు. నీ ఇంటి వసారా బాటసారులకు విశ్రాంతినివ్వాలి. అప్పుడే భగవంతుడు సంతోషిస్తాడు."

ఇదంతా నర-భూతయజ్ఞ విధానమే.

'ఈశావాస్యమిదం సర్వం' - ఈ ప్రపంచమంతా భగవంతుని కిల్లు. అతడే సర్వ జీవుల్లో వున్నాడు. కనుక ఎవరినీ నిరాదరించవద్దు. స్వామి వివేకానంద 'నరుడే నారాయణు'డని సేవించమన్నాడు. భక్తుడొకడు తన దగ్గరకు వస్తే వచ్చి ఏదైనా మంత్రోపదేశం చేయమని ప్రార్థిస్తే, నరుడే నారాయణుడని బోధించి ప్రతివ్యక్తినీ ప్రేమించమన్నాడు. వారి గురువు పరమహంస 'ఆకలైన వారికి అన్నం పెట్టకుండా వేదాంతం చెప్పటం తప్పు' అన్నారు. రమణ మహర్షి కూడా అందరితో పాటుగా ఉన్నదేదో అదే తనకు పెట్టమన్నాడు. తనకెక్కువ యిస్తే వద్దన్నారు. పశువూ - పక్షి - అన్నిటినీ ప్రేమించి ఆదరించారు. వీటిని సైతం వారెప్పుడూ అది ఇదీ వాడు అని అనకుండా పశువును, పక్షిని, వారనే పిలిచే వారట.





ఇది సర్వే సర్వత్రా నిండివున్న భగవంతుని ప్రేమించటం. ఆయన శరీరాలైన జీవరాసులను ప్రేమించటం దైవాన్ని ఆరాధించటమే. వాటిని దైవ స్వరూపులుగా ఆరాధించటం. ఇదే బాబా బోధ.

సగుణ మేరునాయక్ హైదరాబాదు నుండి శిరిడి వచ్చి బాబా దర్శనం చేసి కొన్ని నెలలున్నాడు. చాలాకాలమైనాక బాబాను దర్శించి హైదరాబాదు పోవటానికి అనుమతి నడిగితే బాబా నీవు పోవటానికా నిన్ను పిలిచింది. నీ విక్కడే వుండి ఏదైనా వ్యాపారం చేసుకొమ్మన్నాడట బాబా. అతడలాగే చిన్న టీ బంకు పెట్టుకొని అక్కడే స్థిరనివాస మేర్పరచుకొన్నాడు.

ఆ రోజుల్లో బాబాకు ఉదయం పూజ హారతియైనాక వెన్న, పంచదార నైవేద్యం పెట్టేవారు. చాలాకాలం గడిచింది. బాబా శరీరం వదిలివేసాక 1922-23 ప్రాంతంలో బాబా నాయక్ కలలో కన్పించి ఆ నైవేద్యం పెట్టటం లేదని చెప్పాడు. నాయక్ సంస్థానంలో విచారిస్తే నిజమేనని తేలింది. అప్పుడు నాయక్ తన సొంత డబ్బుతో ఆ నైవేద్యం పెట్టటం ప్రారంభించాడు.

ఒక సంప్రదాయం సాగుతూ వుండగా అది మానటం మంచిది కాదనీ, తనకా నైవేద్య మిష్టమనీ చెప్పటంతో పాటు తాను శ్రీకృష్ణావతారమని చెబుతున్నాడేమో బాబా ఎందుకంటే బూటీ వాడా నిర్మించి మధ్య నట్టింట్లో మురళీ ధరుని విగ్రహం పెట్టాలనుకొంటున్నాననగానే" బాబా "ఎందుకురా? మనమే కూర్చుందాంలే" అన్నారట. అంటే మురళీధరుడు తానేనని గదా. ఇందుకే 'శ్రీలీలా సమాధి'లో ఈ పద్యం వ్రాయబడ్డది.

'జీవిగ్రావమై - ఆంతర చేతనమ్ము
నందనందనుడైన ఆనందమూర్తి
రావియాకుల బూరతో రాగమాల తోడ

(బాబా కూర్చున్న బండ భక్తుడు కాని, జీవి పైనున్న బాబా, ఆనందమూర్తి

శ్రీకృష్ణుడు. కనుకనే పిల్లన గ్రోవితో సంగీతానందం పితుకుతున్నాడు. పాలులాగా)

"ఇతడు శ్రీకృష్ణుడేమో? నా హృదయ వీధి
కడిమి తోటలు పూయు చీకట్ల లోన
వర్ణమయ పింఛంబు ప్రభలతోడ
శ్వేత పద్మముల్ వికసింపచేయు చుండె!"

నాలోపల కదంబవృక్షం తోటలు చీకట్లు కురుస్తున్నవి. అందులో రంగుల ఫింఛంతో శ్రీకృష్ణుడైన బాబా సహస్రార పద్మాన్ని వికసింప చేస్తున్నాడు. ఈ పద్యం బాబాను శ్రీకృష్ణునిగా, అమ్మగా చెబుతున్నాయి. (ముందే వచ్చినా మరలా మరలా అలా బాబాను భావించమని చెప్పటానికి)

"హేపాయ్ పురాతన పార్"

"ఈ పాదాలు ఆద్యంతరహితాలు"

ఈ మహావాక్యం సపత్నేకర్ కథలోనిది. అతడు అక్కల్ కోట నివాసియైన న్యాయ వాది. అతనికొకడే కొడుకు. చిన్ననాడే చనిపోతే భార్య, భర్తలు వికలులైపోయారు.

తాను న్యాయవిద్య చదువుతుండగా 'శేవడే' అన్న సహపాఠి నుండి బాబా మాహాత్మ్యం విన్నాడు. ఆ రోజుల్లో బాబాను అపహాస్యమూ చేసాడు. కనుక ఆ పాపం వల్ల తన పాపడు పోయాడన్న భీతితో శిరిడి వెళ్ళి బాబాను దర్శిస్తే దైవం 'పోరా' అని గద్దించింది. చేసేదిలేక తిరిగి తన యింటికి వచ్చాడు. భార్యా, భర్తలు కాశీ వంటి క్షేత్రాలకు పోదామనుకొన్న రాత్రి, భార్య కలలో తానొక బావికి నీటికై పోగా ఒక ఫకీరు తలకు రుమాలు చుట్టుకొని కనిపించి, తనను వెంటనంటాడు. అతడన్నాడామెతో "తల్లీ! నీ వనవసరంగా ఆయాస పడటం దేనికీ ? నీ కుండ నేను నింపుతాను గదా ? అని ఆమె భయపడి ఇంటికి వచ్చింది. ఈ కలను తెల్లవారి భర్తతో





చెప్పగా అతడా ఫకీరు బాబాయేనని శిరిడీ వచ్చారు. ఈసారి బాబా సపత్నేకరును కసురుకోలేదు. ఆయన బాబా పాదాలొత్తుతున్నాడు. అప్పుడు బాబా అన్న మాటలు "బాబూ! నీ వొత్తుతున్న పాదాలు ఆద్యంతరహితాలు". జనన – మరణ – దేశ – కాల అతీతులన్న అర్థం అన్నాడు. (పాఖాడే కథలో సముద్రం ఈ ఆద్యంతరహితమైన స్థితికీ సంకేతం). ఇంతలో ఒక తల్లి వస్తే ఆమెతో బాబా అన్నాడు. 'నాకిన్నాళ్ళు నడుము, కాళ్ళు, కీళ్ళు నొప్పులుగా వుండేవి. ఇప్పుడే అవి పోయినవి' అని ఈ మాటలు సపత్నీకరు భార్యను గురించి చెప్పినవేనని ఆమె గ్రహించినది. తనకా బాధలు మసీదులోకి రాగానే పోయినవి కనుక. మరలా బాబా అన్నాడు "వీడు తన బిడ్డను నేను చంపానంటున్నాడు. అదే బిడ్డను తెచ్చి మరలా ఈ కడుపులో పెడతానని'' – భార్యా భర్తలు సంతోషించి బాబాకొక కొబ్బరికాయను సమర్పిస్తే దానిని భర్త కిచ్చి నీ భార్య ఒడిలో పెట్టు, సంవత్సరం తిరగకుండానే కొడుకునెత్తుకొని రండి' అన్నాడు. వారలాగే చేసారు. దైవమిచ్చిన వరం ఫలించింది.

ఈ కథలో దైవం సంతానాన్ని ప్రసాదించటం సంగతి సరే. అదే బిడ్డను తేవటమేమిటి ? హరి వంశంలో 'ఒక బ్రాహ్మణునకు వరుసగా నలుగురు కొడుకులు కలగటం, వారు పురుటింటిలోనే మరణించటం జరిగితే ఆ బ్రాహ్మణుడు వచ్చి శ్రీకృష్ణుని ప్రార్థిస్తాడు. శ్రీ కృష్ణుడు మృత్యులోకం వెళ్ళటం తిరిగి మరణించిన ఆ నలుగురు కొడుకులను తెచ్చి బ్రాహ్మణునికిచ్చి ఓదార్చిన కథ వుంది. సరిగ్గా ఇక్కడా జరిగింది ఇక్కడ నల్గురికి బదులు ముగ్గురే జన్మించారు.

ఇది బాబా దైవమనీ – కృష్ణుడు చేసిన పనే చేసి తాను తదవతారాన్ననీ స్పష్టం చేశాడు. (ఉద్ధవేశ బువాకు చెప్పాడు కదా – నీవు భాగవతం చదువు. అప్పుడు నీకేది చెప్పానో అది' అనటంలాంటిది. అప్పుడుంటే ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు ఉద్ధవునితో చెప్పిన విషయం భాగవతంలో వుంది. )

నానా చందోర్కరుకు గీతాశ్లోక వ్యాఖ్యానంలో కూడా తాను శ్రీకృష్ణుని అవతారమనే సూచించిన వైనం తర్వాత చూద్దాం. కనుకనే ఆ పాదా ఆద్యంతరహితాలు. సంతానం సపత్నేకరుకు దక్కింది. మనకు బాబా పాదాలంటే ఏమిటో దక్కింది. మనకిది బాబా వరమివ్వటమే కదా. ఆ మహాత్ముని ఫోటోకు ఆయనకు భేదం లేదన్న విషయం తర్వాత స్పష్టపడుతుంది. కనుకనే బాబా ఫోటోలో వామపాదం పైనున్న కుడి పాదం కంటే పూజించుకోదగ్గదనే బాబా ఎడమ కాలును క్రింద పెట్టాడేమో!

ఈ సంఘటనలన్నీ భక్తుల కాధ్యాత్మిక మార్గబోధ చేసిన స్వప్న వృత్తాంతాలు గీతలో భగవంతుడన్నాడు కదా. "ఎవరెలాంటి భావంతో వస్తారో వారినలాగే ఆదరిస్తాను"– అని అలాగే బాబా.

గురుచరిత్ర 18–19 సచ్చరిత్ర అధ్యాయాల్లో సాఠే కథ వచ్చింది రావు బహద్దూరు సాఠే ఎన్నో బాధలకులోనై బాబా దర్శనానికి శిరిడీ వస్తే 1917లో బాబాను చూచిన వెంటనే అతనికి చిత్తశాంతి లభించినదట. (ఇదే గురులక్షణం. ఎక్కడ మనకది లభిస్తుందో ఆ చోట మన గురుస్థానం. సప్తశృంగ పూజారి కథలో అతనికిలాగే మనశ్శాంతి లభించినదని చెప్పబడినది కదా. బాబా మాట్లాడకుండానే)

సాఠే శిరిడీలో గురుచరిత్ర పారాయణం ప్రారంభించి 7 రోజుల్లో పూర్తి చేసాడు. (ఆనాటికి సాయి సచ్చరిత్ర రాలేదు) 7వ రోజు రాత్రి బాబా అతనికి కలలో సాక్షాత్క రించాడట. గురు చరిత్ర చేతిలో పట్టుకొని మరీ కన్పించాడు. తెల్లవారీ కలను కాకా సాహెబ్ దీక్షితుతో ప్రస్తావించి దీని భావమేమో బాబా నడిగి తెలుసుకొని చెప్పమన్నాడు. బాబా దానికి సమాధానంగా దీక్షిత్‌తో చెప్పాడట. అతడింకొక సారి పారాయణం చేస్తే భగవంతుడు ప్రీతి చెంది వానికి బంధ విముక్తి కల్గిస్తాడని.

ఇది సచ్చరిత్ర వ్రాసిన హేమాద్రిపంతు విని 'నేను 7 ఏళ్ళ నుండి గురుచరిత్ర పారాయణం చేస్తున్నాను. సాఠే 7 రోజులే పారాయణం చేసాడు.





7 ఏళ్ళుగా బాబా సేవ చేస్తుంటే దైవానుగ్రహం నాకు లభించలే'దని బాధపడ్డ విషయం తర్వాత చెప్పబడుతుంది.

ఏ వ్యాధికేది మందో వైద్యునకు తెలిసినట్లు దైవానికి తెలుసు. ఎవరినెలా ఉద్ధరించాలో – ఆ మార్గమే చెబుతాడు బాబా. మనస్సులో స్ఫురింప చేస్తాడు. సాఠేకు గురు చరిత్రను పారాయణం చేయాలన్న సంకల్పం. బాబా సన్నిధానంలోనే జరగటమే దానికి గుర్తు. ఆ స్ఫురణ బాబా యిచ్చినదేనని. ఇలాంటి విషయం నానా చందోర్కరుకు గీతా శ్లోకార్థ భావం చెప్పటం దగ్గర కూడా వస్తుంది. దాని వివరణ మక్కడ చూద్దాం.

# జ్ఞానేశ్వరి

బాలకృష్ణ విశ్వనాథ దేవ్ దహను తాలుకా తహశీల్దారు. బాబాకు సన్నిహిత భక్తుడు. హేమార్పంతు వ్రాసిన బాబా సచ్చరిత్రను ప్రచురించటానికి పరిష్కరించిన వాడు. ఈయన 1910లో శిరిడీ వెళ్ళినపుడు ఆ గ్రామం అసలు పేరు 'శీలధి' లేక 'శైలధి' అని. దానిని 'శిరిడీ'గా వ్యవహరించటం జరిగినట్లు వ్రాసాడు. అప్పుడా గ్రామంలో 2568 జనాభా అని, ఒక మరాఠీ బడి, మిషన్ బడి వున్నట్లు, 9 గుడులున్నాయని, వివిధ కులాలున్నాయని వ్రాసాడు. అన్నివిధాల స్వయం సమృద్ధి కల గ్రామమనీ వ్రాసాడు. బాబా మొదటిసారి 1938 ప్రాంతంలో వచ్చినపుడు మరీ కుగ్రామమట. 400 ఇళ్ళు మాత్రమే వుండేవని మట్టి రోడ్లు, వీధి లాంతర్లుండేవి కావనీ, పాములు విపరీతంగా బజార్లలో రాత్రిపూట తిరిగేవనీ కొందరు వ్రాసారు. ఇందుకే బాబా తరచుగా రాత్రుల్లో భక్తులకు దీపాలతో రమ్మనీ, పొమ్మనీ చెప్పేవాడనీ అంటారు.

ఈ దేవుడు "జ్ఞానేశ్వరి" అంటే జ్ఞానదేవు వ్రాసిన భగవద్గీతా వ్యాఖ్యానం చదవాలని ప్రయత్నిస్తే ఏవో అవాంతరాలు వస్తుండేవట. బాబాకు ఆ గ్రంథం కొని వారి చేతుల మీదుగా తీసుకుంటే వారి ఆశీస్సులతో

చదువుకోవచ్చని కొందరు సలహా యిచ్చినా అతడంగీకరించలేదు. ఎందుకంటే బాబాకన్నీ తెలుసుగదా వారంతట వారే ఆశీర్వదించాలని భావించేవాడు. అతడు 1914 ఫిబ్రవరిలో షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి 20రూ.లు దక్షిణ నిచ్చాడు. ఆనాటి రాత్రి బాలకరాముడన్న బాబా భక్తుని కలసి బాబాపై అతని భక్తిని వారి అనుగ్రహాన్ని గురించి ప్రశ్నించాడట. రేపు చెపుతానని అన్నాడతడు. తెల్లవారి మరలా మసీదుకు పోగా బాబా 20 రూ.ల దక్షిణ నడిగాడు. అతడిచ్చి మసీదులో ఒక మూల కూర్చుంటే బాబా తన దగ్గరకు వచ్చి కూర్చోమన్నాడట. మరలా మధ్యాహ్న హారతి తర్వాత, దేవు బాలకరాముని కలసి బాబా తనకేమైనా బోధించాడా అని అడిగితే అతడు చెప్పబోతుండగా, బాబా కబురు చేసి తన దగ్గరకు రమ్మన్నాడు. బాబా మరలా 25 రూ.ల దక్షిణ నడిగితే చెల్లించాడు. తర్వాత దేవు వాడాకు వెళ్ళాడు. భోజనానంతరం మసీదుకు రమ్మని పిలవటం, 12 రూ.లు దక్షిణ నడగటం తర్వాత జ్ఞానేశ్వరిని చదువుకోమని ఆజ్ఞాపించటం జరిగింది. ఆ గ్రంధ పఠనానికింత దక్షిణ అవసరమా? ఏమో? బాబా భావన మనకేమి తెలుసు? మతగ్రంధ పఠనానికి పాపమేదైనా అడ్డువస్తే తొలగించటానికీ ఉపాయం పన్నాడేమో బాబా ? ఎందుకంటే బాబాయే అన్నాడనేకసార్లు 'నేనెవరి దగ్గరా ఏమీ తీసుకోను. మసీదు తల్లికి బాకీ వున్న వారినే అడుగుతాను. నేను నీ దగ్గర రూపాయి తీసుకుంటే 10 రూపాయలివ్వాలి" అని.

కాబట్టి పుణ్యాత్ములే పవిత్ర గ్రంధ పఠనానికర్హులు. ఆ అర్హత కల్పించటానికే బాబా ఈ పని చేసాడనుకోవాలి. 1914 ఏప్రిల్ 2 గురువారం రాత్రి బాబా అతని స్వప్నంలో పై అంతస్తులో కూర్చొన్నట్లు కన్పించి దేవు నడిగాడు. జ్ఞానేశ్వరి బోధ పడుతున్నదా? లేదా? అని. ఎందుకంటే అందరికి అర్థమయ్యే గ్రంథంకాదది. దేవు కన్నీళ్ళతో అన్నాడు నీ దయలేకపోతే అర్థం కావటం కష్టమని. బాబా అన్నారు 'నీవు నిదానంగా చదవటం లేదు. నా దగ్గర యిప్పుడు చదువు' అని. దేవు ఏమి చదవమంటా





వంటే బాబా 'ఆధ్యాత్మరామాయణం' చదువు అన్నారట. బాబా పుస్తకం కోసం పోవటం మెలకువ రావటం జరిగింది.

బాబా నాముందు చదువు అంటే అర్థమేమిటి? – తనను మనస్సులో గురువుగా భావించి చదవమని జ్ఞానేశ్వరికి ముందుగా ఆధ్యాత్మ రామాయణం చదివి ' జ్ఞానేశ్వరిని చదువుకో' అని బాబా బోధించారు జగద్గురువు కదా మరి.

# త్రిశూలము - లింగము

మేఘుడు హరి వినాయక సాఠే ఖేడాజిల్లా డిప్యూటి కలెక్టరుగా వున్నపుడు ఆయనకు వంట బ్రాహ్మణుడుగా శివ పూజారిగా వుండేవాడు. సాఠే బాబాను పరమ శివునిగా భావించే భక్తుడు. కనుకనే మేఘుని బాబా దగ్గరకు పంపించాడు.

ఇతడే బాబాకు గోదావరి నీళ్ళతో ఒక శివరాత్రినాడు అభిషేకం చేసినాడు. ప్రతిరోజు బిల్వ పత్రాలతో బాబాను పూజిస్తూ వచ్చాడు మసీదులో ఇంట్లో. 12 నెలలు గడిచింది. దైవమతి కృతజ్ఞుడు. విశ్వాసం కలవాడని కృతజ్ఞశ్చ – ఆ విష్ణు సహస్ర నామంలో చెప్పాడు భగవంతుడైన వేదవ్యాసుడు. కనుక ఈ భగవంతుడైన బాబా భక్తుని శ్రేయస్సు నా దృష్టిలో పెట్టుకొని ఒకనాడు మేఘుడు, మగత నిద్రలో వుండగా అతనింట్లోకి ప్రవేశించి 'మేఘా త్రిశూలం గీయి' గోడపైన అని చెప్పి అక్షింతలు చల్లి వచ్చాడట'. మేఘుడు బాబా మసీదుకు పోయి ఈ సంగతి బాబాతో చెప్పగా 'ఔను నేను వచ్చాను. అది భ్రాంతికాదు. త్రిశూలం గీసి పూజించు' అన్నారు. తర్వాత ఎవ్వరో పూనా నుండి వచ్చి బాబాకు శివలింగమర్పిస్తే ఆవ్వాళ మేఘునితో "చూడరా ! శంకరుడు వచ్చాడు. పూజించుకో అని ఆశీస్సులతో పాటు ఇచ్చారు.

అనేక సంవత్సరాలు బాబా సేవలో తరించిన మేఘుడు 1912లో దివంగతు డైతే బాబా కన్నీళ్ళు కార్చి 'వీడు నాకు నిజమైన భక్తు'డన్నారట.

అతడంత ధన్యజీవి. రమణ మహర్షి 'లక్ష్మి' అన్న గోవు మరణిస్తే ఇలాగే కన్నీళ్ళు పెట్టుకొన్నారు. తర్వాత అతని శ్రాద్ధ కర్మలను బాబా తానే స్వయంగా డబ్బిచ్చి చేయించారు. బాబాలో ఒక ప్రత్యేకత ఉన్నట్లు తోస్తుంది. కలలో కన్పించి దానికొక గుర్తుగా ఏదో ఒక పదార్థాన్ని ఇవ్వటం ఇక్కడ అక్షింతలు. పైగా మేఘుడు 'బాబా తలుపులు వేసివుంటే నీవు రాలేవేమోనను కొన్నానంటే' నాకు తలుపులు, గోడలడ్డం కావు అన్నారు. అలాగే దేవుతో 'నాకు రావటానికి వాహనాలతో పనిలేదు' అని మాన్కరు వంటి కథల్లో బాబా జామ్నేరు చమత్కారమెంత అద్భుత విషయం!!

# అబ్దుల్

ఇతడు 1869లో జన్మించాడు. నాందేడులో అమీరుద్దీనని ఒక ఫకీరు దగ్గరుండి అతనిని సేవిస్తూండేవాడు. 1889లో బాబా అమీరుద్దీన్‌కు కలలో కన్పించి అబ్దుల్‌ను శిరిడీ పంపమన్నాడు. ఇంతేకాక 2 మామిడి పండ్లు అమీరుద్దీన్‌కిచ్చాడట. ఇవి నిజంగా అతని ప్రక్కనే కన్పించాయి, తెల్లవారి చూచేసరికి, అబ్దుల్'ను శిరిడీ పంపాడు. అతడు రాగానే బాబా అన్నారట 'నాకాకి వచ్చిందని. కారణమేమో? కానీ అతడు బాబాను భక్తితో సేవిస్తూ వచ్చాడు. మసీదూడ్చి దీపాలు తుడిచి, వెల్గించి, ఇంతేకాక బాబా నడిచే దారులూడ్చి శుభ్రం చేసేవాడట. అపరిశుభ్రతను తొలగించటం వల్ల కాబోలు కాకి అన్నాడు బాబా.

ఈ అబ్దుల్ ఉర్దూలో ఏదో గ్రంథం వ్రాసాడట. దీనిలో బాబా చెప్పిన కొన్ని విషయాలు పూజ్యశ్రీ నరసింహ స్వామీజీ తన పుస్తకంలో (జష్ఠుతీవతీం డ ాఖుఎఐఅస్త్రం బాబా ఉపదేశాలు)లో కొన్నిటిని ఉదహరించారు. వాటి కర్ణాలేమిటో బ్రహ్మకు తరంగాదు చెప్పటానికి. అబ్దుల్ కూడా బాబా ఖురానీ - ముస్లిమ్ సంప్రదాయం, సూఫీ సంప్రదాయం క్షుణ్ణంగా తెలిసినవాడు. ఖురాన్‌ను వివరించే వాడనీ సంస్కృత, ప్రాకృత గ్రంథాలు వివరించే వాడని, బాబా సాక్షాత్తు సర్వజ్ఞుడనీ వ్రాసాడట.





దురదృష్టవాశాత్తు ఈ గ్రంథం ప్రచురించబడలేదట. ఎందుకో శిరిడీ బాబా సంస్థానం వారు ప్రచురించి అన్ని భాషల్లోను అనువదింపచేస్తే బాబా విషయం యింకా ఎంతో మనకు తెలిసి వుండేదేమో ?

రమణ మహర్షికి ఇంతే సంస్కృతం, తమిళం, మళయాళం, తెలుగు భాషల్లో గ్రంథరచన చేయగలిగినంత పాండిత్యముండేదట. సంస్కృత గ్రంథాలను సునా యాసంగా వ్యాఖ్యానించేవారని తెలుస్తుంది. వారి ఆస్థాన పండితుడైన వాసిష్ఠ గణపతి ముని (నాయనగారు) చెప్పారా విషయం. వారి 'ఉమాసహస్రం'లో చివరి 30 శ్లోకాలు రమణ మహర్షి సమాధ్యవస్థలో నాయనకు ఆత్మభూమికలో బోధిస్తే వారు వాటిని వ్రాసుకొన్నారట.

ఏమి చదువని వారంత పండితులైనారంటే కేవల ఆత్మస్వరూపులు కదా వారు మనకెంత పూజ్యులు.

# సమాధి మందిరం

కాకా సాహేబు దీక్షిత్ 1910 డిసెంబర్లో కట్టించిన వసతి గృహంలో ఒకరోజున బూటీ-శ్యామా నిద్రిస్తున్నారు. బాబా వారికి కలలో కన్పించి తనకొక నివాస గృహం కట్టించమని చెప్పారు. శ్యామాకు - బూటీకి ఒకే కల రావటం వల్ల పరస్పరం చెప్పు కొన్నారు. బూటీ నాగపూరు జమీందారు కావటం వల్ల వెంటనే భూమిని కొని గృహ నిర్మాణం ప్రారంభించాడు. దాని పథకమంతా బాబాతో చర్చిస్తూ - జోగు పర్యవేక్షణ క్రింద నిర్మాణం పూర్తికావచ్చింది. ఇది కేవలం బూటీ తన కుటుంబం శిరిడీలో వుండటం కోసం. ఇతర భక్తులకు నిర్మించాలనుకొన్న కోర్కెననుసరించి బాబా సంకల్ప ప్రేరణ వల్ల చివరకు బాబా సమాధి మందిరంగా తయారైంది. ఇదే నేడు మనం దర్శించే బాబా సమాధి మందిరం. మధ్య హాలులో మురళీధరుని విగ్రహం ప్రతిష్టించాలని బూటీ ఆశయం. కాని బాబా తానే తనకు గుడిగా చేసుకోవటం తటస్థించిన పద్ధతి ఇది.

రమణ మహర్షి సమాధి మందిరం కూడా ఇలాగే వారి సంకల్పానుసారంగా తయారైనట్లు తెలుస్తున్నది. వారి అవతార సమాప్తి సమయంలో ఒక ఇంజినీరు కలలోనికి వెళ్ళి 'ఇలా, నా మందిరం నిర్మించాలని తానే పథకం (ప్లాను) గీసి చూపించారట. అదే చివరకు అమోదయోగ్యమైనది.

ఇదే నేడు రమణ మహర్షి మందిరంగా భక్తులకందరకూ పుణ్యదేవాలయమైనది. అవతార కార్యక్రమాలిలాగే వుంటాయి.

## అద్భుత స్వప్నం

సచ్చరిత్ర క్రోడీకరించిన స్వప్నాలలో సమాధి మందిర సంబంధమైనదొకటి. ఇదొకటి గొప్ప కల.

1916లో మద్రాసు నుండి కాశీ పోతున్న రామదాసు పంథాకు సంబంధించిన భజన సమాజం కథ సచ్చరిత్ర 29 అధ్యాయంలో వచ్చినది. వారిలో యజమానికి బాబాపై భక్తిలేదు. భార్యమాత్రం భక్తురాలు. కనుకనే ఆమెకు బాబా మసీదులో రామునిగా సాక్షాత్కరించాడట. భర్త ఇది నమ్మలేదు. ఒకరోజు రాత్రి బాబా అతనికొక స్వప్నం కల్పించాడు. అందులో అతడు పోలీసులకు బందీగానున్నట్లు, బాబా వచ్చి బందీ నుండి విడిపించినట్లు. బాబా నతడు ప్రార్థిస్తాడు. 'నాకీ కర్మను దొలిగించమని. బాబా సరే'నన్నాడు. అతడు ఖైదు నుండి బయటపడ్డాడు కదా. బంధించిన పోలీసులు చచ్చి పడివున్నారు. బాబా అతనితో అన్నాడట 'ఇప్పుడు నిన్ను అధికారులు వచ్చి బంధిస్తారు' అని. వీరు బాబాను ప్రార్థించారు మరలా. బాబా అనుగ్రహంతో తిరిగి అతనికి బంధ విముక్తి కలిగింది. అప్పుడు బాబా అన్నాడట 'మసీదులో నీవు పెట్టిన నమస్కారాలకు ఇప్పుడు పెట్టిన వాటికి బేధమున్నదా'? అని వాడన్నాడు 'అప్పుడు నీవద్ద డబ్బులు గుంజటానికని పెట్టారు. ఇప్పుడు నీవు దైవమని భక్తితో నమస్కరించాను' అని.





దీనివల్ల మేల్కొన్నపుడు కలుగని భక్తి స్వప్నంలో కల్గించారు. బాబా అని స్పష్టపడుతున్నది కదా. మరలా బాబా 'నీకేమి కావాలింకా' అని అడగటం, వారు తన గురువులైన రామదాసు (శివాజీ గురువు)గా చూడాలనుకుంటున్నాననటం. బాబా వానికి గురువును చూపించటం జరిగింది.

ఇక్కడ స్వప్నంలో 'గురుదర్శనం' కల్పించటానికే బాబా వానిమనస్సులోని కోరికను బయట పెట్టించారు. తరువాత వాడు అనవసరమైన ప్రశ్న వేస్తాడు? మీరు ముసలి వారుగా కన్పిస్తున్నారు గదా? మీ వయస్సెంత? మీకు తెలుసా? అని. ఈ ప్రశ్న దేనికోసం వేసినట్లు? – అతనికి దానివల్ల ప్రయోజనమేమిటి? కాబట్టి ఇది వానికి సంబంధించినది కాదని స్పష్టం. మరి బాబా ఏమి చెప్పాలనుకొని ఆ మాటనడిగించారు.

తనకు వయస్సులేదు. తాను కాలాతీత దైవమని చెప్పటానికి, నేటికీ మన స్వప్నాల్లోనూ, మేల్కొన్నపుడూ – బాబా వృద్ధుడుగానే కన్పించటం తెలిసిన విషయమే. భక్తుల అనుభవాల్లోనిదే. ఈ వృద్ధత్వమంటే రెండర్థాలు. 1. తండ్రిగా కన్పించటం 2. గురువుగా వృద్ధుడంటే ఆధ్యాత్మ విద్యా బోధకుడైన గురువనే తాత్పర్యం కనక. ఈ స్వప్న విషయం విస్తారంగా నా 'లీలా సమాధి'లో చెప్పబడినది. కనుక ఇక్కడ సారాంశము మాత్రమే చెప్పబడినది (జిజ్ఞాస కలవారక్కడ చూచుకోవచ్చు.).

## కఠోపనిషత్తు

ఈ స్వప్నాలానాడు వారికి వచ్చినవి. నేటికీ జరుగుతున్న విషయమే. మనకూ స్వప్నాల్లో బాబా రావటం జరుగుతూనే వున్నది.

14–2–1989న మా కుటుంబం శిరిడీ పోతున్నది. రైల్లో – ఆ నాటి రాత్రి కలలో బాబా మా గురువు కీ॥శే॥ కుండలినీ యోగులు ఆరుమళ్ళ రామకోటయ్యగారి రూపంలో వచ్చారు. ఆ స్వప్న వృత్తాంతమిది.

నేను పోతున్నది, శిరిడీ, కానీ మా ఊరు 'ఈమని' వెళ్ళి గురువులను దర్శించటానికి వారింటికి వెళ్లాను. వారు బైటకు వచ్చి 'ఎందుకురా అనవసరంగా వచ్చావు' అన్నారు. 'అదేమండీ అలా అన్నారు మార్గమేదైనా బోధిస్తారేమోనని వచ్చాన'ని నేనన్నాను. విని వారన్నారు 'మార్గమేదో అప్పుడే చెప్పాను కదా అమ్మను పూజించుకోమ'ని అరిచారు. 'నీవు వస్తే నేను మీ కోసం రావాలి కదా బయటకు, అవసరమైతే నేనే నీ దగ్గరకు వస్తాలే పొమ్మన్నారు' ఇదో కల. బాబా మా గురు రూపంలో రావటం, మాట తీరు తెలుస్తూనే వుంది. వారు లుంగీ, పూర్వకాలం కుట్టించుకున్న బనియను, పైన కండువా వారి రూపమిది. అదే రూపంలో కన్పించటం వల్ల ఎవరి గురువును వారారాధించుకోవాలని చెప్పటమే కదా. వారెప్పుడూ 'ఏమండీ' అనేవారే తప్ప ఏరా అని నన్ననలేదు. కనుక బాబాయేనని గుర్తించాను.

తర్వాత శిరిడీ నుండి వస్తున్నాం. రాత్రి కలలో మా గురువుగారు రావి చెట్టు క్రిందనున్నారు. గురుపత్ని ఏదో ఆటతో క్రీడిస్తున్నది. పొడవైన త్రిభుజం అంచు మీద పొట్టి త్రిభుజం పెట్టి. అవి నిలవటం లేదు. పడిపోతున్నాయి. ఆమె మరలా పెడుతున్నది. అది చూచి గురువుగారామెతో 'ఏమి అనవసరమైన పని?' అని నన్ను పిలిచి' నీకు మృత్యుతత్త్వబోధ చేస్తాను రమ్మన్నారు. సిద్ధపడుతుండగానే తెల్లని గుడ్డను కప్పిన శవాన్ని మోసుకొని పోతున్నారెవరో. ఇంతలో గాడాంధకారం క్రమ్మింది. గురువులూ గురువుపత్ని కన్పించలేదు. శవం లేదు. అంతా ఒకటే చీకటి. మెలకువ వచ్చింది.

దీని వివరణ విస్తారంగా 'శ్రీ లీలా సమాధి'లో వుంది. ఇక్కడ సారాంశం మాత్రమే చెప్పబడుతున్నది. 'ఆ చీకటి ప్రళయ రాత్రి. సృష్టి అంతా నిద్రపోతున్న దశ. శవం మృత్యువు అదీ దేవతే గనుక తెల్లని గుడ్డ కప్పబడ్డది. అమ్మ క్రీడిస్తున్న త్రిభుజాలు శ్రీ చక్రవిద్య. అది త్రిభుజ చతురస్ర వృత్తాలతో చిత్రించబడుతుంది. ఆ విద్య నాకు చాలా యిష్టం. ఒకసారి మా గురువుగారినడిగాను - నాకా విద్య బోధించమని. నాకా విద్యతో





సంబంధం లేదు. తెలిసిన వారెవరూ నా జీవితంలో నాకు తటస్థ పడలేదు. అయిన మీకా విద్యతో పనేమిటి ? మీరు శ్రీ రాజరాజేశ్వరి అమ్మను పూజిస్తున్నారు కదా. అది చాలు' అన్నారు. ఇదే కలలో చెప్పినది. మృత్యు విద్యను బోధిస్తాననటం కఠోపనిషత్తులో యముడు నచికేతునకు చెప్పిన ఆత్మవిద్య. ఈ గ్రంథమంటే నాకు చాలా ఇష్టం. ఇలా నాకిష్టమైన గ్రంథాలు - లేదా విద్యలు సూచించినా వాటిలో కఠోపనిషద్విద్య'నే ఉపాసించమని ఆదేశించటం స్పష్టం.

ఈ రెండు విద్యలు శ్రీ చక్రోపాసన. దీనికి సంబంధించిన గ్రంథం యోగినీ హృదయం, కఠోపనిషత్తులను ఆనాడు నేను వ్యాఖ్యానించలేదు. ప్రస్తుత మారెండు నాచేత 'అమ్మ' వ్రాయించుకొన్నది. ఆనాటి (1989) స్వప్నం 2008 నాటికి ఫలించింది గ్రంథ రచనా రూపంలో,

1991 ఫిబ్రవరి 24 న తేది రాత్రి మేము తిరుపతి వెళ్ళాం. ఆ తెల్లవారి నా శిష్యుడు బుద్ధన్న (కర్నూలు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు) తిరుపతిలో నన్ను కలసి చెప్పాడు.

'రాత్రి రైల్లో వస్తున్నాను. కలలో మీరు కన్పించి 'ఆంజనేయస్వామి సేవాభక్తికి నిదర్శనం గుర్తుంచుకొ'మ్మని చెప్పారు. ఇది వరకూ మీరు చాలాసార్లు స్వప్నంలో వచ్చారు" అని. అతనికి నేనంటే చాలా భక్తి. శ్రద్ధలున్నాయి. నేనతని దైవమన్నా తప్పులేదు. ఒకటి రెండు సార్లు నన్ను, నా అర్థాంగినీ శిరిడీ' తన ఖర్చులతో తీసుకొని వెళ్ళినవాడు. బహుశా ఇందుకే 'ఆంజనేయ స్వామి'ని సేవాభక్తికి ఆదర్శంగా చెప్పాడేమో బాబా.

ఏమైనా బాబా మన గురువు లెవరో వారి రూపంలోనే వస్తున్నాడు. 'గురు ఘోలన్ స్వామి'గా ములేశాస్త్రి కథలో లాగా, అందరకూ తానే తగుదునమ్మా అని తన రూపంలోనే రావటం లేదు. మన స్వగురు రూపంలో వస్తున్నాడు. చందోర్కరుకు గీతాశ్లోక వ్యాఖ్యానం దగ్గర ఈ విషయం మరలా ప్రస్తావితమౌతుంది.

# బాబా పటం స్వయంగా బాబాయే

1917 వ సం.హోలీ పండుగ నాడు-ముందు రోజు రాత్రి బాబా సన్యాసి వలె కాషాయాంబరాలలో హేమాద్రిపంతు కలలో సాక్షాత్కరించాడు. కన్పించి రేపు నీ యింటికి భోజనానికి వస్తానన్నాడు.

తెల్లవారి భార్యతో ఈ సంగతి చెప్పి బాబా స్వయంగా రాకపోయినా ఎవరినైనా తన ప్రతినిధిగా పంపవచ్చునన్నాడు. 12 గం.లకు బంధుశు లందరితో హేమాద్పంతు భోజనానికి కూర్చున్నాడు. నడుమ శ్రీ కృష్ణుని పటం పెట్టాడు. బాబా సాధారణంగా 12గం.లకు భోజనం చేస్తాడు గనుక, ఆ సమయానికే భోజనారంభం కాగా బాబా రాలేదని తలుపులు మూసాడు. ఇంతలో తలుపుపై చప్పుడు విని తీస్తే. ఇద్దరు సాయిబు లున్నారు. వారు హేమద్రిపంతుతో అన్నారు తమరు భోజనం నుండి లేచి వచ్చినట్లున్నారు ఇది మీకిమ్మని బాబా స్ఫురింపజేస్తే మికిద్దామని వచ్చా'మని కాగితంలో చుట్టిన వస్తువునిచ్చారు. ఈ వస్తువు తమ దగ్గరకెలా వచ్చిందో తర్వాత చెబుతాము - భోజన సమయంలో వచ్చినందుకు మన్నించమని వస్తువిచ్చి వెళ్ళారు. హేమద్పంతులోనికి వచ్చి కాగితం తీస్తే ఏముంది? బాబా చిత్రం(పటం). చిత్రంగా లేదా? సంఘటన. దభోళ్కరు (హేమద్రిపంతు) పీటవేసి, ఇదివరకే వేసిన విస్తరి ముందు ఫోటోను పెట్టి ఆరగింపు చేసి - భోజనం చేసారంతా.

ఇతడే బాబా సచ్చరిత్ర వ్రాసింది. బాబా భక్తునింటికి ఫోటో రూపంలో వచ్చాడు. దేవ్ గారింట్లో వ్రతానికి ముగ్గురు మానవుల రూపంలో వచ్చిన వాడు ఇక్కడ చిత్ర రూపంలో ఎందుకు వచ్చినట్లు? ఇంకొక సంవత్సరములో బాబా మహాసమాధి చెందబోతున్నాడు. భవిష్యత్తులో అతడారాధించుకోవటానికి స్వయంగా చిత్రరూపంలో దయచేసాడన్నమాట. అంటే బాబా తన తర్వాత రాబోయే కాలంలో మన బోటి వారిని అనుగ్రహించటానికి తనకూ చిత్రానికి భేదం లేదు. తన ఫోటోను,





ప్రతిమనారాధిస్తే స్వయంగా తనను పూజించినట్లేనని చెప్పటానికి కాదా?

ఇందుకే బాబా తన చరిత్ర వ్రాసిన వానిద్వారా తన కథను లోకంలోకి, దివ్యగంగను భగీరథుని ద్వారా శివుడు లోకానికను గ్రహించినట్లు, అనుగ్రహించటమే కాక తన ఫోటో వారింటికి పంపి - వారిద్వారా - తనకూ ఫోటోకు భేదంలేదు. కనుక నేను సశరీరంగా లేనన్న బాధ మీకు వద్దు. భయంలేదు. నేను నా చిత్రరూపం ద్వారా సదా మీకు రక్షగా వుంటానని చెప్పటమే దాని కర్థం.

ఇందుకే బాబా ఫోటోలో అంత ఆకర్షణ. ఒకసారి ఈ గ్రంధకర్త శిరిడీ పోయి వచ్చాడు. అనంతపురం విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్న రోజులవి. వచ్చిన వారం రోజుల్లో తాను బాబా ఫోటోలు చిన్న, చిన్న కార్డు సైజులో చాలా మందికి పంచాడు. గనుక ప్రతి ఉపాధ్యాయుని జేబులో విద్యార్థి జేబులో అవే ఫోటోలు పెట్టుకోవటం ప్రత్యక్ష సాక్ష్యం. మరొక ఆచార్యుడనే వాడు - 'మీరు శిరిడి వెళ్ళి బాబాను మన విశ్వ విద్యాలయానికి తీసుకొని వచ్చారని ఇవ్వాళ బాబా పటంలేని బస్సుకాని, సైకిలుకాని, అంగడి కాని, కూరలబండి కాని, రైలు పెట్టె కానీ, స్టేషన్ కానీ, ధ్యానమంత్రం. బస్సుస్టాండు కానీ, టాక్సీకానీ మనకు కన్పించవు. ఇంత వ్యాప్తికి కారణం బాబా చిత్రంతో తానుండటమే. బాబా మంత్రోపదేశం చేయలేదు. ఫోటోయే బాబా ఒక భక్తునితో మసీదులో చెప్పాడు 'ఆత్మధ్యానం చేయి లేదా మీరు ఏ రూపాన్ని నిత్యం చూస్తున్నారో ఆ రూపాన్నే ధ్యానించండి' అని. భక్తులకు చెప్పినట్లుగానే బాబా ఫోటో అలా లోకంలోకి వ్యాపించింది. పురాణకాలంలో అవతారాలున్నపుడు ఛాయ చిత్ర విధానం లేదు. కానీ మన అదృష్టవశాత్తు పరమహంస కాలానికి విద్య వచ్చిన కారణంగా వారి రూపాలే మనకు ధ్యాన మంత్రాలైనవి. మంత్రం శబ్దరూపంలో ప్రత్యక్షంగా వుంది. పరమహంస కూడా అన్నాడు.

"మీరు చూస్తున్న దీనిని (తన శరీరాన్ని చూపించి) గుర్తుంచుకొని లోక వ్యవహారం చేసుకోండి" అని.

కనుక బాబా తన చిత్రం ద్వారా నేటికి – ఏనాటికీ లోకానికి సన్నిహితంగానే వున్నాడు. లేకపోతే అంత కథ దేనికి ? అంటే ఈ ఫోటో కథనా యిద్దరు సాహెబులు 9 ఏళ్ళ తర్వాత చెప్పారు. అందులో ఒకరు ఫకీరు. ఫోటోలతో పాటు బాబా ఫోటోను గదిలో వ్రేలాడదీసాడు. అతని గురువు ప్రతిమార్చన మహమ్మదీయ మతంలో లేనందున ఫోటోల వల్లనే యజమానికి రోగం వచ్చినదని – వాటిని సముద్రంలో పారవేయమన్నాడు. అతడలాగే చేసి తన యింటిని కొన్నాళ్ళు మూసి వుంచాడట. తర్వాత కొన్నాళ్ళకు ఇంటి తలుపు తీసి చూస్తే – బాబా ఫోటో ఒక్కటే గోడకలాగే వుందట. మరి మిగిలిన ఫోటోలతో పాటు దీనిని పారవేయలేదా? పారవేస్తే మరలా వచ్చిందా? అన్న జిజ్ఞాసలో పడ్డాడతడు. చివరకు దీనిని దభోళ్కరు కివ్వాలని స్ఫురించింది. అతడలాగే చేసాడు. ఇంత కథ నడిపించటందేనికి? ఇతర చిత్రాలు సముద్రంలో పడవేస్తే బాబా చిత్రం మాత్రం ఎలావుండిపోయింది. అంటే దానికి – బాబాకు భేదం లేదు కనుక అది పోవటం లేదు. 'మా అమ్మ నన్ను కన్నానని మురిసి పోయింది. ఆమె నన్నెపుడు కన్నదని బాబా ఒకసారి అన్నట్లు బాబా చరిత్ర చెబుతున్నది.

'కనుక పోవట'మంటే పై కథ. బాబా రావటం లేదు. పోవటం లేదు. ఆత్మ పదార్థానికి రావటమన్న 'జన్మ', పోవటమన్న 'మృత్యువు' లేదు. అది సనాతనం. అజరామరం అన్న వేద సత్యాన్ని స్థాపిస్తున్నదీ కథ.

ఒకరోజున బొంబాయిలో పంజాబీ బ్రాహ్మణుడు రామలాల్ – కలలో బాబా ఒక 'మహంతు'లాగా కన్పించి శిరిడీకి రమ్మన్నాడట. ఆయన ఎవరో తెలియని కన్పించిన మహంతుకు ఫోటోలో వున్న వ్యక్తికి పోలికలున్నందున అది సాయి బాబాయని తెలుసుకొని 'శిరిడి' వెళ్ళాడు.

అంటే పటమే నీకు 'ధ్యాన మంత్రమై' అసలు బాబాను దర్శింపచేస్తుంది. దీనికది సాధనం. యోగ సాధనకది ఆధారమన్న మాట.





# కాకా సాహెబ్ దీక్షిత్

**(1864– 1926)**

బాబాను 1909లో దర్శించారు. ఈ సంఘటనలోనూ బాబా తన విచిత్ర మార్గాన్ని, చమత్కారాన్ని ప్రదర్శించారు.

దీక్షిత్ లండన్లో చదివే రోజుల్లో రైలెక్కబోయి క్రిందపడి కాలు విరగొట్టుకొని కుంటివాడైనాడు. బొంబాయిలో ఒకసారి తన మిత్రుడు నానా చందోర్కరుతో ఈ విషయం ప్రస్తావించి "ఎన్నో వైద్యాలు చేయించాను. కానీ కాలు కుంటితనం పోలేద"న్నాడు. విన్న స్నేహితుడు బాబాను దర్శించమని చెప్పాడు. ఆ దర్శించిన విధానం చిత్రంగా ఉంది.

దీక్షిత్ అసెంబ్లీ ఎన్నికల నిమిత్తంగా అహమ్మదునగర్ వెళ్ళి కాకా సాహెబ్ మిరీకర్ ఇంట్లో విడిది చేసారు. అతని కుమారుడు బాబా సాహెబ్ మిరీకర్ కోపర్గాం తహసీల్దారు. గుర్రాల ప్రదర్శన చూడటానికని అహమ్మదునగరు వచ్చాడు. ఎన్నికలైపో గానే దీక్షిత్ శిరిడీ పోవాలని నిశ్చయించుకోగా మిరీకరు తండ్రి కొడుకులు ఎవరి ద్వారా దీక్షితను శిరిడీ పంపాలా? అని ఆలోచిస్తున్నారు.

ఇంతలో శ్యామా తన మామగారు, తన భార్య అనారోగ్య కారణంగ కూతురు అల్లుళ్ళను అహమ్మదునగర్ రావలసిందిగా తంతి వార్త పంపిస్తే వారు వచ్చారు. అక్కడ ఇద్దరు మిత్రులు కలసి 'నీవు మిరీకరు ఇంటికి పోయి దీక్షితు శిరిడీ తీసుకొని పోవాలని. సరే'నని శ్యామా అలాగే చేశాడు. ఆ రాత్రి 10 గం.లకు కోపర్గాం రైల్లో పోవటానికి ఏర్పాట్లు జరిగాయి. ఇంతలో మరొకరు తన దగ్గరున్న బాబా ఫోటో పైనున్న తెరను తొలగించి దీక్షిత్‌కు చూపించాడు. బాబా దర్శనానికి శిరిడీ పోవాలనుకున్న భక్తునికి బాబా స్వయముగా వచ్చి దర్శనమిచ్చాడు. ఆ పటం మేఘునిది. దాని అద్దం పగిలిపోతే వేయించమని బాలాసాహెబ్ మిరీకరుకు పంపించాడు. అది అద్దం వేయించి శ్యామాతో శిరిడీ పంపిస్తాడు మిరీకరు.

10 గం.లకు స్టేషన్‌కు పోగా రైల్లో జాగా లేదు. కానీ ఆ బండి గార్డు దీక్షిత్ చేసి కోపర్గాం చేరి గోదావరిలో స్నానం చేసి శిరిడీ పోయి మసీదులో నున్న శాశ్వతమైన స్నేహితుడైనందున మొదటి తరగతిలో కూర్చుండబెట్టాడు. వారు హాయిగా ప్రయాణం – ఆత్మ స్వరూపాన్ని దర్శించాలి. దీక్షిత్ బాబా దర్శనంతో పులకరించిపోయాడు. బాబా అన్నాడట. 'అతనితో నీ కోసమే శ్యామాను పంపించినదీ – నీ బరువు బాధ్యతలు నేను విమానంలో తీసుకొనిపోతానని.

1926 జూలై నెలలో దభోళ్కరుతో రైలులో ప్రయాణిస్తూ దీక్షిత్ – బాబాను స్మరిస్తూ – వారిని గురించి ప్రసంగిస్తూ అనాయాసంగా ప్రాణాలను వదిలి పెడతాడు. బాబా భక్తుల్లో ఉన్నత శ్రేణికి చెందినవాడు దీక్షిత్. తానొక ఇల్లు కట్టుకొని శిరిడీలో నివసిస్తూ, ఇతరులకు ఆశ్రయం కల్పించిన మహా భక్తుడు.

ఈ ఘట్టంలో ఆలోచించదగ్గవి 2, 3 విషయాలున్నవి.

1. భక్తుని కోసం చిత్రరూపంలో దైవం రావటం 2. చిత్ర దర్శనానంతరం బాబా స్వయంగా దర్శనమివ్వటం 3. ప్రయాణంలోనూ సౌకర్యం కల్పించటం, భక్తుని బాధ్యతలన్నీ తానే తీసుకోవటం.

1. విషయం పరమహంస వివేకానంద కోసం ఎదురుచూడటం వంటిది అలాగే రమణ మహర్షి కూడా స్వప్నాల ద్వారా – పుస్తకాల ద్వారా – భక్తులను ఆకర్షించటం. ప్రయాణ సౌకర్య విషయంగా మన అనుభవాలు వున్నాయి. శిరిడి పోయే సమయంలో రూ.కొక జంట తటస్థపడి చెప్పింది. అందులో అబ్బాయి చెప్పినది. టికెట్టు పోయింది. గేటు దగ్గర టికెట్లడుగుతున్నాడధికారి. ఎలారా బాబా అనుకొని బాబాను స్మరించారు. ఇంతలో ఎవరో ఆ అధికారిని పిలిస్తే అతడవతలకు వెళ్ళాడు. నేను గేటు నుండి జారు కొన్నాను.' అని. టికెట్లు ఇప్పించటం ఇవ్వటం. దారిలో డబ్బులు చాలకపోతే డబ్బు నివ్వటమో దొరికేటట్లు చేయటమో, ఎలాగో





ఒకలాగున మనం క్షేమంగా ఇంటికి చేరుకొనే వరకూ బాధ్యత ఆ తండ్రిదే. ఈ మాటలు నాతో చాలామంది చెప్పారు.

# గయలో చిత్రం

కాకా సాహెబ్ దీక్షిత్ బాబాను 1909లో దర్శించిన తర్వాత ఎప్పుడో తన కుమారుని ఉపనయనం నాగపూరులో జరిపించాలనుకున్నాడు. అలాగే నానా చందోర్కరు తన కుమారుని వివాహం గ్వాలియరులో జరిపించాలనుకొన్నాడు. ఇద్దరూ బాబా కత్యంత ప్రీతి పాత్రులైన భక్తులు కావటం వల్ల బాబాను సమీపించి తమ యింటి శుభకార్యాలకు రావలసినదని ప్రార్థించారు. బాబా 'మంచిది, నా ప్రతినిధిగా శ్యామాను తీసుకొని పొండి. నేను వారి కాశీ, ప్రయాగ క్షేత్ర దర్శనానంతరం గయలో కలుసు కుంటాను' అన్నాడట.

శ్యామాతో పాటు తాత్యాకోతే కూడా ప్రయాణమై ముందు నాగపూరు వెళ్ళారు. అక్కడ దీక్షిత్ బాబా ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించి కానుకగా 200 రూపాయలు ఇచ్చాడు. ఆ రోజుల్లో బహుశా ఈ కథ ఏ 1912 నాటిదో. అప్పుడు 1 రూ.కు నవరసు బంగారు వచ్చేది. కనుక 200 అంటే చాలా పెద్ద మొత్తంగా మనం గుర్తించాలి. తర్వాత వారు గ్వాలియరు వెళ్ళారు. అక్కడ చందోర్కరు అతని మామ జఠారు వందేసి రూపాయలు కానుకగా యిచ్చారు. తర్వాత వీరు కాశీకి పోయి జఠారు మందిరంలో 2 నెలలున్నారు. పిదప అయోధ్యలో జఠారు మేనేజరు ఏర్పాటు చేసిన బసలో 2 రోజులుండి ప్రయాగ వెళ్ళి – అక్కడ నుండి గయ వెళ్ళి అక్కడ పండా యింట్లో బస చేసారు. అతడు ధనవంతుడైనందున వారికొక పెద్ద ఇంట్లో బస ఏర్పాటు చేసాడు. దీనికంటే శ్యామాకు కోత్యేకు ఆశ్చర్యకరమైన, ప్రీతి కల్గించిన అంశమేమంటే ఆ యింట్లో బాబా పటం చాలా పెద్దది. గోడపైన దర్శనగోచరం కావటం శ్యామాకు కన్నీళ్ళు వెక్కిళ్ళు, గగుర్పాటు ఒక్కసారి కలిగాయి.

ఆ పండాతో శ్యామా, బాబా పటమెక్కడిదని ప్రశ్నిస్తే అతడన్నాడు 'నా ప్రతినిధులు మన్మాడ్, పుణతాంబా వంటి శిరిడీ ప్రాంతాల్లో చాలామంది వున్నారు. వారివల్ల శిరిడిలో బాబా సంగతి విని, ఒకప్పుడు వారిని దర్శించాను. నాకు బాబా పటం కావాలన్నాను. శ్యామా యింట్లోదిప్పించాడు బాబా' అని. శ్యామాకు బాబా చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "నేను మీకంటే ముందుగానే గయకు వెళ్ళి మిమ్మల్ని కలుస్తాను' మాటలను నెమరు వేసుకొని తానే ఆ 'శ్యామా'నన్నాడు. పండా చాలా సంతోషించి వారిని ఏన్గుపైనూరేగించి చాలా సత్కరించాడు.

ఈ కథ సచ్చరిత్రకారుడు వివరంగా వ్రాసాడు.

ఇందులో 2, 3 అంశాలు భక్తితో భావించవలసిన వున్నాయి. 1. బాబా తానూ పటమూ వకటేనని స్వయంగా చెప్పటం. తానే ముందుగా గయ వెళ్ళి అక్కడ వారిని కలుసుకుంటాను అన్న మాటలో తన చిత్రరూపమూ – తన యథార్థ రూపమూ వకటేనని స్పష్టం చేయటం. 2. వారి ప్రయాణాన్ని సౌకర్యంగా, నిర్విఘ్నంగా ఆనందంగా చేయించటం, సకల మర్యాదలతో అందరూ ఆదరించిన వైనం చూచాం కదా? తాను చెప్పిన మాటలు సత్యములు – 'నేను మసీదులో వుండి అబద్ధం చెప్పన'న్న మాటలు మననం చేసుకోదగ్గవి. 3. శ్యామా బాబా ప్రతినిధి కనుకనే శ్యామా ద్వారా చాలా విశేషాలు జరిపించాడు బాబా. పాఖడే కథలో శ్యామా పాత్ర చూచాం కదా !

# నవయుగ తుకారాం

బాబా బువా సుతార్ గొప్ప సంకీర్తనకారుడు. నిత్యం భగవద్భజన చేస్తూ కాలక్షేపం చేసేవాడు. అతడొకసారి బాబా దర్శనం చేస్తే దైవమన్నదట "ఇతనిని 4 సం.ల నుండి ఎరుగుదు"నని. సుతార్ ఆశ్చర్యపోయి ఇదేమిటి నేడే కదా బాబా దర్శనం చేసింది. మరి బాబా ఇలా అంటారేమిటి? అని.





చాలాసేపు తర్వాత ఆలోచిస్తే బొంబాయిలో 4 సం.ల క్రితం బాబా చిత్రపటానికి నమస్కరించిన సంగతి గుర్తుకు వచ్చింది. ఓహో బాబా చిత్రరూపం చూసి, బాబాను స్వయంగా దర్శించటమేనన్న మాట'–అని సంతోషంతో పొంగిపోయాడు సుతార్.

సర్వ వ్యాప్తమైన మహా జ్యోతి కనుక సర్వజ్ఞత పరమాత్మ లక్షణం కదా.

# కులకర్ణి కథ

అన్న అప్పా సాహెబు కులకర్ణి 1917లో రాణాకు బదిలీ కాగా అక్కడ భాటే అన్న భక్తుడతనికి బాబా చిత్రపటాన్నిచ్చాడు.

ఈ భాటే వృత్తాంతము విచిత్రమే. ఈయన కోపర్గాం తహసీల్దారు (1904–1909) నాస్తికుడు. బాబాను పిచ్చి వాడుగా జమకట్టి ఆక్షేపిస్తూండేవాడు. స్నేహితులు 'ఇది పద్ధతి కాదు. ఒకసారి శిరిడీ పోయి చూచిరా. తర్వాత తిడుదువుకానీ!' అన్నారట. సరేనని వెళ్ళాడు. ఆ పరంజ్యోతి వీనిని చూడగానే ఒక కాషాయ వస్త్రంపైన కప్పేసరికి భక్తుడైపోయినాడు. దైవానికి అసాధ్యమేముంటుంది కనుక. ఆయనిక ఉ ద్యోగం మానివేసి శిరిడిలోనే స్థిరపడ్డాడు. ఆయన కులకర్ణికి బాబా ఫోటో ఇచ్చాడు. బాబా 'సచ్చరిత్ర' వ్రాసిన దభోళ్కరు శిరిడీ వెళ్ళి బాబాను దర్శించి సాఠేవాడాకు వచ్చి భాటేతోనే గురువు ఆవశ్యకతను వాదించాడు. భాటే గురుపక్షంగా వాదించాడు. దభోళ్కరు 'మన కర్మానుసారంగా మనం ప్రవర్తించాలిగాని సోమరిగా కూర్చొని అంతా గురువే చేస్తాడనుకోరాదని వాదించాడు. తర్వాత బాబా దగ్గరకు పోగానే బాబా కాకా సాహెబును పిలిచి వాడాలో ఆవాదమేమిటని అడిగాడట. వాడా మసీదుకు దూరంగా వున్నది కదా బాబా ఎలా విన్నాడు ? ఆయన సర్వ వ్యాప్తమైన పరమాత్మ అన్న అనుభవం హేమాడ్పంతుకు కలిగినది.

కనుక ఈ భాటే భక్తుడైనాక గురువేదైనా చేయగలడనటానికి స్వానుభవమే సాక్ష్యంగా అలా వాదించాడన్నమాట. నాస్తికుని పరమభక్తునిగా మార్చగల 'పరుసవేది' గురువు.

ఈ కులకర్ణి బాబా పటాన్ని పూజిస్తున్నాడు. ఒకసారి భివండికి అధికార కార్యక్రమ నిమిత్తం పోగా తన ఇంటి కొక ఫకీరు వచ్చి అతని భార్యను భిక్షమడిగాడు సరిగ్గా 12 గం.కు. వారిని చూచి 'తమరు శిరిడి బాబానా' అని అడిగారట భార్యా, బిడ్డలు. కాదు నేను వారి సేవకుడనన్నాడు. ఆయన కొకరూపాయి నిచ్చింది ఆమె. తర్వాత కులకర్ణి యింటికి వచ్చి, ఆ విషయం విని ఆ ఫకీరును వెదకి వేసారి ఇంటికి వచ్చాడు. తాను గనుక యింట్లో వుంటే 10 రూ.లు ఇచ్చేవాడినని ఆయన మాట.

ఆ సాయంకాలం స్నేహితునితో కలసి వ్యాహ్యాళి వెళ్తుంటే ఆ ఫకీరు ఎదురుగా వచ్చి దక్షిణ అడిగితే ఈయన 1 రూపాయినిస్తే – ఇంకా కావాలని అడగటం–ఈయన 2, 3 రూపాయలు ఇవ్వటం ఇంకా ఆయన అడగటం చివరకు ఆ ఫకీరును తీసుకొని ఇంటికి పోయి 9 రూపాయలు ఇచ్చినా, ఫకీరు ఇంకా అడిగితే నా దగ్గర 10 రూపాయల నోటు ఇవ్వగా ఫకీరు 9 రూపాయలు తిరిగి యిచ్చి, 10 రూపాయలు తీసుకొని వెళ్ళాడు. కులకర్ణి యిస్తానన్న 10 రూ.లు గనుక.

బాబా ఫోటోను ఆరాధిస్తే ఆ స్వామి ఇలా అనుగ్రహిస్తాడనటానికిదొక దృష్టాంతం.

# బోధివృక్షం

రావిచెట్టు క్రింద బుద్ధునకు జ్ఞానోదయమైనది. గయలో నేటికీ ఆ వృక్షమున్నది. దాని మొలకలే నేడు విశ్వమంతా వ్యాపించి వున్నాయి. తర్వాత కాలంలో అదే! సంకేతమై 'మహాబోధి' అంటే దివ్య జ్ఞానమన్న అర్థంలో స్థిరపడ్డది. ప్రతి గురువూ శ్రీకృష్ణావతారమే. చెట్లలో నేను రావి





చెట్టునన్నాడు. దానికి సంస్కృతనామం 'అశ్వతం' అని. అంటే 'రేపటికి వుండని దని అర్థం. అంటే నీవు దేనిని చూచి సత్యమనుకుంటున్నావో ఆలోకం సంసారం రేపటికి ఉండదు. కాబట్టి రావి, సృష్టికి సంకేతం. కానీ చిత్రమేమంటే ఆ లోకమే రావిచెట్టే – నీకు జ్ఞానబోధ చేసేది. దాని నుండి పైకెక్కి పోగలవు. కాబట్టి రావి ఉండనిదానికి, నిత్యమూ వుండేదానికీ (దైవం) సంకేతమైనది.

బాబా వేప చెట్టు క్రీనీడన ఎన్నేళ్ళు కూర్చున్నాడో తెలియదు కానీ వేప 'నాథ' సంప్రదాయంలో పవిత్ర వృక్షం. దక్షిణామూర్తి. మట్టి క్రీనీడన ఆసీనుడై శిష్యులకు జ్ఞానబోధ చేస్తున్నాడు. నేటి కాలంలో శ్రీ రమణమహర్షి దక్షిణమూర్తి అవతారంగా చెప్పబడుతున్నాడు.

వేపనీడన బాబా ఎందుకున్నట్లు ?

"బాబా! నీ కృప వేప చెట్లమగు మాపై రాలి తికచ్ఛద
భోత్కంఠలు, తాపవృంతములు తూల్చుంగాక చైత్ర ప్రభా
శ్రీభాక్కై మనుపూలతావి దెసలం జిందించుచున్ చేదులో
శోభావంతములై సుధా మధునవాంశుల్ సోకి స్పర్శలై"

ఉగాదికి వేపచెట్లు పూచి తీయని వాసనలు వెదజల్లుతున్నాయి. దాని పూత ఉగాది పచ్చడి. అనేక వ్యాధులకు దివ్యౌషధం. చేదని నిరసిస్తావా? మందని సేవిస్తావా? అంటే లోకం క్షణికానుభవాన్నిస్తూనే ఈశ్వరానుభవానికి మార్గమౌతున్నది. బాబా లోకం 'మిధ్య' అనలేదు. దానిని తన శరీరంగా, దైవ శరీరంగా భావించమన్నాడు. వేపచెట్టు ఓ సూత్రంగా బాబా లోకానికి వెల్లడించాడు. అతడు భవరోగవైద్యుడు. ఈశ్వరునకు వైద్యనాథుడని ఒక పేరు. తమిళ దేశంలో ఆ స్వామి విగ్రహాలు, గుడులు, క్షేత్రాలున్నాయి. ఒకసారి అక్కల్ కోట మహారాజు అవసానదశలో దర్శించిన కేశవ నాయక్ అడిగాడట కురు మూర్తిని 'స్వామి తమ నిర్యాణానంతరం

నేను, నా కొడుకు రామచంద్రుడెవరిని ఆశ్రయించాలని, విన్న ఆ స్వామి తన చెప్పులు వాని మీదకు విసరి వీటిని పూజించుకో. శిరిడిపో. అక్కడ నేనుంటానన్నాడట. స్వామి 1878లో శరీరయాత్ర చాలించారు.

కేశవ నాయక్ శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాడు. బాబా నాయక్‌తో వేపాకు తినరా' అన్నాడు. ఆశ్చర్యం అవి తీయగా వున్నాయి. అక్కల్ కోట స్వామి కూడా అలాగే చేసాడట. దానిద్వారా నేనే ఆ స్వామినని బాబా నిరూపించాడు.

వేపాకు తియ్యగావుంది? – అంటే దాని క్రిందనున్న అంటే దాని క్రిందనున్న బాబా మోక్ష ప్రదాత. ఇది తీపి అది చేదు.

ఇందుకే వేపచెట్టు బాబాకు సంకేతం. బాబా బోధ ప్రత్యక్షానుభవం ద్వారా చేసేది తప్ప పరోక్ష జ్ఞాన బోధకాదు. అంటే పుస్తకాలలోని విషయం చెప్పటం కాదు. ఉదాహరణకు – ఒకసారి ముకుంద లేలే శాస్త్రి బాబాను దర్శించాడు. అతడు బ్రాహ్మణుడు కావటం వల్ల బాబాను సాయిబనుకొన్నాడు. ఆనాటి పద్ధతి అది. తాను పండితుడు. సాయిబుకు సంస్కృతం ఏమివచ్చు? – ఇదీ ఆలోచన. దీనితో బాబాను దర్శిస్తే ఆ మహాను భావుడు గీతలో ఒకశ్లోకం నారాయణోపనిషత్తును పారాయణం చేసుకొమ్మన్నాడట. బాబా చదివిన శ్లోకం. గీత 9వ అధ్యాయంలో చివరి 5 శ్లోకాల్లో మొదటిది.

"అపిచేత్ సుదురాచారో భజతేమామనన్యభాక్

సాధురేవ స మంతన్యః సమ్యక్ వ్యవసితో హి సః" –

దీనితర్వాత 4 శ్లోకాలుంటే బాబా ఇదే ఎందుకు పఠించినట్లు ? ఈ శ్లోకం భావమేమంటే ఎంతటి అనాచారి అయినా సరే నన్ను భక్తితో సేవిస్తాడో వాడు మహాత్ముడే" అని. తర్వాత శ్లోకాల భావాలివి. వాడు వెంటనే ధర్మాత్ముడౌతున్నాడు. శాంతిని పొందగలడు. నా భక్తుడెప్పుడూ నశించడని తెలుసుకో!





'ప్రజా నీహి నమే భక్తః ప్రణశ్యతి'

నా భక్తుడెవ్వడూ నశించడు. నన్నాశ్రయిస్తే చాలు నీచ జన్ములైనా స్త్రీలైనా, ఎవరైనా సరే పరమపదవి పొందుతారు."

"ఇక పవిత్రులైన వారు – రాజర్షుల సంగతి దేనికి"

'నా యందే మనస్సు నేకాగ్రంగా నిలుపు. నా భక్తుడు కా, నాకోసమే జీవించు. యజ్ఞం (తపస్సు, ధ్యానం) చేయి. నిశ్చయంగా నన్ను చేరగలవు.

ఈ శ్లోకాల వరుసలో మొదటి దానినే చదివి బాబా మిగిలినవి కూడా అన్వయించుకొమ్మన్నాడు. బాబాను దురాచారి అనుకొన్న లేలేశాస్త్రికి చెప్పిన మాటలివి. తనను గూర్చి చెప్పినట్లే. నీవు దురాచారివి తప్ప నేను కాను. సంస్కృతం ముక్కలు నాలుగు చదివి గొప్ప వాడవని గర్విస్తున్నావు. ఇదే దురాచారం. అహంభావన వల్ల నీవు నన్ను దర్శించలేవు. గ్రహించలేవు. బుద్ధిమంతుడవై – నన్ను ఏకాగ్ర బుద్ధితో దర్శించు.

ఇది బాబా బోధ, ఇది పరోక్ష జ్ఞాన బోధ తప్ప అంటే చదివినంత మాత్రాన ఎవరూ దైవాన్ని దర్శించం లేదు. భక్తుడు కావటం లేదు. కనుక చదివి అనుభవంలోకి తెచ్చుకోవాలంటే దైవధ్యానం ముఖ్యం.

ఇందొకసారి నానాచందోర్కరుకు గీతా శ్లోకాన్ని వ్యాఖ్యానించి అతని గర్వాన్ని అణిచాడు బాబా. అతడు పెద్ద ఉద్యోగి కావటమే కాక గీతా, శంకర భాష్యాన్ని చదివానని అతనికి గర్వమే కాక బాబాకు సంస్కృతమేమి వచ్చు? ఇదీ అతని మహా భావన. ఈ దృష్టితో ఒకసారి గీతా శ్లోకాలను మననం చేసుకొంటున్నాడు బాబా. పాదసేవ చేస్తూ – వాడిలోపల గర్వాన్ని దూరం చేయకపోతే వీడికి తానర్థం కాడు కనుక బాబా అన్నాడు "ఏమిటిరా గొణుగుకొంటున్నా'వని, 'ఆ ఏదో గీతా శ్లోకంలే' అన్నాడు. ఆ గర్వం పైకి తేల్చాడు బాబా లేకపోతే అణచటం కుదరదు కదా! పైకి చదవమన్నాడు బాబా!

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేశ్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వ దర్శినః" "

దానికర్థం చెప్పమన్నాడు బాబా. అతడు తాత్పర్యమిలా చెప్పాడు. "సాష్టాంగ నమస్కారంతో, గురువుని ప్రశ్నించటంలో, వారిని సేవించటంతో" జ్ఞానం లభిస్తుంది. అప్పుడు జ్ఞానవేత్తలు దానినుపదేశిస్తారు". విని బాబా 'అలాకాదు ప్రతి దానికీ వివరణం చెప్పు' అన్నాడు. 'ప్రణి పాతమంటే సాష్టాంగ నమస్కారం, పరిప్రశ్న అంటే ప్రశ్నించటం, సేవ అంటే ప్రతిరోజూ మేము మీకు చేసేది" ఇలా చెబితే బాబా కాదని ఇలా చెప్పాడు. 'సాష్టాంగ మంటే సర్వస్య శరణాగతి నీవే తప్ప యింకొక దిక్కు లేదని ఆశ్రయించటం; ప్రశ్నించుట మంటే తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో అడగటం, సేవ అంటే శరీరం, మనసు గురువు కర్పించటం. జ్ఞానం బోధింపబడేది కాదు. అజ్ఞానావరణ తొలగించటమే జ్ఞాన బోధ. ఇవన్నీ జ్ఞానవేత్తలు చేసేవన్నాడు కృష్ణుడు. ఎందుకంటే సర్వకాల, సర్వావస్థల్లోను అలాంటి గురువులుంటారు. వారి నాశ్రయించు– అని సారాంశం.

అజ్ఞానావరణ అంటే – నేను జీవుడను – శరీరమే ఆత్మ. జీవేశ్వరులు వేర్వేరు. ప్రపంచంతో పాటు జీవేశ్వరులందరూ ఈశ్వరుని స్వరూపాలే అని తెలియకపోవటం అజ్ఞానం. వాటిని తొలగించటమే గురువు చేసే పని. న్యాయానికి శిష్యుడంటే కాబోయే గురువే. ఆత్మస్వరూపుడే. దీనిని తెలియపరచటమే అజ్ఞానాన్ని తొలగించటం. అప్పుడున్న ఆత్మజ్యోతి దానంతటదే ప్రకాశిస్తుంది. ఆ జ్యోతిని ఒక అహంకార పొర ఆవరించి వుంటుంది. గురువు దానిని తొలగిస్తాడు. లోకంలో గురువులంతా శ్రీకృష్ణ స్వరూపాలే. (ఈ శ్లోక వివరణ విస్తారంగా 'శ్రీలీలా సమాధి' లో వుంది – చూడవచ్చు)

ఇందులో ప్రధానంశాలు 1. జీవుడు 2. ప్రపంచం 3. ఈశ్వరుడు. ఇతనికి అవి రెండు శరీరాలు. ఇది బాబా బోధ సారాంశం.

బాబా దృష్టాంతం ద్వారా దీనినే బోధించాడు.





# బోధా స్వరూపం

ఎవరో శ్రీరమణమహర్షి నడిగారట. నిష్కామ కర్మ యోగమంటే ఏమిటని వారేమి చెప్పకుండా కొండపైకి వెళ్ళారట. వెళ్తూ దారిలో ఒక చెట్టు కొమ్మనరికి ముళ్ళన్నీ చెక్కుతూ, బుడుపులన్నీ చెక్కివేసారట. తర్వాత ఎండుటాకు లేవో తీసుకొని, దానిని నున్నగా రుద్ది దానిని నిగ నిగ లాడేటట్లు చేసారట. ఈ పనికి చాల సమయం పట్టింది. ఆ కర్రలు తీసుకొని కొండ దిగి వచ్చారట. దారిలో ఒక గొడ్ల కాపరి పిల్లవాడు కనిపించి తన కర్రపోయినదని ఏడుస్తుంటే మహర్షి దానిని ఇచ్చివేసారట.

నిష్కామకర్మ అంటే ఏమిటని అడిగిన వారు – అనుకొన్నారట. దృష్టాంత పూర్వకంగా మహర్షి మనకు నిష్కామకర్మ అంటే ఇదని బోధించారు'అని. సర్వ సామాన్యంగా బాబా బోధనా పద్ధతి ఇదే. కానీ కొంచెం భేదముంది. బాబా యోగ సంకేత భాషలో ప్రసంగిస్తారు. ఆయన భాషవేరు. రమణ మహర్షి భాష తానూ వేరు. అలాగే పరమహంస భాష కూడా సంకేతమే. బాబా బోధాసారాంశం–తానూ సృష్టి అంటే సర్వ జీవరాసులు – మానవులూ చెట్టు, చేమ, పుట్టా అన్నీ తానే. దైవం +సృష్టి+జీవులూ కలిపి భగవంతుడు. అతడే ఇవిగా పరిణామం పొందాడు. ఇవన్నీ ఈశావాస్యం – పరమేశ్వరునకు వస్త్రం లేదా శరీరం లేదా ఇల్లు,

.

పూజ్యశ్రీ నరసింహ స్వామిజీ వ్రాసిన బాబా సందేశాలు – లేదా ఉపదేశాలన్న గ్రంథం (జష్ఘుతీవతీం ఢ ాఖుఎఅఅస్త్రం)లో 116వ అంశం క్రింద బాబా మాటలనిలా ఉదహ రించారు. "సంసారంలో లోకంలో నీవెలా మెలగాలో చెబుతాను విను. ధనాన్ని దాన ధర్మాల క్రింద వినియోగించు. అందరనూ దయతో చూడు. మహాత్ములను గౌరవించు. నీ విధులను సక్రమంగా నిర్వహించు. కానీ, సదా దైవాన్ని స్మరించు. ఈ సంసారమంతా అతడే – అతనిదే – నాది కాదు. అని ఆత్మ విచారణ చేయి."

(భారతంలోనూ ఇదే చెప్పబడినది. మమ – "నాదీ' అనుకొంటే బంధం. 'నమమ' అనుకుంటే ముక్తి అని.)

68) నేను పంచభూత స్వరూపుడను – అన్నిటా, అంతటా ఉన్నాను. ఆకలైన వానికి అన్నం పెడితే నాకు పెట్టినట్లే. ఈ కుక్క లోనూ, దోమలోనూ నేనే ఉన్నాను. (ఇక్కడ బాబా అల్లా మాలిక్ గా మాట్లాడుతున్నాడు. తానేదైవమై మాట్లాడుతున్నాడు. రమణ మహర్షి కూడా ఇతరులను – జంతువులను ఆదరించటమే తననాదరించట మన్నారు.).

23) 'సాయి, సాయి' అని నన్నే స్మరించు. నన్నే శరణను, ఆత్మవిచారణ, శ్రవణ మననాదులనవసరం.

18) నా భక్తుడు నీలో – తనలో – ప్రతి జీవిలో నన్నే చూస్తూ గురుమయంగా దర్శిస్తే నీవు నాలోకి వస్తావు. ఇలా బాబా ప్రతిదానిలో కూడా తననే దర్శించమన్నాడు. భావించమన్నాడు. చూచేదంతా పంచేంద్రియ జ్ఞానమంతటినీ తన్మయంగా ఈశ్వర మయంగా చేయమన్నాడు. భేద భావన, ఇతరులంటే అసహ్యం, భయం పోగొట్టుకొని అందరినీ ఆత్మసమంగా భక్తితో చూడమన్నాడు. 'సర్వమూ గురువుగానే భావించు, చీమను కూడా దైవం కంటే వేరైనదని చూడకు.' ఇది కేవలం తంత్ర విద్యలోని మాట. దేశం, కాలం, పదార్థం ఏయే వస్తువు ఎలా ఎలా కన్పిస్తుందో ఆయా రూపాల్లో ప్రకాశించే జ్ఞాన జ్యోతికి నమస్కారం' అని యోగినీ హృదయతంత్రంలో మాట.

# గురు అన్వేషణ

రాధా బాయ్ దేశ్ ముఖ్ కథలో బాబా ఒక కథ చెప్పాడు. "నలుగురము స్నేహితులున్నాము. మేము గురన్వేషణలో బయలుదేరాము. అదొక కీకారణ్యం. దారి తప్పాము. అప్పుడొక అడవిలో తిరిగే వాడగుపడి – మీరెక్కడికి పోతున్నారని అడిగితే మేమేదో చెప్పాము. అతడన్నాడు 'బాబు





! ఇది పెద్ద అడవి. దారి తెలియదు. పైగా నాతో పాటు వచ్చిన – మధ్యాహ్నమైనది. అన్నం తిని బయల్దేరండి' అన్నాడు. మేము వినకుండా అడవిలో తిరిగి, తిరిగి అలసిపోతే మరలా అతడెదురుపడి అలాగే అన్నాడు. ముగ్గురు స్నేహితులతని మాట వినక వెళ్ళిపోయారు. నాకాకలిగా వుంది. నేను బంజారా పెట్టినది తినగానే 'గురువుగారు' కన్పించి, తన బడిలో నన్ను చేర్చుకున్నారు. ఆ బడి చాలా బాగావుంది. నేను నిత్యం గురువుగారి ముఖం చూస్తూ వుండేవాడిని. ఆయన నన్ను ఒక బావిలో తలక్రిందులుగా వ్రేలాడదీసారు. అలా చాలా సేపుండగా గురువు వచ్చి నన్ను పైకిలాగి – ఎలా వుంది? అన్నారు – చాలా ఆనందంగా వుంది అన్నాను ఇలా చెప్పుకుపోయాడు బాబా.

ఈ కథలో 'అడవి' అంటే లోకం. లోకంలో గురువును వెదకిన కథ. ఇది నీ గురువెవ్వరో నీవే వెతుక్కోవాలి. రమణ మహర్షి అన్నారు. 'నీకా తపన వుంటే గురువే వస్తాడు నీకోసం. గురువంటే బయట వ్యక్తి గానే రానక్కరలేదు. లోపలి ఆత్మ స్వరూపమే మార్గం చెబుతుంది" అని. ఇదే అడవిలో గురువును వెదకటం. నానా చందోర్కరుతో గీతాశోక వివరణ సందర్భంగా బాబా అన్నాడు.

"మీరు నాకు చేసే సేవ సరిపోదు. శరీరం, మనస్సును గురువు కర్పించు" అన్నాడు. దానికీ కథ సమాధానం.

'సచ్చరిత్ర' మొదటి అధ్యాయంలోనే ఒక కథ చెప్పబడినది. కాకా సాహెబ్ దీక్షిత్ బాబా నడిగాడు 'నేను వెళ్ళవచ్చునా' అని. ఎవరో నడుమ అడిగారు ఎక్కడకు? అని 'చాలాపైకి' అని బాబా సమాధానం. దీక్షిత్ మార్గమేదని అడిగితే బాబా చెప్పినది అక్కడకు పోవటానికి చాలా మార్గాలున్నాయి. శిరిడీ నుండి కూడా ఒక మార్గమేదో వున్నది? అది చాలా ప్రయాసతో కూడినది. నడుమ అడవులుంటాయి. క్రూర మృగాలుంటాయి' అనగానే దీక్షితన్నాడు' మార్గం చూపేవానిని తీసుకొని పోతేనో

'అన్నాడు. 'అప్పుడు భయం లేదని బాబా అన్నారు. కాబట్టి ఈ అడవి త్రోవ చూపే వాడు గురువు బాబా. అతనిని తోడుగా గ్రహించి గమ్యస్థానం చేరాలి. బాబా వెదికినదీ గురువునే. దీని కోసమే దైవప్రతినిధిగా తాను వచ్చాడు'. అల్లాయే యజమాని. నేనతని సేవకుని అన్న 'మీ లెక్కలన్నీ అల్లాకప్పచెప్పాల'నీ – తాను దైవ ప్రతినిధిగా గురువుగా వచ్చానని చెప్పటమే అర్థం. కాబట్టి బాబాయే జగద్గురువుగా వచ్చిన దైవం.

పైన బాబా గురువు గారి కథలో ఒక మాటన్నాడు. రాధ బాయితో 'అమ్మా! నాది చెవి కొరికే మార్గం కాదు. గురువునే నమ్ముకో. ఏమీ చేయనక్కరలేదు. ఏమీ చదువనక్కర లేదు. మంత్ర జపం లేదు. గురువే రక్షకుడని సంపూర్ణ విశ్వాసముంచు చాలు' అని బోధించాడు. ఇదే కబీరు మార్గం. (నా గురువు కబీరని ఒకసారి – మరొక చోట 'ఆయనే నేన'ని బాబా అన్నాడు.)

"మి కాన్ పున్ కనీరా గురునవా" (నేను చెవికొరికే గురువును కాను) అంటే 'ఘరానే నిరాలే అహే' (మా సంప్రదాయం వేరు) ఇవి బాబా మరాఠీలో చెప్పిన మాటలు.

"కాన్ పునాకా గురు హద్దికె, కా గురు ఔర్
బేహద్ కా గురు జబ్ మిలే లా హైరి కాన్ తౌర్" (కబీరు)

'చెవిలో ఊదే గురువు చెప్పేది కొంచెం. అనంతాన్ని బోధించే గురుమార్గం వేరు. అలాంటి గురువు దొరికితే చాలు. నీవు గమ్యం చేరగలవు".

రమణ మహర్షి గురువును గురించి ఇలాగే చెప్పారు. బాబా సంప్రదాయంలో ఉపవాసాలు – భోజన నియమాలు – మంత్ర జపాలు లేవు. కేవలం గురు భక్తీ గమ్యం చేర్చే సాధనం. ఇదే దత్తాత్రేయ సంప్రదాయం. సర్వ జగత్తు గురువై నీకు బోధిస్తే అది వినగల గాలి





అంతే. కనుకనే బాబా ఒక వ్యక్తి ఇతరుని గురించి నిందిస్తుంటే బాబా, పంది కసువు తింటూ వుంటే చూపి – "నీవు అలాగే ఇతరుల పాపాన్ని తింటున్నావు. " వాడికి మేలు. నీకు కీడు అలాంటప్పుడు శిరిడీ నీకేం మేలు చేస్తుందని వచ్చావు?" అని బోధించాడు. ఇక్కడ పందికూడా గురువై, మలభక్షణ చేస్తూనే నీకేదో బోధిస్తుంది అని బాబా బోధించటంతో తాత్పర్యమిదే.

# గురుభక్తి - సేవ

'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా..........'

శ్లోక వ్యాఖ్యాన సందర్భంలో బాబా నానాచందోర్కరుతో అన్నాడట 'సేవ అంటే మీరు చేసేది చాలదు' అన తన గురు కథలో బావిలో వేలాడదీసిన కథ చెప్పి నిత్యమూ గురువులో లీనమైన స్థితి ఎలావుంటుందో వివరిస్తూ అన్నాడు.

'నాకన్నులు నా గురువును చూడటంలో నిమగ్నమయ్యేవి.

నా సర్వస్వమూ ఆయనే' అన్నాడు.

ఇంకా అర్థం కాలేదు. లోకానికని; జవహరాలీని గురువుగా అంగీకరించి, సేవించటం ద్వారా లోకానికి బోధించాడు. గురువు తక్కువ – ఎక్కువ అనే భేద భావం లేకుండా సేవించటమే పని. –

ఇది మాత్రం మనకర్థమౌనా? కాబట్టి మరొక సందర్భంలో చెప్పారు. "ఈ ప్రపంచం నా శరీరం. ఇది నా వాకిల్లు. అందులో నున్న నన్ను నా గురువెప్పుడో తీసుకొని పోయాడు. నేనెవరినంటావా. నా తండ్రి పరబ్రహ్మ. నా తల్లి మాయ. వారివల్ల నేను పుట్టాను''. గురువునకు తనను తానర్పించుకోవటమంటే, 'నేను' లోపించి తను–మన–ధనాదులన్నీ గురువున కర్పించటం. పరమహంస కంఠవ్రణంలో బాధపడుతున్న రోజులలో శిష్యులనే వారు 'స్వామీ! అమ్మ నడగ రాదా? తగ్గించమని

వారన్నారట “నన్ను నేను అమ్మ కంకితం చేసుకున్నానెప్పుడో. అడగటమంటే నన్ను, నేను, మరలా అమ్మ నుండి తెచ్చుకోవాలి కదా! ఎలా కుదురుతుంది?” – అని ఇదీ సమర్పణ. శరణాగతి బుద్ధి.. తనను లోపింప చేసుకొని చేసే సేవ అని బాబా అంటే ఇదీ బోధ.

ఈ శావాస్యోపనిషత్తును మరాఠీలో అనువాదం చేస్తూ దాసగుణ బాబాను ప్రశ్నించాడు.

ఉపనిషదర్థ బోధ చేయమని. బాబా ఉపన్యాసం చెప్పలేదు. చందోర్కరుకు గీతాశ్లోక వ్యాఖ్యానంలాగా మంత్ర వ్యాఖ్యానం చేయవచ్చు కదా.

ఒక ధనికుడు బాబాను బ్రహ్మజ్ఞానమర్థించి వచ్చిన కథ ‘సచ్చరిత్ర’ 16 – 17 అధ్యాయాల్లో వుంది. బ్రహ్మజ్ఞాన స్వీకరణ యోగ్యతను గురించి 10 విషయాలు వ్రాసాడు దబోల్కరు. అవన్నీ కఠోపనిషత్తులోనివి కొన్ని. గీతా వ్యాఖ్యానంలోనివి కొన్ని. అవి నిస్సందేహంగా బాబా చెప్పిన మాటలు కావు. దభోల్కరు పండితుని మాటలు. బాబా కానీ, పరమహంస కానీ ఎక్కడా పుస్తకాల్లోని మాటలు చెప్పలేదు. స్వానుభవ దృష్ట్యా, ప్రత్యక్ష జ్ఞానబోధ చేసారే తప్ప పుస్తక పాండిత్యాన్ని ప్రదర్శించలేదు. దాసగణుకు ఈశావాస్యోపనిషత్తు భావం చెప్పటం – కాకా దీక్షిత్ పనిపిల్ల ద్వారా చేసారు బాబా. కొందరు భక్తులు జంతువుల ద్వారా బోధ చేయించిన కథలున్నాయి. అలాగే బాబా పనిపిల్ల ద్వారా అవగాహన చేయించాడు. అది ఇలా జరిగింది.

దాసగణుతో బాబా అన్నాడు ‘ఉపనిషత్తు భావం తెలియటంలో పెద్ద కష్టమేమీ లేదు. నీవు తిరిగి వచ్చేవేళ కాకా సాహెబు దీక్షితు పనిపిల్ల నీ సందేహాన్ని తీరుస్తుంది’ అని.

ఆ పనిపిల్ల పాటలు పాడుకుంటూ పని చేసుకొంటున్నది. ఆ పాట భావం ఎఱ్ఱ చీర చాలా బాగుందనీ, దాని కుట్టుపని, అంచుల చివర్లలో చాలా అందంగా వున్నదని. దాసగణు కీర్తనకారుడైన హరిదాసు కనుక





పాటలంటే అతని కిష్టం. కాబట్టి మెచ్చుకొని తెల్లవారి దీక్షితునకు బట్టలు పెడుతుంటే ఆ పిల్లకొక కొత్త చీర యిమ్మన్నాడు. అతడలాగే చేసాడు. ఆ పిల్ల చీరకట్టుకొని ఆడుతూ, పాడుతూ పని చేసింది. తెల్లవారి దాచుకొని అదే సంతోషంతో ఆడుతూ, పాడుతూ పని చేసింది. దాసగణు ఇది చూచి ఇలా భావించాడు. కాబట్టి మన కష్ట, సుఖాలు మన మనస్సు మీద ఆధారపడి వుంటాయి. భగవంతుడిచ్చిన దానితో తృప్తి పడటము మన కర్తవ్యం. ఇవ్వటం, పుచ్చుకోవటం అన్నీ భగవంతుడే, ఏది ఇచ్చాడో దానితో తృప్తి పడాలి తప్ప ఆశతో అట్టులు చాచరాదు’ అని. ఈ స్ఫురణ బాబా ఇచ్చినదే కాబట్టి ఇందులో 2, 3 విషయాలు ఈశావాస్య ఉపనిషత్తుకు సంబంధించి వున్నాయి. అవి సచ్చరిత్రకారుడు కానీ ఇతరులు కానీ చెప్పలేదు.

1. ఎఱ్ఱ చీర – అంచులు – అదే పాట ఆ పిల్ల ఎందుకు పాడాలి. నానా చందోర్కరు అదే శ్లోకం ఎందుకు చదవాలి? – కాబట్టి ఇదంతా బాబా చేసిన ఏర్పాటు కదా. పైగా బాబా బోధనా విధానంలో ముఖ్యాంశమేమంటే ఒక సందర్భం ఏర్పాటు చేయటం. దభోల్కరు సెనగల కథ నిపుదుదాహరణగా చూచుకోవచ్చు. అంతకథ సందర్భం – ఎందుకు – ఏర్పాటు చేయటం. దాని సారాంశమేమిటో అదే సూటిగా చెప్పవచ్చు కదా. కాబట్టి బాబా బోధ విధానంలో ఒక రహస్యమున్నది. ఆ సందర్భంలో మనలను కూర్చోబెట్టి తాను చెప్పేదాన్ని మన అనుభవంలోకి తెచ్చి బోధించటం. –

ఎఱ్ర చీర – అంచులు ఏమిటంటే

1. ఈశావాస్య మిదం సర్వం
2. యత్కించ జగత్యాం జగత్
3. తేన త్యక్తేన భుంజీ
4. మాగృధః కస్య స్విద్ధనం

తాత్పర్యమేమంటే 1) ఈ సకల ప్రపంచమూ ఈశ్వరుడు కప్పుకొన్న వస్త్రం (అంటే శరీరం) లేదా ఆయనను ఇల్లు (అన్నా శరీరమే)

2) కాబట్టి ఆయనను వదిలి తినవద్దు. (అనుభవించవద్దు)

3) ఎవరి సొమ్మునూ ఆశించవద్దు. అసలు ఈ సర్వస్వమూ ఐశ్వర్యం ఎవరిది? – అంతా ఈశ్వరునిదే కదా – ఇదీ భావం.

ఈశావాస్యంలో పరమాత్మ సూర్యుడుగా చెప్పబడ్డాడు. అతడే ఈశ్వరుడు. అతడు నేసిన వస్త్రమే ప్రపంచం. దానిలో నూలు, దారాలు ఆయన కిరణాలు. తన కిరణాలన్న నూలు దారాలతో ఆయన ప్రపంచం జీవులు అన్నిటినీ నేస్తున్నాడు. ప్రపంచమన్న వస్త్రం తానే. సాలీడు (సాలెవాడు) సూర్యుడు.

బాబా గురువెవ్వరన్న విషయం దగ్గర చూద్దాం. సాయి శరణానందకు చెప్పారట బాబా తన గురువు రోషన్ షా – అని – దానికర్థం సూర్యుడు కావచ్చు. తను బ్రాహ్మణుడు కనుక గాయత్రిని జపించమంటున్నాడు కాబోలు బాబా – అని ఆయన చెప్పుకొన్నాడు.

ఈ రోషన్ షా ఈశావాస్యంలో సూర్యుడే. ఎఱ్ఱని చీర అంటే ఉదయించే సూర్యబింబ కాంతి. నీలో జ్ఞాన సూర్యుడుదయించుగాక. అప్పుడు ఈశావాస్యం నీ కర్థమౌతుంది. ఇది దాసగణుకు బాబా చేసిన ఆశీర్వాదం.

చాలా చోట్ల బాబా వస్త్ర విషయం ప్రస్తావించాడు. దేవుగారి విషయంలో 'నీకు నేను సెల్లా కప్పుదామనుకొంటే నీవు నా గుడ్డపీలికలు దొంగతనం చేస్తున్నావేమిటి?" నా అని.

భాటేలో నాస్తికుని చంపటానికి కాషాయ వస్త్రాన్ని కప్పి భక్తునిగా చేయటం వంటి కథల్లో వస్త్ర ప్రస్తావన వచ్చింది.

ఇదంతా ఈశావాస్య మంత్రార్థమేనని దాసగణుకు బాబా స్ఫురింపచేసాడు. ఏదీ కోరుకోవద్దు. ఏదైనా కోరితే నన్నడుగు. ఇతరుల నడుగవద్దు – ఇది బాబా చేసిన బోధాసారాంశం.





మా గృధః కస్యస్విద్ధనం – ఏదీ ఆశించదు, ఐశ్వర్యమంతా ఈశ్వరునిదే – 'ఇదే బాబా చెప్పింది (పై మాటల్లోని సారాంశమిదే). –

"నా ఖజానా నిండుగా వుంది' అన్న అంశం క్రింద ఈ విషయం వివరింప బడుతుంది.

'తేనత్యక్తేన భుంజీథ' – అంటే దభోళ్కరు సెనగల కథలో నన్ను వదలి తినవద్దు – అన్న బోధే ప్రధానం. ఇది అక్కడ చూచుకోవాలి. ఎవరైనా వుంటే పెడతావు సరే ఎవరు లేకపోతేనో? నీలో నేను లేనా? – అన్నాడు. అంటే లోపల అంతర్యామిగా నున్న నా కర్పించి నైవేద్యం పెట్టి తినమనే కదా బోధ.

కనుక దాసగణు ద్వారా బాబా మనకు చేసిన బోధ ఇది. ఆనాడు అర్జునుని ద్వారా జగద్గురువైన శ్రీకృష్ణుడు లోకానికి బోధించినట్లు.

దాసగణు ఆ పనిపిల్ల పాట విని అనుకొన్న మాటలు – భగవంతుడు మనలను కాపాడుతాడు. దశి దిశల్లో వుంటూ కావలసినదిస్తాడు. వచ్చిన దానితో సంతృప్తిపడు అన్నదీ మనకు బోధించటమే. ఈశావాస్యమంటే అంతా ఆయనదే అన్నప్పుడు కర్త అతడే – భోక్తా అతడే. మనదేమి లేదిక్కడ. అంతా ఆయనదేనన్న విషయాన్ని బోధించే కథలు. నానా చందోర్కరు మహమ్మదీయ స్త్రీలను చూచినపుడు పొందిన ఆవేశాన్ని గురించి బాబా చేసిన బోధ ఒకటి. అది మనకు సంబంధించినదే కనుక. వాసుదేవానంద సరస్వతి బాబాకిమ్మని ఇచ్చిన కొబ్బరికాయ దగ్గర బాబా చేసిన బోధ చూడాలి.

1. చందోర్కరు విషయం : బాబా దర్శనానికని మహమ్మదీయ స్త్రీలు వచ్చారు. బాబా పాదాలను నమస్కరించటానికి వారిలో ఒకామె తన బురఖాను తొలగించింది. ఆమె అందానికి ముగ్ధుడైన చందోర్కరు బాబా వెనకనే వున్నాడు. ఎందుకంటే స్త్రీ తిరగ గానే నానా బయటకు వెళ్ళబోతే బాబాయే కూర్చోమన్నాడట. సరే ఆమె అందగత్తె.

నమస్కారానంతరం మరలా బురఖాను వేసుకొన్నది. ఆమె అందాన్ని చూచిన చందోర్కరు మనసులో చలించి పోయాడు. బాబా గమనించి ఆ వెనకనున్న అతని చేతిని నొక్కి చెప్పాడు. "నానా అనవసరంగా చికాకు పడకు. ఇంద్రియాలను వాటి పనులను వాటిని చేసుకోనివ్వు. వాటికి నీవెందుకడ్డుపడటం? ఈ సృష్టి దైవ నిర్మాణం కనుక చాలా అందమైనది. దానిని చూచి ఆనందించు. మనస్సు క్రమంగా స్థిరపడి శాంతిస్తుంది. ముందు ద్వారం తీసివుంటే వెనక ద్వారం నుండి ప్రవేశించటం దేనికి? మన మనస్సు నిర్మలంగా, స్వచ్ఛంగా వున్నంతవరకూ భయంలేదు. మనలో దురాలోచనలు లేనపుడు పాపం అన్న ప్రసక్తి లేదు. మన కళ్ళను వాటి పనిని వాటిని చేసుకోనివ్వు. సిగ్గు పడనూ వద్దు. భయమూ పడనక్కర్లేదు.".

ఇది బాబా బోధనాసారాంశము. ఆయన వేదాంతిలాగా "మనస్సును జయించు. కామం, క్రోధాదులు పనికి రావు. స్త్రీ చాలా చెడ్డది" అనలేదు – ఇలాంటి నీరసమైన, చచ్చు, పుచ్చు వేదాంతం రమణాదులు చేయలేదు. సన్యాసం పుచ్చుకొంటామని వచ్చిన వారిని వారంతా వారించారు.

ఇక్కడ బాబా చెప్పినదేమిటి ? తూర్పు ద్వారమేమిటి ? పడమటి ద్వారమేమిటి? నాలుక (ఈ మాటలు పరమహంస కూడా వాడారు). కన్ను–ముక్కు–చెవి వంటివి సృష్టిని అనుభవించటానికే ఏర్పాటైనవి. అనుభవించుకొనే మనస్సును తీసివేసి, నాకది కావాలని కోరుకోవటం మమకారం. భగవంతునిదనుకోవటం ద్వారా అనుభవించు. అప్పుడు నీకు పుణ్య, పాప ప్రసక్తి లేదు. ఇదంతా కర్మయోగమే కదా! ఆమె అందగత్తె. నిజమే. ఆ అందాన్ని ఎలా అను భవించాలో బాబా ఆ మార్గం చెబుతున్నాడు.

"భగవంతుడెంత శిల్పి ! ఈ లోకోత్తరమైన శిల్పాన్ని చెక్కాడు"– అనుకొని ఒక శిల్పం – చిత్రం – కవిత్వం – కన్నప్పుడు, విన్నప్పుడు నీవెలా అనుభవిస్తున్నావో! అలా అనుభవించు. దాని నుండి తప్పుకోవద్దు. ఈ సృష్టి అన్న మహా కావ్యాన్ని – శిల్పాన్ని – బొమ్మను చేసిన భగవంతుడు





మహా కళాకారుడని భావిస్తూ అనుభవించు. దొంగ లించాలి, స్వంతం చేసుకోవాలనుకోవటం లేదు కదా. ఒక పువ్వును చూచి, ఎంత బాగుందని అనుభవించు. ఆ పూవును కోసుకొని పోవాలనుకోవద్దు. ఇది దొంగబుద్ధి, అది కళాబుద్ధి. నీవు సినిమా, నాటకం చూస్తున్నపుడు నీకు నచ్చిన విషయాన్ని చూచి అనుభవిస్తున్నావా? సొంతం చేసుకోవాలనుకొంటున్నావా? మొదటిది తూర్పు ద్వారం. సృష్టిని అనుభవిస్తూనే ముక్తిని పొందటంబీ పడమటి ద్వారం సన్యాస మార్గం.

దేవీ సప్తశతిలో జగన్మాత చెబుతుంది. "సృష్టిలో అన్ని వస్తువులు కానీ, భావాలు కానీ నేనే, ఆకలిదప్పులు, నిద్రా కోరికలు అన్నీ నేనే, స్త్రీలంతా నా స్వరూపాలే. నీవు పడే భ్రాంతి నేనే. మోహమూ నేనే! "నని. అంటే ఇదంతా అమ్మ లీల అట. 'నేనందులో ఒక పాత్రధారిని. పావును' అనుకొని జీవించమని తల్లి బోధ. నిజంగా కర్తా–భోక్తా అన్నీ తానే ఐనపుడు నడుమ నేనెవ్వరిని? అహంకారాన్ని తొలగించుకొని అనుభవించమని బాబా బోధ. ఇంకొక చోట ఒక నిర్గుణోపాసకునితో చెప్పాడు" మన మధ్య ఆ గోడను కూలగొట్టు. అప్పుడు మనం పరస్పరం ఒకరినొకరు చూచుకోవచ్చు"నని 'నేనన్న' ఆలోచన. మనస్సును తీసివేసే మార్గమేమిటంటే అల్లా మాలిక్ – అనుకొంటూ జీవించటం అంతా ఆయన ఖజానా? కనక దేనిని ఆశించవద్దు. ఆయన నడిగి తీసుకో.

బాబా ఎంత చక్కగా మార్గబోధ చేసాడో ఆలోచించుకోవాలి. లోకం – సంసారం వదిలి పెట్టిపో అనలేదు. రమణులు సైతం అన్నారు. 'నీ సంసారం చిన్నది. నా సంసారం చూడు ఎంత పెద్దదో ఎవరొస్తారో! ఏమి అడుగుతారో? అని ఎదురు చూడ్డంతో నాకు కాలం సరిపోతున్నది. సన్యాసమంటే 'అహంస్ఫురణ' లేకుండా జీవించటం తప్ప ఆశ్రమాలకో, హిమాలయాలకో పోవటం కాదు. అక్కడకు పోయినా నీ మనస్సు వుంటూనే వుంది కదా. దానినక్కడే త్రుంచివేయి. కర్త–నేను ఎవరన్న విచారణ ద్వారానే అంతా లభిస్తుంది. సన్యాసం ద్వారా కాదు". అన్నారు.

# కొబ్బరికాయ కథ

ఒక భక్తుడు పుండరీకరావు రాజమహేంద్రవరంలో మకాం చేసిన వాసుదేవా నంద సరస్వతిని దర్శించటానికి వచ్చాడు. (ఈయనే గురుచరిత్ర వ్రాసింది. మహారాష్ట్ర – కర్ణాటకంలో దానిని పారాయణం చేస్తారు కనుక వారి దర్శనం కోసం మహారాష్ట్ర నుండి వచ్చాడు) ఆయన గారు ఒక కొబ్బరికాయ నిచ్చి – మా అన్న బాబా కివ్వు – అని ఇచ్చాడు. ఈయన తీసుకున్నాడు 'సరే'నని. కాని దారిలో ఆకలివేస్తే ఒక ఏటి ఒడ్డున కారం, అటుకులు తింటూ వుంటే – కారంగా వున్నాయనిపించి – ఆ కొబ్బరికాయ పగులగొట్టి కొబ్బరి కలుపుకొని తిన్నాడు. మరచిపోయి శిరిడీ వస్తే దైవం ప్రశ్నించింది. నా తమ్ముడిచ్చిన కొబ్బరి కాయఏది?–అని, ఆయన కప్పుడు గుర్తుకు వచ్చింది కాబోలు 'బాబా ఇలా జరిగింది. తత్పరిహారంగా 10 కొబ్బరికాయలు సమర్పిస్తానన్నాడు. భయపడ్డ భక్తుడు. బాబా 'వల్లకాదు. నా తమ్ముడిచ్చిన కొబ్బరికాయతో ఆ 10 టెంకాయలు సరిపోవని భీష్మించి మరలా అన్నాడట ఆ తండ్రి 'సరే! పుండరీకా ఆ చింత వదలిపెట్టు. అది నా సంకల్పానుసారంగానే ఇవ్వబడినది. నా సంకల్పం వల్లే (ఆకలి అమ్మ – తానేనని చెప్పిన మాటలు పైన వచ్చాయి కదా) పగులగొట్టబడినది. దానికి నీవు కర్తవు కాదు. భోక్తవు కావు. అంతా దైవమేననుకో. బాబా కోపించలేదు. భగవంతుడంటే కోపిస్తాడని మనకొక భయం చిన్ననాటి నుండి బోధింపబడినది. కనుక అయ్యో పాపం చేసాం. ఇలా మ్రొక్కుకుంటే అది పోయింది – అని ఎవడో తెలియనివాడు చెప్పటం – మనం వినటం ఇది అనాదిగా వస్తున్నది. ఒకసారి శ్రీ అరవిందుల శ్రీమాత అన్నది ఎవరితోనే "మేము నిన్ను కోపించటానికి రాలేదు. మార్గం చెప్పటానికి వచ్చాం. నీవనుభవిస్తున్న బాధలు చాలక ఇంకా మేముకోపంతో మిమ్మల్ని బాధిస్తామా? తప్పు. అలా అనుకోవద్దు' అని. కనుక భగవంతుడు దయామయుడు. ఆయనకు కోప, తాపాలుంటే ఆయన మనమూ ఒక్కటే





కదా. మనకంటే ఆయన గొప్ప ఏమిటి ? – కాబట్టి బాబా కోపించక జీవితాన్ని ఎలా అనుభవించాలో చెబుతున్నాడు. ఇందుచేత జీవితంలో మనమేం చేసినా కర్తను నేనుకాదని చేయటమే. ఏ ఫలితం వస్తే అదే భగవంతుడు మన కనుగ్రహించిన వరం అనుకొని జీవించాలి లోకమంతా. నీవు భగవంతుడుగా పరిణమించటానికి సృష్టింపబడినదని జీవించు. నిన్ను కట్టిపడవేయటానికి కాదిది వచ్చింది' అని భావించి జీవించు.

ఇందుకే బాబా దభోల్కరుతో అన్నాడు తన జీవిత చరిత్ర వ్రాస్తనని సంకల్పించి నపుడు "నీవు నీ అహంకారాన్ని నా పాదాల కర్పించి వ్రాయి. నీవు చెప్పేది సత్యమని వాదించకు. అప్పుడు నీలోకి నేను వచ్చి నా కథ నేనే వ్రాసుకొంటాన"ని – నన్ను నేను విస్మరించి అంతా దైవానికర్పించి జీవించటమే – అంతా దైవమే ఆయనలీలే నని బ్రతకటమే తూర్పు ద్వారం.

# చదివిన పెద్దమనిషి

పూనాలో అనంతరావు పాటంకరన్న వ్యక్తి ఉన్నాడు. అతడు బాబా దర్శనం చేసి మొరపెట్టుకొన్నాడట "నేను చాలా చదివి, చదివి అలసిపోయాను. కానీ నాకావంత సిద్ధించలేదు. నీ దయ వర్షించనిదే లాభం లేదని నీ దగ్గరకు వచ్చాను. బాబా నీవే దిక్కని'.

బాబా అన్నాడు 'ఒక రోజున ఒక వర్తకుడిక్కడకు వచ్చాడు. అతనికొక ఆడ ఒక గుఱ్ఱమున్నది. అది తొమ్మిది లద్దెలు వేసింది. అతడు జిజ్ఞాసువు కనుక వాటిని 'ప్రోగు చేసుకొని మూట కట్టుకొన్నాడు' అని. ఇదేమి సమాధానం. అంతా యోగ పరిభాష

బాబా కొన్నిసార్లిలా మాట్లాడినాడట. ఆ మహాత్ముని మనస్సాసమయంలో ఏ యోగ భూమికలో వుండేదో మరి. అక్కడి నుండి వచ్చే భాష యిలా వుంటుందేమో? ఎవడికి తెలుసు.

ఇందులో వర్తకుడెవరు? గుఱ్ఱమేది? లద్దెలంటే ఏమిటి? ఇదంతా

సమాధి భాష. వేద భాష. ఉపనిషద్భాష. సగానికి సగమింతే. ప్రత్యేకించి యోగ సంబంధమైన ఉపనిషత్తుల్లో ఇదే భాష కన్పిస్తుంది.

పాటంకరు కర్థంకాలేదు. కేల్కరన్న భక్తునినడిగాడు. ఆయనకు తోచిన నవవిధ భక్తి మార్గాలవి. శ్రవణం (భగవంతుని గురించి వినటం), మననం (ఆలోచించటం), కీర్తనం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, స్నేహం, ఆత్మ నివేదనం (ఆత్మ విచారం, ఆత్మ వివేచన)

తర్వాత బాబా మరలా అతనిని అడిగాడు 'ప్రోగు చేసుకొన్నావా?" అని నీదయ వుంటే ప్రోగు చేసుకోగలనన్నాడు పాటంకర్. మంచిదని బాబా ఆశీర్వదించాడు. వర్తకుడు అంటే మనిషి. వాడు ఆత్మ విచారణ చేసే వాడైతే గుఙ్మమన్న దైవకృప (అంటే జగన్మాత శివకారుణ్య స్వరూపిణి) అనుగ్రహిస్తుంది. ఆ అనుగ్రహం ద్వారా భక్తి ఏర్పడుతుంది. అదే తరణోపాయం.

బాబా భక్తి మార్గాన్నే చాలావరకు ప్రబోధించాడు. అంటే సగుణ మార్గం. ఆత్మ విచారణ కాదనలేదు కాని – సగుణోపాసననే ప్రోత్సహించారు పరమ హంసలాగా.

ఇందుకే చాలాసార్లనేవారట. సీతాఫలం మంచిది, రామఫలం కంటే. అది త్వరగా జీర్ణమౌతుంది. రెండవది కాదు – అని సీతాఫలమంటే భక్తి. రామఫలమంటే ఆత్మ విచారణ (రమణ మహర్షి మార్గం)

చాలా వరకూ బాబా బోధనా విధానమిదే.

## బాబా పుట్టు పూర్వోత్తరాలు -1

పరమాత్మకు జన్మలేదు. కాని అన్ని జీవులు ఆయనే. అందరూ, చెట్టూ, పుట్టా, గట్టూ, పిట్ట, జంతువు, మనిషి, చీమ, దోమ అన్నీ ఆయనే. జనన మరణాతీతుడై కూడా వాటిననుభవిస్తున్నాడు.





"త్వం స్త్రీ, త్వంపుమానసి, త్వంకుమార, ఉతవా కుమారీ

త్వం జీర్ణోదండేన వంచసి త్వం జాతో భవసి, విశ్వతోముఖః"

"నీవు స్త్రీవి, పురుషుడవు, కుమారుడవు లేదా కుమారివి. నీవు ముసలివాడవై చేతి కర్రతో (లోకాన్ని) మోసగిస్తున్నావు. విశ్వమంతా నీవే."

"నైవ స్త్రీ, న పుమాన్, విష న చై వాయం న పుంసకః

యద్యత్ శరీర మా ధత్తే తేనతేన సరక్ష్యతే"

అని ఉపనిషత్తుల్లోని ఆత్మ వర్ణన

అతడు స్త్రీకాదు – పురుషుడు కాదు – పోనీ నపుంసకుడా! అంటే అదీకాదు. ఏ శరీరాన్ని ధరిస్తాడో అది అతనికి ఆచ్ఛాదన (వస్త్రం – కప్పుకొనేది). ఇదే బాబా అన్న

'జైసా దేశ్ – వైసా వేష్' – దేశాన్ని బట్టి వేషం వేయాలన్నది దాని కర్థం. ఈ వర్ణన బాబా కన్వయించినంతగా ఎవరకూ అన్వయించదేమో!

బాబా మతమేది? హిందువా? సాయిబా? ఊరేది? పేరేది! తల్లి, తండ్రులెవరు? మనకేమి తెలియదు.

ఆనాడు బాబా దగ్గరున్న వారికే తెలియలేదు. ఎందుకని బాబా చెప్పలేదు. ఆయన తెలియనివ్వలేదు. రకరకాలుగా చెప్పేవాడు తప్ప ఇదమిత్థంగా ఏదీ చెప్పలేదట. ఒకసారి అన్నాడట "తన మేనమామ తనను ఔరంగాబాదు నుండి తీసుకొని వచ్చి గోదావరి ఒడ్డున వదిలేవాడు' అని. ఆ మేనమామ నిజంగా వున్నాడా? కట్టుకథా? తెలియదు.

బాబా శరీరాన్ని వదిలిన తర్వాత 37 ఏళ్ళకు అంటే 1955 లో బాబా విషయాన్ని 4 పుస్తకాలు వ్రాసి లోకంలో ప్రచారం చేసిన పూజ్యశ్రీ నరసింహాస్వామి గారు క్రీ.శ. 1934 ప్రాంతంలో రమణ మహర్షి శిష్యులై వారి జీవిత చరిత్రను మొదటిసారిగా (వ్రాసినవారు) ఎంతో శ్రమించి బాబా శిష్యులను భక్తులను కలుసుకొని ఎంతో పరిశోధన చేసిన పండితుడు

'బాబా జీవితమంతా మాయముసుగులో మనకు తెలియకుండా పోయినదన్నారు. బాబా మరొకసారి 'నాకన్నతల్లి మాయ – తండ్రి దైవం'. వారికి పుట్టాను నేను' అన్నందుకు కాలు వారలా తీర్మానించారు.

ధూమల్ అన్న నానేక్ ప్లీడరు బాబా భక్తుడు వ్రాసాడు సాయిబాబా ఎవరి ఎవరికీ తెలియదని.

దీక్షిత్ బాబా సచ్చరిత్ర పీఠికలో వ్రాసాడు. బాబా పుట్టు పూర్వోత్తరాలు మనక తెలియదు. కానీ ఆనాడు నైజాం రాష్ట్రంలోని – అనేక స్థలాలు "ఊళ్ళ పేళ్ళు బాబాకు తెలుసు. ఒకసారి ఒకరు పత్రి గ్రామంనుండి రాగా ఆ ఊళ్ళో కొందరి పేరు చెప్పి వారి బాగోగులు విచారించారు బాబా. అంతమాత్రాన ఆయన పత్రిలో పుట్టాడని చెప్పలేము అని వ్రాసాడు. ఈయన బాబాతో 10 ఏళ్ళు కలిసి జీవించిన భక్తుడు.

కోర్టు విచారణ విషయంలో బాబా చెప్పిన మాటల చూస్తే ఆయనకు సాధారణ జన్మలేదనే తెలుస్తుంది. కాని 'వెంకుసా' శిష్యుడనన్నాడు. ఈ 'వెంకుసా' కథ బాబా గురువెవ్వరన్న చోట చూద్దాం.

బాబా కేవలం పరమాత్మ ఎందుకంటే ఊరున్నా లేనివాడు. పేరున్నా లేనివాడు. (ఆయనకు పేరులేదు. బాబా అని మహల్సాపతి పిలిచాడంతే. అదే పేరు) రూపమున్నా లేనివాడు. కనుక ఆయన రూపాల్లో ఆయా భక్తుల దగ్గరకు వెళ్ళాడు కనుక. ఆయనదే రూపమనాలి? దైవమైనా మన మధ్య తిరిగినవాడు, దుఃఖించ లేనివాడు. కోపించినా ప్రేమించేవాడు, తల్లీ, తండ్రీ, గురువు, స్నేహితుడు అయినవాడు. ఏ బంధం లేకపోయినా ఉన్నా తిననివాడు (కుక్కకు రొట్టె పెడితే త్రేపినవాడు. తనకోసం తెచ్చిన రొట్టెను కుక్కకు పెట్టినవాడు), నిద్రించినా నిద్రించని వాడు (చూ!! కథలో మహల్సాపతి బల్ల లేకుండా నేనెలా బల్లమీద నిద్రించేదంటే 'దీక్షిత్ ఆయనకూ ఒకటి చేయిస్తానంటే బాబా అన్నాడు. వాడెలా పండుకోగలడు. నిద్రిస్తూనే నిద్రపోనివాడే బల్లమీద పండుకోగలడన్న మాటల్లో తెలిసిన





విషయం. దరిద్రదేవతను (భిక్షాటన (వ్యాజం) రూపంలో ఆది భిక్షువైన వాడు) లక్ష్మిగా పరిణమింప చేసుకొన్నవాడు. వృద్ధుడైనా యువకునిలా పరుగెత్తగలవాడు. (మద్రాసు రామదాసు కలలో విషయం), మసీదులో వుంటూనే అంతా వ్యాపించినవాడు (చందోర్కరుకు కొండమీద రాతిక్రింద నీరున్నదన్నది చెప్పినవాడు) మచ్చీంద్ర గడ్ భక్తునకు దర్శనమిచ్చినవాడు, 'అల్లా మాలిక్' అంటూనే అల్లా ఐనవాడు గురువును కాదంటూనే జగద్గురువైనవాడు. మనతో పాటు ఆకలి లేక పోయినా తిని – ఆడి పాడి నవ్వి కన్పించిన సర్వాతీత పరబ్రహ్మమై సర్వ దేవతా రూపాలను – తానన్న తెరమీద చూపినవాడు. అలాగే సర్వ గురువులలో తానైన వాడు – బాబా ఎవ్వరు ? అంటే మనకు తెలుస్తూనే – తెలియకుండా పోతున్నది. చేతి కందుతూనే అందకుండా పోతున్నది. కనిపిస్తూనే కన్పించకుండా పోతున్నది.

దసరానాడు (సీమోల్లంఘన వేళ) కట్టుకున్న గుడ్డలాగేసి నగ్నంగా నిలిచి ఇప్పుడు చూడండిలా నేను సాయిబునా? హిందువునా? అన్నప్పుడు సాయిబులకు సుంతీ చేసుకున్నట్లు – హిందువులకు సుంతీ చేసుకోలేనట్లు కన్పించిన వాడు హిందువా? ముస్లిమా? ఎవ్వరాతడు? కేవలం నిర్గుణాత్మ తత్త్వం ధరించిన ఒక దివ్యరూపం తప్ప.

అతనికి పుట్టు పూర్వోత్తరాలు లేవని ఇలా నిరూపించాడు. కానీ మనిషి దీనినిలా చూడలేదు. ఆయన చుట్టూ అనేక కథలు గిజిగాని గూడు లాగా పేరుకొని, పెనవేసుకొని పోయాయి. వాటిలో కొన్ని యిలా వున్నాయి.

1976లో ఖేర్ అన్న పండితుడు చాలా పరిశోధన చేసి బాబా పత్రి గ్రామంలో జన్మించినట్లు చెప్పిన విషయం ప్రచారంలోకి వచ్చింది. దాని ప్రకారం – మన్మాడు సమీపంలో మాన్వత్ గ్రామం దగ్గర పత్రి వున్నది. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో పెద్దవాడుగా జన్మిస్తే, ఒక ఫకీరుకు ఇచ్చాడట. ఈ పత్రి "పార్థపుర మన్న పేరు కలిగి (పార్థుడంటే అర్జునుడు) దేవగిరి యాదవ వంశరాజులచే పాలింపబడ్డదట. వారి

పాలనలో గణిత శాస్త్రాభివృద్ధి జరిగినదట. బాబాను దర్శించినపుడు దభోళ్కరును "అవో హేమద్పంతు అనిపించినట్లు – ఆ పేరున ఒక పండితుడు గొప్ప గణిత శాస్త్రవేత్తయై ఈ దేవగిరి యాదవ వంశస్థులకు మంత్రిగా వున్నట్లు దభోళ్కరు వ్రాసిన విషయం గుర్తించాలి.)

ఆ బ్రాహ్మణ కుటుంబీకులకు కులదేవత ఆంజనేయ స్వామి (సాయిబాబా శిరిడీలో మారుతీ దేవాలయంలో కొన్ని నాళ్ళున్నట్లు ఆయన తన కన్నగారని చెప్పేవాడనీ మనకు తెలుసు) ఆ గ్రామంలో 'లెండీ' అన్న పేరుగల ఏరున్నదట. శిరిడిలో లెండీ బాగ్ వున్నది కదా.

ఆ భూసారి బ్రాహ్మణ వంశీకుడొకరు రఘునాథ మహారుద్ర అన్న పేరు గలాయన. హైదరాబాదులో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మరాఠీ భాషాశాఖలో ఆచార్యుడుగా వుండేవాడట. ఆయన బాబాను గురించి చెప్పినదేమంటే "పరశురామన్న వానికి ఐదుగురు కొడుకులు". అందులో హరిభావు అంబాదాసు బలవంతు. ఈ ముగ్గురు చిన్నతనంలోనే పత్రిగ్రామం వదలి పెట్టారు. హరిబావు అన్నతడు దైవాన్వేషణ తత్పరుడై చిన్నతనంలోనే ఊరు వదిలి పెట్టాడు. తర్వాత తరంలోనూ ఒకరు సన్యాసం పుచ్చుకొన్నారు. కనుక ఆ కుటుంబం దైవభక్తి కలిగినదనీ, చెబితే హరిభావే బాబా అని ఊహించాడు ఖేరు.

బాబా శిరిడీలో ప్రసిద్ధుడైనాక చాలాకాలం తర్వాత పత్రిలో బాబా స్మారక మందిరం కట్టారట

ఇందులో బాబా విషయమేమీ లేదు. వట్టి ఊహతప్పు.

పుట్టపర్తి బాబా తాను పూర్వజన్మలో శిరిడీ బాబానన్నాడు కదా. వారు చెప్పిన కథ కూడా పత్రి కథే. (దాని విషయం 'లీలాసమాధి' లో వుంది.) బాబాను గురించి విపరీతంగా కృషి చేసినవారు నరసింహ స్వామిగారు. వారు బాబా తల్లి విధవరాలై వెంకుసా దగ్గరకు వచ్చి, వారి ఆశ్రమంలో బాబాను వదలి వెళ్ళినట్లు చెప్పారు.





ఈ వెంకుసా సేలూ రైల్వే స్టేషన్‌కు దగ్గర్లో నేటికీ ఒక వేంకటేశ్వరాలయం దానికి వెనక ప్రక్కన ఈయన 'సమాధి' వున్నాడట. (వీటి ఫోటోలు నరసింహ స్వామీజీ వ్రాసిన బాబా చరిత్రలో వున్నవి. ఈ సేలూ రైలు స్టేషన్ సికింద్రబాదు – మన్మాడురైలు రోడ్డులో మనకు కన్పిస్తుంది. ఆయన వేంకటేశ్వర స్వామి భక్తుడు కావటం వల్ల 'వెంకుసా' అన్న పేరు వచ్చింది. ఈ 'వెంకుసా' పేరు గోపాలరావు కేశవరావు దేశముఖ్. పెద్ద జమీందార్ బాబా ఈయన్ని శిష్యుడని దాసుగణు ప్రచారం చేస్తే నరసింహస్వామిగారు ఆమోదించారు. కానీ తర్వాత పరిశోధనకుల వల్ల తేలిందేమంటే వెంకుసా 1808లో శరీరయాత్ర చాలించాడని బాబా జన్మ 1838లో కనక బాబా పుట్టటానికి ముందే 30 ఏళ్ళ క్రితం దివంగతుడైన వెంకూసా బాబాకు గురువు కావటమసంభవం. ఐతే బాబా ధూళియా కోర్టు విచారణలో వెంకుసాను తన గురువైనట్లు – తనది కబీరు మతమనీ పేర్కొన్నాడు కదా! ఎలా కుదురుతుంది అంటే ఆనాటికి ప్రసిద్ధులైన గురువులను తన గురువులుగా ప్రకటించటం – తనలో పూర్వ గురువులెందరో వున్నట్లు ప్రదర్శించటం సాధారణ విషయం. అది జనంలో గురుభక్తిని చాటటానికే గుర్తుంచు కోవాలి. జవహర్ ఆలీని గురువుగా సేవించలేదా? అదంతా అబద్ధం. జవహర్ తనకు గురువా – కాదుకదా.

కాబట్టి బాబా చెప్పిన మాటలకు మామూలు అర్థాలు లేవు అని పై వృత్తాంతాల వల్ల స్పష్టపడుతున్నది కదా.

నరసింహ స్వామి వారి ప్రకారం బాబా పత్రిలో జన్మించి – ఒక ఫకీరు ద్వారా – వెంకుసా దగ్గరకు చేరాడు. ఆ ఫకీరు మన్వాత్ గ్రామ నివాసి. వెంకుసా సేలూ నివాసి. బాబా జన్మస్థలం పత్రి. ఇవన్నీ దగ్గర దగ్గర గ్రామాలు.

పుట్టపర్తి బాబా ప్రకారం ఇంతే. పత్రిలో జన్మించి ఎవరో మహమ్మదీయునికి బాలుడుగా దొరికి వెంకుసా దగ్గరకు చేరటం వరకు

సమానమే. కానీ తల్లి, తండ్రులు దేవగిరి అమ్మ – గంగా భవాడియా అని సత్యసాయిబాబా చెబితే వేరే మరొక చోటున జమునా బాయి నందలాల్ అని వుంది. మరాట్వాడా ప్రాంతంలో సూఫీ అన్న మహమ్మదీయ శాఖ విస్తారంగా వుండటం వారిలో మహాత్ములుండటం సత్యమే. బాబాకా మత విషయాలన్నీ తెలుసు అన్నదీ సత్యమే. కనుక హిందువుగా జన్మించి మహమ్మదీయుల దగ్గర కొంత కాలముండటం పై విధంగా వ్యాపించిన కథ కావచ్చు.

'వెంకుసా' వృత్తాంతం మాత్రం అబద్ధం. మరొకరు రాజర్షి బాలసన్యాసి అన్నవారు ఆంగ్లంలో సాయిబాబా అన్న చిన్న పుస్తకాన్ని వ్రాసారు. ఇది 1942లో అచ్చయినది. దాని ప్రకారం ఈ రాజర్షి – బాబా హిమాలయాల్లోని రామ చంద్రబాబాజీ మ శిష్యులు. బాబా తల్లి, తండ్రులు ఉత్తర దేశంలో తీర్థయాత్రలు చేస్తుండగా ఎవరో – మహమ్మదీయుడు వారిని మక్కాకు – జెరూసలెంకు తీసుకొని పోగా ఇక్కడ 1858 ఉదయం 9 గం.లకు జన్మించారట. తర్వాత బాబా తల్లి, తండ్రులు భారతదేశానికి తిరిగి వస్తుండగా "ఆ తల్లీ తండ్రి స్వర్గస్థులైనారు. బాబా కప్పుడు 5, 6 సం.ల వయస్సు తర్వాత ఎవరితోనో కలిసి బృందావనం పోతుండగా దారిలో బాలబాబా సొమ్మసిల్లి పడిపోతే, ఆ బాలుని రామచంద్ర బాబాజీ హిమాలయాలకు తీసుకొని పోయి బాబాకు జగన్మాత మంత్రోపదేశం చేసి వారి ఆజ్ఞతో 1872లో 16 ఏళ్ళ వయస్సులో శిరిడీ వచ్చారట.

ఈ వృత్తాంతంలో 'క్రీస్తు – అల్లా – కృష్ణ – జగన్మాత' ప్రస్తావన రావటం బాబాలో ఈ దైవాంశలు కన్పించటం – కన్పిస్తాయి. పోతే, బాబా తనది చెవిలో ఊదే సంప్రదాయం' కాదన్నాడు. అంటే మంత్రోపదేశం, ఉ పవాసాలు ఇలాంటివి లేవని మరి బాబా గురువుగారు మంత్రోపదేశం చేయటం సంగతి ఎంతవరకు నిజమో? తెలియదు.





మరొక విషయం బాబా శిరిడీ 16 ఏళ్ళ వయస్సులో 1872 ప్రాంతంలో వచ్చాడని ఈ గ్రంథం చెబుతుంది. కానీ, ఇతరులు 1868–72 అప్పటికి బాబా వయస్సు 30 ఏళ్ళనీ, ఎందుకంటే 1838లో బాబా జన్మించాడు. కనుక 72 లో వచ్చాడు. కనుక 30 ఏళ్ళు.

కానీ సచ్చరిత్రలో నానాచోప్‌దారు తల్లి చెప్పిన విషయమున్నది కదా. దాని ప్రకారం 16 ఏళ్ళ వయస్సులోనే 'శిరిడీ' వచ్చినట్లు చెప్పబడినది.

గురుస్థానం కట్టించిన సాఠేతో బాబా అన్నాడట. చుట్టూ వున్న కోటగోడను పడవేసి గురుస్థానం కట్టించమనీ – అక్కడ తన గురువు సమాధి వున్నదని చెప్పాడు. అదీ నిజమేనట. సాఠేవాడ కట్టినపుడు బయలు పడినది. ఆ గురు స్థానంలో తాను 12 ఏళ్ళు గురు సమాధి దగ్గర తపస్సు చేశాననీ చెప్పాడు. అది కబీరు సమాధి అని చెప్పాడు. బాబా 16 ఏళ్ళ వయస్సులో గురుస్థానంలో వేపచెట్టు దగ్గర ఒక ఉదయం ఊరి వారికి కన్పించినట్లు చెప్పిన వృత్తాంతం ప్రకారం 16లో 12 ఏళ్ళు తీసివేస్తే తన నాల్గో ఏట 'శిరిడీ' వచ్చాడనాలి.

ఇందులో ఏది నిజం? ఏది అబద్ధం. ఇంత గంగరగోళంగా బాబా ఊరు, పేరు వయస్సు శిరిడీ వచ్చిన తేది – అప్పటికి బాబా వయస్సు – ఎంత మాయా జాలంగా వుంది.

ఇదంతా ఎందుకు జరిగినట్లు ? రమణ మహర్షి తల్లి పేరున మాతృభూతే శ్వరాలయం నిర్మింపజేసారు. పుట్టపర్తి బాబా తన తల్లిగారి పేరున విద్యా సంస్థలు, విగ్రహాలు ప్రతిష్ఠించారు. శ్రీరామ చంద్రుడు "జననీ–జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" (తల్లి, పుట్టినదేశం – స్వర్గం కంటే పూజిచదగ్గవి) అన్నాడు.

మరి శిరిడీ బాబాలో ఇవన్నీ ఎందుకు లోపించిపోయినట్లు?ఆయన సంకల్పంలో లేవా ఇవన్నీ, లేక ఆయన జన్మ సాధారణ మానవజన్మ కాదా?

క్రీస్తుదైవ కుమారుడని వింటున్నాం. కర్ణుడు సూర్య వరానుసారంగా కుంతికి జన్మించాడని భారతం చెబుతున్నది. దైవం మానవాకారంలో వచ్చి అనుకూల గర్భంలో బీజప్రదానం చేసిన కథలూ వ్యాసుడు ధృతరాష్ట్రాదులకు జన్మలు ప్రసాదించిన సంగతీ! తెలిసిందే.

అంటే దైవం తనంత తానుగా శరీరాన్ని కల్పించుకోగలడు. సద్యోగర్భసంజాతుడు వ్యాసమహర్షి ఈ అధ్యాయ ప్రారంభంలో ఉదాహరించిన మంత్రాల్లో రెండవ మంత్రంలో – ఏ శరీరాన్ని తాను ధరిస్తున్నాడో అది అతనికి కవచమౌతున్నది. వేషమౌతున్నదన్న మాటకర్థమేమిటి ?

## అయోనిజవాదం

సాధారణంగా మహాక్షేత్రాల్లో దైవం వెలిసాడనటం పల్లీ మనస్తత్వం నుండి పుట్టినమాట. ప్రతి గ్రామంలో శివాలయంలోని లింగం, వెలిసింది తప్ప, చేసి పెట్టింది కాదనటమూ వింటున్నాం.

మాతృ గర్భం నుండి పుట్టకుండా జన్మస్వయంభూతంగా వస్తుందా? ఈ అసాధారణ విశేష జన్మల గురించి మనకు తెలియదు. కనుక శరీర నిర్మాణం మాతృగర్భం చేసే పని తప్ప దానంతటదే కల్గటంముంటుందా ?

సచ్చరిత్ర వ్రాసిన దభోళ్కరు ఈ వాదమే ప్రచారం చేసాడు లేదా గ్రంథస్థం చేసాడు. అతనికి బాబా దైవం. అలాంటి దైవంపై కథల్లో చెప్పినట్లు తల్లి, తండ్రులు వదిలి పెట్టిన అనాథ బాలకుని కథలాయన విన్నా ఆయనకు రుచించవు. మనకూ అంతే. ఒక మహావతారమంతా అధ్వాన్నంగా పుట్టటం, పెరగటం నమ్మశక్యంకానిది కదా.

ఐతే బాబా స్వయంభువా ? అన్ని అవతారమూర్తుల దైవాల రూపంలో భక్తులపై కారుణ్యం ప్రదర్శించినవాడు – ఇతరుల కథల్లో





చదవలేదు. సర్వదేవతా రూపాలను ఆంజనేయుడు – దత్తాత్రేయుడు – గణపతి వంటి హిందూ దేవతామూర్తులనే కాక జైన తీర్థంకరుల రూపాలను ప్రదర్శించిన లేదా ప్రకటించిన ఆది దేవుడాయన.

బీరారులో భౌమ గ్రామనివాసిని సూర్ణాబాయికస్లీవాలన్న మహిళకు స్వప్నం వచ్చింది. అందులో బాబా ఆమెతో 'సాయిబాబా, సాయినాథుని' జపం చేయమని బాబా ఆదేశించాడట. నిత్య దేవతారాధన మాని బాబా జపం చేయటం ప్రారంభించింది. 4వ రోజు కలలో సాయి దర్బారు కన్పించింది నాల్గు పీఠాలు – వాటి పై సాయిబాబా – సాయి నాథుడు – పద్మ ప్రభువు – మహావీర భగవానుడుగా బాబా నాల్గు ఆసనాలపై – తానే అధిష్టించినట్లు కన్పించిందట. ఆమె ఏదో అడగాలనుకోగా బాబాయే అన్నాడట 'చూడమ్మా! వీళ్ళంతా మీ జైన తీర్థంకరులు శాంతినాథుడు – పద్మప్రభువు మహావీర ప్రభువు – వారినడుగు' అన్నాడట. –

ఇది స్వప్నంలో వారివారి ఇష్టదైవరూపాల్లో తానే దర్శనమివ్వటం. అంటే బాబా సర్వాత్మ స్వరూపుడే కదా.

అలాగే అక్కల్ కోట మహారాజుగా గురు మౌలప్ స్వామిగా కొందరకు వారి తండ్రి కంఠస్వరంతో ప్రసంగించటం తన చిత్రరూపాల్లో భక్తులను శిరిడీకి లాగటం. ఇతరత్రా అనేక మానవ రూపాల్లో భక్తరక్షణార్థం పోవటం (దేవు – చందోర్కరు కథల్లో) మరీ అన్నింటి కంటే చిత్రమైనది. ' జామ్నేరు చమత్కారం' లో గుఱ్ఱంబండి తోలేవాడు – గుఱ్ఱాలను సృష్టించటం – చేసిన దైవం, తనను తాను సృష్టించుకోలేదా? ఇతరత్రా లేకపోవచ్చు. ఇక్కడ జరగవచ్చు కదా ?

## అరుళ్ పెరుంజ్యోతి

స్వామి రామలింగం రామలింగ స్వామి అన్న ఒక మహాత్ముడు చిదంబరం దగ్గర 1823లో జన్మించి 1874 లో శివైక్యమైనాడు. వారిద్వారా

లోకానికొక మంత్రం శివుడు స్వయంగా ప్రకాశింపజేసాడు.

అరుళ్ పె రుంజ్యోతి అరుళ్ పెరుంజ్యోతి
తనిప్పు పెరుంకరుదై అరుళ్ పెరుంజ్యోతి
బృహత్ (విశాలం) జ్యోతిస్సు బృహత్ జ్యోతిస్సు
పరమ కరుణాలయమైన బృహత్ జ్యోతిస్సు

వారు స్వయంగా శివకరుణ పొందటం తదనుగ్రహంతో అమృత దివ్య శరీరాన్ని పొందటం జరిగింది. వారొకనాడు రాత్రి చిన్న కుటీరంలో శయనించారు. తెల్లవారి శిష్యులు తలుపులు తీసి చూస్తే ఒక గుప్పెడు బూడిద మాత్రముంది. వారదృశ్యులైన దానికి గుర్తుగా.

వారి రచనలు కోకొల్లలు. ఆ రచనల్లో సృష్టి విధానాన్ని గురించి ఐదు విధాలుగా వివరించారు.

1. భార్యా, భర్తల సంగమం ద్వారా జరిగేది.
2. మహా పురుష స్పర్శ ద్వారా
3. మహా పురుష దర్శనం ద్వారా

ఈ మూడు క్రింది తరగతికి సంబంధించినవట. ఊర్ధ్వ సృష్టిలో

4. శంభు ప్రకాశ దృష్టి

ఇందులో మాతృగర్భంలో పావుగంటలో శిశు సృష్టి జరుగుతుంది. ఇదే వ్యాస భగవానుని జన్మ రహస్యం. సద్యోజాత సృష్టి. అప్పటికప్పుడే మహాత్ముల సంకల్పాను సారంగా జరిగేది.

రెండవది అసాధారణ శంభుసృష్టి. పరమాత్మ స్వయంగా శరీరధారణ చేయటం స్వయంభూత సృష్టి, తనంతతానై శరీరంతో రావటం.

5) విభు పక్షసృష్టి – జడపదార్థాన్ని మహాత్ముని సంకల్ప మాత్ర దర్శనంతో మానవ వ్యక్తి రూప ధారణ చేసి అసాధారణ కార్యాలనాచరింప చేయటం. శాంతి పర్వంలో ఒక పురుగును రాజుగా పరిణమింప చేస్తాడు





వ్యాస భగవానుడు. అక్కల్ కోట మహారాజు ఇలాగా జమీందారు తన జన్మదినంనాడు ముస్తాబై మహారాజు దర్శనానికి వస్తే వారు లాగి లెంపకాయ కొట్టి – వెధవా ! నీలాంటి వారిని నిముషంలో కేవల సంకల్పంతో మహారాజులను చేయగలం. నీవు అలంకరించుకొని వస్తావా అన్నాడట – ఇదంతా ఈ కోవకి చెందినదే. బాబా జన్మ అసాధారణ శంభుసృష్టి అని నిశ్చయంగా చెప్పవచ్చు.

# బాబా గురువు

'సచ్చరిత్ర' మొదటి అధ్యాయంలో బాబా తిరగలి విసిరిన కథ వచ్చింది. దాని పరమార్థం వివరిస్తూ కవి అన్నాడు. 'ఇది వినగానే కబీరు కథ గుర్తుకు వచ్చింది. ఒకరోజు తిరగలి విసురుతుంటే చూచి కబీరు దుఃఖపడ్డాడు. ఎందుకని గురువు అడిగాడట. ఆ తిరగలిలో ధాన్యం నలిగిపోతున్నట్లే నేను లోకంలో నలిగిపోతున్నాను కదా అన్న భయంతో ఏడ్చాను అన్నాడట. దానికి గురువన్నాడు 'భయంలేదు నాలాగే పిడి అంటే జ్ఞానం గట్టిగా పట్టుకో. మనస్సును దైవం పైన కేంద్రీకరించు. క్షేమం కలుగుతుంది' అని.

బాబా విసిరినది మన కర్మలను తప్ప గోధుమలు కాదు. క్రింది రాయి కర్మ, మీది రాయి భక్తి. పిడి జ్ఞానం. అవి సచ్చరిత్ర బాబా విసిరిన దాని పరమార్థం చెప్పాడు. లోకవ్యవహారమంతా కర్మ. దానిని భగవద్భక్తితో ఆచరిస్తూ దైవ చింతనతో జీవితం గడపాలి. అది బాబా బోధలో సారాంశం. జ్ఞాన – భక్తి – కర్మయోగ సమన్వయం బాబా ప్రతిపాదిస్తున్నాడు.

ఈ కథలో కబీరు వృత్తాంతం–బాబా తనది కబీరు మతమన్న దానితో ముడి పెట్టుకొని చూడాలి. అలాగే గురుస్థానంలో సమాధి తన గురువు కబీరుదనీ బాబా అన్నాడట. కబీరు నేత పనిచేస్తు జపం చేసాడంటారు.

బాబా తాను చిన్నతనంలో బీద్గాంలో జరీనేత పనిలో జీవించాననీ – తన యజమాని తనకు సెల్లా బహూకరించాడని చెప్పి – బాబా ఈ వృత్తాంత పరమార్థ వివరణ చేస్తూ ఇలా అన్నాడట 'మనిషి ఇచ్చింది పోతుంది. దైవ మిచ్చింది పోదు' అని అంటే సెల్లా కప్పిన యజమాని అల్లా అన్నమాట. అదే సందర్భంలో ఇంకా అన్నాడు బాబా 'నా యజమాని తీసుకో, తీసుకో అంటున్నాడు. కానీ ప్రతివాడు 'తే తే' అంటన్నాడు. నేనేం చెబుతున్నానో ఎవడూ గ్రహించటం లేదు. నా సర్కారు ఖజానా నిండుగా వుంది అంచులదాకా పొర్లిపోతూంది. ఇది త్రవ్వి ఈ సంపద మీదే కనుక బండ్ల మీద తీసుకొని పోండిరా అంటున్నాను. మీరే ఆ సంపదకు వారసులు. ఎందుకంటే అది మీ తండ్రి సంపద' అని.

కబీరు నేతపని చేసిన సాలె. బాబా కూడా అదే ప్రవృత్తిగా జీవించానంటున్నాడు.

దేవునితో అన్నాడు 'నీకు జరీ సెల్లా బహూకరించాలని చూస్తుంటే నీవేమో నా గుడ్డ పీలికలు దొంగలిస్తున్నావు. ముసలి వాడవైనా నీకీ దొంగబుద్ధి పోలేదా' అని మందలించినట్లు దేవుగారిననుగ్రహించిన కథలో వుంది. ఈ గుడ్డ పీలికలు – వస్త్రం.

బాబా జరీ నేతపని చేయటం – కబీరు మతమనటం, కబీరు వస్త్ర వ్యాపారి కావటం తిరుగలి కథ, ఇదంతా ఒకగిజిగాని గూడుగలాగా వుంది కదా!

దీనిని బట్టి బాబా గురు వృత్తాంతమన్న జరీ సెల్లా మనం నేసుకోవాలి. ఈశావాస్యోపనిషద్విషయంలో మొదటి మంత్రం 'ఈశావాస్యమిదం సర్వం' ఈ కన్పించేదంతా ఈశ్వరునకు నివాసం – ఇల్లు లేదా ఆయన కప్పుకొన్న వస్త్రం. ఆయన దిగంబరుడు అంటే శరీరంలేనివాడు. ఆయన శరీరమే ప్రపంచం, అదే ఇల్లూ అదే వస్త్రమూ. మరొక మంత్రంలో ఋషి ప్రార్థిస్తాడు





"ఓయి సూర్యుడా! నీ వేయి కిరణాలన్నిటినీ వెన్కకు ఉపసంహరించు. ఒకటిగా చేయి. నీలోపలకు చూస్తాను (చూచిన తర్వాత) ఇదేనేను. నీలో వున్నదే నేను. నేనే నీలో వున్నాను" అని.

ఈ కిరణాలన్ని దారపు పోగులు. పడుగు పేకగా, వస్త్రం – ప్రపంచం సృష్టి, భగవంతుని సాలెపురుగుతోనూ పోల్చి చెప్పారు ఉపనిషత్తుల్లో ఋషులు. ఆ సాలెపురుగు సూర్యుడు. మనకు బయట గోచరించే సూర్యుడు కాక లోపలి సూర్యుడున్నాడు. అతడే సృష్టికర్త. అతని క్రిందిదంతా ఆయన కొడుకు యముని రాజ్యం. ఇది మృత్యువు సూర్యునకు పైనున్నదంతా అమృత సామ్రాజ్యం, స్వర్గం. ఇదీ వేద భావనే. వేదంలోనే. సూర్యుడు వాయు దేవతల ద్వారా వారినే నూలు పోగులుగా చేసుకొని సృష్టి అన్న వస్త్రాన్ని చేస్తున్నాడని చెప్పబడినది. ఆయన కిరణాలు అనంతం – వేయి. ఒక్కొక్క కిరణం ఒక్కొక్క నూలు పోగు. చంద్రునికి నూలు పోగు అర్పించటం దీనికే మనలోని మనస్సన్న వస్త్రంలోని కోర్కెలు నూలుపోగులు. వాటిని భగవంతుని కర్పించటం. కాబట్టి సృష్టి దిగంబరుడైన సూర్యునకు వస్త్రం. ఇదే బాబా కథలో వచ్చే పీలికలు – జరీ సెల్లా రహస్యం.

దేవుకు ఇద్దామనుకొన్న సెల్లా బాబా దయావస్త్రహం. అది పోదు.

బాబా 80 ఏళ్ళు జీవిస్తే సుమారు 60 ఏళ్ళు శిరిడిలోనే వున్నాడు. కాని మన కందిన 34 కథలు అందులో 10వ వంతే. 1910లో దభోల్కరు బాబా దర్శనం చేసాడు. 1918లో బాబా శరీర వస్త్రాన్ని త్యజించాడు. దభోళ్కరు విన్న – కన్న కథలు సుమారు 10వ వంతు. అవి చాలు మనం తరించటానికని భావన. ఒక్కొక్క కథ ఒక్కొక్క నూలు పోగు అన్ని కలిపి బాబా ధ్యానంతో – అనుగ్రహంతో నేసుకోవటం మనవంతు. మనకప్పుడు 'బాబా దయ' అన్న జరీ సెల్లా దక్కుతుంది. దాని కహంకారాన్ని పెట్టాలి. తనకూ, మనకూ మధ్యనున్న గోడ అదే కనుక ఆ కథల పరమార్థం భావించుకోవటం మనవంతు.

ఉదా. దభోళ్కరు శనగల కథ. ఒకరోజు ఆయన మసీదులో కూర్చున్నాడు. శ్యామా అన్నాడు – నీ కోటు మడతల్లో సెనగలున్నాయి యేమిటి ? ఏమో నాకు తెలియదని ఆయన సమాధానం. బాబా జోక్యం చేసుకొని "ఇవ్వాళ ఆదివారం. శిరిడీలో సంత, వీడు సెనగలు కొని తింటూ వచ్చాడని' ఆయన గోల పెట్టాడు. నేను తినలేదు. ఇన్నేళ్ళు శిరిడి లో వున్నా సంత విషయం నాకు తెలియదు. అని ఈ సంభాషణ ఎక్కడకు పోయిందంటే బాబా అన్నాడు 'వీడి కొక్కడే తినే దుర్గుణమున్నది'. అంటే – ఆయనన్నాడు – 'ప్రక్కనున్న వారికి పెట్టకుండా నేనెప్పుడూ తినలేదు' అని మరలా బాబా 'సరే ఎవరు లేక పోతేనో'' అన్నాడు. ఆయన మాట్లాడలేదు. బాబా ముగిస్తూ అన్నాడు 'అప్పుడు నీవు – నీలోనున్న నా కర్పించి తినాలికదా. తింటున్నావా?" ఇది ఈ కథ సారాంశం. బయట వారికి పెట్టటమూ – తనకు పెట్టటమే. లోపల వున్నాను కనుక ఇలా చేయటం నీ భక్తికి నిదర్శనం. అంటే అన్నమెలా తినాలి. ఇది బాబా చెప్పినది. దాని కోసమీ సందర్భం కల్పింపబడినది. ఆ సెనగలు తాను కల్పించినవని తేలుతున్నది కదా. ఇందుకే బాబా అన్నది ఈ సర్వం నేనే. కుక్కలో పందిలో దోమలో సర్వత్రా వ్యాపించి వున్నాను. త్రిగుణమయ సృష్టిని – అతీత తత్త్వాన్ని నేనే. నేనే లక్ష్మిని. పరమాత్మను. "నా ఆనందస్వరూపమైన నిర్గుణ తత్త్వాన్ని ధ్యానించు లేదా రోజూ చూస్తున్న ఈ రూపాన్ని ధ్యానించు" అని తన కథ వ్రాసిన కవితో బాబా చెప్పాడు.

కనుక ప్రతి కథా ఒక నూలుపోగు. దీనిద్వారానైనా సూర్యబింబాన్ని చేరుకోవచ్చు. భగవంతుడు గీతలో అన్నాడు. "నేనీ రహస్య విద్యను పూర్వం సూర్యునకు బోధించాను" అని. అధ్యాత్మ విద్యకు సూర్యదేవుడు ఆది గురువు. ఆయన శిష్యుడు ఆంజనేయుడంటే ఇదే. 'ఆయన నాకన్న' అని బాబా అన్నది ఇదే కాబట్టి బాబా సూర్యదేవుడు ఈశ్వరుడు. అతడే గురువు.

ఇందుకే సాయి శరణానందతోను, సారే తోనూ తనగురువు 'రోషన్





షా' అన్నాడని వారన్నారు. అంటే తనను సూర్య మంత్రమైన గాయని ఉపాసించమంటున్నాడా బాబా అని బ్రాహ్మణుడైన శరణానంద గుంజాటన పడ్డాడు. సాఠేకు చివరి అక్షరం 'సా' గానో 'షా' గానో విన్పిస్తే వెంకుసా కాబోలుననుకొన్నాడాయన. కానీ వెంకుసా కాలంవేరు కదా. కాబట్టి బాబా గురువు. ఈశ్వరుడైన సూర్య పరమాత్మ. అంటే తానే. ఆయన కథలే నూలుపోగులు. ప్రతిదీ ముక్తిదాయకమే. ఒక్క కథచాలు తరించటానికి. ఇందుకే బాబా అన్నాడు దభోల్కరుతో రాధాబాయ్ దేశ్‌ముఖ్ కథలో "ఈ ఒక్క కథను ధ్యానించు. మననం చేయి. తరిస్తావు. నా లీలలనంతం అంటూ హారతయిన తర్వాత తన కర్పించిన కలకండను ఆయన చేతిలో పెట్టాడు తన దయగా" – ప్రసాదంగా.

ఇది వ్రాసి దభోల్కరన్నాడు "ఆయన ద్వారా ప్రసరించిన ఈ సచ్చరిత్ర ఒక పెద్ద కలకండ ముక్క" అని. అది పారాయణం చేయటం బాబా ప్రసాదాన్ని భక్తితో ఆస్వాదించటమే.

# బాబా భాష

బాబా మాటలకు మామూలు అర్థాలుండవు. అదంతా యోగ సంకేత భాష. మా చిన్నతనంలో తత్వాలను పాడేవారు. బ్రహ్మంగారి తత్త్వాల్లాగా అందులో మాటలకు మామూలు అర్థాలుండవు. "గూటిలో చిలకేదిరా అన్నా!

గూడు చిన్న పోయోరా"–

అంటే చిలకపాట కాదు. పంచవన్నెల రామచిలక అంటే పంచప్రాణాలు. గూడంటే శరీరం. ఆనాటి వారికివి బాగా అర్థమైనాయి. ఆంగ్ల నాగరకతా ప్రభావం వల్ల మనకర్థం కాకుండా పోయాయి.

"బాబా నీవొక బంగాళాంగనను ప్రేమించావు. నీ మనస్సు పోయింది. అది దొంగ. కుడి, ఎడమ రెండు కాల్వలున్నాయి. మార్గం

తిన్నగా వుంది. ఆమె భర్తను చంపుతుంది. ప్రేమిస్తుంది. ప్రియుడి ప్రక్కనే కూర్చుంటుంది. కానీ లోపల అంతా విషం. నాకు యోగిని అలా కన్పించింది మరి". ఇది సిద్ధపురుషుడైన శరహాపాట.

ఇదంతా కుండలినికి సంబంధించిన విషయం. నీచ స్త్రీ – దొంగది – అంటే కుండలిని. అది కుటిలంగా వంకరగా నడుస్తుంది. అంటే పాము. మనస్సు పోవటమంటే కుండలిని లేవగానే మనిషి చచ్చియోగి పుట్టటం. తిన్నని మార్గమంటే సుషుమ్నా నాడి. భర్తను, మనిషిని – శివుని ప్రేమిస్తుంది. చంపుతుంది. అహంకారం చేస్తే తప్ప యోగం సిద్ధించదు. యోగిని అంటే కుండలినీ శక్తి.

ఇలా వుంటుంది యోగ సంకేతభాష. సాధారణంగా బాబా చెప్పేమాటలు ఈ విధంగానే వుండేవనిబీ ఏదో పిట్టకథలు చెప్పినట్లు చెప్పేవాడని ఆనాటి భక్తులన్నారు. కనుక ఆ మాటలకు మనం మామూలు అర్థాలు చెప్పటానికి వీల్లేదు.

అక్కడ తిట్టు దీవెనగా పరిణమించినది. భక్తులను కోపించి – తర్వాత నేనెప్పుడు కోప్పడ్డాను.

కోపించి వెన్కకు పంపిస్తాడా అని మన దృష్టిలో కోపతాపాలు అక్కడ లేవు. శ్యామాను పాము కరిచింది. మసీదుకు తీసుకొని వచ్చారు. బాబా అన్నాడు 'ఓరీ! పిరికి బ్రాహ్మణుడా మెట్లెక్కబోకు, దిగిపో' అన్నాడట. శ్యామా 'పాపం' నీరసించిపోయాడు. మరల బాబా అన్నాడట. 'ఏమీ భయపడవద్దు. ఇంటికిపో, నీ ప్రాణానికేమి ముప్పు లేదు' అని. అలాగే జరిగింది. ఇక్కడ 'సచ్చరిత్ర' చెప్పింది కదా బాబా దిగిపో అన్నమాట పాము విషాన్ని తప్ప శ్యామాను కాదనీ

కనుక బాబా ఎవరిని కోపించాడంటే భక్తుల కర్మలను. ఇందుకే ఆయన తిరగలి విసిరినది. మన పాపకర్మలను తప్ప ధాన్యాన్ని కాదని సచ్చరిత్ర చెప్పింది. చావడి ఉత్సవంలో – బాబాకు శయ్యనేర్పాటు చేసి





అందరితో పాటుగా తాత్యా కూడా వెళ్తుంటే బాబా అన్నాడట "వెళితే వెళ్ళావు కాని – ఒకసారి వచ్చి నన్ను చూచిపో– నన్ను నా క్షేమాన్ని చూస్తూ వుం"డని.

దీని కర్థమేమిటి? దైవం తనను కాపాడమంటుందేమిటి అంటే నిద్రపోవటానికి

వెళ్తున్నావు. నిద్రలో కూడా నన్ను స్మరించు' అని – బాబా మాటల కర్థాలిలా వుంటాయి. ఇందుకే బాబా చేష్టలు మాటలు చూచిన నాటి జనం ఆయనను పిచ్చి వాడనుకొన్నారు. పరమహంసను అన్నారు – 'వారు మేల్కొన్న మనస్సున్న వారు, మనం మేల్కొన్న లోకం వేరు. బాబా లాంటి వారు మన వెనక రాబోయే జన్మలన్నిటిని చూస్తూ, చూస్తూ మాట్లాడుతున్నారు. మనమేమో ఈ క్షణంలో కూడా లోపల ఏమిటో తెలియక బైటను చూస్తూ మసలుకొంటున్నాం."

బాబా భాష కేవలం సంకేతం. కాబట్టి ఆయన రోషన్ షా – వెంకుసా మరొకటి అన్నాడంటే అదిలోకదృష్టిలో – ఆనాటి వారికి తెలిసిన పేర్లు చెప్పాడే తప్ప నిజంగా వారు తనకు గురువులని కాదు. పరమహంస గురు వెవ్వరు? 'అమ్మ'.

రమణ మహర్షి కెవ్వరు? 'అరుణాచలేశ్వరుడు' బాబాకు అంటే తానల్లా సేవకుడనేవాడు కదా. కాబట్టి బాబాకు గురువు బాబా లేదా అల్లా పరమాత్మ. ఎవరో వకరు గురువనక పోతే లోకానికి తృప్తి వుండదు. ఇందుకే ఆయన పత్రిలో పుట్టాడు. వెంకుసా దగ్గర పెరిగాడు. అన్న పిట్ట కథల, మన తృప్తికోసం మనం చెప్పుకొన్న కథలు తప్ప అది సత్యంకాదు. లోకానికి అబద్ధం రుచించినంతగ సత్యం కాదు.

నానా చందోర్కరుకు బాబా ఒక శ్లోకానికర్థం చెప్పాడని చూచాం. ఆ శ్లోకం గీతలో 4వ అధ్యాయంలో ఉన్న 42 శ్లోకాల్లో 34వ శ్లోకం. అదే ఎందుకు ఆ క్షణంలో చందోర్కరు చదవాలి? బాబా సంకల్పమేదో వుండి

వుండాలి. ఆ సంకల్పం – తాను జగద్గురువునని చెప్పటం కోసం – లేదా నీ గురువునాశ్రయించకుండా తరించలేవని చెప్పటానికి.

బాబా తాను గురువు కోసం వెతుక్కొన్న కథ 'సచ్చరిత్ర'లో వుంది. నల్గురు స్నేహితులు కలిసి గురువును వెతుక్కొన్నారట. ఎక్కడ అడవిలో ? చివరకు బాబాకే గురువు దొరికాడు. అతడు ఎవరు? చదువురాని అడవి మానసి. బంజారా! అంటే గిరిజనుడు. అడవి అంటే దారి దొరకని లోకం, మనిషి గురువు కోసం అల్లాడుతున్నాడు కూడా. రమణ మహర్షి అన్నాడు 'నీకు తపన వుండాలి. ఉంటే దైవమే గురువై వస్తాడని. అ తపన ఆ నల్గురులో బాబాకే వున్నది. బాబా అంటే గురువు కోసం తపనపడే ప్రతి భక్తుడు – దీనినే 'ఆకలి'గా చెప్పాడు. తనకాకలి ఔతున్నది. కనుక బంజారా పెట్టిన అన్నం తిన్నాడు. మిగిలిన ముగ్గురూ కాదని వెళ్ళిపోయారు. వారికాకలి లేదు. వారికి గురువు – దైవం – పుస్తకాల విషయం విద్యా వ్యసనం తప్ప భక్తి కాదు. అందుకే వారు బాబాను వదలి వెళ్ళిపోవటం బాబా అన్నంతినటం అంటే గురుబోధను ఆస్వాదించటం. గురువు కన్పించటం, గురువు ఒడిలో చేరటం జరిగినది. వారంతా వేరు మార్గాలవారు. బాబా ఒక్కడే గురువు కోసం తపన పడ్డాడు. అంటే బాబా మనలనుద్దేశించి చెప్పుతున్నాడు. కనుక మనం గురువుననుసరించే తరించాలి. ఇదే విషయం 'సచ్చరిత్ర' రెండవ అధ్యాయంలోనే చెప్పబడినది. దీక్షిత్ వెళ్ళవచ్చునా అని అడగటం. ఎవరో ఎక్కడని ప్రశ్నిస్తే బాబా పైకనటం జరిగింది. ఈ సందర్భంలో దీక్షిత్ అడిగాడట 'మార్గమేది?" అని. బాబా అన్నాడట 'అక్కడకు వెళ్ళటానికి అనేక మార్గాలున్నాయి. శిరిడి నుండి కూడా ఒక మార్గమున్నది. అది చాలా కష్టమైన దారి, నడుమనున్న అడవిలో క్రూర మృగాలుంటాయని బాబా అనటం. దీక్షిత్ 'దారి చూపే వ్యక్తి ఉ ంటేనో?' – అనటం. బాబా అప్పుడు కష్టం లేదనటం – జరిగినది. ఇదంతా గురువును వెతుక్కొన్న కథే. . ఇక్కడా అడవి వచ్చింది. బాబా గురు అన్వేషణలోనూ వచ్చింది. రెండవ అధ్యాయంలోనే సచ్చరిత్ర' వ్రాసిన





దభోల్కరుకు, భాటేకు గురు విషయంలో చర్చ వచ్చింది. భాటే గురువు వుండి తీరాలన్నాడు. దభోల్కరు 'మన కర్మలను మనమే చేయాలి తప్ప గురువుండాల్సిన అవసరమేమిటనటం జరిగింది. గురు చర్చ ఇక్కడా వచ్చింది. తర్వాత దభోల్కరు మసీదుకు పోతే బాబా దీక్షిత్ తో అన్నాడట "వాడాలో ఏమి జరిగినది? ఆ వివాదం దేనిని గురించి" అని. విన్న దభోల్కరు ఆశ్చర్యపడ్డాడు. వాడా మసీదుకు చాలా దూరాన వున్నది కదా. ఎలా విన్నాడు బాబా. ఆయన సర్వజ్ఞుడై యుండాలని" అంటే గురువాయనే. గురువు అవసరమున్నదని దభోల్కరుకు తెలిసిపోయింది. బాబా గురు కథలో మిగిలిన ముగ్గురు నికడు 'ఆత్మను ఆత్మచే ఉద్ధరించాలి' అన్నాడు. రెండవవాడు 'మనోజయమే మార్గమన్నా'డు. మూడవవాడు సత్యా, సత్య విచారమే మార్గమన్నాడు. నాల్గవ వ్యక్తి బాబా అన్నాడు ఇదంతా పుస్తక జ్ఞానం. దీనివల్ల లాభం లేదు. మన సర్వస్వాన్ని గురువునకర్పించాలి తప్ప మరొక మార్గం లేదు అన్నాడు.

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"

గురువే త్రిమూర్తి స్వరూపుడు. వారికంటే పైనున్న పరబ్రహ్మ. కనుక గురువునకు నమస్కారము. 'ఈ శ్లోకం దత్తాత్రేయులకు చేసే ప్రార్థన. అతడు త్రిమూర్తి స్వరూపుడు. జగద్గురువు. బాబా ఈ సంప్రదాయాన్ని గురించి ప్రధానంగా చెప్పాడు. ఇది శిరిడీ నుండి బాబా వేసిన మార్గం. శిరిడీ మార్గం.

గీతలో నాల్గవ అధ్యాయంలో 42 శ్లోకాల భావం చూస్తే ఆ శ్లోకాల్లో చెప్పిన విషయాలన్నీ బాబా జీవితచరిత్రను వ్యక్తీకరిస్తున్నవి. బాబా జీవిత రహస్యమే ఆ శ్లోకాలు వ్యాఖ్యానిస్తున్నాయి. చందోర్కరుకు గురువునెలా భావించాలో చెప్పి – కృష్ణ పరమాత్మ వంటి గురువులే లోకోద్ధరణం చేయటానికి ప్రతి యుగంలోనూ వస్తున్నారు. వారినాశ్రయించి తరించాలి అని ముగిస్తాడు బాబా. అంటే బాబా గురువెవ్వరు?

శ్రీ కృష్ణుడా? దత్తాత్రేయుడా? – అంటే వారే బాబాగా వచ్చారని భావం. శ్లోకాల భావాలు చూద్దాం.

1. శ్రీ కృష్ణుడంటున్నాడు 'అర్జునా! నేనీ మహాయోగాన్ని సూర్యునకు చెప్పాను. అతని నుండి మనువునకూ, ఇతని నుండి ఇక్ష్వాకునకు లభించినది.

2. ఈ యోగం తర్వాత రాజర్షులకు లభించింది. విశ్వవ్యాప్తమైనది. అది క్రమంగా లోపించినది.

3. నీవు నాకిష్టుడవు. కనుక నీకు చెప్పాను.

'ఇది చెప్పినది సద్గురు కందుకూరు శివానంద మూర్తిగారు.

4. నీకంటే సూర్యుడు పూర్వుడుకదా. నీవు తర్వాత వచ్చావు. ఆయనకు నీవెలా చెప్పావు – అని అర్జునుడి ప్రశ్న –

5. శ్రీ కృష్ణుడన్నాడు "నీకు నాకు అనేక జన్మలు గతించాయి. నీకు తెలియదు. నాకు తెలుసు" – అని.

6. బాబా కథలో రోషన్ షా గురువన్న విషయంలో ఈశావాస్యం ప్రస్తావించటం సూర్యుడే పరమాత్మ జగద్గురువు అని చెప్పటం జరిగింది. ఆ సూర్యుని గురించే కృష్ణ భగవానుడిక్కడ ప్రస్తావించాడు. ఆ గురుపరంపరా మార్గం నష్టమై పోవటం – బాబా వంటి వాదీ వచ్చి దానిని తిరిగి పునరుద్ధరించటం జరుగుతున్నది. 5వ శ్లోకంలో జన్మ పరంపర చెప్పబడినది అవి కృష్ణునకు తెలుసునని, బాబా దగ్గరకు వచ్చిన వారిలో బాబా అంటూ వచ్చాడు. శ్యామాతో మనం 72 జన్మల నుండి స్నేహితులం అనటం. అలాగే ఉద్ధవేశబువాతో బాబా అన్నారు "నీకప్పుడు చెప్పానే అది పారాయణం చేసుకో. అంటే అతడు ఏది ? – అవి ప్రశ్నిస్తే బాబా పూర్వజన్మలో భాగవతంలో చెప్పానుగదా అదే అని భాగవతంలో ఆ విషయాన్ని వ్రేలుదూర్చి చూపించాడట ఇలా ఎంతమందికో బాబా





పూర్వాపరజన్మ వృత్తాంతాలను చెప్పాడు. పాము–కప్ప కథా దీనికి సంబంధించినదే కదా!

కృష్ణుడంటున్నాడు –

'నాకు జన్మలేదు. అయినా నా మాయనాధారం చేసుకొని జన్మిస్తున్నాను.' సరిగా బాబా ఇదే అన్నారు. చందోర్కరుతో 'నా తండ్రి బ్రహ్మము. నా తల్లి మాయ' అని.

7, 8 ధర్మం నశించినప్పుడల్లా నన్ను నేనే సృష్టించుకొంటున్నాను. సాధు సంరక్షణార్థం, దుష్ట శిక్షణార్థం బాబా అన్నాడట.

"తాజుద్దీన్ బాబా, బన్నేమియా, తాను భక్త సంరక్షణార్థమే వచ్చాము – అని. తాజుద్దీన్ బాబా – పూనాలో ఉన్న గొప్ప యోగి. ఆయనను గురించి చాలా కథలున్నాయి. "తాజుద్దీన్ బాబా నాకొకరి ద్వారా ఆయన సగం కాల్చిన బీడీ పంపాడు. నాకప్పుడు 10 సం.లు ఆ తెచ్చిన వ్యక్తి నాతో అన్నాడు "ఇది నీకు కలమై నిన్నుద్ధరిస్తుందని, ఆ తర్వాత నాకనేక ఉన్నత పదవులు వచ్చాయి. తర్వాత 'మెహర్బాబా'ను, గురించి ఢిల్లీలో ప్రసంగిస్తే వారు నాకొక సందేశం పంపారు "నా జన్మదినంనాడు నీవు నన్ను స్మరిస్తావు" అని. అప్పుడు నాకామాట అర్థం కాలేదు. తర్వాత చాలాకాలానికి నేను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయాధిపతియైనాను. ఆ రోజు ఫిబ్రవరి 25. అప్పటి నుండి మెహర్బాబా జన్మదినోత్సవం నిత్యం నా స్మృతిలో మెదిలేది. నా తండ్రి తన మిత్రునితో ఒకసారి తాజుద్దీన్ బాబాను దర్శిస్తే నా తండ్రితో ఆయన అన్నాడు 'ఆ రోజునొక ఫకీరు నీకు తాను తినే రొట్టెముక్కనిస్తే నీవు తిన్నావు కానీ నీ స్నేహితుడు తినలేదు. ఇకనుండి వాడి కన్నంతినే యోగ్యత పోతుందన్నాడు. నిజంగా అలాగే జరిగింది. ఆయన కన్నం పెట్టాలంటే బలవంతాన నోట్లో కుక్కవలసి వచ్చింది" అని ఒకప్పుడు మన దేశానికి ఉపరాష్ట్రపతిగా ఉన్న హిదయతుల్లా 'శిరిడి సాయిబాబా' అన్న ఆంగ్ల గ్రంధానికి వ్రాసిన ముందు మాటలో వ్రాసాడు. తాజుద్దీన్ బాబా ఒక 'ఔలియా' (మహాత్ముడు).

# బన్నేమియా

ఔరంగాబాదులో ఉన్న ఒక యోగీశ్వరుడు బాబా తాను శరీర వస్త్రాన్ని త్యజించ టానికి ముందు నాల్గు నెలల క్రితం బడే బాబా కొడుకు కాసీంను పిలిచి 250 రూ.లు ఇచ్చి షంషుద్దీన్ మియాకిచ్చి – కవాలీ జరిపించమని చెప్పాడు. అతడు ఔరంగాబాదు వెళ్ళి అలాగే చేసాడు కాసిం వెళ్తున్నపుడు. బాబా అతనికొక చేమంతిపూల దండనిచ్చి బన్నీ మియాను చూచి 9వ రోజున 9వ తేదీన అల్లా వెల్గించిన దీపాన్ని తన చోటికి తీసుకొనిపోతున్నాడు "అని చెప్పమన్నాడట. కాసిం అలాగే చేసాడు. ఇతడు బన్నీ మియాను దర్శించినపుడు ఆయన ఒక చేతిని ఆకాశంలోకి ఎత్తి నిలబడ్డాడట. చుట్టూరా వున్న భక్తులు కాసింని వారించారట. ఆయన దగ్గరకు పోవద్దు. ఆయన నిన్ను కొడతాడని. ఒక గంట చూచాడు. బన్నేమియా అలాగే సమాధిలో ఉన్నాడట. అప్పుడు కాసింతో పాటుగా వెళ్ళిన చోటాఖాను ధైర్యం చేసి సాయి యిచ్చిన పూలదండను బన్నేమియా మెడలో వేసి, సాయిబాబా చెప్పమన్న మాటలు చెప్పాడట. బన్నేమియా ఆకాశంలోకి చూస్తూనే కన్నీళ్ళు కార్చాడట.

తర్వాత 4 నెలలకు బాబా శరీర త్యాగం చేస్తాడు. బన్నేమియాను – తాజుద్దీన్ బాబాను బాబా స్మరించాడంటే అర్థమిది.

నా జన్మ – కర్మ – దివ్యములు. ఇది తెలిసినవానికి పునర్జన్మ లేదు. వాడునన్నే పొందుతాడు." బాబా "నేను దైవాన్ని (పర్వదీగార్) నేను శిరిడీలో వున్నాను. నా వయస్సు లక్షల సంవత్సరాలు. నా కర్మ – మీ రక్షణ, ఆశీర్వదించటం నేనందరకూ అంతా ఇస్తాను. నేను వచ్చింది అందుకే.

ఒకసారి శ్రీమతి తర్కడ్‌తో బాబా అన్నాడట. 'అమ్మా నా దగ్గరకు వచ్చే వాళ్ళంతా కాంతా, కనకాలనే కోరుతున్నారు తప్ప, నేనేది ఇవ్వాలని వచ్చానో అది కోరినవాడే కన్పించటం లేదు. అందుకే నాకు విసుగెత్తింది.





వేచి, వేచి ఒకరోజు ఎవరికీ తెలియ కుండా అదృశ్యుడైపోతాను" – "నా ఖజానా నిండుగా వుంది. సుపుత్రుడైన వాడు దానిని తీసుకొని పొండి" అనటం ఇదే. "క్రోధాదులు లేనివారు నన్నే ధ్యానించేవారు – ఆశ్రయించిన వారు, జ్ఞానతపస్వులు – నన్నే పొందుతారు"– బాబా.

'ఊగే–మూగా' కదలకుండా ఉన్నచోటనే ఉండు. అంతా నేనే చేస్తాను. రాధాబాయి దేశముఖ్‌తో చెప్పి "గురు కటాక్షమే అంతా చేస్తుంది. అదొక్కటే తారక మంత్రం'. "ఎవరెవరు దేనికోసం వచ్చినారో వారినలాగే ఉద్ధరిస్తాను. అందరూ తలొక దారిన నన్నే ఆశ్రయిస్తారు".

బాబా అందరను తలొక రీతిగా ఉద్ధరించారు. మహాల్సాపతికి పైసా ఇవ్వలేదు. బడే బాబాకు రోజుకు 50 రూపాయలు దాకా ఇచ్చాడు. దీక్షిత్తును విమానంలో తీసుకెళ్ళాడు. సంతానం కావలసిన వారికిచ్చాడు. (చూ. అమ్రలీల). పరీక్షలో పాసు చేయించాడు (తార్కాడు కొడుకు). రోగాన్ని పోగొట్టారు. ధనాన్నిచ్చాడు. ధర్మార్థ, కామ, మోక్షాల్లో ఏది ఎవరు దేనిని కోరుకొన్నారో వారికదిచ్చారు.

22. ప్రయత్నం లేకుండా వచ్చిన దానితో తృప్తి పడుతూ ఏకాగ్ర బుద్ధితో–

జయాపజయాలను సమానంగా స్వీకరిస్తూ – కర్మ చేసిన వానికి బంధంలేదు.

బాబా జవహరాలీ, తంబూలీ కథల ద్వారా మనకు గురు భక్తిని బోధించటమే. 27. కర్మలన్నిటినీ జ్ఞానం చేత జన్మించే ఆత్మ సంయమయోగాగ్నిలో వ్రేల్చిన వారు – ధన్యులు.

బాబా మహమ్మదీయ స్త్రీ దర్శన వేళ చందోర్కరుకు చెప్పినదిదే. భౌతికంగా నీవు చూచేదీ – అనుభవించేదీ అంతా దైవార్పణం చేయి. అంతా దైవలీలగా భావించు. 24 నుండి 32 శ్లోకాల దాకా అనేక యజ్ఞాలు చెప్పి అన్నిటికంటే జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమని చెప్పి, అది గుర్వనుగ్రహం వల్లనే

లభిస్తుందని చెప్పిన 34వ శ్లోకాన్నే బాబా చందోర్కరుకు చెప్పాడు. ఇదే శిరిడీ మార్గం.

28. ద్రవ్య యజ్ఞం తపో యజ్ఞాదులను కొందరనుష్ఠిస్తున్నారు. బాబా – ఈ ద్రవ్య(ధనం) యజ్ఞాన్నే దక్షిణ ద్వారా మనకు బోధించినది. దైవపరం చేస్తే ధనాన్ని అది ప్రజలకిస్తాడు భగవంతుడు.

32. అనేక యజ్ఞాలున్నాయి. వీటన్నిటికీ కర్త బ్రహ్మము. ఇవన్నీ కర్మ జాలాలు. ఇది తెలిసిన వాడు ఒక్కడే వున్నాడు. బాబా, అనేకులకు వారి, వారి సంస్కారాలను గుణంగా ఉపాసనాదులు లభించడం దానికి సంబంధించినదే.

33. సర్వయజ్ఞాల్లో జ్ఞానయజ్ఞం శ్రేష్ఠం. మహల్సాపతి, చందోర్కరు–ఉపాసనీ– దీక్షిత్–కపర్దే–శ్యామా–ఎందరో బాబా ననుసరించి తరించారు.

34. 'మూర్ఖుడు–శ్రద్ధ లేనివాడు–సంశయాత్ముడు నశిస్తారు. సంశయాత్ములకు ఈ లోకమే లేదు. పరలోకం మాటేమిటి ?

బాబా 'ఈ మసీదులో నుండి నేనెన్నడూ అబద్ధమాడను' అన్నమాట సంశయాత్ముల కోసం చెప్పినదే.

ఇలా బాబా కథలను వివరించుకొని బాబా కృష్ణ పరమాత్మ, సర్వ జగద్గురువు. వీరికి గురువు వేరే మానవులు లేరని భావించి, ఆరాధించి తరించాలి తప్ప – ఎవరో ఉన్నారని వ్రాయటం కేవలం కృష్ణునకు సాందీపని గురువన్నమాట చెప్పుకోవటమే.

# గురుస్థానం

'భజామి శిరసిస్థితం గురు పాదారవింద ద్వయం'

1912లో శ్రావణ పౌర్ణమినాడు బాబా అనుమతితో గురుస్థానంలో వేపచెట్టు క్రింద గురు పాదప్రతిష్ఠ జరిగింది. ఆ పాదాలనూరేగింపుతో





బాబా దగ్గరకు తీసుకొని రాగా వాటిని తాకి బాబా అన్నాడట అవి 'దైవ పాదాలని' ఆ దైవం గురువు. ఆ గురువు తానేనని బాబా చెప్పలేదు. కానీ తాను జగద్గురువు ననకుండానే వాటిని తన పాదాలుగా స్థాపింపచేసాడు.

గురుస్థానం సహస్రార కమలం. అక్కడ శివ పాదాలున్నాయని తంత్ర గ్రంథాలు చెబుతున్నాయి. దీనినే 'గురు పాదుకా పంజరమనీ' అంటారు. తాను గురు సంప్రదాయాన్ని స్థాపించటానికి వచ్చాడు కనుక బాబా దానికి గుర్తుగా ఈ గురుస్థానంలో పాదుకలను ప్రతిష్ఠింప చేసి మనలనుద్ధరిస్తున్నారు. ఆ పాదాల జంటలో కుడిది శివునిది. ఎడమది జగన్మాతది. ఆ తల్లి వామ పాదమే బాబా భూమి మీద పెట్టి కూర్చున్నాడు. దక్షిణ పాదం ఎడమ మోకాలి పైది. వామపాదం తల్లి పాదం అమ్మ పాదం.

"హే పాయ్ పురాతన్ పార్" అంటే నిత్యమూ ఎల్ల కాలాల్లోనూ యోగులు ధ్యానించే సహస్రారకమలంలో పరమేశ్వరీ, పరమేశ్వరుల పాద కమలాలు.

అవి జగత్తుపై కరుణామృతాన్ని వర్షిస్తున్నవట. వానిని భావన చేయటం వల్ల మన శరీరమంతా అమృత వర్షంతో తడుస్తున్నది. ఈ మాటలు యోగ శాస్త్రాలు చెప్పినవే. కాబట్టి బాబా " ఆది ద్వంద్వమైన పార్వతీ, పరమేశ్వర స్వరూపుడన్న భావన భక్తులకుండాలి. ఆ దృష్టితోనే గురుస్థానంలో పాదుకలను, అగరు – సాంబ్రాణి ధూపం వేసి నమస్కరించాలి. సమాధి మందిరం ఆజ్ఞా చక్ర స్థానమన్నాం. ద్వారకామాయి మణిపూరచక్రమనీ, చావిడి మూలాధారమనీ అన్నాం.

శిరిడీ దర్శనమీ దృష్టితో చేయటం మనవంతు. చావడిలో బాబా రోజు విడిచి రోజు నిద్రించే వాడని కదా చెప్పింది. కనుక మూలాధారం. ఇదంతా యోగ శాస్త్ర పరంగా చెప్పినది.

శ్రీ రమణ మహర్షి నెవరో ప్రశ్నించారు. 'ఆత్మ దర్శనానికి గురువు అనుగ్రహ మవసరమా" అని. దానికి రమణుల సమాధానం "బోధ, శ్రవణ,

– మననాదులకంటే అదే ప్రధానం” అని. ఇదే బాబా మార్గం కూడా. మరొకచోట వారే అన్నారు.

గురుపాద దర్శనం ధ్యానంలో తోచిందంటే చాలు. ఇంకేమి అక్కర్లేదు. సర్వమూ సిద్ధించినట్లేనని.

# దివ్య కార్మికుడు - కర్మిష్ఠి

గీతలో భగవంతుడన్నాడు.

“నా జన్మ – నా చేష్టా దివ్యములు తప్ప మానవోచితములు కావు” – అంటే అర్థమేమిటో? బాబా జీవిత చరిత్రను భావిస్తే తెలుస్తుంది.

కర్మ చేయకుండా ప్రపంచ గతి సాగదు. అంటే మనకు గడవదు. శరీరం దాని కోసమే వచ్చింది. జన్మ దేనికి వచ్చినట్లు? నీవు ముక్తుడవు కావటానికి తప్ప.

ముక్తి అంటే చచ్చిపోయి ఏ స్వర్గంలోనో, వైకుంఠంలోనో ఉండటం కాదు. జన్మ – ముక్తీ రెండూ వక్కటే.

ముక్తుడవు కావటమంటే జీవిస్తూనే కర్మలు చేస్తూనే వాటి ఫలాలను వదలటం. అసలు ముక్తి సంగతిదేనికి ? జీవితమంటే తెలిస్తే అదీ తెలుస్తుంది.

గీతలోనే చెప్పాడు ఈ సృష్టి ఒక మహా చక్రరీతిగా తిరుగుతున్నది. ఎవడు దానిననుసరించి – తనను తాను భగవంతుని, ఈ సృష్టి క్రమాన్ని అనుసరిస్తాడో వాడు ధన్యుడని.

కాబట్టి సృష్టి దైవ నిర్మాణం. వాడు సూత్రధారిగా నడిపిస్తున్న ఈ జన్మను అతనిని దృష్టిలో పెట్టుకొని జీవించటమే ముక్తి,

ఈశావాస్యోపనిషత్తులోనూ చెప్పబడ్డది. “కర్మలు చేస్తూనే జీవించాలి నూరేళ్ళు. ఇదే నీకు విధింపబడిన కర్మసూత్రం. కర్మలు నిన్ను బంధించవు.





ఎవడీ పద్ధతిననుసరించడో వాడు చీకటి లోకాలను పోతున్నాడు. అనుసరించిన వాడు వెలుగులోకి పోతున్నాడు అని.

‘ఇదే గీతలో పైన చెప్పిన చక్రభ్రమణం. జామ్నేరు చమత్కారంలో చూచాం కదా – ‘అన్నీ తానే ఏర్పాటు చేసి భక్తుని ఉద్ధరించటానికి బాబా బువాను పంపించాడు.

‘నా దగ్గర రైలు టిక్కెట్టుకు తప్ప డబ్బు లేదు బాబా’ అంటే అన్నీ అవే ఏర్పాటవుతాయిలేరా! అన్నది దైవం. గురువులు చెబుతున్నారు “నీవు దైవానికంకితం కాగలిగితే తర్వాత నీకు చేయవలసిందేమీ లేదు. అంతా అక్కడే సిద్ధంగా వుంటుంది.” – ఈ మాట సద్గురు శివానందుల వారిది.

బాబా బువా దైవం మాట విన్నాడు. అన్నీ వాటంతటవే అమరినవి కదా. పుండరీక రావు కథలో కొబ్బరి కాయ విషయంలో ‘నీవు దేనికీ కర్తవు కావు. అన్నీ నేనే చేసాను” అని. అలాగే చందోర్కరు ఆడవాళ్ళను చూచి చలించినపుడు బాబా అన్నాడు.

“ఈ సృష్టి అంతా అందాలరాశి” (సుష్టు కృతం = బాగా చేయబడినదని) దీనిని చూచి ఆనందించటానికే నీకు అవయవాలు వచ్చాయి. దానిలో నీది నాదీ అనుకోక తటస్థంగా అనుభవించు”. ఈ మాటలన్నీ ఏం చెబుతున్నాయి. గీత – ఈశావాస్యం చెప్పిన మాటలే కదా.

ఒకసారి రైల్లో రేగే (ఇండోరులో న్యాయాధిపతి) బాబా దర్శనార్థం వస్తున్నాడు. రైలొక స్టేషన్లో ఆగితే మిలటరీ అధికారి వచ్చి రైలు ఖాళీ చేయమని ప్రయాణీకులతో చెప్పాడు. అంతా దిగి పోతున్నారు. రేగే కూడా దిగుతుంటే మళ్ళీ అధికారి వచ్చి “వద్దులే. ఈ పెట్టెతో మాకు పనిలేదు. మీరు కూర్చోవచ్చున్నాడు’. రేగే శిరిడీ రాగానే బాబా అన్నాడట “ఆ అధికారితో నేనే చెప్పాను. వారు నా భక్తులని”. అందుకని అతడు మిమ్ములను వదలి పెట్టాడు’ అని. ఎక్కడ చెప్పాడు బాబా అంటే అధికారి హృదయంలో

స్ఫురింపజేశాడు. మనలాగా చెవిలో చెప్పలేదు. ఇది అంతర్యామి ప్రచోదన. గాయత్రీ మంత్రార్థమిదే. నన్ను దైవం ప్రేరేపించుగాక – అని. నీవు సద్బుద్ధిని ఆలోచననివ్వమని వేడుకో ఇస్తాడు. కనుక జీవితమంతా ముక్తికి బాటే. మోక్షప్రస్థానమే. ఎప్పుడూ ఇదినాది కాదు. ఇందులో నాదేమి లేదు. అంతా ఆయనది. ఆయన చెప్పినట్లు నడచుకోవటమే నా బాధ్యత. ఆయన ఇచ్చినది ఆయన కివ్వటమే నా వంతు. 'కస్య స్విద్ధనం' – ఈశావాస్య మన్నది. ధనమెవడిదిరా! నీది కాదు. ఆయన ఇస్తున్నాడు. నీవు తీసుకొంటున్నావు తప్పు. నీవు చేస్తే వచ్చింది కాదు. ఆయన అనుగ్రహం. ఇదే బాబా అన్నాడొకరైతుతో. వాడు పైరు పోయిందని ఏడుస్తున్నాడు. నీవు చల్లిన గింజలెన్నిరా? సకాలంలో వర్షం కురిస్తేనే పండుతున్నది. ఇందులో నీవు చేసినదేమిటి? అల్లా ఒక చేత్తో యిస్తాడు. మరొక చేత్తో తీసుకుంటాడు –అని బాబా అనటంలో తాత్పర్యమేమిటి? ఇచ్చినపుడు సంతోషిస్తున్నాడు మనిషి. తీసుకోగానే ఏడుస్తున్నాడు.? కష్టాలు – దుఃఖాలు, సుఖాలు నష్టాలు అన్నీ దైవమిచ్చేవే. నావని నీవనుకోవటంతోనే ఈ బంధమేర్పడుతున్నది. ఇదే. దాసగణుకు ఈశావాస్య భావంగా పనిపిల్ల పాటతో బాబా స్ఫురింపజేసిన అర్థం.

బాబాకు జీవితమేమున్నది? ఆయన గృహస్థు కాదు. సన్యాసి కాదు. పీఠాధిపతి కాదు. ఇందుకే నానా వలీ బాబా శిరిడీ రావటానికి ముందుగా వచ్చి శరీరత్యాగానంతరం 14వ రోజున తాను స్వర్గానికేగిన ధన్య జీవి." "బాబా నొకసారి గద్దె దిగమన్నాడు. అదేమైనా రత్న సింహాసనమా? బాబా దిగాడు. నానావలి కాసేపు కూర్చొని వెళ్ళి పోయాడు. ఇంతే కథ. అర్థమేమిటి? బాబా పీఠాధిపతికాడు. ఆయనకు వారసుడు ఎవరూ లేరు. ఆయన కాయనే వారసుడు. దేవు గుడ్డపీలికల కథలో బాబా చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి. "నేను నీకు జరీ సెల్లా నిద్దామని చూస్తుంటే గుడ్డ పీలికలేరుకుంటావేమిటిరా?" – అని అంటే 'నీ కళ్ళతో చూచి తెలుసుకోవాలి నిజా నిజాలు. నేనేమిటో? అంతేకానీ వాడినీ, వీడిని అడిగితే వారేం





చెబుతారు. నన్ను గురించి వారికేం తెలుసు గనుక' అని అంటే బాబాకు–మనకు నడుమ పూజారి పురోహితుడు లేడు. నేరుగా నీవే అడుగు బాబాను. ఆయనే నీ దగ్గరకు నేరుగా వస్తాడు. నీ బాబా వస్తాడు.

ఇదీ జరి సెల్లా. ఆయన దయను ఎవడో మోసుకొని నీ దగ్గరకు తెచ్చి ఇవ్వడు, తానే మన బరువంతా మోసే కర్మిష్ఠి. కనుకనే 'ఊగే మూగే' – కదలక కూర్చో. నేనే చేస్తాను. ఇదీ బాబా అభయహస్తం. చాలా బొమ్మల్లో, ఇటీవల బాబా ఆశీర్వదిస్తున్నట్లు చూస్తున్నాం. అది బాబా పద్ధతికాదు. ఆయన అలా ఆశీర్వదించలేదు. ఆయన దయే ఆయన అభయ హస్తం. ఒక్కడుగు వేస్తే ఆ తండ్రి ఏడడుగులు నీ వైపు వస్తున్నాడు. ఒక రూపాయి దక్షిణనిస్తే 10 రెట్లు నీకిస్తున్నాడు! ధనమెవరిది? అంటే దైవానిది. కనుకనే దక్షిణ సంప్రదాయాన్ని ఏర్పాటు చేసి, నీకు దానగుణం బోధించి – తరింప చేస్తున్నాడు. నీవు బ్యాంకులో వేసుకోవటం. మరొక జన్మకు అది దారి బత్తెం. దానిని లేని వారికిచ్చాడు. అంటే లేని వారికి వ్వమని బోధించటమే దక్షిణ తీసుకోవటానికర్థం.

సర్వజంతువులూ తానే నన్నాడు. వాటిని ఆదరించు. పూర్వకాల, మన సమాజంలో ఈ లక్షణముండేది. చెట్టునూ, పుట్టనూ, జంతువులనూ, మనిషినీ ఆదరించటం. దీనినే నరయజ్ఞము, భూత యజ్ఞమని ధర్మశాస్త్రకర్తలు చెప్పారు. అతిథి, అభ్యాగతుల నాదరించినట్లే నీ చుట్టూ వున్న జీవరాశులను ప్రేమించి ఆదరించాలి. బాబా జీవితమంతా మనమిలా బ్రతకాలనీ – అదే ముక్తి అని బోధించటానికే వచ్చాడు. అవతార కార్యమిదే. లోక రక్షణ మంటే ధర్మ స్థాపన మంటే లోకానికిలా బోధించటమే. దుష్ట శిక్షణ అంటే చావగొట్టటం కాదు. శిక్షణ అంటే జీవిత విధానమిలా వుంటుందని గురువులా బోధించటం. శిక్షణ అంటే 'ట్రెయినింగ్'.

ఇది బాబా 'దివ్య కర్మిష్ఠి' అంటే "నాకేమీ కర్మలు లేవు. అయినా చేస్తున్నాను. ఎందుకంటే నన్ను చూచి లోకం నేర్చుకుంటుంది" – అని

గీత చెబుతున్నది. "నామీద దృష్టి నిలిపి లోకంలోకి వెళ్ళు" ఇదే బాబా బోధ. అప్పుడు కర్మలు నిన్ను బాధించవు. బంధంకావు. కనుకనే "అన్నమిలా తినాలి – ఇలా నిద్రపోవాల"ని కూడా బాబా చెప్పారు.

# శ్రద్ధ - సబూరి

ఈ రెండు రూపాయల దక్షిణనే బాబా మనలనడిగింది. బాబా తన గురువు నన్వేషించిన కథలో గురువుగారిని దర్శించినపుడాయన తననీ రెండు రూపాయల దక్షిణ నడిగినట్లు – తానిచ్చినట్లు చెప్పారు.

శ్రద్ధ – 'దైవం, గురువు, వేదం మీద విశ్వాసముండట'మని చెప్పారు పెద్దలు. అదొక దైవగుణం. మనం సాధించదగినది. కానీ అది పై లోకాల నుండి దైవానుగ్రహంతో సిద్ధించేదని శాస్త్రాలు చెబుతున్నాయి. 'దేవీ సప్తశతి'లో అది అమ్మవారుగా చెప్పబడినది. కఠోపనిషత్తులో నచికేతుని శ్రద్ధ ఆవహించినదని చెప్పబడినది. అంటే తాను తెచ్చుకొన్నది కాదు. దేవలోకాల నుండి దిగి వచ్చిన భగవంతుని దయ. 'అది ఆత్మ దర్శన శక్తి. దానితోనే మనిషి దేవుడౌతున్నాడు. ఏ విధంగా లోక జ్ఞానానికి– కన్ను– ముక్కు వంటి ఇంద్రియాలు సాధనాలో, అలాగే దైవాన్ని దర్శించటానికి శ్రద్ధసాధనం". ఇది గాఢమైన విశ్వాసం. దైవం – గురువు మీద విశ్వాసంతో బ్రతకటం.

'తర్కం – వాదం' అహంకారం నుండి పుడితే శ్రద్ధ నిరహంకారం అహంకారం లేకపోవటం నుండి జన్మిస్తుంది. నీవు అహంకారస్థానంలో గురువునో – దైవాన్నో కూర్చోబెట్టి పూజించటం శ్రద్ధ' ఇది సత్వ – రజస్సు – తమస్సులనే మూడు గుణాలతో కలసి బయటకు ప్రవర్తనగా వస్తుంది. సత్త్వం ప్రధానమైతే సాత్త్విక శ్రద్ధ. రజస్సు ప్రధానమైతే రాజసిక శ్రద్ధ. తమోగుణం నుండి వస్తే తామసిక శ్రద్ధ. మనిషి ప్రవర్తన వీటినుండే పుడుతుంది. దైవ దర్శనానికి కావలసినది సాత్త్విక శ్రద్ధ. తానాత్మ





స్వరూపుడను తప్ప శరీరాన్ని కాదన్న నిత్య సంకల్పం శ్రద్ధ. నేనే ఆత్మనన్న అచంచల నిష్ఠ – విశ్వాసం శ్రద్ధ

ఇందుకే భగవంతుడు గీతలో అన్నాడు 'జీవుడు శ్రద్ధామయుడు'. శ్రద్ధ అన్న పదార్థంతో తయారైనాడన్నాడు. మనిషి రజస్తమస్సులతో ఆవరింపబడిన తనను తాను శరీరాన్ని అనుకోవటం నుండి దైవం నుండి వేరుపడి పోతున్నాడు. ఇందుకే బాబా ఒకచోట అన్నాడు. "నీకు, నాకు మధ్యనున్న ఆ గోడను కూల్చివేయి. అప్పుడు మన మొకరినొకరం చూచుకోవచ్చు" అని.

ఈ నేను – అన్న భావన సంశయాన్ని కల్పిస్తుంది. 'సంశయాత్మా వినశ్యతి' అన్నాడు గీతలో. సంశయించటం మానవ స్వభావం. కనుకనే బాబా దేవుతో అన్నాడు "నీ కళ్ళతో నీవు చూచి నిజానిజాలు తేల్చుకోవాలి గానీ వాడినీ, వీడినీ అడగటం దేనికి? గుడ్డ పీలికలు దేనికిరా. జరీ సెల్లా ఇవ్వటానికి నేను సిద్ధంగా వుంటే" ననీ.

మీ తండ్రి ఆస్తి ఇది. తీసుకొని పోండి రా – అంటే 'తేతే' అని అడుగుతున్నా రేమిటనీ – అనటంలో తాత్పర్యం శ్రద్ధతో – అహంకారం లేకుండా నా దగ్గరకు రండి. వచ్చి, చూచి విశ్వసించండి అనే ఇదంతా శ్రద్ధను గురించి బోధించటమే. ఫలం మీద కోర్కె లేకుండా మన విధులను మనం నిర్వహించటం బాబా చెప్పినట్లు చూడటం – ఆచరించటం సాత్త్విక శ్రద్ధ.

ఇవి లేకుండా కర్మలు చేయటం తామసికం. ఎక్కడ భక్తి వుంటుందో అక్కడ శ్రద్ధ వుంది. ఇవి రెండు కలసిమెలసి వుంటాయి కనకనే భక్తి, శ్రద్ధలన్న మాట పుట్టింది.

"పిడికిలి కొలదీ బియ్యమ"న్నట్లు

'శ్రద్ధ కొలదీ దైవం'

పిడికిలి శ్రద్ధ – బియ్యం భక్తి.

# సబూరి

ఈ మాట సూఫీమతంలోది. అరబ్బీ భాషలో 'సబర్' అన్న మాటకు అర్థం అనంతమైన ఓర్పు. సంతోషంతో ఎదురు చూడటం. ఓర్పు దుఃఖంతో ముడిపడింది కాదు. ఆనందంతో ముడిపడింది. దీనితో శ్రద్ధ ముడిపడి ఉన్నది. దీనికి మూలం

శరణాగతి భగవత్కరుణ కోసం ఆనందంతో ఎదురు చూడటం. దీనిద్వారా క్రమంగా మనిషిలో మమతాహంకారాలు లోపించి పోతాయి. ఒక నిత్య జాగృతి ఏర్పడుతుంది. భగవంతుడు ఏ క్షణంలోనైనా, ఏ రూపంలోనైనా రావచ్చునన్న జాగరూకత మనకున్నపుడు మనలోని ప్రత్యణువు దానికోసం సంతోషంతో మేల్కొని ఉంటుంది. ఈ నిత్యజాగృతినే భగవద్గీత "సర్వ భూతాలకు ఏది రాత్రో, యోగికది పగలు ; వారికేది పగలో యోగి కది రాత్రి" అన్న ప్రతీకా భాషలో చెప్పింది".

సూఫీ మతంలో దీనికొక కథ చెప్పబడింది. ఒకామె కల్పవృక్ష ఫలాన్ని గూర్చి విని, దాన్ని వాంఛించి ఒక యోగి దగ్గరకు వెళ్ళి "నాకు ఆ ఫలం కావాలి. దానితో క్షణంలో నేను జ్ఞానాన్ని పొందాలి. దయచేసి ఆ ఫలం ఎక్కడ దొరుకుతుందో చెప్పండి" అంది. ఆ యోగి విని " అలా అయితే నీవు నాతో పాటు ఉండి చదువుకో" అన్నాడట. "అలా కాకపోతే దానికోసం నీవు జీవితమంతా సేవించాలి" అన్నాడట. అది విని ఆమె లాభం లేదనుకొని ఒక పండితుని దగ్గరకు, తరువాత ఒక హకీము దగ్గరకు, ఒక ముని దగ్గరకూ, ఒక శాస్త్రవేత్త దగ్గరకూ – ఇలా వెళ్తూనే ఉంది. అలా ఆమె ముప్ఫై ఏళ్ళు తిరిగి తిరిగి, చివరకు ఒక వనాన్ని సమీపించింది. అక్కడ కల్పవృక్షమున్నది. దానికా ఫలమున్నది. ఆ చెట్టు ప్రక్కనే తాను మొదటిసారి చూసిన యోగి నిలబడి ఉన్నాడట. అపుడామె అతనిని అడిగిందట "ఈ ఫలం నాదగ్గరే ఉందని మొదటిసారిగా నేను మీ దగ్గరకు వచ్చినపుడు చెప్పలేదేమిటి?" అని. ఆయన నవ్వి "అపుడే చెబితే నీవు





నమ్మవు పైగా ఈ చెట్టు ముప్ఫై ఏళ్ళ కొకసారే కాయ కాస్తుంది" అన్నాడట.

ఈ కథలో మొదటిసారి ఆమె చూచిన వ్యక్తి ఒకడే నిజమైన గురువు. తరువాత చూసిన వాళ్ళంతా పుస్తకాలు చదివిన వారూ. నైతిక ప్రవర్తన తెలిసిన వారు తప్ప, యధార్థమైన వస్తువును తెలిసిన వారు కారు. ఇందుకే మొదటి వాడే చివరకు కనిపించి ఫలాన్నిచ్చాడు. ఆ ముప్ఫై ఏళ్ళు ఆమె ఓర్పుతో దాన్నే అన్వేషిస్తోంది. దాని ఫలితంగా ఆ కల్పవృక్ష ఫలం లభించింది. ఆ తోటనే అరబ్బీ భాషలో టేఖర్ (టేఫీ) అనీ, క్రైస్తవ భాషలో 'ఈడెన్' అనీ, మన భాషలో 'స్వర్గం' అనీ ఉపనిషత్తులలో 'వనం' అనీ అన్నారు. అదంతా మనిషి అంత శ్చైతన్య వికాస సంకేతం. వసంతం రాగానే తోటంతా పుష్పించినట్లు, గురు స్పర్శ తగలగానే అంతశ్చైతన్యమన్న వృక్షం ఆపాదమస్తకం పూలు పూచి, కాయలు కాచి ఫలభారంతో వినమ్రమవుతున్నది. ఈ తోటనే 'గురువు' గారి బడి అనీ, గురువుగారి తోట అనీ సూఫీ మతం చెపుతున్నది. ఆ గురువుతో పాటు చదవటమంటే దాన్ని అనుభవించటముతప్ప దానిని పుస్తకాలలో చదవటం కాదు. దాని కోసం ఆ చదువు – ఏ చదువు ' క్షమ'ను (సబూరి) చెపుతున్నదో అది చదువు – తప్ప, పుస్తక పఠనం కాదు. కనుక గురువుతో పాటే ఉండి చదవటమంటే, మన సర్వేంద్రియాలను గురువు నందు లగ్నం చేయటం – అతనిని ఆపాదమస్తకం ఆస్వాదించడం. అక్కడ పుస్తకం లేదు. దైవ ప్రతిరూపమైన గురువే ఉన్నాడు. మౌనంగా గురు సన్నిధిలో ఉండి, ఆ నిశ్శబ్దంలో మనలోపల గురువును చూడటం – అది ఒక నిశ్శబ్ద భాషా రూపమైన ప్రార్థన. ఏ మహాగురువు నిశ్శబ్దంగా అనుభవించబడుతున్నాడో

ఏ – అనుభవం నీలోని వెలుగును బయటకు తెస్తున్నదో అది చదువు. కనుక

ఇదే బాబా తాను గురు సన్నిధానంలో ఎలా ఉన్నాడో రెండు, మూడు చోట్ల కథారూపంలో వ్యాఖ్యానం చేశాడు. 12 ఏళ్ళు తాను గురువు

దగ్గర ఉన్నాడట. ఏం చేశాడు? అంటే వారికి రెండు పైసల దక్షిణ ఇచ్చాడట. ఒక పైసా శ్రద్ధ, రెండవ పైసా! సబూరి. నిత్యమూ బాబా గురువునే ధ్యానించేవాడట. అందుకే ఆ గురువు తల్లి తాబేలు, పిల్ల తాబేలుపై తన దృష్టి ప్రసరించి సాకుతున్నట్లుగా బాబాను రక్షించాడట. మరొక కథలో బాబా గురు సేవను గురించి చెపుతూ "నా ఇంద్రియములు తమ, తమ స్థానాలు వదిలి నేత్రాలలో లయించిపోయినవి. ఆ నేత్రాలు గురువులో లయించిపోయినవి. నాలో గురువు తప్ప మరొక స్పృహ లేదు" – ఇది గురువు దగ్గర శిష్యుడుండి చేర్చుకున్నారట. అది బాబా అందమైన బడి అట. అక్కడ బాబా గురువును చదివాడట. ఈ బడి మనం చదివే పాఠశాల కాదు. ఇందాక చెప్పిన కథలోని తోట. ఆ బడి ఆత్మదర్శనాభ్యాసం చేయించేది. ప్రాచీన కాలంలో ఆశ్రమాలలో శిష్యులకు ఆత్మబోధ కావించిన బడినే బాబా పైన చెప్పాడు.

బాబా రెండు చోట్ల తన గురుసేవా వృత్తాంతాన్ని వివరించాడు. రాధాబాయితో చెప్పిన కథ ( 18, 19 అధ్యాయాలు) 32వ అధ్యాయంలోని కథ. మొదటి కథలోనే శ్రద్ధ, సబూరీలన్న గురుదక్షిణలను గూర్చి బాబా ప్రస్తావించాడు. రెండవ కథలో గురువు గారిని గూర్చి బాబా చేసిన అన్వేషణ, శ్రద్ధలను గూర్చి చెప్పబడింది.

దీనికి వ్యతిరేకంగా 16,17 అధ్యాయాలలో ఒక ధనికుడు బాబాను సమీపించి, సాష్టాంగ నమస్కారం చేసి బ్రహ్మజ్ఞానాన్ని త్వరగా ప్రాప్తింపజేయమని ప్రార్థించిన కథ చెప్పబడింది. ఆ కథలో శిష్యుడు, యథార్థ శిష్యుడు కాదు. అతనిలో శ్రద్ధ, సబూరీలు లేవని బాబా నిరూపించాడు. అతడిని అక్కడ కూర్చుండబెట్టి ఒక పిల్లవాణ్ణి ఐదు రూపాయలు అప్పు తెమ్మని పంపించాడు. ఆ అప్పు దొరకలేదు. ఇదంతా బ్రహ్మ జ్ఞానాభిలాషికి అర్థం కాలేదు. అపుడు బాబా అతని జేబులో ఉన్న నోట్ల కట్టను బయటకు తీయ మన్నాడట. అతని జేబులో రూ 250/- ఉన్నా, బాబా అడిగిన ఐదురూపాయలు ఇవ్వలేక పోయాడు. అపుడు బాబా అన్నాడట. దైవాన్ని చూడాలి అనుకున్నవాడు ఐదు వస్తువులను సమీకరించాలి. అవి 1.పంచ ప్రాణాలు, 2.పంచేంద్రియాలు 3.మనస్సు 4.బుద్ధి 5.అహంకారం – ఈ అయిదింటినీ బాబా తన గురుసేవా వృత్తాంతంలో శ్రద్ధ, సబూరీల ద్వారా సమర్పించినట్లు ఈ కథ ద్వారా దాన్ని అర్థం చేసుకోవాలి. తన మనోబుద్ధ్యహంకారాలన్నీ నేత్రాలలో కేంద్రీకరించి, ఆ నేత్రాలను గురువులో లయించానని బాబా చెప్పిన విషయమే ఈ కథలో వాక్యంగా చెప్పబడింది. బాబాకు కావలసిన అయిదు రూపాయలు పంచప్రాణాదులు తప్ప డబ్బు కాదు.





# ధుని

బాబా ద్వారకామాయిలో ఏ రోజున, ఏ క్షణంలో కాలు పెట్టాడో, కూర్చున్నాడో, నిద్రించడం మొదలు పెట్టాడో ఆ పవిత్ర దినమేదో మనకందలేదు. ఏ శుభముహూర్తంలో 'ధుని' ప్రజ్వలింప చేశాడో మనకు తెలియదు. కానీ నేటికీ ఆ రెండూ పవిత్రతకూ, మహత్తుకూ, తాపత్రయ నిర్మూలనకూ ఔషధాలై పోయినాయి. ఈ నాటికీ వీటి మాహాత్మ్యం మన ఇంటికీ ఒంటికీ ప్రాకి వచ్చి వెన్ను తట్టి ప్రకటిస్తున్నాయి.

చాంద్ పాటిల్ గుర్రాన్ని వెతుక్కుంటూ పోతూ దారిలో బాబాను దర్శించినపుడు, ఆయన చిలుము కోసం నిప్పునూ, నీటినీ – రెంటినీ చిమటాతో భూమిని కొట్టి సృష్టించాడని చెప్పబడింది. అలాగే ధునిని కూడా మొదటిసారి ఏ దివ్యాగ్ని నుండి సృష్టించాడో మనదాకా – గ్రంథస్థమై రాలేదు. కాని అది భామాగ్ని మాత్రం కాదు. దీనికి అంతశ్శక్తి – మాహాత్మ్యము ఉండదు కనుక. కాబట్టి ఈ అగ్ని తత్త్వమేమిటి ?

బాబాయే సూచనగా రెండు మూడు చోట్ల రెండు, మూడుసార్లు అన్నాడు. "ఈ ధుని దేనికి బాబా ?" అని ఎవరో అడిగితే "మీ పాపాలను దహించడానికి" అని.

2. మరణించిన జీవులను ఉత్తమ లోకాలకు చేర్చి వస్తున్నాను అని. తెల్లవారి లేచిన తర్వాత ఆ రాత్రి తాను ఏమేమి చేసిందీ చెప్పాడు. ఇలాంటి సూచనలను బట్టి ఈ అగ్ని తత్త్వాన్ని విమర్శించుకోవాలి.

ఋగ్వేదం అగ్ని ఋక్కులతో ప్రారంభమౌతున్నది. పదివేల పైచిలుకుగా ఉన్న ఋగ్వేద మంత్రాలలో దాదాపు అయిదో వంతు అగ్ని ఋక్కులు. ఇందుకే భారతీయ సంస్కృతంతా ఆగ్నేయ సంస్కృతి. యాజ్ఞిక నాగరికత. ఈ అగ్ని 'సృష్టి – ఉత్పాదన – స్థితి నాశనాది క్రియలను నిర్వహించే దివ్యశక్తి తప్ప, భౌతిక అగ్ని కాదు. అగ్ని శబ్దం 'అగ్రి' శబ్దం నుండి వచ్చింది. అగ్ని అంటే సృష్టికి మొదటి అగ్రం మీద ఉన్నవాడు. అతనికి రెండు ముఖాలు. ఒకటి, పైలోకాల్లో ఉన్న దేవతలను జీవులుగా ఆవిర్భవింపజేసే అవతరింపజేసే శక్తి. మరో ముఖం, పుట్టిన వారిని దేవతలుగా పరిణమింపచేసే శక్తి. ఏయే జీవులను ఏ విధంగా పరిణమింపజేయాలో తెలిసిన వాడు కనుక, అతనికి జాతవేదుడు' అన్న పేరు వచ్చింది. అంటే పుట్టిన ప్రతిజీవి పుట్టు పూర్వోత్తరాలు తెలిసిన వాడు అని అర్థం. ఇతడు దేవదూత – అంటే పై లోకాలకు క్రింది లోకాలకు అనుసంధానం చేసేవాడు – సంధికల్పించేవాడు. పై లోకం అంటే మనిషి. అంతశ్చైతన్యం. అక్కడున్న స్ఫురణ, స్మృతి, అగ్ని. ఆ స్మృతి చేత మనిషికీ దైవానికి లంకె ఏర్పడుతున్నది. ఇందుకే భాగవతంలో రుక్మిణీ కళ్యాణంలో రుక్మిణి సందేశాన్ని శ్రీ కృష్ణునకు తీసుకొనిపోయిన విప్రుని పేరు 'అగ్నిద్యోతనుడు'. (అగ్నిని ప్రకాశింప చేస్తున్నవాడు, ప్రకాశింపచేసేవాడు, అగ్ని ప్రకాశం కలవాడు). వేదమంతా ఈ అగ్ని సంబంధమైనదే. యజ్ఞమంటే మనలో నిగూఢంగా ఉన్న అంతశ్చైతన్యం. 'ఒక వెలుగు', ఒక మెరుపు, ఒక నక్షత్రం, ఒక చంద్రుడు, ఒక సూర్యుడు.

ఈశోపనిషత్తులో చివరి మంత్రంలో ప్రాణోత్క్రమణం చేస్తున్న ఋషి చేసిన అగ్ని ప్రార్థన "ఓ జాతవేదా! నన్ను మంచి బాటలో నడిపించి ఆత్మనిధి





దగ్గరకు తీసుకొనిపో!" అని, శరీరం నుండి విడివిడి చేసిన చివరి ప్రార్థన. దీనిని బట్టి ఆత్మ లోకాలకు తీసికొనిపోయేవాడు అగ్ని దేవుడని స్పష్టమౌతున్నది. ఆ లోకాలకు వెళ్ళే మార్గం పేరు 'కృష్ణయానం' – కటిక చీకటి దారి. ఆ చీకటి దారిలో ప్రయాణం చేస్తున్న బాటసారి శరీరంలేని కేవల మనోమయ ప్రాణశక్తి. ఆ జీవుని చీకటి గుండా తీసికొని పోయే వాడి పేరు అగ్ని. కనుక అగ్నిగా గురువుగా పురోహితుడు.

కఠోపనిషత్తులో యముడు నచికేతునికి ఒక అగ్నిని వరంగా ఇస్తాడు. ఆ అగ్ని పేరే నాచికేతాగ్ని. ఇది యోగాగ్ని వీఎర్అషి ఖీఅతీవ. కనుకనే ఆ ఉపనిషత్తు దానిని మహా సంకేత భాషలో వర్ణిస్తుంది. దీని అర్థం వ్యాఖ్యాతలు కూడా సరిగా వివరించలేదు. బహుశా ఇది అనుభవ యోగ్యమైన అంతరాగ్ని కనుక.

జీవుడు పుట్టడానికి, పెరగడానికి, బ్రతకటానికీ, మరణించటానికి ఒక ఉష్ణశక్తి అవసరం. ఏ వస్తువైనా సూక్ష్మదశ నుండి స్థూలదశకూ, దీనినుండి దానికి పరిణామం పొందాలంటే ఉష్ణశక్తి ఆధారం. మనిషికి ఆరోగ్యము, అనారోగ్యమూ రెండూ ఉష్ణమే. దాని ప్రకంపనం మీదనే మనిషి బ్రతుకు ఆధారపడి ఉంది. అంటే లోకం బ్రతుకంతా అగ్నిపై ఆధారపడినదే. కనుక జనన, మరణములకు అవతల ఉన్న వాడు అగ్ని. జననం నుండి మరణానికి, మరణం నుండి జననానికి జరిగే పరిణామం అగ్ని స్వరూపం. కనుక ప్రతిదాన్ని పరిపక్వం చేసే శక్తి పేరు అగ్ని. మనిషిని దైవంగా పరిణమింపజేసే శక్తి అగ్ని. ఒక దివ్య అగ్నిని ఆయా యోగాభ్యాసాల ద్వారా యోగి సాధించి, దానిలో తన మట్టి మృణ్మయ శరీరాన్ని దహించి, హిరణ్మయ (బంగారు) స్వరూపంగా పునస్సృష్టి చేసుకుంటున్నాడు. మట్టిని బంగారంగా పరిణమింపజేసే శక్తి అగ్ని.

ఈ అగ్ని ఆరాధన విశ్వమంతా వ్యాపించి ఉంది. గ్రీసు దేశీయులు, పార్శీ మతస్థులు మొదలైనవారీ అగ్ని ఆరాధకులే.

హిరా క్లిటస్ అన్న గ్రీసు దేశ తత్త్వవేత్త అగ్నిని సృష్టి, స్థితి, ప్రళయాలు చేసే మహాశక్తిగా చెప్పాడనీ, అదే ఋగ్వేదంలోనూ చెప్పబడిందనీ శ్రీ అరవిందులు వ్రాశారు. వారి ప్రకారం – సృష్టిగా పరిణమింపచేసే శక్తి, తిరిగి సృష్టిని దైవంగా పరిణమింపచేసే శక్తి అగ్ని. ఇవే రెండు ముఖాలు. మనిషిని జీవితంలోకి తీసుకొనిపోయే శక్తి. తనలోనికి నడిపించుకొని పోయే శక్తి అగ్ని. ఇందుకే అతడు పురోహితుడుగా వేదం వర్ణించింది. పురోహితుడంటే భవిష్యత్తును – హితాన్ని కల్పించేవాడు. బ్రాహ్మణుడంటే అగ్ని ఆరాధకుడు. అతని కుడి చేతిలో అగ్ని ఉంటుందని వేదం చెప్పింది.

కఠోపనిషత్తులో నచికేతుడు యముని ప్రార్థిస్తాడు.

"స్వర్గంలో భయం – రోగం – వృద్ధాప్యం ఉండవు. ఆకలి దప్పులు లేవు. "సర్వం ఆనందమేనట. కనుక ఏ అగ్ని శక్తితో వారు ఆనందంగా జీవిస్తున్నారో దానిని గురించి చెప్పు" – అంటే యముడు ఆ స్వర్గాగ్నిని వివరిస్తాడు. "అది అనంతమైన స్థితికి, సర్వానికి అదే ఆధారం. అది మనిషి హృదయ కుహరంలోనే ఉంది. ఆ అగ్ని నేటి నుండి నీ పేరన వ్యాప్తి చెందుతుంది. అని చెప్పి, దానిని గురించి వివరించాడనే ఉపనిషత్తన్నది తప్ప, అదేమిటో చెప్పలేదు. అది చెప్పినదంతా ఒకటే – అది ఇలా ఉంది.

"ఈ మూడగ్నులను ఎవడు వెలిగిస్తాడో వాడు మూటితో ఐక్యమై మూడు కర్మలు చేస్తాడు. వాడికి జనన, మరణాలు లేవు. వాడు ఆత్మ పురుషుని పొంది నిత్యశాంతుడౌతున్నాడు". ఈ త్రేతాగ్నులను తెలిసిన వానికి మృత్యుపాశం లేదు. వాడు శోకాల కతీతుడవుతున్నాడు.

ఇదంతా ఒక మార్మిక భాష – 1.ఆ మూడు అగ్నులేమిటి? 2.ఏ మూటితో వారైక్యమౌతున్నారు? 3.ఏ మూడు కర్మలు వారు చేస్తున్నారు? ఇదంతా యోగ పరిభాష.

దీని వివరణలో ఆచార్యులు వ్రాసింది చాలా కొద్ది.





1) 3 అగ్నులు – మనిషిలోని మూడు భూమికలు. జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు. 2) త్రి పురుషులు – 'క్షర – అక్షర – పురుషోత్తములు'.

3) భౌతిక శరీర దశ, ప్రాణ సూక్ష్మదశ, మనో (భావ) దశ. ఈ మూడింటిని దివ్యంగా పరిణమింపజేసేదే ఈ అగ్ని విద్య. ఇది శ్రీ అరవింద వ్యాఖ్యానం.

**శ్రీ కృష్ణ ప్రేమ ప్రకారం :**

అది గుప్తాగ్ని, రహస్యం. ఎవరికి వారే తెలుసుకోవలసిందే తప్ప, చెప్పబడేది కాదు. కనుకనే ఉపనిషత్తు కూడా దాన్ని వివరించక దాచింది. దాన్నే యోగులు మూలాధారంలో ఉన్న కుండలినీ శక్తిగా చెపుతారు.

అగ్ని ఒకటే–కాని అది జ్వలించే వేదికలు మూడు. మనిషిలోని 'స్థూల, సూక్ష్మ కారణ దశలను దివ్యమయంగా చేయటమే ఈ అగ్ని కార్యం. ఐక్యమయ్యే మూడు 'ఆత్మ – బుద్ధి – మనస్సులు."

ఆత్మ = పురుషుడు, బుద్ధి = మూల ప్రకృతి,

మనస్సు = ఉత్తమ మనస్సు లేదా గురువు. వాడు చేసే మూడు పనులు– 1) కర్మ మార్గం 2) యజ్ఞమార్గం 3) దమ–దానాలు – ఇవి ముక్తి మార్గంలో వ్యక్తిని పరిశుద్ధం చేసేవి.

ఇది కృష్ణ ప్రేమ వ్యాఖ్యానం. అది ఎవరెంత చెప్పినా అర్థంకానిది – కనుక యోగాగ్ని (Mystic Fire). అది మన హృదయంలోనే ఉంది. లేదా మూలాధార చక్రంలో

మూడున్నరచుట్లు చుట్టుకొని నిద్రిస్తున్న కుండలిని. ఈ మూడున్నర చుట్లు అ+ఉ+మ+అనుస్వారం–ఓంకారమే. త్రిపురుషులూ ఓంకారమే అనేటప్పటికి లిమాండు కోపనిషద్విషయమౌతున్నది. అక్కడా పురుషుడగ్నిగానే చెప్పబడ్డాడు.

తాత్పర్యమేమంటే మనిషిని దైవంగా మార్చే శక్తి అగ్ని. అదే ధుని. ధునిని నిత్యాగ్నిగా స్థాపించటం మానవ జాతిని తరింపజేయటానికే. ఇందుకే

'ఊధి' – అంత గొప్ప వరంగా మనకు సంక్రమించింది. ఓషధిగా రక్షా కవచంగా, బాబా అగ్ని కనుక సర్వాన్ని కన్నవాడూ పెంచేవాడూ – తరింపజేసేవాడూ, కనుకనే వచ్చిన వారందరికి వారి పాపాలను తాను తీసుకొని, వారికి కావలసినవి వారికిచ్చాడు.

అర్థార్థికి అర్థం–

ఆర్తునకు సుఖ సంతోషాలు–

జిజ్ఞాసువునకు జ్ఞానం –

మోక్షార్థికి మోక్షం –

మొదటి రెంటికీ ఉదాహరణలు కోకొల్లలు. మూడవదానికి చందోర్కరు మొదలైన వారు, నాల్గవ దానికి దీక్షిత్, దభోల్కరు మొదలైన ఉదాహరణలు.

మరి గజానన మహారాజు, గంగాఘీరు వంటి వారు బాబాను ఎందుకు దర్శించారో? మనం భావన కూడా చేయకూడదు. అంతరహస్యం బాబా. ఆ తండ్రికి నమస్కారాలు ఎన్ని అర్పిస్తే ఆయన ఋణం ఈ భూదేవి తీర్చుకున్నట్టు? అంటే మనమంతా – త్రికాలాల్లో ఉన్న ప్రపంచ మానవులంతా కలసి కోటి దండాలు పెట్టినా, ఆ ఋణం తీరదు. బాబా మనకంత ఇచ్చాడు.

దివ్య ధనమైన జ్ఞానమణి బాబా.

# హే పాయ్ పురాతన్ పార్

బాబా పలుకు – చేష్టా ఏదీ పొల్లు పోదు. వ్యర్థం కాదు. ప్రతిదీ అర్థవంతమే. సపత్నేకు సంతాన ప్రాప్తి కల్గించిన కథ చూచాంకదా! అతడు బాబా పాదాల నొత్తుతున్నప్పుడే "హే పాయ్ పురాతన పార్" అన్నది. అలాగే దామూరాసనకు సంతాన ప్రాప్తి కల్గించాడు. అది ఇలా జరిగింది.





# ఆమ్రలీల

ఎవరో గోవా నుండి మామిడి పండ్ల బుట్ట పంపించారు. అవి శ్యామా చిరునామాకు రాగా అతడది బాబా కర్పించాడు. అందులో నుండి బాబా 8 పండ్లు తీసి అవతల పెట్టి, మిగిలిన వాటిని పంచమన్నాడు (4 పండ్లని సచ్చరిత్రలో వుంది. కానీ 8 పండ్లవి). ఆ ఎనిమిది రాసనేకుంచాను. వాడు వస్తున్నాడు. వాడవి తిని తీరాలి 'అన్నాడు బాబా. రాసనే వచ్చాడు. బాబా అన్నాడు 'ఇవి నీ కోసముంచాను. నీకు సంతానం లేదుకదా అవి నీ భార్యకిచ్చి తినమను' అని బాబా అంటే ఏ భార్య కన్నాడు రాసనే. అతనికి సంతానం లేకపోగా రెండవ భార్యను చేసుకొన్నాడు. అయినా సంతానం కలగలేదు. జాతకం లోపల ఏదో దోషమున్నది కనుక సంతాన యోగం లేదన్నాడు జ్యోతిష్కులు. బాబా దానిని త్రోసి పారేసారు.

ఆ 8 పండ్లలో 4 పండ్లు ఆడుకునే పిల్లలు కాజేశారట. నాల్గే మిగిలాయి. ఆ నాల్గు రాసనేకిచ్చాడు. బాబా ఇస్తూ అన్నాడట నీకు వరుసగా నలుగురు పుడతారు. పెద్దవానికి దౌలత్ షా అనీ, రెండవ వాడికి 'థా / తా నాషా అని పేర్లు పెట్టమన్నాడు. అన్నట్లుగానే యిద్దరు కొడుకులు పుట్టారు. బాబా దగ్గరకు వాళ్ళను తీసుకొని వెళ్ళి ఏం పేర్లు పెట్టమంటావు బాబా అన్నాడు రాసనే. బాబా అన్నాడట 'నేనప్పుడే చెప్పాను కదా. నీ నోటు పుస్తకం 3వ పేజీలో రాసుకున్నావు చూడమని' చెప్పగానే అలాగే వుంది – దౌలత్ షా' అని.

ఇతడే తర్వాత బాబా సంస్థానానికి భర్త, కర్తయైనాడు.

8 పండ్లలో 4 పోవటమేమిటి? బాబాకు తెలియదా? పిల్లలు కాజేస్తారని? – అసలు జరిగినదేమిటంటే రాసనేకి 8 మంది పుట్టారు.

★లిమాండూక్యోపనిషత్తులోని పురుషుడగ్నిగా చెప్పబడిన సంగతి త్రివిధ పురుషులన్న అధ్యాయంలో వేరే వ్రాయబడుతున్నది.

కానీ బ్రతికింది నలుగురే. ఇదీ బాబా ప్రతిపనికీ – మాటకూ ఒకర్థముంటుంది – అంటే.

అతనికిద్దరు పుడితే వారి పేర్లు చెప్పాడు బాబా. మిగిలిన వారి పేర్లు సూచించ లేదు? ఎందుకోమరి? ముందు పుట్టిన ఇద్దరకూ ఆ పేర్లు పెట్టమనటంలో బహుశా వారిద్దరూ కవలపిల్లలా ? ఏమో ఎవరూ చెప్పినట్లు లేదు. బాబా చరిత్రకారులు.

ఏమైనా బాబా చేష్టకు – మాటకు – అర్థముండి తీరుతుంది అనటానికి మరొక ఉదాహరణ కుశాభావు కథ.

ఈ కుశాభావు ఒక గురువు దగ్గర కొన్ని క్షుద్ర విద్యలు నేర్చుకొని బాబా దగ్గరకు వస్తే 'వేశ్యతో స్నేహం తగదు' ముందు నీ చేతికున్న కడియం తీసివేసి గోదావరిలో పారవేసి – క్షుద్రవిద్యలు వదలి మసీదుకు రమ్మన్నాడు. (చాలామంది వీటితోనే జనాన్ని ఆకర్షిస్తున్నారు. కావలసిన విస్తూ). అతడలాగే చేసి వచ్చి బాబా నాశ్రయించాడు.

ఆరోజు ఏకాదశి. కుశాభావు ద్వారకామాయిలో వున్నాడు. బాబా పాద సంవాహనం చేస్తూ.

బాబా – నీ విన్వాళ ఏం తిన్నావు?

కు.భా – ఇవ్వాళ ఏకాదశి బాబా. ఉపవాసముంటాను.

ఉపవాసమంటే ఏమిటి?

కు.భా – ఏమీ తినకుండా వుండటం లేదా కందమూలాలు తినవచ్చు.

బాబా – ఓహో! కాందా (ఉల్లికాయ) తింటావా? ఐతే తిను. ఇదుగో. (విని బాబా వానికుల్లిపాయ నిచ్చాడట).

కు.భా – తమరు తింటే నేను తింటాను.

బాబా తిన్నాడు. కు. భా. తిన్నాడు.





వచ్చిన భక్తులతో బాబా 'వీడు బ్రాహ్మణుడై ఉల్లిపాయ తిన్నాడని హేళన చేసాడు' బాబా తింటే నేను తిన్నాను.

బాబా నేను తిన్నానా? చూడమని వాంతిచేస్తే కందమూలాలు పడ్డాయి. వానిని కుశాభావు భక్తితో తిన్నాడు. తింటుంటే వాని వీపుపై కొడుతూ – 'ఛీఛీ – కక్కింది తింటావా వద్దురా! అన్నాడు. కానీ అతడు తిన్నాడు. బాబా అతని భక్తికి సంతసించి నీవెప్పుడు స్మరిస్తే, అప్పుడు నీ దగ్గర వుంటాను. నన్ను స్మరించి దోసిలిపట్టు. నీకు నా నీ ప్రసాదం లభిస్తుంది' అని ఆశీర్వదించాడు.

తర్వాత చాలా కాలానికి పూజ్యశ్రీ నరసింహ స్వామీజీ (ఎవరు బాబా కథను లోకవ్యాప్తం చేసి 'ఆలిండియా బాబా సమాజం' స్థాపించి – మైలాపూరులో బాబా మందిరం కట్టించారో ఆ మహానుభావుడు) కుశాభావును చూచి బాబా ఆశీర్వాదాన్ని చూపించమని అడిగితే – కుశాభావు బాబాను స్మరించి దోసిలి పడితే నిండా ఊధి వచ్చిందట. దానిని తాకి చూచాడు నరసింహ స్వామీజీ. అప్పుడే ధునిలో నుండి వచ్చినట్లు – వేడిగా వుందట బాబా ప్రసాదం.

బాబా మాట పొల్లు పోదుకదా! బాబా ఒకసారి ఉద్ధవేశ్ బువాతో అన్నాడట. నాకు 11 రూ.లు దక్షిణ ఇమ్మని.

కు.భా : నా దశేంద్రియాలు, మనస్సు – కలిపి 11 రూ.లు నీకెప్పుడో ఇచ్చానుకదా. బాబా – అవి ఇవ్వటానికి నీవెవ్వడవు. అవి నావే కనక నీ విప్పనక్కలేదు. రోజూ పారాయణం చేయి.

కు.భా – ఏ పురాణం?

బాబా – అప్పుడు నీకేది బోధించానో అది.

కు.భా – గీతనా? జ్ఞానేశ్వరినా?

బాబా – బాపూసాహెబ్ జోగ్ చదువుతున్నాడే అది తీసుకొనిరా. ఆయన

వెళ్ళి భాగవతం ఏకాదశ స్కంధం తెస్తే బాబా తన వ్రేలునొకచోట దూర్చి ఇది చదువు – అన్నాడట. అది భాగవతంలో శ్రీకృష్ణ ఉద్ధవ సంవాదం. ఇది బాబా లోకానికి ఉద్ధవేశ ద్వారా చెప్పిన ఒక మార్గం.

11 రూ.లు అంటే 11వ స్కంధం. దీనిలో శ్రీకృష్ణుడే తాను అన్నమాటే కదా. లేకపోతే లక్ష రూపాయలు ఖర్చు పెట్టి రాతి వాడా కట్టి బూటీ అందులో నడమ హాలులో మురళీకృష్ణుని పెడదామనుకోవటమేమిటి? బాబా పోయి తానక్కడ సమాధి కావటమేమిటి? – తాను కృష్ణావతారం కాకపోతే. ఇందుకే బాబా జగద్గురువుగా? అవతరించాడని చెప్పటం.

## ద్వారకామాయిలో బాబా ఫోటో

ద్వారకా మాత–బాబా నివసించిన పాడుబడ్డ మసీదు పేరది. లిడాకురు నాథుని పట్టణం పోవలసిన పనిలేదు. "ఇది బాబా మాట". మసీదుకు అలా ఎందుకు పేరు పెట్టారట. తాను శ్రీకృష్ణావతారం కాకపోతే.

శ్రీరామకృష్ణ పమహంస అనేవారట 'మహారాజు అప్పుడప్పుడు మారువేషంలో సంచారం చేసినట్లు ఆనాటి రాముడూ, కృష్ణుడూ ప్రస్తుతం ఈ రూపం (తన దేహాన్ని చూపుతూ)తో వచ్చారు. ఇంతకు మించి ఎక్కడా ఏమి లేదని.

వీరు బాబా కంటే కొంచెం ముందు అవతరించిన మహాత్ముడు. అలాగే బాబా ఫకీరు వేషంలో వచ్చిన కృష్ణుడు. అంటే జగద్గురువు. కనుకనే తన నివాసమైన పాడుబడ్డ మసీదుకు పేరు పెట్టి తులసీ బృందావనాన్ని స్థాపించారు. ఇవ్వాళ ఇది మనకు కన్పించదు. కానీ శ్రీపూజ్య శ్రీ నరసింహ స్వామీజీ గ్రంథాల్లో దీని ఫోటో మనం చూడవచ్చు. ఆ రోజుల్లో 1935 ప్రాంతంలో నరసింహ స్వామీజీ దర్శించిన మసీదు బొమ్మలో అదొక పెంకుటి చావిడి. అందులో ఒక మూలగా ఇది వున్నది. నేటికీ దాని గుర్తు చూడవచ్చు.

★ ఇక్కడ కాలు పెట్టిన వానికి ద్వారక పండరిపురం





ఒక బండ – దానిపై బాబా నిలువెత్తు ఛాయాచిత్రం. దానికి ఎడమ ప్రక్కగా ఇది వున్నది. ఈ బృందావనం కృష్ణస్వామి ఆవులను మేపుకొంటూ తిరుగాడిన బృందావనమేనని బాబా మనకు చెప్పినట్లే.

బాబా ఆనాడు బండపై కూర్చున్నాడట. ఆ గ్రామ ప్రజలు దానిపైన బట్టలుతుకు కొనేవారు. నడిరోడ్డులో వున్న మసీదుకు ముందున్న బండ. ఒక రోజున ఈ మహాత్ముడు దాని పైన ఏదో రత్న సింహాసనమనుకొని కూర్చున్నాడు. ఇంకేముంది. ఊరి వారు తమ బట్టలుతికే పని మానుకున్నారు. ఆ బండే నేడు ద్వారకా మాయిలో వున్న బండ.
పరమహంస రమణ మహర్షి కూర్చున్న ఫోటోలు మనకు దక్కాయి. పరమహంస సమాధి గతులైనప్పటి బొమ్మ –మహర్షి కొండపై ఒక బండరాయిపై చేతిలో కర్రను పట్టుకొని కూర్చున్న బొమ్మ – బాబా బండపై నాసీనుడైన బొమ్మలే నేడు లోకవ్యాప్తి పొంది పూజనీయములైన విగ్రహాలు, ప్రతిమలుగా మన ఇళ్ళలో – గుళ్ళలో గుండెల్లో కొలువు దీరాయి.

ఈ బాబా బొమ్మలో ఎడమపాదం నేలపైన – కుడి పాదం ఎడమ మోకాలిపైన వేసి కుడిపాదం బొటనవ్రేలును ఎడమ చేతి చూపుడువ్రేలు – నడిమివ్రేలు పంగలో జొనిపి వున్నట్లు మనకు దక్కింది.

లిఇక్కడ కాలు పెట్టినవానికి ద్వారక పండరిపురం.

ఆనాటి రామకృష్ణావతారాలెలా వున్నాయో మనకు కన్పించకుండా పోయాయి. కానీ నేటి ఈ అవతారానికి మాత్రం లోకానికి దక్కటం ఎంత అదృష్టం. బాబా ఫోటోకి తనకీ భేదం లేదని చెప్పిన కథలు చూచాంకదా. ఆనాటి బాబాను నేటి మనం చూడలేదె లాగా? అయ్యో అని బాధపడకుండా మనకు దర్శనమిస్తున్నాడు. ఆ స్వామికి మనపైన ఎంత దయ. ఎందుకంటే వారి ఇష్టం లేకుండా వారిని ఫోటో తీయటం కష్టసాధ్యం. వారితో చెప్పకుండా ఒకసారి ఫోటో తీసారట. కానీ చూస్తే ఏముంది? బొమ్మలేదు. దానికి కొందరు పుస్తకాల్లో అచ్చువేసారు. బాబాలేని బాబా ఫోటో. అలాగే

పరమహంస కూడా తన ఫోటోలు తీయటానికంగీకరించలేదు. కాబట్టి వారి ఫోటోలు మనం పూజించుకొనే విగ్రహాలుగా దక్కటం వారి అభీష్టమేననాలి కదా!

ఈ ఫోటోలో ఎడమ పాదం – లోకానికనుగ్రహించినది. ఎడమ అంటే ప్రపంచం. కుడి అంటే పైన. అది జగన్మాతస్వరూపం. కుడిపాదం శివ స్వరూపం. గురు పాదుకలు గురుస్థానంలో చూస్తాం కదా. అందులో కుడిపాదం శివుడూ – ఎడమ పాదం జగన్మాతా అని భావిస్తూ నమస్కరించాలి. ఈ రెండు కలిసినవే గురు పాదుకలు – లేదా పాదాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రతి గురువూ ఈ శివ పార్వతీ ద్వంద్వ స్వరూపమే. శ్రీ కృష్ణుని గురించి పరమహంస అనేవారట కదా "కృష్ణుడంటే అమ్మ" అని. అందుకే అవతారమంటే జగన్మోహనంగా వుండటం.

బాబా ఎడమ పాదం మనకిచ్చాడంటే తల్లి పాదంగా భావించాలి.

## మరి బండ కర్థమేమిటి?

ఒక కథ చెప్పారు. బాబా ఇంకా శిరిడీ రాక పూర్వం మహారాష్ట్రం అంతా తిరిగారని. అలా వస్తుండగా 'శివగాంవతర్డి' అనే వూళ్ళో ఒక అంగడి – బట్టల కొట్టుకు వచ్చి ఆకలిగా వుందిరా! ఏమైనా తినటానికివ్వండి అని అడిగితే, యజమాని కసిరాడు. ఆ కొట్లో ఒక పిల్లవాడు బాబా నేనింటికి పోయి రొట్టె తెస్తానుండు' అని పరిగెత్తి రొట్టె తెచ్చేసరికి బాబా లేడు. వెతుక్కుంటూ పోయి, పోయి చూస్తే ఒక స్మశానంలో కన్పించాడు బాబా. బాబాకు రొట్టె పెట్టాడు పిల్లవాడు. అది తిన్నాడో లేదో మరి ఆ దైవం అన్నాడట 'ఒరేయ్! నేనేది అడిగినా ఇస్తావా' అని 'నా దగ్గర డబ్బు మాత్రం లేదు ఏమైనా ఇస్తానడుగు' అన్నాడట పిల్లవాడు. 'సరే అక్కడ కుండ పెంకులో నీళ్ళు తీసుకురా' అన్నాడు బాబా. అప్పటికి ఆయన వయస్సు 15–20 నడుమ కావచ్చునేమో. వాడు తెచ్చాడు. బాబా ఆ నీరు త్రాగి, సగం





వుంచి నీవు త్రాగు అన్నాడట. వాడు త్రాగాడు. తర్వాత ఏమైనదో మరి. చాలా సేపటికి సూర్యుడు నడినెత్తికి రాగా నిద్రలేచాడు. చూస్తే ఏముందొ? బాబా లేడు. చాలా కాలం వెతికాడట ఆయన కోసం. చివరకు శిరిడి వస్తే అక్కడ బాబా స్నానం చేస్తున్నాడు. ఒక గోతాం పట్టా పర్దా చాటున. అప్పుడెవరూ చూడకూడదట బాబాను. ఆగలేక పర్దాలో చూస్తే బాబా అన్నాడట. 'గాడిదకొడకా ఆనాడు నా నెత్తురు, మాంసం తిన్నది చాలక నా ఎముకల కోసం వచ్చావా అని తిట్టాడట. మన భాషలో తిట్టు, బాబా భాషలో అది దీవెన. తర్వాత అతడే 'గుజారీ మహారాజ'న్న పేరుతో మహాయోగియై నర్మదానదీ తీరాన ఆశ్రమం కట్టుకొని లోక సేవ చేసాడట – ఇది బాబా ఆనతి పైన జరిగిన పనే.

ఒక సామాన్యుడైన పిల్లవాడిని (చాకలి కులస్థుడంటారు) మహారాజుగా చేసినది దైవం. లోకమన్న బండరాయిని మలిచి మహాయోగిగా చేయటానికే అవతారాలు వచ్చేది. ఆ బండ మనమే. మనమనస్సే బండ. దాని పైన బాబాను కూర్చోబెట్టుకోవటం పేరే ధ్యానం జపం – తపస్సు. అందుకే ఆ ఫోటోయే ప్రసిద్ధమైనది. విశ్వమంతా వ్యాపించిన దెందుకంటే ఇందుకే.

ఆనాడు బృందావనంలో నల్లనివాడు మురళీ ఊదేవాడు కదా. ఆ మురళి వట్టి వెదురుపుల్ల. దాని నుండి ఆయన దివ్య గాంధర్వం పాడాడు 'అది విని వ్రేపల్లె అంతా తరించింది. కాలక్రమంగా కృష్ణుడు గతించాడు. మురళి మిగిలింది. ఆయన నెరిగిన వృద్ధులు దానినొక రచ్చబండపై పెట్టి పూజించేవారు అడవికి వస్తూ – పోతూ. (20–30 ఏళ్ళ క్రితందాకా బాబాను దర్శించిన వృద్ధులు శిరిడిలో వుండేవారు.) క్రమంగా తరాలు మారినవి. తర్వాత తరంవారు ఆ మురళికి వెండి తొడగు బంగారు తొడుగులు చేయించి పూజించేవారు. మనం విగ్రహాలకు కవచాలు – కిరీటాలు పెట్టినట్లు అది వూదటం మానేసింది. అంతకు పూర్వం తొడుగులు లేనపుడు గాలి దూరి

అది దానంతది ధ్వనించేది. ఆ నాదంలో ఊరు, ఊరంతా మైమరచి పోతుంది. తర్వాత చాలాకాలాని కెవరో మహాత్ముడది చూచి 'ఇది కాదురా వెధవాయిల్లారా! తొడుగులు తీసివేయండని తీసివేయిస్తే మరలా పాడిందట! ఆ మురళి.

ఆ మురళి వంటిదే ఈ బండ. శిలనుండి అహల్యను సృష్టించిన రామ పాదం వెదురు పుల్లనుండి అమృతగానాన్ని వెదికిన శ్రీ కృష్ణుని వ్రేళ్ళు ఎలాంటివో బాబా వామ పాదమంతే.

ఆ బొమ్మనిలా ధ్యానించుకొన్నవారు ఆ మురళీ పాటను వినగలరు. వారి హృదయాల్లో బాబా నర్తిసాడు.

# ద్వారకామాయి

మనిషే రాయి. అతని లోపలి ఆత్మ శ్రీకృష్ణుడు. రాతిపై కూర్చున్న బాబా అన్న మాట. అతడే రావాకులను బూరగా చుట్టి మురళిగా వాయిస్తున్నాడు. ఇతడు శ్రీ కృష్ణుడేమో? నా హృదయవీధి. కడిమితోటలుపూయు చీకట్లలోన వర్ణమయ విశ్వసించంబు ప్రభలతోడ శ్వేతపద్మముల్ వికసింప చేయుచుండె. జగన్మాత కడిమి చెట్ల తోపులో నివసిస్తుంది. ఈ బాబా నాలో ఆ కడిమిచెట్ల తోపులో ఉన్న అమ్మలాగా కన్పిస్తున్నాడు. ఆయన చుట్టూ వున్న ప్రపంచమే పింఛం. దానిని తలమీద పెట్టుకొన్నాడు సహస్రార కమలం లాగా.

బాబా స్వయంగా చెప్పిన మాటలు

ద్వారకా మాయి – మసీది ఆయీ – అంటే తల్లి. ఇక్కడకు వచ్చిన తన పిల్లలను రక్షిస్తుంది. ఆమె బడిలో కూర్చున్న వారికి రోగాలు, రొష్టులు, ఆది వ్యాధిలుండవు. ఆమెపై విశ్వాస ముంచు ఆమె నిన్ను రక్షిస్తుంది.

(శ్యామాతో) నీవు విష్ణుసహస్రం పఠించు నిత్యమూ. ఒకసారి నా గుండె కొట్టు మిట్టాడితే గుండెపై హత్తుకొన్నాను. నా ఆరోగ్యం చక్కబడినది.





నీకు సంస్కృతం రాకపోతే ఈ మసీదు ఆయా నేర్పుతుంది ఫర్వాలేదు నిత్యమూ పారాయణం చేసుకో.

(సంస్కృతంలో అక్షరాలు రాని శ్యామా అలాగే నిత్యమూ పారాయణం చేసి ఇతర భక్తులకు విష్ణుసహస్రాన్ని వ్యాఖ్యానించి చెప్పేవాడట.)

"ఈ మసీదుఆయీ నిన్నన్ని ఆపదల నుండి కాపాడుతుంది. ఇది మసీదు కాదు. ద్వారక. ఆమెను శరణన్న వారికే ఆపదలూ రావు.

(ద్వారక అంటే నాల్గు దిక్కులూ ద్వారాలు కలది. అంటే భగవంతుడి దగ్గర కెవరైనా పోవచ్చు. ఎప్పుడైనా సరే. అన్ని జాతులవారికీ ఆశ్రయమిచ్చేదని అర్థం. కనుక మసీదులోకి అన్ని జాతుల వారు పోతున్నారు).

ఈ మసీదు మెట్లెక్కిన వారికి కర్మలు నశిస్తాయి. ఆనందము దయిస్తుంది. ఒక్కసారి వస్తే చాలు ఆమె నీ ధ్యేయాన్ని సమకూరుస్తుంది.

ఇది తరణ (దాటటం సంసారసాగరం) సాధనం తప్ప మరణా శ్రయం కాదు.

'నాకేమి అక్కర్లేదు. కానీ మసీదు ఆయీ తన ఋణాన్నివ్వ మంటుంది. ఆమెకు బాకీ పడ్డవారి నుండి నేను వారి ఋణాన్ని తీర్చటానికే దక్షిణ నడుగుతాను".

"ఈ మసీదులో కూర్చున్న ఫకీరు ఎన్నడూ అబద్ధమాడడు. నన్నాశ్రయించిన వారిని కడవరకూ చేరుస్తాను. నడుమ వదలి పెట్టను. నిర్భయంగా వుండు. ఆ పొడవాటి పాము నిన్నేం చేస్తుంది. దానిని చూచి మనం నవ్వుకొంటాము తప్ప భయపడము. "(ఒక భక్తునికి రాబోతున్న ఆపదను సూచిస్తూ బాబా చెప్పిన మాట.)

ఇక్కడ కూర్చునే బాబా సుమారు 50–60 ఏళ్ళపాటు వివిధ

వ్యక్తులకు అభయ హస్త ప్రదానం చేసి – వారి, వారి మనస్సులను బట్టి వారికి తరణోపాయాన్ని బోధిస్తూ తానెవరో మాటల ద్వారా, చేష్టల ద్వారా చెబుతూ జీవించాడు.

అందుకనే అది శ్రీకృష్ణ నివాసమైన ద్వారక. బాబా తనను గురించి తాను స్వయంగా చెప్పిన మాటలు. అవతారం ప్రతిదీ ఒకసారి కాకపోతే మరొకసారి ప్రత్యక్షంగా – పరోక్షంగా – తనను గురించి తాను ప్రకటించకపోతే లోకానికి తెలియదు. కనక చెప్పుకోక తప్పదు. అలా చెప్పటం వల్ల లోకం తరిస్తుంది. తనకేమీ అక్కర్లేదు. లోకం కోసం చెప్పక తప్పదు.

అలా బాబా తనను గురించి తాను చెప్పుకొన్న సందర్భాలు కొన్ని వున్నాయి. 'నన్ను భక్తితో తలచేవారిని నిత్యమూ నా నేత్రం చూస్తూనే వుంటుంది. నేనెక్కడున్నా – ఏంచేస్తున్నా – ఒకటి గుర్తుంచుకోండి. నేనన్ని చూస్తుంటాను. అన్నీ నాకు తెలుస్తాయి."

'నన్నే ధ్యానించు, నా నామమే జపించు. నా చేష్టలనే మననం చేయి. అపుడు నిత్యమూ నీతోనే వుంటాను. సందేహం లేదు. నిత్యమూ నన్ను స్మరించేవారి యోగ క్షేమాలు చూస్తాను. నాకేమి అర్పించక తినకుండా నన్నే శరణన్న వారి బాధ్యత నాదే. భార్య – భర్త – పిల్లా – జెల్లా అన్నిటినీ కాదని నన్నే స్మరించు. నా భక్తులు సర్వంలోనూ నన్నే చూస్తారు. సర్వ జీవరాసుల్లో – గాలిలో – వెలుగులో – ఆకాశంలో – భూమిలో నన్నే నా రూపాన్నే – నా నామాన్నే దర్శించు జపించు. మననం చేయి. ధ్యానించు. అపుడు నీవూ, నేను ఒకటౌతాము. బాబా ఉపవాసాలామోదించలేదు. ఏమీ తినకపోవటం ఉల్లి పాయ తినకపోవటంలాంటివి మత విషయాలు కావు. నేటి మహాత్ములు వాటిని ప్రచారం చేయలేదు. బోధించలేదు. బాహ్యాడంబరాలు – కాషాయ వస్త్రాల్లాంటివి బొట్టు, కట్టూ, ఆచారాలు, సంప్రదాయాలు మూఢంగా లోకమాచరిస్తూ ఇదే భగవంతున కిష్టమైన





మార్గమనుకొంటుందో వాటిని వీరెవ్వరూ అంగీకరించలేద. జాతకాలు నమ్మమన లేదు. వాటికి బదులుగా నిత్యమూ భగవంతుని వారి ప్రతినిధులైన మహాత్ములనే శ్రద్ధా భక్తులతో సేవించమన్నారు.

ఉపవాసముంటే భగవంతునికి దగ్గరగా ఉండటం తప్ప అన్నం తినకుండా, ఇష్టమైన ఉపాహారాలు తినటం కాదు. కనక బాబా తన దగ్గర అంటే తన రూప చేష్టా భాషణలనే ఆరాధించమన్నాడు. ధ్యానించమన్నాడు. భగవంతుడు నీ ఇష్టానిష్టాలకు ఆచార వ్యవహారాలకు – లౌకికమైన కట్టు, బొట్టు – ఉపవాసాదులకు సంబంధించిన విషయం కాదు. ఇవి ఆరోగ్యప్రదాయకములు కావచ్చు కానీ శుచీ శుభ్రతలను, కల్గించ వచ్చు. కానీ నిన్ను భగవంతుని చేర్చలేవు.

బాబా జీవితమంతా దీనికుదాహరణమే. సాధన అంటే గురువును శ్రద్ధా, భక్తులతో సేవించటమేనని" తన గురువు కథను చెప్పాడు. ఆయన తనకేమంత్రమూ చెప్పలేదని, రాధాబాయి దేశముఖ్ కథలో – ఆశ్రద్ధాభక్తులతోడి సేవ అంటే ఏమిటో కూడా – 'తం విద్ధి ప్రణి పాతేన' – శ్లోకం దగ్గర చంద్రోర్కరుకు వివరించాడు. అప్పుడు నందోర్కరుడన్నాడట – 'సేవించటమంటే మేము మిమ్మల్ని సేవిస్తున్నట్లే కదా – అంటే దాబా అది చాలదు అన్నాడు.

వివేకానంద స్వామి భగవద్దర్శనం కోసం పడ్డ ఆరాటం చూచిన ఇతర శిష్యులు గురువుతో చెబితే పరమ హంస అన్నారట "ఇక్కడ పడ్డ తపనలో – చేసిన తపస్సులో –సాధనలో అది ఎన్నో వంతని"– అలాగే బాబా కూడా అని తన గురు సేవావృత్తాంతాన్ని చెప్పాడు. ఆ విషయం 'సచ్చరిత్ర' లో వుంది. అందుకే బాబా అన్నాడు. అదే మంత్రంగా ధ్యానించమన్నట్లు

"ఊగే – మూగే" – "హే పాయ్ పురాతన్ పార్" ఈ రెండు ప్రధాన మంత్రాలు. ఊగే మూగే అంటే మౌనంగా కూర్చో నన్ను ధ్యానిస్తూ

ఆరాధిస్తూ అంతా నేను చేస్తాను. నీకేం తెలుసునని నీవు చేస్తావు. మార్గం తెలిసిన, తెలిపే గురువును వారి పాదాలను ధ్యానిస్తూ కూర్చో అంతా ఆయనే చూచుకొంటాడు. దైవానికి – గురువునకు భేదంలేదు. బావూ గిరితో అన్నాడే–జావ్నేరు చమత్కారంలో–నీవు వెళ్ళు అన్నీ అవే సమకూరుతాయి' అని.

'నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్' అని గీతలో స్వామి అన్నట్లు నీవు నా చేతిలో పనిముట్టువు కావాలి అంతే నీ వంతు. నన్నే శరణను – నన్నే యజించు – ఆరాధించు నన్నే చింతించు నన్నే నమస్కరించు – నా భక్తుడవుకా" గీత 9వ అధ్యాయంలోని ఈ శ్లోకాల భావాలే బాబా చెప్పింది.

"మన్మనాభవ మద్భక్, మద్యాజీ మాం నమస్కురు
మమే వైష్యసి యుక్తైవ, ఆత్మానాం మత్పరాయణః"–
"అనన్యా శ్చింతయన్తోమాం, యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహం"

దేనిని ఆలోచించక సర్వాన్ని వదలి, నన్నే వుపాసిస్తున్నారో, వారు నిత్యమూ నాతోనే, నాలోనే వుంటారు కనుక వారి యోగ క్షేమాల బాధ్యత నాదే. వారు నిత్యయుక్తులు. నిత్య ముక్తులు. 'యుక్తులంటే పైన చెప్పినట్లు నిత్యం దైవస్మరణ చేసేవారు.

# వారేమిచ్చినా

"పత్రం, పుష్పం ఫలంతోయం – యేమే భక్త్యా ప్రణశ్యతి
తదహం భక్త్యు పహృతం, అశ్నామి ప్రయతాత్మనః"

ఆకో – పూవో పండో ఏదీ దొరక్కపోతే త్రాగే నీళ్ళైనా నాకు భక్తితో అర్పించు వాటిని నేను ఆస్వాదిస్తాను. నాకు కావలసింది భక్తి తప్ప పంచామృతాభిషేకాలు కావు పాయసాన్నాలు కాదు. జనం వాటి నర్పించి





భక్తులమనుకొనేవారు వట్టి డాంబికులు అందుకే బాబా చద్ది అన్నం కూరా పెట్టించుకొని తిన్నాడు. –

ఒకసారి ఒకవ్యక్తి 'అమ్మా అన్నం పెట్టన్నాడు'. ఆమె విస్తరి వేసి పెట్టింది. తిని అన్నాడాయన 'సంతోషం' అని. ఏమి పెట్టినా తినేవాడే దైవం. చాలదనేవాడే మనిషి.

మరొక సారి 'నాకిస్తానన్న 11 రూపాయలివ్వు' అని గృహిణిని అడిగాడు. ఆమె ఎప్పుడో మనస్సులో బాబాకు 11 రూపాయలు ఇస్తానని మ్రొక్కుకొని ముడుపు కట్టింది. వచ్చిన మనిషికది తెలుసా? కాని అడిగాడు. అడగ్గానే ఆ గృహిణి 'ఓహో దానితో ఏం చేస్తావని అడిగింది. ఆయన 'ఫలానా చోట బాబాయే' అని ఇస్తూ పేద వాళ్ళున్నారు. వాళ్ళకు గంజికొని పోస్తానని' వెళ్ళాడు (ముందే చెప్పబడ్డది).

ఆయన దక్షిణ రెండు రూపాయలే. శ్రద్ధ – సబూరి. ఇదే భక్తి – సాధన. వాటినే జీవితంలో అలవరచుకొనే ప్రయత్నం చేయాలి. వాటి. నలవరచుకోవటమంత తేలికైన పనికాదు. అహంకారం చంపుకోవటానికదొక యుక్తిగా చెప్పాడు బాబా. అది చస్తే తప్ప ఇవి దక్కవు. ఇందుకే పరమహంస ఒక త్రాగుబోతు – తిరుగుబోతైన భక్తునితో అన్నాడు. 'రోజుకొక అరగంటైనా ధ్యానించు. అతడు నా వల్ల కాదన్నాడు. మరలా రామకృష్ణులు – పోనీ 'అన్నం తినేటప్పుడు స్మరించు' అతడు 'ఏమో, మరచిపోతే తప్పినట్లే కదా' – మరలా పరమహంస నిద్రపోయే ముందు స్మరించు' ' – అది నా వల్లకాదు' – అన్న శిష్యునితో పరమగురువన్నారు 'నీ వీలునామ బాధ్యత నాకర్పించు' " – అన్నాడు. అది విని ఆయన చాలా తేలికగదా అనుకొన్నాడు. చాలాకాలం గతించింది అప్పటికి పరమహంస లేరు. అప్పుడన్నాడట శిష్యుడు 'గురువు గారడిగితే నీ బాధ్యత నా కప్పగించమని. చాలా తేలికననుకొన్నాను. కానీ తర్వాత, తర్వాత తెలిసింది. అబ్బో చాల కష్టమని"– ఎందుకంటే ఏది చేయాలన్నా

'నేను' అడ్డువస్తుంది. దానిని తనకివ్వ మన్నాడు గురువు. అంటే ఏదీ తానై చేయటం లేదు. జీవితమంతా దైవానికర్పించటమే. ఇదే భక్తి అంటే. సాధన అంటే. –

బాబా అన్న – "ఊగే–మూగే" అన్నఅదే. కనుక బాబా నీ ఆచార, సంప్రదా యాలను కోరలేదు. నీవు మాంసభుక్కువా? శాకాహారివా? అని అడగలేదు. నీవు బ్రాహ్మణుడవా? ముసల్మానువా? అని అడగలేదు. ఆయనను కొందరు సాయిబను కోవటం తటస్థిస్తే అన్నాడు. 'ఇతడు బ్రాహ్మణుడు. తెల్లని బాపడు' పవిత్ర పరిశుద్ధ బ్రాహ్మణుడు. లక్షల మందినీ శుద్ధ మార్గంలో నడిపిస్తాడు. ఇది బ్రాహ్మణుని మసీదు' అని.

ఆయన సర్వ సమన్వయమూర్తి. కనుకనే వేషం ముసల్మానుది. ద్వారకామాయి – బృందావనం. మాటా, చేష్టా అంతా సనాతన వైదికాచారమే నన్న మాటలు 'నేనే అల్లాను, నేనే కొల్లాపుర మహాలక్ష్మిని. పండరీపురంలో విఠోబాను. నేనే గణపతిని. మారుతిని. దత్తాత్రేయుని ఇవన్నీ సగుణ మూర్తుల నారాధించేవారి కోసం చెప్పిన మాటలు. నిర్గుణారాధకుల కోసం కొన్నిచోట్ల

'నేను పరమాత్మను. ఆయననే బ్రహ్మమంటారు'. అంటూ బాబా ఒక మాటన్నాడు. చందోర్కరుతో శుద్ధ చైతన్యమని. దాని వివరణ అడిగితే దానినే బ్రహ్మమంటారు. అదే సర్వానికి మూలకారణం. అతని నుపాసించిన వారినే బ్రహ్మవేత్తలంటారు. కేవల శుద్ధ చైతన్యమే అది" అని. అదే సృష్టిగా వికసిస్తున్నది. నిర్గుణం సగుణమౌతున్నది. అలా పరిణమింపచేసే శక్తినే 'మాయ' అంటారనీ–ఆమె నాకు తల్లి, పురుషుడు (ఆత్మ) నాకు తండ్రి అనీ – వారి వల్లనే నేను జన్మించానని – తన ఆద్య స్వరూపాన్ని అంటే అగ్ని స్వరూపాన్ని వివరించారు. ఈ సృష్టి అంతా మూలకారణమైన పరమాగ్నినే 'ధుని'గా వెల్గించింది. ఆ 'ధుని'తాను ఒకటేనని చెప్పటం కోసం. 'ఆ చైతన్యమే త్రిగుణ సంభూతమై ప్రకృతిగా వచ్చింది. ఆ మాయ





అంటే ఏమిటని మళ్ళీ నానా చందోర్కర డిగితే బాబా వివరిస్తూ 'ఆమె శుద్ధ చైతన్యంలోని మహాశక్తి. ఆమె వల్లనే పరమ పురుషుని నానా విధాలుగా జన్మింపచేస్తున్నది. ఆయన నుండి ఆమెను వేరు చేసి చూపలేము. నిప్పులో వేడి – నీటిలో చల్లదనం – చంద్రునిలో వెన్నెల లాగా వారిద్దరు కలిసే వుంటారు. ఇలా చెప్పిన విషయమంతా పరమహంస చెప్పిన తాంత్రిక శక్తి స్వరూపమే. 'ఆమె తనను తానుపసంహరించుకొంటే చైతన్యం బహిర్గతమై అనుభవానికి వస్తుంది."

మరొక భక్తుడు ఒక కేసు విషయంలో కోర్టుకు పోతూ బాబా నాశ్రయిస్తే 'బాబా నీవు వెళ్ళే దారిలో నెవాస్‌లో మోహినీ రాజన్న దైవమున్నది. ఆయనకు నమస్కరించి వెళ్ళు అన్నాడు. అతడలాగే చేసాడు. శిక్ష నుంచి తప్పించుకొన్నాడు.

శివ, పార్వతులు, లేదా ప్రకృతి పురుషులు లేదా బ్రహ్మము – మాయ సమ్మేళనే – మోహినీ రాజంటే ('అయ్యప్ప' అని నేడు లోక మారాధిస్తున్నదీ అదే). ఈ మోహినీ అంటే మాయ ఆవేశించిన శివుడు మోహినీ రాజు. శక్తి పేరు త్రైలోక్యమోహిని. ఈ విషయం పరమహంస ఇలా చెప్పాడు. 'ఒకప్పుడు మోహినీ శక్తిని దర్శించాలనుకొన్నాను. ఇంతలో ఒక దివ్య సుందరి సాక్షాత్కరించి, చూస్తున్నంతలో ఒక దివ్య శిశువును కన్నది. పాలిచ్చింది. తర్వాత ఉగ్రమూరియై ఆ శిశువును తానే కబళించింది" అని.

ఇదీ మాయ అంటే, సృష్టి–స్థితి లయలను నిర్వహించే మహాశక్తి. సకల జగత్తును కని, పాలిచ్చి, పాలించి తుదకు మహా చైతన్యం కలిపే రుద్రశక్తి. బాబా ఒకసారి అన్నాడు 'ఆ మహామాయ నుండి త్రిమూర్తులే తప్పించుకోలేరు. నేనెంత? ఆమె పాశం నుండి నేను తప్పించు కోలేకపోతున్నాను' అని.

అంటే త్రిగుణ స్వరూపమైన జగద్రక్షణ భావం నుండి మనలను

కాపాడాలని వచ్చిన మహావతారం కనక, ఆ సంకల్పం నుండి తాను విడివడలేకపోతున్నానని.

దీనికి సూచనగా తానింకా కొద్ది నెలలలో దేహాన్ని త్యజిస్తాననగా 1918లో ఒక రోజున శ్రీమతి తార్కడ్‌తో అన్నాడట బాబా – 'అమ్మా! ప్రతివాడు ధనం – స్త్రీ సంతానం కోరుకొంటున్నారే తప్ప నా దగ్గరున్న దెవరూ కోరుకోవటం లేదు. నాకు విసుగెత్తి పోతున్నది. ఎదురు చూచి, చూచి నేను ఎప్పుడో అదృశ్యుడనైపోతాను' –అని. ఆ ధనం ఆధ్యాత్మిక ఐశ్వర్యం. దైవం – ముక్తి. అది కోరే వారెవ్వరూ రావటం లేదట. అంటే ఆ మాయామోహినీ శక్తికి లోబడి పోతున్నది. జగం. కనక మోహినీ రాజును ప్రార్థించాలి.

# అద్వైత జ్ఞాన మార్గం/ఆత్మ విచారం

నానా చందోర్కరు అద్వైతి. శంకర భాష్యాలు చదివినవాడు. అలాంటివారికి మార్గమే బోధించాడు. 'బాబా నీవెవ్వరవు?" ఎక్కడ నుండి వచ్చావు" అని ప్రశ్నించాడొకరు.

బాబా – "నాకొక చోటంటూ ఏమీ లేదు. అన్ని చోట్లవున్నాను. నేను కేవలం సచ్చిదానంద స్వరూపుడను. కానీ మీ కోసం రావలసి వచ్చి దేహినైనాను. బ్రహ్మ నా తండ్రి. మాయ నా తల్లి". నిత్యమూ తానెవరినని విచారించటమే మోక్షమార్గం.

రేయింబవళ్ళు తార్ఖాడన్నాయన రైల్లో సీటు కోసం ప్రయాణీకులతో శిరిడీ వస్తే బాబా అన్నాడట "రేయింబవళ్ళు నేనెవరినని ఆలోచించక ప్రక్కవారితో తగాదా పడటం దేనికి ? ఒకామె బొంబాయి నుండి వస్తే బాబా అన్నాడట 'తల్లీ! ఏమి కావాలి' అని. ఆమె ముక్తిని కోరింది.

బాబా – (నవ్వి) ఇంతేనా చావటానికా ఇక్కడకు వచ్చింది. ఎప్పుడూ నేనెవరినని విచారించు.





ఆమె – నీ మాటలు బోధ పడలేదు బాబా !

బాబా – నీ భర్త నడుగు చెబుతాడు –అతడు వేదాంతార్థాన్ని చెప్పాడు.

దీనికి మార్గం మూర్తిపూజ అని వేరొకర్థం చెప్పాడు. దైవాన్ని ప్రతిమ రూపంలో ఆరాధించు. నవవిధ భక్తుల్లో ఏదో నొకదానిని బట్టి పైకి పోవచ్చు. భక్తితో విగ్రహారాధన చేస్తే మనస్సుకు విశ్రాంతి లభిస్తుంది.

లోకంలో ఎలాజీవించాలంటే బాబా చెప్పినదిది "బట్టలు లేనివారికి బట్టలివ్వు. అన్నం లేనివారికన్నం పెట్టు. నీ యింటి వసారాశ్రయం కల్పించాలి. ధనముంటే వినయ సంపద వుండాలి. కాయలున్న చెట్టు చూడు వంగి వుంటుంది. అంతమాత్రాన దుర్మార్గుల దగ్గర అలా వుండకూడదు. అక్కడ పరుషంగానే వ్యవహరించాలి. మహాత్ముల దగ్గర మాత్రమే వినయంగా వుండాలి. ధనం, ధర్మానికే వినియోగించు. చూచేదంతా నశిస్తుంది. నిజమే. బ్రతకటానికి డబ్బు కావాలి. లోకంలో ఆనందంగా వ్యవహరించు. కానీ భగవంతుని విస్మరించక 'ఇదంతా నాదికాదు. ఈశ్వరుని సొత్తని' భావిస్తూ వ్యవహరించు.

'మమ' కాదు కావలసింది. 'నమమ' – అని జీవించు. 'నాది – నేను' అనబోకు. నాది కాదు భగవంతునిదని బ్రతకటం నేర్చుకో.

# దక్షిణ మీమాంస

అన్న పేరుతో 'సచ్చరిత్ర' లో 2, 3 అధ్యాయాలున్నాయి. దక్షిణ విచారణ అని 3 అర్థం. బాబాకు పిల్లా, జిల్లా కుటుంబం లేదుకదా ఆయనకు డబ్బులతో ఏమిపని? అన్నవారు, ఉల్లిపాయ తినవచ్చునా? లేదా ? – అనీ బాబా తింటున్నాడు. ఈయన? ఏమి సన్యాసి అన్నవారూ, ఆయన సాయిబు, మనం బ్రాహ్మణులం కదా మొక్కవచ్చా అన్నవారు రకరకాలుగా వుండేవారు ఆనాడు జనం. ఇది తప్పా ఒప్పా అన్నది కాదిక్కడ మనం

చర్చించేది. ఆనాటి సమాజ స్వరూపమది అనటం. దానిని ఛిన్నా భిన్నం చేయటమే అవతార ప్రయోజనం. మూఢాచారాలు పోగొట్టి, ఉపవాసమంటే ఇది అనీ – పైవి మతవిషయాలు కావనీ, మతమంటే భగవత్ చింతన, ధ్యానం, గురు పదారాధన – ఇది అని చెప్పక పోతే లోకమా ఆచారమన్న ఊబిలో చిక్కుకున్న ఆవు దూడలాగా అలమటించి నశించవలసిందే కదా. మతం ఆచార్యుడు – గురువు వీరి నుండి పురోహితుని చేతిలోనికి పోయినప్పటి దురాచారాలవన్నీ ఆధునిక యుగంలో అవి పోవటానికి కారణం పరమహంసాదుల అవతారాలే.

# ఉల్లిపాయ

బాబా మనకు దురాచారాలివి. వదులుకోండి. నా దగ్గరకు రండి అంటే భగవదా రాధనంటే ఇదీ అని చెప్పిన పద్ధతి చాలా సుకుమారం. ఒక ఆచార్యుడు బోధించినట్లుండదు. ఒక చెలికాడు – ఒక భర్త భార్యతో లేదా భార్య, భర్తతో – చెప్పినట్లుండే కావ్యమార్గం తప్ప తర్కం బోధించినట్లు కాదు. ఇది కోదండం మాష్టారు పద్ధతి. తంత్ర విద్యనంతా శివుడు, తన ఒడిలో పార్వతిని కూర్చుండబెట్టుకొని చెప్పటం లేదా పార్వతి భర్త మధురంగా చెప్పినట్లు చెప్పటం పద్ధతిగా వచ్చింది. మన దేవాలయాలపై శివ, పార్వతుల బొమ్మలు చూడండి. ఒకరి ఒడిలో ఒకరు వ్రాలి వింటున్నట్లుంటాయి. అది స్నేహం – ప్రేమ – భక్తి కనుకనే పరమహంస అనేవారట భక్తులు వచ్చి 'అమ్మవారిలా చేసారు నాకా సహాయం చేసారంటే' 'ఔను మరి, తల్లి, పిల్లలకు చేయటంలో ఆశ్చర్యమే ముంటుంది. దాని నింతగా చెప్పనవసరం లేదు. అని. అలాగే బాబా బోధా విధానం తంత్ర మార్గంలో తండ్రి, పిల్లలకు చెప్పినట్లుంది తప్ప – శాసించటం లాగా వుండదు.

ఒకరోజు యోగాభ్యాస ప్రారంభకుడొకడు బాబా దర్శనానికి వచ్చాడు. పసివాడికి చెప్పటం తాను ఉల్లిపాయను రొట్టెలో కొరికి తింటున్నాడా మహానుభావుడు. 'ఉల్లిపాయ తినేవాడు నాకు గురువేమిటని' ఈయన గొణుక్కుంటున్నాడు. మరి రెండు – మూడు పుస్తకాలు చదివాడు కదా అందుకని.





ఆ గొణుగుడు – సగుణుడు బాబా పసిగట్టి శ్యామాతో అన్నట్లు పైకి అన్నాడు. 'దానిని జీర్ణించుకోగలవాడు, దానిని తినవచ్చు' నని – అంటే తిను ఫర్వాలేదు. కానీ, జీర్ణించుకోవటం నేర్చుకో, అంటే భగవధ్యానాదులు చేసుకొమ్మని భావం.

దాసుగణ మహారాజు బ్రాహ్మణుడు. ఉల్లిపాయ తినడు. ఆయనతో బాబా – ఒరేయ్ గణూ ఇవ్వాళ పితలా చేసి దానిలో ఉల్లి పచ్చడి చేసి కొంచెం నాకు పెట్టు మిగిలింది తిను" అన్నాడు.

దాసగణు అలాగే చేసి పచ్చడిలో కొంచెం వ్రేలు ముంచి వాసన చూచి తెచ్చాడు. తిన్నావా అంటే బాబా, తిన్నానన్నాడు. ఆయనకు తెలియనిదేముంది? గణు వ్రేలు ముంచి వాసన చూచినట్లు అభినయించాడు బాబా. నాటినుండి బాబా శరీరంతో ఉన్నంత వరకూ శిరిడిలో ఏకాదశి నాడు తప్ప బాబా చెప్పినట్లు ఉల్లిపాయ తినేవాడు. 'ఇదొక ఉదాహరణ బాబా మూఢాచారాలకూ భగవంతుడికి సంబంధం లేదని చూపటానికి.

ఇలాగే మిగిలినవీ, కుశాభావు కథ చూచాం కదా.

అలాగే ప్రతి మనిషీ కామ క్రోధలోభ మోహమద మాత్సర్యాలతో తయారైన వాడే. కదా. మనిషంటే వీడే. ఏదో వకటి లేకుండా మనిషి వుండడు. వాటిని పోగొట్టాలి. వద్దురా అంటే వింటాడా? మనిషి. వాడికి అనుభవంలోకి తెచ్చి, ఉదాహరణ పూర్వకంగా చెబితే తప్ప.

ఒకసారి జోగుతో బాబా అన్నాడు. ఈ జోగెవరంటే 9 ఏళ్ళ పాటు నిత్యమూ హారతిచ్చేవాడు. తర్వాత చేతి పటిక బెల్లం పెట్టేవాడు. అలాంటి వాడితో బాబా "ఒరేయ్ నాకు దక్షిణ ఇవ్వరా! అన్నాడు. ఆయన దగ్గర డబ్బులు లేవు కాబోలు విసుగుతో అన్నాడు అదే మాట.

బాబా – సరే లేవు. ఈ కోపం – విసుగూ దేనికీ? అని అతని దగ్గర డబ్బు లేదని బాబాకు తెలియకనే అడిగాడా. అన్నాళ్ళు సేవించిన వానికే తెలియలేదే? భ్రాంతి, మాయ, అంటే ఇంతకంటే వేరే వుదాహరణం కావాలా? అతనికి కోపాన్ని వదలుకొమ్మని చెప్పటానికి బాబా ఆపని చేసింది. ఎందుకంటే – ఇతడే ఒకసారి బాబా నడిగాడు" బాబా ఇన్నేళ్ళు నీ సేవ చేసాను. నా ముక్తి సంగతేమిటనీ – కొన్నాళ్ళుండు నీ కున్న బంధం కాస్తా తెగి పోయింది. తర్వాత రుచులు మాను' – అన్నాడు.

క్రోధ గుణం పోని వానికి ముక్తి సంగతి ఎంతో దూరమని చెప్పటం కోసం కదా బాబా ఈ యుక్తి పన్నింది.

అలాగే పురందరేతో అన్నాడు! నీతో ఎవరైనా గిట్టని మాట అంటే మౌనంగా భావించు లేదా ఒకమాట సున్నితంగా అను. ఎవరితో పోట్లాడవద్దు' అని.

దాసగణు ఒకసారి ఎవరో తనను ఎందుకు పిల్వలేదు. వాడు పాయసం చేసి అందర్ని పిలిచాడు నన్ను మాత్రం పిలువలేదు అన్న వానితో బాబా

"ఒరే గణూ ఎవరికెవరురా? – శత్రువు అన్న భేదం దేనికిరా? ఎవడి కెవడు శత్రువు? ఎవడు తినేవాడు? పెట్టేవాడెవ్వడు? అంతా ఒకటేనన్న భావం అవరచుకో ఇలాగే ఒక విషయ మనుభవింప చేసి తర్వాత అది కూడదని చెప్పటం బాబా బోధన పద్ధతి. లోకానుభవం కాకుండా వట్టి నీతివాక్యాలు చెబితే ఎవడు వింటాడు? 2 . బయ్యాజీ అప్పాజీ అన్నవాడు భీమ బలుడట. రోజూ బాబాకు మాలీషు చేసి భుజాల పైకి అవలీలగా ఎత్తుకొనే వాడట. అదొక సరదా కాబోలతనికి లేదా భక్తితోనూ కావచ్చు. కానీ గర్వపడేవాడట నేను చాలా బలశాలినని. ఒకరోజు పైకెత్త బోతే లేవలేదట. ఇంకా ప్రయత్నించాడు. ఊహూ... లేవలేదు నవ్వాడట అంటే – బాబా సంకల్పం లేనిదే మనకేదీ సాధ్యపడదని





భావం. దీనిని ధ్రువపరిచే ఉదంతాలు ఉన్నాయి. ఒకటి ఒకరోజున బాబా చేసిన బోధ.

'నేనొక రోజున వుణతాంబా వెళ్ళాను. అక్కడ ఇద్దరు పోట్లాడుకుంటున్నారు. నడుమ రూపాయల కుండకోసం. నేను మెల్లగా దానిని తీసుకుపోయాను. తర్వాత వాళ్ళిద్దరూ లబోదిబో మన్నారు, నాకనిపించింది.

నేనెవరు? ఈ డబ్బు ఎవరిది? ఎక్కడిది? దీనికోసం ఎంత ఉన్మత్తమౌతున్నది లోకం ? ఈ కుండ నిజానికి నాది (భగవంతునిది) నీది కాదు (మనిషిదికాదు). కానీ దానికోసం కొట్టుకొని చస్తున్నారు. చిత్రంగా వుంది. ఈ మాయాజాలం? – "ఈశా వాస్యమిదం సర్వం – మాగృధః కస్యస్విద్ధనః" – ఇదంతా ఈశ్వరునిది. డబ్బెవరిది? దాని కోసం ఆశించకు. ఆయన కర్పించకుండా తినవద్దు. అన్న ఈశావాస్య విషయమిదే కదా. ఒక ఆవును చూచి బాబా అన్నాడట. ఈ గోవు ఇప్పుడు కాకాది. నిన్న ఒకనిది. అంతకు ముందొక ఔరంగాబాదువానిది. అంతకుముందు మహల్సాపతిది. భగవంతుడికి తెలియాలి. అది అసలెవరిదో? –

పరమహంసతో శిష్యులన్నారట "స్వామీ ! ఆ దూరాన మేడలో రాత్రిపూట ఏవో చప్పుళ్ళు విన్పిస్తున్నాయే యేమిటవి?"అని వారన్నారట "అవి ఒక దొరగారి బూట్ల చప్పుళ్ళు. ఆయన ఒక సాయిబు దగ్గర ఆ యిల్లుకొని తర్వాత చచ్చి దయ్యమై మమత పోక ఆ యింట్లో తిరుగుతున్నాడు. ఆ సాయిబు దానిని ఎవరి దగ్గర కొన్నాడు. రేపెవరిదో మరి ఆ మేడ?" అని.

దేనిపైనా మమత పెట్టుకోరాదు. అంతా పరమేశ్వరునిదన్న భావంతో బ్రతకటమే గొప్ప సాధన అని చెప్పటమే కదా.

ఇదే బాబా దక్షిణ తీసుకోవటంలో రహస్యం. ఎందుకంటే అది తనది తానిచ్చింది కనుక – ఒకటి, రెండు దాహరణాలు చూద్దాం

బాబా సేవకుడు రఘు అన్నవాడు మరి కొందరితో కలసి ఒక నేరం చేస్తే కేసు విషయం బాబా తన భక్తుడైన నాసిక్ ప్లీడరు ధూమల్ కప్పగించాడు. అతడు కేసు గెలిచాడు. దాని ఫీజు 300 రూ.లు వచ్చింది. ధూమల్ ఆ డబ్బును, బాబా దగ్గరకు తెచ్చాడు.

బాబా–ధూమల్, నాకు దక్షిణ నిస్తావా ? బాబా

ధూమల్ – అలాగే బాబా.

సరే'నని బాబా ఆ మొత్తాన్ని తీసుకున్నాడు.

ఎందుకంటే, ఆ కేసు గెలిపించింది తానేగనుక. మేజిస్ట్రేటు మనస్సులోకి వెళ్ళి ధూమల్ కనుకూలంగా తీర్పు చెప్పించిన అంతర్యామి గనుక.

'కస్య స్విద్ధనం'–అని ఈశావాస్యం చెప్పినదంటే దానికుదాహరణ మింతకంటే ఏముంటుంది ? బాబా దక్షిణ తీసుకోవటంలో మరొక రహస్యమేమంటే తాను తీసుకున్న దానికి 10 రెట్లెక్కువ మేలు చేయటానికి, ఈ మాట బాబాయే అన్నాడు.

"నేనెవరి దగ్గర ఏమీ తీసుకోను. మసీదు తల్లి తన బాకీ వున్న వారి నుండి తన ఋణాన్ని నా ద్వారా గ్రహిస్తుంది. అల్లా చెప్పినట్లుగానే నా బాకీని దక్షిణ రూపంలో గ్రహించి వారిని ఋణ విముక్తులను చేయటమే కాక తీసుకొన్న దానిని 10 రెట్లెక్కువ ఇస్తాను' అని.

చేసిన ఋణం తీర్చకపోవటం చాలా పాపమని ప్రాచీనుల భావన. అది అధర్మం. దానికోసం మళ్లీ జన్మించైనా బాకీ తీర్చుకోక తప్పదు. నాదయితే ఎక్కడికీ పోదు. భగవంతుడున్నాడు. వాడే చూచుకుంటాడు" – ఇది నాటి మనిషి ధర్మ దృష్టి, ఇదే బాబా చేసిన పని. తాను దైవం కనక మనిషిని ఋణవిముక్తుని చేసి ధర్మభ్రష్టుడు కాకుండా కాపాడటం.

అవస్థే అన్న న్యాయాధికారి బాబా దర్శనానికి వచ్చాడు. తాను





తన కొడుకు పెండ్లికి పిల్లను చూచుకోవటానికి పోతూ బాబా ఆశీస్సులకై శిరిడీ వచ్చాడు. వస్తూ తన దగ్గర 400 రూ.లు, భార్య దగ్గర 300 రూ.లు తెచ్చుకొన్నాడు.

బాబా–నాకు దక్షిణ నివ్వు. బాబా –

అవస్తే – ఎంత ?

బాబా–300 రూ.లు

ఆయన కొడుకుతో బాబా, నీవు 40.రూ॥లు దక్షిణగా ఇవ్వు – అన్నాడు. ఇలా మాటి మాటికి అడిగి వారి దగ్గరున్నదంతా బాబా దక్షిణ రూపంలో తీసుకొన్నాడు. వారు వివాహ నిమిత్తం పోతున్నారు. బాబాయేమో చిల్లిగవ్వ లేకుండా లాగి వేసాడు.

అదంతా గమనించిన జోగు – అవసే అవస్థే వీవును తట్టి నీవు చాలా అదృష్టవంతుడవు. ఉన్నదంతా బాబా దక్షిణగా తీసుకొన్నాడు గదా. అంటే నీకు 10 రెట్లెక్కువ ఇవ్వటానికే బాబా అలా చేసాడన్నాడు. ఆ రోజుల్లో 700లు అంటే నేటి విలువలో 7 లక్షలు కావచ్చు. ఎందుకంటే ఆ రోజుల్లో కాసు బంగారం ధర 1, 2 రూ.ల కంటే ఎక్కువలేదు కనుక.

అవస్థే బాధతో – ఏమో, నా దగ్గర చిల్లి గవ్వ కూడా మిగలలేదు. పెండ్లి నెలా చేయాలి" అని వాపోయాడు.

జోగు – నీకెంత కావాలి.

అవ – 300 రూ.లు

జోగు – ఇదుగో తీసుకో, బాబాకిప్పుడే ఎవరో బొంబాయి భక్తుడు 6000 రూ.లు దక్షిణగా ఇచ్చాడు. అందులో బాబా 3000 అప్పుడే ఖర్చు చేసాడు. నీ నుండి 600 రూ.లు తీసుకున్నాడు. కనక నీకు నెలకు 50 రూ.లు చొప్పున నెల జీతం పెంచాడనుకొంటాను బాబా.

విన్న అవస్థే అన్నాడు. 'నీ తాత ఎవడున్నాడని జీతం పెంచటానికి"

కానీ బాబా అనుగ్రహంతో అతనికి నెలకు 50 రూ.లు జీతం పెంచింది ప్రభుత్వం. ఇదీ బాబా దక్షిణ గ్రహించటంలో ఒక రహస్యం.

హరిలేలే అన్న భక్తుడు నాసిక్ నుండి 'శిరిడీ' వస్తున్నాడు. దారిలో 'కోపర్గావ్' దగ్గర తనకు జీతం 25 రూ.లు పెంచబడిన సంగతి తెలుసుకొని శిరిడీ వచ్చాడు. రాగానే బాబా 15 రూ.లు దక్షిణ ఇవ్వరా' అన్నాడు. అతడు నా దగ్గర లేదన్నాడు. బాబా లేకపోవటమేమిటి ? నిన్ననే గదా నీకు 25 రూ.లు ఇచ్చింది. అంటే అర్థమేమిటి? ఆ ఇచ్చింది తానేనని కదా! అంతర్యామిగా వుంటూ దైవం – మనిషిని తానే చేసానని భ్రాంతి పడేటట్లు చేస్తున్నాడు. ఇదంతా మాయా నాటకం. కనుక మనిషి వంతేమిటి? దైవ భావనతో బ్రతకటం అంతా తను చేస్తున్నాడు తప్ప నాదేమి లేదనుకొని జీవించటం.

'మనజులు సేయనెవ్వరు ? సమస్తము నీశ్వరునాజ్ఞ సెల్లెడిన్'

అని భీష్ముడు భారతంలో అన్న మాట వెనుక ఆయన జీవితానుభవం–300 ఏండ్ల పాటు బ్రతికి మహానుభావునిగా – ఎంత అనుభవం దాగి వున్నదో కదా! ఇదే! బాబా మనకు చేస్తున్న బోధ. –

ఇలా ఎన్ని ఉదాహరణలు ఎన్ని కథలు, మనిషి కెన్ని జన్మలో అన్ని కథలు ఆ బాబా తన చుట్టూ అల్లుకొన్నాడు. అదొక సాలెగూడు. ఆ గూటిలో ఒక్కొక్క దారం ఒక్కొక్క జన్మ. ఆ జన్మలో నేనో, నీవు, మరొకరో వుంటారు. నీ స్వభావానికి తగ్గ కథ – మార్గం నీవే ఎన్నుకోవాలి.

కఠోపనిషత్తు చెబుతున్నది –

"సస్యమివ పచ్యతే నరః – సస్యమివ ఆజాయతే పునః"

గడ్డి ధాన్యం వానకు పండి ఎండకు ఎండి రాలిపోతూ మరలా వానకాలం రాగానే పంటకు తయారౌతున్నట్లు జీవి ఇంతేనని భావం. బాబా కూడా ఇదే అన్నారు. "జన్మదినోత్సవాలు చేసుకుంటారు జనం.





ఎందుకు? అంత సంతోషం దేనికి? భూమిలో విత్తు వేస్తే వానకు మొలకెత్తి సూర్యకిరణాలకు ఫలిస్తుంది. దానికా మేఘం కానీ, సూర్య కిరణం గానీ సంతోషించటం లేదు. మరలా ఆ మొక్కలే ఎండిపోతున్నాయి. దానికవి క్రుంగిపోవటం లేదు. నీవు అలాగే వుండు. (సుఖాల్లో సంతోషించటం, దుఃఖాల్లో క్రుంగిపోవటం దేనికి?) నీవు, నీవుగా వుంటే అవి నిన్నేం చేస్తాయి. ముక్తి అంటే ఈ దుఃఖం లేకపోవటమే. (బుద్ధుడన్నాడు – కోరిక లేకపోతే జన్మలేదు. కనుక కోరికలే జన్మలకు హేతువు. దుఃఖానికి కారణం). శ్రీ రమణులు అన్నారు కోరికలేక పోవటమే మోక్షం.

ఒకసారి ఒక వృద్ధురాలు మరణించిన కొడుకు కోసం దుఃఖిస్తుంటే వింటున్న దీక్షిత్ అన్న భక్తుడు బాబాను ప్రార్థించాడు. "బాబా ఆమె ఆర్తనాదం గుండెలను పిండివేస్తుంది. దయచేసి ఆ కొడుకును బ్రతికించు' అని. బాబా అన్నాడు 'నానా! నీకేమి తెలియదు. ఆ పోయిన జీవుడు మరొక శరీరంలో ప్రవేశించాడు. ఈ శరీరంలో చేయలేని కార్యాలాశరీరంలో చేస్తాడు. వాడినీ పోయిన శరీరంలోకి తెస్తే కొత్త శరీరం పోతుంది.

ఈ రెంటిలో నన్ను దేనిని వుంచమంటావు? వచ్చే ఫలా, ఫలాలు నీకు తెలియవు. దానికి బాధ్యుడెవరు? నీవు వహిస్తావా? – అనగానే అతడు కిమ్మనలేదు.

ఇదీ జన్మల రహస్యం. ఈ శరీరంతో పని చాలించి క్రొత్తగా జన్మించి ఇక్కడ సాధించలేనిది అప్పుడు సాధించటమే పునర్జన్మ అంటే. ఇందుకే శ్రీ అరవిందు అన్నారు. "మరణం మరొక నూత్న కార్య సాధన కనువైన ద్వారం" అని. బాబా అన్నట్లు – ఈ పాంచ భౌతిక శరీరం పోయింది. దాని అవసరం తీరి పోగానే – గాలి గాలిలో, మన్ను మన్నులో కలియటమే కదా మృతి అంటే –

ఈ విషయం తెలిసి జీవించటమే ఉత్తమ సాధన. బాబా గురువుగా వచ్చాడనీ సాధన మార్గంగా బోధించాడన్న మాట కర్థమేమంటే – ఒక్కసారి

జన్మించి, ఒకసారి పోయేవాడని కాదు. భగవంతుడని అర్థం. ఆ రూపమే భగవంతునిగా ఆరాధించమని.

రమణ మహర్షి అన్నట్లుగా గురువంటే భౌతిక వ్యక్తి కానక్కర్లేదు. ఆత్మ స్వరూపమే గురువుగా బోధించవచ్చు. కాని ఆర్తి వుంటే అదే భౌతిక గురువుగా మారవచ్చును. ఇదే మాట బాబా కూడా అన్నాడు.

గాడ్గిల్ అన్నవాడు అక్కల్‌కోట పోతూ బాబాను దర్శిస్తే బాబా అన్నారట 'వీడి కోసం నేనిప్పుడు మరలా అక్కల్ కోట పోవాల్సి వచ్చింది' అని. అంటే సర్వ గురువులూ రమణమహర్షి – పరమహంస – వివేకానంద – శ్రీ అరవింద అన్నీ కృష్ణావతారాలే. జగద్గురువులైన ఆయన అవతారాలే లేదా గురుమండల స్వరూపిణి యైన జగన్మాత స్వరూపాలే. ఏమనుకొన్నా సాధనలో అన్నీ ఒకటిగానే చరిస్తాయి.

గాడ్గిల్ మరలా బాబాతో అన్నాడు ఆపై మాటలివి. బాబా! నీవే నా గురువై మార్గోపదేశం చేయమని. బాబా అన్నారు – గురువెందుకు? అవసరం లేదు. ఉపదేశం నీలో వుంటుంది. అది వినటం నేర్చుకో. దానిననుసరించు. అదే గురువంటే"

శ్రీ అరవిందులన్నారు.

"Follow thy Inner voice"

నీలోపలకు చూడు. అక్కడ నీ మార్గాన్ని నిర్దేశించే దివ్యవాణి–అంతర్వాణి వుంటుంది. ఆమె నీ మార్గాన్ని చూపిస్తుంది అని.

బాబా శిరిడీ రావటానికి పూర్వం నానావలి వచ్చాడు. బాబా శరీరం చాలించిన పిదప 14వ రోజున తానూ గతిస్తాడు. అలాంటి నానావలి బాబానెలా సేవించాడో అన్నాళ్ళు మన కందనే లేదు. అయనొకసారి బాబా కూర్చున్న గద్దెనుండి లేవమని, తాను కూర్చుండి, కొంతసేపు లేచి మరలా బాబాను కూర్చుండమన్నాడన్నా సంఘటన చాలా ప్రసిద్ధమే కదా!





పరమహంస చరిత్రలో కూడా నానావళి లాగా, హృదయ్ రామకృష్ణ మేనల్లుడు కూడా ఆయనతో ఇలాగే అన్నాడు.

బాబా కథలోని ఈ ఘట్టానికర్థమేమిటి? పరమహంస తన వారసునిగా స్వామీజీని లోకానికిచ్చి నాటక రంగస్థలం నుండి తన పాత్రనుపసరించుకున్నారు.

బాబా గద్దెకు వారసుడెవ్వడు? నానావలి కానీ ఉపాసనీ మహారాజు కానీ కాదు. మరెవ్వరు? తానే. ఇందుకే బాబా కథ దివ్యగంగ లాగా త్రికాలాల్లో, త్రిలోకాల్లో ఎడతెగకుండా ప్రవహిస్తుంది. నీవెక్కడ దిగితే అక్కడ బాబా వుంటాడు. ఇదే ఊరూరా బాబా గుడులు రావటంలో పరమార్థం. బాబా వామ పాదానికి నమస్కారం. అది అమ్మ పాదం కదా!

# "హేపాయ్ పురాతన్ పార్"

## (ఈ పాదాలు ఆద్యంతాలు లేనివి)




**రచయిత**

**తుమ్మపూడి కోటీశ్వరరావు, బెంగుళూరు**

**సహాయకులు**

**డా॥ ఓరుగంటి ప్రసాద్**


# "హేపాయ్ పురాతన్ పార్"


| | | |
|---|---|---|
| © హక్కులు | : | రచయితవి |
| ప్రచురణ | : | జనవరి 2022 |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ.100/-** |
| ప్రచురణ మరియు ప్రతులకు | : | శ్రీ షిర్డి సాయిబాబా మందిరము<br>రోడ్ నెం:4, లక్ష్మీనగర్, సైదాబాద్,<br>హైదరాబాద్. 500 059<br>సెల్: 80192 62315 |
| డి.టి.పి. | : | శ్రీమతి పి.ప్రవీణ<br>7842912234 |
| కవర్ డిజైన్: | : | తణుకు నరేష్‌బాబు,<br>87903 61239 |
| ముద్రణ | : | ఆదిత్య బైండింగ్ వర్క్స్, కాకినాడ.<br>98480 77634 |

# కృతజ్ఞతలు


* నాకు ముద్రణకు అవకాశము యిచ్చిన గురుతుల్యులు శ్రీ తుమ్మపూడి కోటీశ్వరరావు గారికి నా పాదాభివందనములు...

* నా శ్రీమతి అనంతలక్ష్మీ సత్యవతికి...

* "ఆద్యిత బైడింగ్ వర్క్స్" అధినేత సోదరసమానులైన శ్రీచంద్రశేఖర్ గారికి...

* డి.టి.పి. చేసిన శ్రీమతి పత్తి ప్రవీణకు ...

* షిర్డిసాయి బాబామందిర్ ట్రస్ట్ మెంబర్లకు

నా కృతజ్ఞతలు



ఇట్లు

సాయి పాదరేణువు

**డా॥ ఓరుగంటి ప్రసాద్,**

హైదరాబాద్

**80192 62315**


# విషయసూచిక


| | పేజి |
|---|---|
| దాహం దాహం దాహం | 1 |
| భూమిక | 2 |
| శిరిడీ బాబా అంటే? | 4 |
| జామ్నేరు చమత్కారం | 11 |
| శయనము | 26 |
| ద్వారకామాయి – ద్వారక | 33 |
| ద్వారక | 34 |
| సర్వగురు స్వరూపుడు బాబా | 36 |
| రామదాసు | 38 |
| పూర్వజన్మ వృత్తాంతాలు | 39 |
| రెండు మేకల కథ | 41 |
| భౌతిక దశ | 42 |
| మహాపరి నిర్యాణము | 44 |
| ఆనందరావు పాఖాడే | 45 |
| కలలో బాబా | 51 |
| జ్ఞానేశ్వరి | 59 |
| త్రిశూలము – లింగము | 61 |
| అబ్దుల్ | 62 |
| సమాధి మందిరం | 63 |
| అద్భుత స్వప్నం | 64 |
| కఠోపనిషత్తు | 65 |
| బాబా పటం స్వయంగా బాబాయే | 68 |
| కాకా సాహెబ్ దీక్షిత్ | 71 |
| గయలో చిత్రం | 73 |
| నవయుగ తుకారాం | 74 |

| | |
|---|---|
| కులకర్ణి కథ | 75 |
| బోధివృక్షం | 76 |
| బోధా స్వరూపం | 81 |
| గురు అన్వేషణ | 82 |
| గురుభక్తి – సేవ | 85 |
| కొబ్బరికాయ కథ | 92 |
| చదివిన పెద్దమనిషి | 93 |
| బాబా పుట్టు పూర్వోత్తరాలు –1 | 94 |
| అయోనిజవాదం | 102 |
| అరుళ్ పెరుంజ్యోతి | 103 |
| బాబా గురువు | 105 |
| బాబా భాష | 109 |
| బన్నేమియా | 116 |
| గురుస్థానం | 118 |
| దివ్య కార్మికుడు – కర్మిష్ఠి | 120 |
| శ్రద్ధ – సబూరి | 124 |
| సబూరి | 126 |
| ధుని | 129 |
| హే పాయ్ పురాతన్ పార్ | 134 |
| ఆమ్రలీల | 135 |
| ద్వారకామాయిలో బాబా ఫోటో | 138 |
| మరి బండ కర్థమేమిటి? | 140 |
| ద్వారకామాయి | 142 |
| వారేమిచ్చినా | 146 |
| అద్వైత జ్ఞాన మార్గం/ఆత్మ విచారం | 150 |
| దక్షిణ మీమాంస | 151 |
| ఉల్లిపాయ | 152 |